# అనగనగా ఓ మంచికథ

2023



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 261

*కౌముది మాసపత్రికలో*

*జనవరి 2023 సంచిక నుంచి డిసెంబర్ 2023 సంచిక వరకూ వచ్చిన*

# అనగనగా మంచి కథలు


| సంఖ్య | కథపేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | ముగింపు మీకు తెలుసు | బుచ్చిబాబు | 3 |
| 2 | అందరివంటిది కాదు | కొండముది శ్రీ రామచంద్రమూర్తి | 16 |
| 3 | కోరిక | పెద్దిభొట్ల సుబ్బరామయ్య | 29 |
| 4 | పెళ్ళాం చిత్తరువు | కంటిపూడి జానకి రామచౌదరి | 35 |
| 5 | కథ నాది ముగింపు ఆమెది | శీలా వీర్రాజు | 40 |
| 6 | అందమైన జీవితం | గొల్లపూడి మారుతీరావు | 55 |
| 7 | అందని ద్రాక్షపళ్ళు | అరెకపూడి (కోడూరి)కౌసల్యాదేవి | 66 |
| 8 | ఆత్మీయత | ఎమ్.వి వి సత్యనారాయణ | 77 |
| 9 | అజ్ఞాత రచయిత | మల్లాది వెంకటకృష్ణమూర్తి | 85 |
| 10 | అందని ద్రాక్షలు | పాలకూర సీతాలత | 92 |
| 11 | అగ్గిపుల్ల | నందుల సుశీలాదేవి | 102 |
| 12 | కథానాయకి | బలివాడ కాంతారావు | 109 |

# ముగింపు మీకు తెలుసు

## - బుచ్చిబాబు

## ( 1958 జనవరి 1 తెలుగుస్వతంత్ర పత్రిక నుండి)

**నేనూ ఆమె చిన్నప్పుడు** ఒక కళాశాలలో చదువుకున్నాం. పదిహేనేళ్ళ తరువాత భర్తతో కాపరం చేస్తుండగా మళ్ళా ఆమెను చూడడం జరిగింది. చిన్నప్పటి స్నేహితులు, చదువు, కళాశాలలో ఉపాధ్యాయులు – ఇవన్నీ ముచ్చటించుకుంటూ, వార్షికోత్సవ సందర్భంలో తరగతి విద్యార్థులందరూ కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి తీసి, అందులోని వ్యక్తులు ఎవరెవరు ఏం చేస్తున్నదీ, ఎక్కడెక్కడున్నదీ ఆరాలు తీసి స్మరించుకుంటున్నాం. మూలగా నిలబడ్డ ఓ వ్యక్తికేసి చూపించి, "పాపం మురళి ఎక్కడున్నాడో" అన్నదామె. "మురళి ఎవరు?" వెంటనే స్ఫురణకు రాలేదు.

"పావలా ఫ్లూట్ మీద గానం చేస్తుండేవాడట హాస్టల్లో – తెలీదు?" అని అందిచ్చింది.

జ్ఞాపకం వచ్చింది. అతన్ని "బాల" అనేవాళ్ళం. వేణువాద్యమే కాకండా, భావ గీతాలు కూడా వ్రాస్తుండేవాడు. "ఎక్కడున్నాడో?"

"ఏమో, నాకూ తెలియదు. అతన్ని మళ్ళా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు" అన్నాను.

అక్కడినుండి వచ్చేసిన తర్వాత "బాలు"ని గురించిన కుతూహలం హెచ్చింది.

"పాపం మురళి ఎక్కడున్నాడో?" అన్నదామె. ఆ "పాపం" ఎందుకు? "బాలు" ఇప్పుడెక్కడున్నది ఏం చేస్తున్నదీ తెలుసుకోవాలని అన్వేషణ సాగించాను. ఎందరెందరికో వ్రాశాను. ఆరాలు తీశాను. నా యత్నాలు ఫలించాయి. "బాలు"ను గురించి తెలుసుకున్నాను..

"ఎవరో నువ్వు చెప్పనక్కర్లేదు. నాకూ తెలుసు" అన్నాడు మిత్రుడు శాస్త్రి.

"చెప్పు చూద్దాం" అన్నాను.

ఫలానా అని చెప్పేశాడు శాస్త్రి. ఆశ్చర్యపడ్డాను. సత్యాన్వేషకుడు సాధించే దారుణ ఫలితాలలో సత్యాన్ని తెలుసుకోడం ఒకటి కాబోలు అనుకున్నాను.

నిజంగా జరిగిన ఒక సంఘటన ఆధారంగా ఒక కథ వ్రాద్దామని సంకల్పించి, ఆ వుదంతం మిత్రుడు శాస్త్రికి చెప్పి చూశాను. ముగింపు ఆశ్చర్యం గొల్పేదిగా వుండాలంటారు విమర్శకులు. ముగింపు యిట్టే చెప్పేశాడు శాస్త్రి. ఇంక నేను కథ వ్రాయడం దేనికి?

ఆధునిక సాహిత్యం వింతమార్గాలు తొక్కి ఎందుకు విపరీతమైన ధోరణులు వ్యక్తం చేస్తోందో కొంచెం అర్ధమవుతూంది. నూతనమైన వస్తువు దొరకదు. ప్రతి విషయం గురించీ, పెద్దలు యిదివరలో వ్రాసివున్నారు. చెప్పే తీరులో, "శిల్పం"లో విశిష్టత కనపర్చాలి. ఈ కసరత్తంతా దీని ఫలితమేమో అనిపిస్తుంది. దీర్ఘ సమాసాసనం, కామాలు వైక్లబ్యం, చుక్కల పందెం, బ్రాకెట్ల మేళవింపు, గద్యకవితల ముష్టి యుద్ధం, వికృత ప్రయోగాలనబడే నిప్పుల చక్రాల గుండా దూకుళ్ళు – యివన్నీ ఆధునిక అసాహిత్య తాలింఖానాలలోని కొన్ని వింతలు. మిత్రుడు శాస్త్రి కూడా నాతో ఏకీభవించాడు. అతన్ని గురించి వ్రాస్తూ 'హెమింగ్‌వే ప్రభావం ఈయన మీద బాగా కనిపిస్తోందే' అన్నాడొక విమర్శకుడు. శాస్త్రిగోల. అతనెప్పుడూ, హెమింగ్‌వే రచన వొక్కటి కూడా పూర్తిగా చదువలేదు.

చదవలేదు మొర్రో అంటే నమ్మే వాళ్ళెవళ్ళంటారు. 'ఇందులో పాత్రలన్నీ కల్పితాలు'అంటాడు రచయిత. చాలా భాగం కల్పనా సాహిత్యంలో రసవత్తరమైనది. ముందు రచయిత చెప్పిన యీ వొక్క వాక్యమేమోననిపిస్తుంది.

అంత మాత్రంచేత, భయపడిపోయి కథా రచన వివరించవల్సిందే. శాస్త్రి వొక రచయిత, విమర్శకుడు. రచనకు అతను ఆపాదించే విలువలు వేరు, సామాన్య పాఠకుడు కోరే ఆనందం వేరు. ముగింపు తెలిసిపోయినంత మాత్రాన కథ కుంటుపడుతుందనుకోనక్కర్లేదు. ఈనాడు అపరాధ పరిశోధక నవల చాలా ప్రచారంలోవుంది. పాశ్చాత్య దేశాలలో దానికున్న పలుకుబడి, ప్రచారం మరే యితర రకం రచనకీ లేవనొచ్చు. వీటిల్లో చాలా భాగం హంతకుడెవడో తెలుసుకోవడంలో పాఠకుడికి వినోదం, తాత్వికోల్లాసం సమకూరుస్తాయి. మరో రకం డిటెక్టివ్ నవలలో, హంతకుడెవడో మనకి ముందే తెలిసి పోతుంది. అసలు కథంతా హంతకుడే చెప్పేస్తాడు. కాని అతనట్లా ఎందుకు చెయ్యాల్సి వొచ్చింది – ఏ విధంగా చేశాడు – అతని మనస్తత్వము ఏ విధంగా అల్లా ఏర్పడింది. కారణాలు, అవకాశం, అవలంబించిన విధానం వీటిని చర్చించడం, ఈ రకం నవల వుద్దేశం. వీటిపట్ల కుతూహలం పాఠకుడిలో ఎప్పుడూ వుంటుంది. పాఠకుడి యీ కుతూహలాన్ని తృప్తిపరచే ఉద్దేశంతో ఈ రచన సాగించడంలో ఆక్షేపణ వుండదనుకుంటా.

ఆటవిక శాఖ వారు జంతువుల చర్మాలు వేలం పాడుతున్నారని తెలిసి మా వూళ్ళో చౌదరిగారు వొక ధనికుడు పులి చర్మాలు తీసుకురమ్మని పంపితే ఆ వూరెళ్ళాను. ఆటవిక శాఖాధికారి నౌకరొచ్చి, వారి బంగళాకి తీసుకెళ్ళాడు. అధికారిగారి పేరు మూర్తి. స్నానం చేస్తున్నారు, అలా కుర్చీలో కూర్చోమన్నారు. గోడలకేసి చూస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాను. గోడలన్నీ అడవి మృగాల తలలు కొమ్ములు, కోరలు చర్మాలు అమర్చబడి వున్నాయి. ఆటవిక శాఖాధికారి కూడా కాస్తో కూస్తో భయంకరంగా వుంటాడని నా వూహ. నిజంగా మూర్తి అల్లాగే వున్నాడు. చూడగానే ఏ ఉత్తర దేశపాయనో అనుకున్నా. దగ్గర దగ్గరగా ఆరడుగుల ఎత్తు – అంత ఎత్తుగా వుంటేగాని ఆ శాఖలో ఉద్యోగం దొరకదు కాబోలు. కొంచెం నలుపు. నల్లగుడ్డు చుట్టూ తెలుపు 'జీర రంధ్రాలు కనబడేట్లు వొంకర తిరిగిన ముక్కు. దట్టమైన కనుబొమలు. తాంబూలం వల్లో పొగాకు వల్లో అక్కడక్కడ డాగైన పళ్ళు, పై పెదవిని కప్పిన మీసం, చదరంగా

కత్తిరించబడిన తెల్లవెంట్రుకలతో వైవిధ్యాన్ని తెచ్చుకున్న గడ్డం అది ఆయన వైఖరి. రాగానే కరస్పర్శ చేశాడు. నలిగిన వేళ్ళని సరిచేసుకుంటూ కూర్చున్నా. తొందర పనిమీద జీపులో వెళ్ళాలిట. "వో గంటలో వొచ్చేస్తాను. ఈ లోగా అసిస్టెంట్లు చర్మాలన్నీ తనిఖీ నిమిత్తమై ప్రదర్శిస్తారు, వాటిని చూస్తూ వుండ"మని చెప్పి, అమ్మగారితో టిఫిన్ విషయం చెప్పవలసిందిగా నౌకర్‌తో మాట్లాడాడు. అటూ యిటూ చూసి లోపలికెళ్ళి వొక తోలు హంటర్ తీసుకొచ్చాడు.

'ఇది అడవి పంది చర్మం' అని హంటర్ చూపించాడు. 'మొన్ననే వేటాడ్డం' ఏమనాలో తెలిసింది కాదు. హంటర్ తిప్పుకుంటూ జీపులో ఎక్కాడు. ఊపిరాడక దగ్గినట్లుగా, జీపు నానాభీభత్సం చేసి నిష్క్రమించింది.

ముందుగదిలో బల్లమీద కొన్ని పత్రికలు కనిపించాయి. కాలక్షేపానికి ఏదైనా పత్రిక తీద్దామని లోపలికెళ్ళాను. పత్రికలతో పాటు ఏవో కవర్లు కూడా వున్నాయి. వొకటి నే చదువుకున్న కళాశాల పాత విద్యార్థుల సమావేశానికి రావల్సిందిగా పంపిన ఆహ్వాన పత్రం. కవరు మీద శ్రీమతి సీతాదేవి అని వ్రాసి వుంది. సీతాదేవి ఎవరు? మూర్తిగారి చెల్లెలా? కూతురా?

నౌకరు టిఫిన్ సరంజామ బల్లమీద పెట్టిన చప్పుడైంది. వెనక్కి తిరిగాను. ఆమె కనబడింది. చటుక్కున ఆమె లోపలికెళ్ళిపోయింది. వొక్క క్షణంలోనూ ఆమెను పూర్తిగా చూశాననే చెప్పాలి. మొహం అంతా ఆవరించే పెద్ద కళ్ళు. ఎండి ఆనందంతో విడిపోయిన దానిమ్మను స్ఫురింపచేసే పళ్ళు, పమిట కొంగుని పాయలుగా స్ఫుటంగా విడదీసిన ఎత్తయిన వక్షస్థలం. స్త్రీ కాబట్టి ఇన్నింటినీ క్షణికమైన దృష్టి ఇముడ్చుకుంది.

ఇంతట్లోకి 'అసిస్టెంట్' వొచ్చాడు. అతని వెనకాల మరో యిద్దరు నౌకర్ల చర్మాల కట్టలని పట్టుకొచ్చారు. అసిస్టెంటు పొట్టిగా వున్నాడు. కొనవూపిరితో అక్కడక్కడ అంటిపెట్టుకుని వున్న వెంట్రుకల మధ్య నిగనిగ మెరిసే బట్టతల అటవీశాఖలో ఉద్యోగుల గురించి నే అనుకున్నది తప్పని, ప్రత్యక్షంగా ఋజువు చేస్తున్నాడీ వ్యక్తి. జింక, దుప్పి, సివంగి వీట్ల చర్మాలు చూపిస్తున్నాడు. నాక్కావల్సింది పులి చర్మం. అవి దూరంగా వున్న కాంప్‌షెడ్‌లో వున్నాయట. తీసుకొస్తానని వెళ్ళాడు.

ఆమె మళ్ళా మధ్య గది కిటికీలోంచి చూసింది. నేను మళ్ళా ఆమెకేసి చూశాను. కళ్ళు అంత మరీ పెద్దవి కావు. పళ్ళు దానిమ్మని స్ఫురింపచేస్తున్నా అదింకా పచ్చిదానిమ్మే. ఆ చీర మడతలు పడే స్వభావం కలదిగాని, రొమ్ములు మరీ అంత స్పష్టమైనవీ, ఎత్తైనవీ కావు. ఈసారి నా దృష్టిని ఎక్కువగా ఆకర్షించినది ఆమె ఎర్రటి పెదవులు. సంధ్యా సమయంలో పటమటాకాశంలో కమ్మిన నల్లమేఘాలని చీల్చిన కడసారి సూర్యకిరణంలా. గుమ్మంలో కొచ్చింది.

"చక్కెరైపోయింది. ఇక్కడ దొరకదు. బెల్లం కొంచె వేశాను. మరి కొంచెం కావాలా?"

పరాయి స్త్రీని పరీక్షగా చూడటం గూర్చి మనస్సు పీకుతున్నా, ఆమె నెక్కడో చూసినట్లుగా వుండడం వల్ల అలా చూసానేమో? ఆమెకూడా అందుకే అలా చూస్తుందేమో.

"మూర్తిగారు – మీకు –"

"మా వారే"

"వారు ఏ కాలేజీలో చదువు?"

నవ్వింది.

"నన్నింకా గుర్తుపట్టలేదా?"

నేనూ నవ్వాను. ఇప్పుడు గుర్తుపట్టాను. ఆమెని సీతారామమ్మగా కళాశాలలో ఎరుగుదును. తాశిల్దారుగారమ్మాయి. పదనాలుగు, పదిహేనేళ్ళ నాటి మాట. కళాశాల కల్లా ముగ్గురే విద్యార్థినులు, వొకామె క్రైస్తవ కన్య 'అన్నా' మరొకామె 'జయంతి' తండ్రి డాక్టరు, వంగదేశస్థుడు. స్త్రీలు చదువుకోవాలనీ వరుణ్ణి వారే ఎన్నుకోవాలనీ , కట్నాలూ అవీ యివ్వకూడదనీ, జిల్లా కలెక్టరుగారు ఉపన్యాసాలిస్తూండేవాడట. ఆయన్ని తృప్తిపరచి, మెప్పు పొందడం కోసం తాశిల్దారుగారు సీతారామమ్మని కళాశాలలో సాహసం చేసి చేర్పించాడని ఆ రోజుల్లో వింతగా చెప్పుకునేవారు. అప్పుడు ఆమెకి పదిహేను పదహారేళ్ళుంటాయేమో. మాతో చదువుకున్నదేగాని నిజంగా ఆమెతో ఎప్పుడూ నేనింతవరకూ మాట్లాడలేదు. ఆమె కంఠం ఎట్లా వుంటుందో మాకు తెలీదు. తలొంచుకుని కూర్చునేది. ఆమె అప్పుడెట్లా వుండేది నాకు. జ్ఞాపకంలేదు. సన్నగా వుండేది. సాధారణ ఛాయ. కనురెప్పలు తీర్చి దిద్దినట్లు వొంపు తిరిగి, నీడలు పడుతున్నట్లుగా, అస్పష్టమైన వొక దృశ్యం మెదడులో మసలుతోంది, పొగమంచుతో నిండిన అద్దంలోంచి వర్షపుధారలని చూసినట్లుగా. ఇప్పుడెంతో మారిపోయింది. కాలం కాఠిన్యాన్ని కవులంతా ఆడిపోశారంటే యిందుకే కాబోలు. యౌవ్వనంపై మమకారం కొద్దీ కండలు పెరిగి, సన్నటి శరీరాన్ని కప్పేసి కౌగిలించుకున్నాయి. అప్పుడే కళ్ళ కింద చర్మంపై గీతలు, మెరుపుల్లా మధ్య మధ్య తెల్ల వెంట్రుకలు – ఎర్రటి పెదవులను మినహాయించి నడివయస్సు స్థబ్దత ఆవహించేసింది.

'చాలా మారిపొయ్యాను కదూ' అందామె.

'నన్నెల్లా గుర్తుపట్టారు?'

'పాత విద్యార్థుల సమావేశపు ఆహ్వానం నిన్ననే వొచ్చింది, సమావేశం జరిగిన వారానికి చేరింది ఈ ఆహ్వానం. పాత సామాను తిరగవేస్తూంటే కళాశాల పత్రిక కనబడింది. అందులో మన బృందం ఫోటో వుంది. మీరూ వున్నారు, తీసుకొస్తానుండండి' అని లోపలికెళ్ళిందామె.

ఈ పదిహేనేళ్ళలోనూ ఆమెలో కలిగిన మార్పు చూసిన తర్వాత నేనెంత మారిపోయుంటానో తలచుకుని కాసేపు దిగులుపడ్డాను. యౌవనం ఎప్పుడు అస్తమించి నడివయస్సు స్థబ్దత ఎప్పుడు మీదపడుతుందో ఎవరి మటుకు వారికి తెలీదు. బ్రహ్మచర్యం అవలంబించి, శరీర శక్తుల్ని ఖర్చు చెయ్యకుండా భద్రపరచుకుంటే యౌవనం మరికొంత కాలం నిలబడుతుందా? నిలబడదు. పైపెచ్చు అల్లా చేస్తే మరికొన్ని మానసిక జాడ్యాలు కూడా సంక్రమిస్తాయంటున్నారు

మనస్తత్వ శాస్త్రజ్ఞులు. శరీరం మోటుగా ప్రవర్తిస్తుంది. యౌవనంలో పేట్రేగుతుంది. నడివయస్సులో నిదానిస్తుంది. వార్ధక్యంలో శుష్కిస్తుంది. సంస్కృతి, తపస్సు, ఆధ్యాత్మికాన్వేషణ యివేవీ ఈ మార్పుని ఆపుచెయ్యలేవు. ఇది గమనించే కాబోలు మార్క్స్ మొదలైన మేధావులు ప్రపంచ చరిత్ర పునాదుల్ని మట్టిలోంచి పెల్లగించమంటున్నారు.

'ఇదిగో చూడండి' అని కళాశాల సంచికలో ఫోటో చూపింది. సంచికలో పుటలన్నీ తాకిడికి పొడుంగా రాలిపోతున్నాయి. ఆ ముగ్గురు విద్యార్థినులలో మధ్య నున్నది ఆమె. వెనకాల నిలబడ్డ వారిలో రెండోవాణ్ణి నేను.

'మీరేంటి అంత, అల్లాగైపోయారు?'

నేను భయపడ్డట్టుగానే ఆ కాస్త ప్రశ్నా అడిగేసింది. కాని, 'అంతలావు ' – లాంటి కటువైన పదాలు వాడకుండా కనికరించింది. నాలో మార్పు హర్షించ తగిందా కాదా అని అడుగుదామనుకున్నాను. కానీ ధైర్యం చాల్లేదు.

రంగనాథం ఏం చేస్తున్నాడో?

రంగనాథం ఇంగ్లీషులో ఫస్టు. కాలేజీ పత్రికకి సబ్ ఎడిటర్, బి.ఏ ఆఖరి సంవత్సరం. మేం ఇంటర్ మొదటి సంవత్సరం.

'రంగనాథం గూడ్స్ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఆ మధ్య పెరంబూర్‌లో కనిపించాడు' అన్నాను. షేక్స్‌పియర్ నాటకాలు బాగా చదివేవాడు. అతనంటే ఉపాధ్యాయులకి కూడా బెదురేనని చెప్పుకునేవారు. ఎక్కడ షేక్స్‌పియర్, ఎక్కడ గూడ్స్‌గార్డ్.

'అన్నా, ఎక్కడుందో?'

'స్కూలు మాష్టరు.'

'జ్యోయ్ మొతిదేబీమాటో' అన్నా వంగభాషలో ఉచ్చరణ అనుకరిస్తూ.

'మెడిసన్ పూర్తి చేసి కలకత్తాలో డాక్టరుగా పనిచేస్తోంది. అప్పుడే కళ్ళకి జోడు. ముగ్గురు సంతానం' అని ఆమె స్వేచ్ఛగా నవ్వేసింది. కళ్ళజోడుకి సంతానానికీ ఏం సంబంధమో తెలీక కాబోలు.

'ఇతను గోపాలం కదూ? తెలుగు మాస్టార్ని అల్లరి ప్రశ్నలు వేసి విసిగించేవాడు.'

'మీ కింకా జ్ఞాపకముందే. ఇప్పుడెక్కడున్నాడో తెలీదు' అన్నాను.

'సరే యిది మీరు.. పులి చర్మాల కోసం ప్రస్తుతం యిక్కడున్నారు' అని నవ్వడం సాగించింది.

'కూర్చున్న వారిలో మధ్యనున్నది ప్రిన్సిపాల్, ఆయన సతీమణి రిటైరయి యిప్పుడు అమెరికాలో వున్నాడు.' ఆ రోజులు స్మరించుకుంటూ కాబోలు ఆమె మౌనంలో పడింది. నేను టిఫిన్ పూర్తిచేశాను.

'చూశారా నేనూ పాత విద్యార్థినే, ఆహ్వానము మటుకులేదు.. స్త్రీల కెల్లాగైనా..'

ఒక మతిమరుపు జడ్జిగారిలా వుంది నా ధోరణి. ఆయన భార్య ఏవో ప్రశ్నలడుగుతూ వుండేదట. వాటిల్లో ఏదో వొక దానికి సందర్భం లేకండా నాలుగైదు రోజులయ్యాక సమాధానం చెప్పేవాడుట. ఒక ఉదయం 'ఏమీలేదు, పిల్లిలే' అన్నాడుట. రెండురోజుల క్రితం 'చప్పుడేమిటండీ?' అని ఆమె అడిగిన ప్రశ్నకి సమాధానమని వారం తర్వాత ఆవిడికి స్ఫురించిందట.

నన్ను వాక్యం పూర్తి చెయ్యకుండానే సీతాదేవి అంది.

'మీకూ ఆహ్వానం వొచ్చే వుంటుంది. వెనకటి అడ్రసుకి ఉంటారు. అనేక అడ్రస్‌లు మారి నాకు చేరినట్లుగా మీకూ ఎక్కడికో వెళ్ళే వుంటుంది. అయినా మనం వెళ్ళడం జరుగదుగా.'

అది నిజమే. కానీ ఆహ్వానం రాలేదంటే కొంచెం చిన్నతనంగా వుంటుంది.

'నా కొచ్చిన కవర్‌మీద అడ్రస్ చూశారా? మావారి పేరు టి.కె మూర్తి అనుకుంది. వి.కె.మూర్తి వుండాలి. అందుకనే మావారికది చూపలేదు. తప్పు పేరిట ఆహ్వానం అందుకోడం బదులు, అసలు రాకపోవడమే మెరుగనుకున్నా. పేరుగాని, ఇంటిపేరుగాని కవరుమీద, కార్డు మీద సరిగ్గా వుండకపోతే బాధగా వుంటుంది. దర్బీస్వీప్‌లో మనకో లక్షరూపాయలొచ్చిందన్న వార్త తెలియజేసే ఉత్తరమైనా పేరు సరిగ్గా లేకపోతే చిన్నబుచ్చుకోవడం మాత్రం తప్పదు.'

నౌకర్‌తో టిఫిన్ సరంజామా తీసెయ్యమని సౌంజ్ఞ చేసింది. నేను లేవబోతుంటే, ఆ ఫోటోలో వెనక నిలబడ్డ వారిలో మూలగావున్న వ్యక్తికేసి చూపించి 'పాపం, మురళి ఎక్కడున్నాడో?' అన్నదామె. మురళెవరు? వెంటనే స్ఫురణకు రాలేదు. ప్రశ్నార్థకంగా మొహం చిట్లించాను. "పావలా ఫ్లూట్ మీద గానం చేస్తుండేవాడట హాస్టల్లో తెలీదూ?" అని అందిచ్చింది. జ్ఞాపకం వచ్చింది అతన్ని 'బాలు' అనేవాళ్ళు. బాలకృష్ణ, మరో తరగతి వాడవడంవల్ల మాతో కూర్చునేవాడు కాదు. మా అందరికీ వారానికోసారి ప్రిన్సిపాల్‌గారి పాఠం వుండేది. అప్పుడే కలుసుకునే వాళ్ళం. హాస్టల్లో కూడా వాళ్ళవి మేడమీద గదులు, మావి కింద. ఒక ముస్లిమ్ రోజూ హాస్టల్ ముందు ఫ్లూట్ వాయిస్తుండేవాడు. ఫ్లూట్ అమ్ముతుండేవాడు కూడా. 'బాలు' ఒక ఫ్లూట్ కొని, ఎవళ్ళూ లేనప్పుడు ఏదో మూలగా వెళ్ళి వాయించుకుంటూవుండేవాడట. ఎంతవరకు అభ్యసించాడో ఎలా వాయించేవాడో నాకు తెలీదు. అతనికి ఎవళ్ళూ పెన్సిల్ మటుకు యిచ్చేవాళ్ళు కారు. 'దాన్ని నోట్లో పెట్టుకుని కొరకడమో ఊదడమో చేస్తాడని భయం' అంటూ వేళాకోళం చెయ్యడం నాకు గుర్తు. అతను తెలుగులో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. సంస్కృతంకూడా చదువుకునేవాడు. మా తెలుగు పండితులకి అతనంటే చాలా ఇష్టం. కాని ఆ రోజుల్లో తెలుగుకి అంత పరపతి లేకపోవడం వల్ల యితన్ని ముఖ్యుడుగా ఎవరూ పరిగణించారనుకోను.

'ఎక్కడున్నాడో ఏమో నాకు తెలీదు. అతన్ని మళ్ళా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు ' అన్నాను.

ఇంతలో అసిస్టెంట్ వచ్చాడు. పులి చర్మాలని ఇక్కడికి తేవడం కష్టం. టెంట్ దగ్గరకే ఒచ్చి చూచుకోమన్నాడు. సరేనని లేచాను.

"జాలయ్యని, జేమ్స్ ని తీసుకురమ్మనండి" అన్నది సీతాదేవి, అసిస్టెంట్ సరేనని వెళ్ళాడు. ఆవిడ బల్లమీద ఉత్తరాలు, పుస్తకాలు, పత్రికలు, సంచిక అన్నీ తీసుకుని లోపలికెళ్ళింది. నౌకరు టేబుల్‌పై గుడ్డతీసి దులిపాడు. నేను కాస్త దూరంలో ఉన్న తేనిపట్టుని చూస్తూ కూర్చున్నా. పదినిమిషాల్లో మరోచీరకట్టుకుని ఆమె వచ్చి, 'రండి యిల్లు చూద్దురుగాని' అని ఆహ్వానించింది. అది తిరువనంతపురం చీర – వెడల్పు జరీ, పల్చగా, తెల్లగా, నాజూకుగా వుంది. ఉదారంగు జాకెట్టు కనిపిస్తోంది. పదిరాళ్ళతో పొదిగిన నెక్లెస్ మెడని చుట్టుకుంది. తెల్లరాళ్ళ దుద్దులు మధ్య ఎర్రరాయి మెరుస్తోంది. ఆవిడ వేషధారణలో నైపుణ్యంగలదని తెలుస్తూనే వుంది. సరైన దుస్తులు, ఆభరణాలు, పోషణవల్ల నడివయస్సుని ఆమడదూరంలో వుంచినట్లుంది. లోపలికెళ్ళాం. గదుల్లో మృగాల తలకాయలు గురించి చెప్పింది. భర్త ధైర్య సాహసాలను ప్రస్తావించింది. క్రితం ఒక్కడూ ఒక సివంగిని వేటాడాట్ట. ఇరువురికీ అన్యోన్యం కుదిరినట్టు తెలుసుకున్నాను. భర్త సాహసకృత్యాలని చెప్పడంలో ఉద్దేశం లేకపోలేదు. తన వివాహానికి పూర్వం అతను చాలా పిరికివాడట. తనొచ్చిన తర్వాత, అతను మారిపోయి, అపూర్వమైన శక్తులను తెలివిని ప్రదర్శిస్తున్నాడుట. సీతాదేవి భర్తని ఘనకార్యాలు సాధించడానికి పురికొల్పింది. ఆమె ప్రేమ ప్రేరణవల్ల అతను తన్మయుడయ్యాడు. ***ఆదర్శం స్పష్టంగా లేనంతవరకూ, మానవుడు ఆ ఆదర్శం కోసం ఎన్ని త్యాగాలన్నా చెయ్యడానికి సిద్ధపడతాడు కాబోలు***. ఇంతకీ ఆమె ప్రేరణవల్ల అతను సాధించదలిచిందేమిటి? నాకు తెలీదు. తోటలోకెళ్ళాం. రెండు జింకలూ, నెమలివున్నాయి. పంజరాల్లో వింతవింత పక్షులున్నాయి. తల్లోంచి పడిన పువ్వుని ఆమె ఒంగితీసింది. ఒంగినప్పుడు పొట్ట మడతపడింది. మడతేమిటి, రెండు మడతలు.. జాలేసింది. ***ఆదర్శం స్పష్టంగా వుండక పోవడమే మంచిదేమో***. నేనెల్లా గయ్యానో. మెడమీద గీతలు కనపడసాగాయి. ఆనాటినుండి అద్దం చూసుకోడం తగ్గింది.

సీతాదేవి వివాహం జరిగి ఎంతకాలమైందో? పిల్లలా? ఆమె వయస్సు దాదాపు ముప్పై – ఇల్లా అనుకంటూ వుండగా ఆమె మాట్లాడ్డం సాగించింది. "ఎవరి ప్రయత్నమూ లేకుండా అంతా అల్లా జరిగిపోయింది. అదో చిత్రమైన గాథ"

"చెప్పండి, వినాలనుంది."

"నేనూ, మా పినతల్లి, వంటాయనా కార్లో వెడుతున్నాం. పెదనాన్నకి జబ్బంటే చూసొద్దామని బైలుదేరాం. ఆయనెక్కడో మారుమూల కాంప్‌లో వుండగా పక్షవాతం ఒచ్చిందట. పక్షవాతం అంటే నాకు భయం. మా తండ్రిగారు దానివల్లనే కాలం చేశారు. ఐదేళ్ళయింది. కారు అడవిలోంచి పోతోంది. రాత్రి తొమ్మిదైందనుకుంటా. నట్టడివిలో టైరు చెడింది. స్పేర్ టైర్ ఆ సాయంత్రమే వేశాడు. ఏమిటీ చెయ్యడం? కీకారణ్యం. అరణ్య రొద. దూరంగా ఏవో అరుపులు. మా పిన్ని ప్రాణాలుగ్గబెట్టుకుంది. ఏంచెయ్యాలో ఎవ్వరికీ తెలియడంలేదు. వంటాయన కర్రా కలపా పోగుచేసి మంట చేశాడు. మంటకి ఏ జంతువూరాదట. ఇంక రాత్రంతా ఆ అడవిలో గడపాల్సిందే. డ్రైవరు కొంత దూరం వెళ్ళి ఎవరన్నా వుంటే పలుకుతారని కేకవేశాడు. ఇంతలో పెద్దగాలి, వర్షం. మంట కాస్తా ఆరిపోయింది. అప్పుడు భగవంతుడల్లే మూర్తిగారు

ప్రత్యక్షమయ్యాడు. గడ్డం అదీ చూసి చీకట్లో భయపడ్డాను. తరవాత చెప్పారు. అడవుల్లో క్యాంప్ చేస్తూ మనుషులతో సంపర్కం తగ్గి గడ్డం చేసుకునే అలవాటు విడిచిపెట్టారు. ఈ అడవిలోనే కాంప్ చేస్తున్నాడట దూరంగా కేకలు వినిపించాయట. మమ్మల్నందరినీ టెంట్‌లోకి చేరేశాడు. కాసేపటికి వాన వెలిసింది. మళ్ళా మంటలు చేశారు. స్టవ్ మీద కాసినన్ని పాలుంటే కాచిచ్చాడు. పిన్ని తాగి పడుకుంది. అల్లా కలిసింది స్నేహం.

నేను మిగతాది వూహించుకోగలను. అద్భుతమైన ప్రకృతి దృశ్యం, కొండలు, లోయలు, పెద్ద అడివి దూరంగా ఎక్కడో అడివి జుట్టులో మధ్య పాపిటలాగా చిన్న కాలువ. అడివి దేవత జలుబు చేసి చీదినట్లుగా వర్షం, చీకటికి జడుసుకుని దూరంగా వెళ్ళి మెరవని తారకలు. 'ఈ ప్రకృతిలో వుండిపోదాం అనుకుంటూ వుండేవాడిని కాని నిజంగా వుండలేను. ఒక క్షణం దర్శనమిచ్చి మానవహృదయానికి గగుర్పాటు, సున్నితమైన ఆవేదన, తాత్కాలిక సౌందర్యానుభూతి కలిగించేటందుకే యీ ప్రకృతి భీభత్స దృశ్యం. నువ్వు మాలోవాడి వే సుమా" అని ఒక్కసారి జ్ఞాపకం చేసే దూరపు చుట్టం. ప్రకృతి – అది చచ్చిందో బ్రతికిందో ఎవరికీ పట్టలేదు. భయం, చీకటి, చలి, ఆకలి శరీరానికి నిబ్బరం, వెలుగు, వెచ్చదనం, సంతృప్తి కావాలి. శరీరం దగ్గరగా యింకా దగ్గరగా జరిగింది. ఆకలి అనే జ్వాలలో ఆ శరీరాలు నిశ్శబ్దంగాబడ్డాయి. మంట చల్లారింది. తెల్లవారింది. వెలుగు, నిబ్బరం, కొత్తబలం సంతృప్తి చెందిన శరీరపు వికాసం ఇవన్నీ వివాహం అనే సంస్థలో అంతమొందాయి. ఆ అనుభవం రోజూ, అందరికీ ఏదో విధంగా లభ్యమయ్యేదే. కానీ ఆ శరీరాలు, ఆ పరిస్థితులు, తిరిగిరావు. జ్ఞాపకం మాత్రం నిల్చిపోతుంది. చివరివరకూ అదే స్మరించుకుంటూ, అవే యివనుకుంటూ భ్రమతో జీవితయాత్ర సాగుతుంది.

ఆమె మళ్ళా మాట్లాడుతోంది.

"తరవాత తెల్సింది. ఆయన కాంప్ చేస్తున్నారట. భోజనం సామాగ్రి, అసిస్టెంట్లు, నౌకర్లు ఆ సాయంకాలానికి జీపులో చేరుకోవాలి. ఆ జీప్ కూడా చెడిపోయిందట. వారెవ్వరూ రాలేదట. ఈయనొక్కరూ హడలిపోయి, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, ఎవరేనా మనిషి కనబడితే బాగుండునని దైవాన్ని ప్రార్థిస్తూ కూర్చున్నారుట. భగవంతుడిలా మేం కనిపించామట. లేకపోతే భయంవల్ల ఆయన ప్రాణం విడిచేసి వుందురట" అని ఆమె నవ్వింది.

"ఇదంతా జరిగి ఎంతకాలమైంది?"

"నాలుగు నెలలు"

అతనికి ముప్పై రెండు, ఆమెకి ముప్పైవొకటి. ఇంతవరకూ పెళ్ళి ఎందుకు కాలేదో? ఆదర్శాల అన్వేషణే? ఒకాయన ఆదర్శ స్త్రీ కోసం వేచివున్నాడట. ఇరవై యేళ్ళకి దొరికిందట. తను ఆదర్శపురుషుడి కోసం అన్వేషణ సాగిస్తున్నానందట ఆమె. మధ్య నాకెందుకివన్నీ? అడిగేటందుకు నేనెవర్ని?

ఇంతలో అసిస్టెంటొచ్చాడు. జేమ్స్ తలకి పట్టీ వేసుకున్నాడట. అక్కడికే వెళ్ళి చూడడం తప్పదన్నాడు. బైలుదేరాను. పావుగంటలో అక్కడికే వచ్చాడు మూర్తిగారు. వేలంలో పాడే అవసరం లేకుండానే కొంచెం తక్కువ ధరకి చర్మం నాకు లభింపచేశాడు. నేను సెలవు తీసుకుని వెడతానన్నాను.

"భోజనం చెయ్యరూ?" అన్నాడు.

"వెడతాను, చౌదరిగారు కనిపెట్టుకుని వుంటారు నాకోసం" అన్నాను.

"ఏదేనా పుచ్చుకుని వెడుదురుగాన్లెండి" అన్నారాయన. ఇద్దరం బంగళా కెళ్ళాం. పళ్ళు, నిమ్మరసంతో డ్రింక్ తెచ్చింది సీతాదేవి. ఏదో మాట్లాడటం కోసం అన్నాను. "ఈ ప్రాంతంలో అడవి పందులు ఎక్కువ అంటారా?"

"ఎక్కువే. పెద్ద పులులు లేవు ఎప్పుడేనా చిరుతపులి రోడ్డుకడ్డంగా పడుకుని వుంటుంది. మీరు తీసుకెడుతున్న పులి చర్మం ఉత్తర హిందూస్థానం నుంచి వొచ్చినది. కల్నల్ అండర్సన్ పేరు విన్నారా? ఆయన వేటాడిన పులి చర్మమట మీకిచ్చినది. టానింగ్ పరికరాలు మంచివి రాలేదు. బాగా టాన్ చేస్తే యీ పంది చర్మం చాలా ఆకర్షణీయంగా వుంటుంది."

నే వెడతానని లేచాను.

"ఉండండి" అని గదిలోకెళ్ళి బల్లమీదవున్న నాలుగైదు హంటర్లలో వొకటి తీసుకొచ్చి నాకిచ్చాడు.

"ఇది ఉంచుకోండి జ్ఞాపకార్థం."

నేను తీసుకుని "థాంక్" చేసి దాన్ని పరకాయించి చూశాను. రెండడుగులు పొడుగుంటుంది. అంత బరువులేదు. చుట్టూ నల్లచర్మంతో కప్పివుంది. చివరలో పట్టుకునేందుకు తోలు పటకా ఒకటుంది. ఊరికే అలంకారానికీ, చేత్తో తిప్పుకునేటందుకూ ఆర్మీ ఉద్యోగుల హస్తభూషణం అది. తోలు గొళ్ళెం కాస్త చిరిగింది. చివరలో రెండు మూడు పసుపుపచ్చడాగులున్నాయి చర్మంపైన. ఆయన లోపలికెళ్ళాడు. నేను గదిలో బల్ల దగ్గరకెళ్ళి, మిగిలిన నాలుగు హంటర్లనీ చూసి, వాటిలో డాగులూ, చిరుగులూ లేని మధ్యనున్న మంచి హంటర్ని ఏరి, నా చేతిలోది అక్కడ పెట్టేసి బైటకొచ్చాను. జ్ఞాపకార్థం తీసుకెడుతున్న బహుమతి కొంచెం కొత్తదిగా ఉండడమే మంచిదనుకున్నా. అన్ని హంటర్లూ వొకటే. ఏ హంటరైతే నేం? కాని నే కొత్తగా ఏరుకున్న హంటర్ మరీ తేలికగా కనపడింది. కాస్తంత సన్నంగా కూడా వుందేమో. మరీ మంచిది. ఇంతలో మూర్తిగారు పైకం ముట్టినట్లుగా సంతకం పెట్టి రసీదిచ్చాడు.

"ఈ ప్రాంతం కేసి వొచ్చినప్పుడు యిక్కడికి రాకుండా వెళ్ళకండేం?" అంది సీతాదేవి.

"ఓ తప్పకుండా" అని ఉభయుల దగ్గరా శెలవు తీసుకుని వచ్చేశాను.

ప్రయాణంలో తోవపొడుగునా అసలు అంతకు ముందునుంచీ కూడా ఆమె "పాపం, మురళి" అని ఎందుకన్నదా అని వితర్కించుకుంటూనే ఉన్నా."పాపం" ఏమిటి? అర్థంలేని ముక్క. అతన్ని గురించి ఆమెకేం తెలుసు? "పాపం"

అనగలిగేటంత తెలుసు అదేమిటి? "పాపం" అనేది పేచీలతో కూడుకున్నమాట. దానికెన్నో అర్థాలున్నాయి ఉచ్చరించిన విధంబట్టి, ఆ అర్థాలు మారుతూంటాయి. 'పాపాలు చెయ్యడం' అనడానికి "పాపం చెయ్యడం" అనడానికీ తేడావుంది. కొన్ని వాక్యాలు చూడండి 'పాపం పండింది ' 'పాపాలు పెరిగిపోతున్నాయి ' "పాపిష్టి బ్రతుకు" "పాపాలకల్లా భైరవుడు" పాపం మంచివాడు.

"ఏం పాపం" "మరే పాపం" "పాపానికి పశ్చాత్తాపం లేదు.

వీటిని గురించి ఆలోచిస్తే స్థూలంగా రెండు రకాల అర్థాలు కనబడతాయి. నైతికంగా ఖండించదగిన చెడ్డపని అన్నది వొకటి. లౌకిక దృష్ట్యా సానుభూతి అన్నది రెండోది. "పాపం మంచివాడు" అనడంలో జాలి ప్రకటితమవుతుంది – లౌకిక దృష్ట్యా ఆ మంచితనాన్ని కాస్త హేళన చెయ్యడమూ ఉంది. సీతాదేవి వాడిన "పాపం"లో జాలిపడటం వుంది. అతని మంచితనాన్ని కాస్తంత వెక్కిరిండమూ వుంది. ***మంచివాడు స్త్రీని ఆకర్షించదేమో. మంచివాడు తనకోసం చేసిన త్యాగాన్ని స్త్రీ క్షమించదేమో?*** సీతాదేవి అతన్ని క్షమించింది. "పాపం మురళి" అని అప్రయత్నంగా అనేసి తన ఆధికత్యని (నైతికంగానా?) స్థిరపరచుకుందా? అతనేం చేశాడు? అసలేం జరిగింది? ఇల్లాంటివి ఎన్నో ప్రశ్నలు ఎదురైనాయి. నా కుతూహలం రేకెత్తింది. అతన్ని గురించిన వివరాలు సేకరించాలని అన్వేషణ సాగించాను.

చదువుకునే రోజుల్లో గోపాలం, నేనూ హాస్టల్లో ఒక గదిలో వుండేవాళ్ళం. శెలవలకి యింటికెళ్ళినప్పుడు పెద్ద పెద్ద ఉత్తరాలు వ్రాసుకునేవాళ్ళం. అదృష్టవశాత్తు ఎగ్జిబిషన్‌లో అతన్ని కలుసుకోడం జరిగింది. వ్యవసాయశాఖలో పనిచేస్తున్నాట్ట. వాళ్ళ స్టాల్‌లో కూడా నలుగురికీ వివరించి చెప్పేటందుకు అతన్ని పంపారుట. అతనే నన్ను గుర్తుపట్టాడు. "బాలు" గురించి ఎత్తాను.

"నీ దగ్గర కాలేజీ మేగజీన్ లేదా?" అన్నాడు.

"లేదు"

"ఎక్కడైనా దొరికితే చూడు. అందులో అతని భావగీతాలు కూడా పడ్డాయి."

"ప్రేమ గీతాలా?"

"ఏమో నాకేం గుర్తులేదు. సాధారణంగా ఆ వయస్సులో యువకులందరూ వెళ్ళబోసుకునే శృంగార జాడ్యం" అన్నాడు.

"ఫ్లూట్ వాయించేవాడట."

"చెప్పుకునేవారు. నేనూ వినలేదు. ఐనా అతని గొడవ నీకెందుకు?"

"పెద్దయింతర్వాత బాల్య స్నేహితులు ఎలా తయారయ్యారా అని తెలుసుకోవాలన్న కుతూహలం" అన్నాను.

"అతన్ని ఆచారి బాగా ఎరుగును" అన్నాడు.

"రంగాచారా? ఎక్కడున్నాడు?"

"ఈ వూళ్ళో పవర్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదైంది యిక్కడికి ట్రాన్స్‌ఫరై."

నాకాశ్చర్యం వేసింది. దగ్గరకొచ్చినకొద్దీ దూరమైపోతాం అన్న ఇంగ్లీషు పద్యంలో పాదం స్ఫురణకొచ్చింది. ఆచారిని కలుసుకుని అవీ యివీ మాట్లాడుకున్న తర్వాత "బాలు" విషయం అడిగాను.

"పేరు"

"బాలు – బాలకృష్ణ."

"కృష్ణయ్య! "బాలు" అనడం నే నెరగను. కృష్ణయ్యగానే ఎరుగుదును. కథలు అవీ వ్రాస్తూండేవాడు. కాలేజీ మేగజైన్లో అతని కథ ఒకటి పడింది" అన్నాడు.

"ఆ, అతనే ఇపుడేం చేస్తున్నాడు?" అని అడిగాను.

"ఆ కథపేరు 'రంభ '"

"అతనే.. ఏం చేస్తున్నాడు?"

"రంభతో సరసాలాడుతున్నాడు" అన్నాడు.

"అదేమిటి?"

"రెండేళ్ళ క్రితం టి.బి వచ్చి పొయ్యాడు."

నాకు విచారం వేసింది. 'పాపం మురళీ' అనుకున్నాను. టి.బి వచ్చి చనిపోలేదు. ఏ స్త్రీనో ప్రేమించి, విఫలుడై ఆత్మహత్య చేసుకున్నాడు అనుకుంటే మనస్సుకి శాంతి.

నా కథ ముగిసింది. నే చెప్పిన ఘట్టం విని శాస్త్రి చేసిన వ్యాఖ్యానం తప్పని తేలిపోయింది. అపరాధ పరిశోధక నవల చదివి, హంతకుడెవడో పాఠకుడు పోల్చుకోలేకపోతాడు. తన కియ్యబడిన విషయాలను పురస్కరించుకుని ఫలానా అని నిర్ణయిస్తాడు, చివరపుట చూడగానే. అతను కాడు. మరొకడని తేలిపోతుంది. రచయిత విజయం సాధిస్తాడు. నేనూ శాస్త్రిపైన విజయం సాధించాను.

ఈ విషయం సీతాదేవికి జాబుద్వారా తెలియచేస్తే? ఉత్తరం భర్త చూస్తే ప్రమాదం ఏమన్నా వుంటుందా? ఆలోచన తెమలక సాయంత్రం సినిమాకెళ్ళాను. విశ్రాంతి సమయంలో సోడా తాగుదామని బైటకొచ్చాను. ఎవరో భుజం చరిచారు. వెనక్కి తిరిగాను. గుర్నాధం. గుర్నాధంది బట్టతలైపోయింది. పాంటులో చొక్కా అమరికగా ఉండడం లేదు. కాసేపు ఉగ్గపెడితే లోపలికెళ్ళినట్లుగా వున్నా, లాగూలు విసర్జించి పంచకట్టుపై పటకావేసి బిగించే సమయం వచ్చిందనుకున్నా. అతనికి నలుగురు పిల్లలుట. ప్రపంచం ఎలా కదలిపోతూంది. జీవితం ఎల్లా పెరిగిపోతూంది. ఆ శృంగారం, ఆ కలలు, ఆ ఆదర్శాలు, భావగీతాలు ప్రపంచాన్ని పెంచడానికేనా? సృష్టిని ఆపడం ఎవ్వరితరం?

'పాపం బాలకృష్ణ, టి.బి.తో చనిపొయ్యాడటగా?' అన్నాను.

'ఎవడా అన్నదీ. చనిపోయినవాళ్ళ కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బుని కంపెనీ వారిచే కక్కిస్తున్నాడు" అన్నాడు గుర్నాథం.

"అంటే"

"నాలుగేళ్ళ క్రితం హైరాబాద్‌లో కలుసుకున్నాను. ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. టి.బి.తో చనిపోయింది కృష్ణయ్య చౌదరని బి.ఏ మొదటేడు. కథలు వ్రాస్తుండేవాడు. మన బాలు – బాలకృష్ణ వాడికేం హాయిగా ఉన్నాడు."

"పెళ్ళయిందా?"

'అవకుండా వుంటుందా? ఆ విషయం నేనడగలేదు సుమా. ఆ రోజుల్లో జ్యోతిమతిదేవిని దూరంగా ఆరాధించే భక్తులలో అతనొకడు. భావగీతాలు వ్రాసేవాడు. అంతా రవీంద్రుడు, ఊర్వశి, శాంతినికేతనం ధోరణి. ఆమె వంగకన్య కదా అందుకు. ఆవిడకి ఫ్లూట్ అంటే యిష్టం అంట. ఇంటి దగ్గర పాపయ్యశాస్త్రి ఫ్లూట్ నేర్పేవాడట. మనవాడు కూడా షేక్ మీరాసాహెబ్ దగ్గర వో పావలా ఫ్లూట్ కొని ఊదేవాడు. బుస్‌బుస్‌మని చప్పుడేగాని సంగీతంలేదు. నాతో చెప్పుకుని యిదయ్యేవాడులే. ఓసారేం జరిగిందో తెలుసా?'

"చెప్పు"

"పెట్టిలోంచి వో సంచి పెళ్ళగించాడు. అందులోంచి వో ఎముక ముక్క చూపించాడు. నే జడుసుకున్నా.

"ఇది మా అమ్మది" అన్నాడు. వాళ్ళమ్మ చనిపోయిందిట. దహనం జరిగిన మర్నాడు అస్తికలన్నీ ఏరినతర్వాత అందులో ఒకదాన్ని దాచేశాడుట. "ఈ ఎముకలో నేనొక భాగం – చిత్రంగా వుండదూ" అన్నాడు.

"నాకిదంతా మార్బిడ్"

"అసహజంగా వుండదూ చంపక. వో రకంగా మెంటల్..."

"చపలుడందూ చంపక" అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

"మరోసారి మరో తమాషా" అన్నాడు గుర్నాథం.

"చెప్పు"

"శెలవలిచ్చారు. ఇళ్ళకి పోతున్నాం. గదిలో ఎవ్వరూ లేరు. పర్సులోంచి ఓ పొడుగుపాటి వెంట్రుక తీశాడు. 'ఇదెవరిదో తెలుసా?' అన్నాడు.

'మీ అమ్మదా?' అన్నాను.

'కాదు జయంతిది' అన్నాడు.

"నీకెలా వచ్చింది?"

"ఎవరితోనూ చెప్పకు. అప్పుడప్పుడు నా నోట్సు ఆమె తీసుకుంటూ వుండేది. మొన్న బుక్కు తిరిగిచ్చేసింది. పుటల మధ్య యిదుంది."

"కావాలని పెట్టిందంటావా?"

"అనుకుంటే ఎంత ఆనందం" అన్నాడు."

తీరా చేసి ఇన్సూరెన్స్ ఏజంటుగా తయారయ్యాడు. ఇన్సూరెన్స్ వృత్తిని ఎందుకు చులకన చెయ్యాలో నాకు తెలియలేదు. అతను పనిచేస్తున్న ఇన్సూరెన్స్ కంపెనీ పేరు తెలుసుకుని యింటికి వచ్చేశాను. తొందరపడి సీతాదేవికి ఉత్తరం వ్రాయనందుకు సంతోషించాను. ***మనం చెయ్యని పనులవల్ల ప్రపంచానికెంతటి ఉపకారం జరుగుతోందో తెలుసుకుంటే, నిరుద్యోగులు బాధతో కుమిలి హతమవరు.***

ఆ మర్నాడే ఇన్సూరెన్స్ ఆర్గనైజరు సత్యనారాయణ్ణి కలుసుకుని ప్రస్తావించాను.

"ఇప్పుడాయన మా కంపెనీలో పనిచెయ్యడంలేదు. అప్పుడే ఇది వొదిలేసి నాలుగేళ్ళయింది. అడవి మృగాలని పెంచుకునేవారికి, సర్కస్‌కు నడిపేవారికి జంతువుల ఇన్సూరెన్స్ పథకాని ఒకదాన్ని తయారుచేశాట్ట. ఆ వ్యాసం పెద్దలని ఆకర్షించిదంట. షికాగో పత్రిక కూడా దాన్ని ప్రచురించిందట. వెంటనే అతనికి అటవీశాఖలో పెద్ద ఉద్యోగం లభించింది" అన్నాడు సత్యనారాయణ.

"ఇప్పుడెక్కడున్నాడు?"

"మీ చౌదరిగారు ఇన్సూర్ చెయ్యమని పులి చర్మం తెచ్చాడు. ఆది ఆయన దగ్గర కొన్నదే. మీరేవెళ్ళి తెచ్చారుటగా."

నేను స్తంభించిపోయాను. నేను నమ్మను. నాటకంలో వేషం అన్నట్లు, ఇందులో ఏదో మోసం వుంది. నాకు నిదర్శనం కావాలి అనుకుంటూ ఇంటికి వెళ్ళగానే మూర్తిగారి నౌకరు జాలయ్య ఓ చీటీ తెచ్చాడు. తీసి చూశాను.

"మీతో తీసుకెళ్ళిన హంటర్‌ని దయతో ఇతని ద్వారా పంపండి. మీకు మరో హంటర్ పంపుతున్నాను" అనుంది. జాలయ్య ఆ క్రొత్త హంటర్ చేతికిచ్చాడు. దాన్ని లోపలికి తీసుకెళ్ళి పరీక్షగా చూశాను. రెండూ ఇంచుమించు ఒకటే, ఇదే ఎందుకు కావాలన్నాడు? నిదానంగా చూశాను. నాతో తెచ్చిన హంటర్ మీద రెండు మూడు గుండ్రని గతుకులు మినహా చాలా కొత్తగా వుంది. తేలికగా వుంది. కాస్తంత సన్నంగా వుంది. తోలుగొళ్ళెం దగ్గర చాకుతో కోసి చర్మం తొడుగు వూడదీశాను. లోపల వున్నది ఫ్లూట్. నాలుగు కంతలున్నాయి, ఆ కంతల్లో ఒక పొడుగాటి వెంట్రుక చుట్టబడివుంది. తొందరగా దాన్ని తొడుగులో వుంచేసి జిగురుతో గొళ్ళెం దగ్గర అతికించి, దాన్ని జాలయ్యకిచ్చి పంపించి వేశాను.

నా సందేహం తీరింది. అతని పూర్తిపేరు వి. బాలకృష్ణ మూర్తి. చదువుకునే రోజుల్లో ఆ "మూర్తి" తీసేశాడు. ఉద్యోగంలో కొచ్చిన తరువాత వి.కె.మూర్తి అని పెట్టుకుని ఆ "బాల"ని వదిలేశాడు. గడ్డం పెంచేసి ఆ వెనకటి శరీరాన్ని


కప్పేశాడు. గతాన్ని విస్మరించాడు. అతని స్వప్నాలు, ఆదర్శాలు, ఆశలు గతంలో నశింపయ్యాయి. ఆమె కనుక్కు తీరుతుందన్న సంగతులను ఇతరులు ఆమెకి చెప్పేముందు, భర్త భార్యకి చెప్పెయ్యడం మంచిదని అతనికి తెలీదు పాపం.

గతాన్ని పూర్తిగా వదల్లేదతను. దానిపై రోత కోరినట్లుగా అతను తయారవలేదు. అతనికి కావల్సినవి లభ్యమవలేదు. అయితే అదే యదార్థం. అందులోనే అతని నిజస్వరూపం. ఆ జీవితానికి కట్టిపడవేసిన వెంట్రుక కావాలి. ఆ కంఠాన్ని వినే కంతల వాయిద్యం కావాలి. లభించినదాన్ని అతిగా వూహించుకుని బాధపడి, బాధపడి, బాధలో తృప్తిపడి తృప్తిలో అసంతృప్తిని రహస్యంగా పీకచుట్టూ వురేసుకుని ప్రస్తుతాన్ని గతంలో పూడ్చేసి, గతాన్ని భవిష్యత్తు చితిపై పేర్చి ఏమిటో ఈ వికృతమైన, అసహజమైన ఆలోచనల్ని తెలుసుకున్న సత్యం కల్పితగాథకంటే యదార్థగాథ మహత్తరమైన ఆశ్చర్యాన్ని కలగచేస్తుందన్న నిర్వచనాన్ని ఋజువు చేస్తుందని తృప్తి పడకూడదా? ప్రస్తుతంతో సమాధానపడకూడదూ? విపరీత వ్యాఖ్యానాలు చేసి విసిగించకుండా ముగింపు మొదట్లోనే తెలిసిపోయిన ఈ కథ ముగించకూడదు? ముగింపేమిటో చెప్పివేసిన శాస్త్రి మరీ ఎక్కువ తెలిసున్న వాడవడం వల్ల అసలు రచనకే పూనుకోలేకపోతున్నాడనుకుని అట్లా చేసినందుకు అతనిపై నాకున్న కసిని ఈ కథద్వారా పాఠకుడితో పంచుకున్నా కదా అన్న తృప్తిలో నిలిపివేస్తాను.

# అందరివంటిది కాదు

## కొండముది శ్రీ రామచంద్రమూర్తి

(1979 ఏప్రిల్ యువ మాస పత్రిక నుండి)



**అశోక్‌నగర్** మేమున్న అల్లసాని పెద్దన వీధిలో నాకు తెలియని వాళ్ళెవరూ లేరు. ఊరికి దూరంగా విసిరివేసినట్లుగా వుండే ఆ పెద్ద మనుష్యుల పోష్‌కాలనీలో నడిమధ్యగా వున్న ఆ వీధిలో ఎడమవేపు చివరగా వున్న మర్రిచెట్టు పక్కన ఆడపిల్లల కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్న శివజ్యోతీ ఆమె భర్త సత్యవంతుడూ తమ ఇద్దరు పిల్లలతోనూ కొత్తగా కట్టుకున్న తమ స్వంతరంగుల ఇంట్లో సుఖంగా కాలక్షేపం చేస్తున్నారు. ఆ యింటికి ఎదురుగా ఓ పాత బంగళా వుంది. లంకంత కొంప.

దొడ్డినిండా రకరకాల చెట్లు. మేడమీద మూలగదిలో బిక్కు బిక్కుమంటూ వో ముసలి రిటైరయిన ఇంజినీరూ, ఖల్లుఖల్లుమని ఇరవై నాలుగ్గంటలూ వీధికంతా వినిపించేట్లు దగ్గుతూ వుండే ఆయన బడుగు ఇల్లాలూ కాపురముంటున్నారు. ఆయన ఒక్కగానొక్క కొడుకూ అమెరికాలో సెటిలైపోయి ఓ తెల్లపిల్లని కట్టుకున్నాడు. అతగాడు వీళ్ళిద్దర్నీ కూడా అమెరికా వచ్చేయమని ఎన్నిసార్లు ఎంతగా రాసినా, వీళ్ళక్కడకు పోరు.

"బ్రతికినంత కాలం ఇహ బ్రతకం గదా! సుఖమో, దుఃఖమో ఇక్కడే పుట్టాం. ఇక్కడే ఈ మట్టిలో కలిసిపోతేనే ఈ జీవితాలకింత సార్ధకత. ఏవంటారు?" అంటుంటారు తమను చూడటానికి వచ్చిన ప్రతివాళ్ళతోటీ కానీ నా అనుమానం ఆ తెల్లపిల్ల మోచేతి నీళ్ళు తాగకుండా వుండడం కోసమే, వాళ్ళక్కడకు వెళ్ళటానికి ఈ అభ్యంతరం చెబుతున్నారని. వీధికి మధ్యగా ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టరు గారూ, ఆయన ఇంటికి ఎదురుగా ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ అద్దెకొంపా, సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారికి కుడివైపున వో ఇ ఎన్‌టీ స్పెషలిస్టూ, ఆయనకు ఎడమవైపున పెద్దాసుపత్రిలో పని చేస్తున్న ఆపిలు బుగ్గల పెద్ద నర్సూ, ఇవతలగా హైస్కూలు హెడ్మాస్టరూ, వారికి పొరుగువారుగా వో ప్రొటస్టెంటు పాస్టరు కుటుంబం, వారికి మరి కొంచెం దూరంలో లక్షలమీద వ్యాపారం చేసే పొగాకు చౌదరిగారూ, ఆయనకు చేతివాలుగా కాంపౌండు గోడనానుకుని వున్న పూరిగుడిసెలో గిరీశం వీళ్ళూ మా వీధిలో నాకు తారసపడే వ్యక్తులు.

నిజానికి మా వీధిలో అన్నీ డాబాలూ, మేడలే, గిరీశం పూరి గుడిసె తప్ప మా వీధిలో చాలా ఇళ్ళల్లో స్కూటర్లూ, ఒకటి రెండు ఇళ్ళల్లో కార్లూ వున్నాయి, ఒక్క గిరీశం గుడిసెలో తప్ప. పాపం అతను ఎక్కడకు వెళ్ళినా నడిచే వెళ్ళాలి. అతని రెండు కాళ్ళకూ, అతను పుట్టినప్పటినుంచీ విశ్రాంతేలేదు. అవి నడుస్తూనే వున్నాయి, గిరీశం చదువుకోసం, గిరీశానికి ఓ ఉద్యోగాన్ని చూపించడం కోసం, గిరీశానికి తిండికోసం.

నేను గిరీశాన్ని రోజూ చూస్తూనే వుంటాను. గిరిజాల నల్లని జుట్టు. కోల మొహం. కోటేరేసిన ముక్కు. ధనుస్సులా వంగిన పెదిమలు. వత్తయిన కనుబొమలు. చెంపలమీద విస్కర్స్. పెద్ద మీసాలు. అతని కాళ్ళలో ఎంత బలముందో ఆ కళ్ళల్లో అంతటి నల్లని చిక్కదనముందు.

నాకింకా పెళ్ళికాలేదు. అతనికప్పుడే పెళ్ళి కావడమూ, ఆ పెళ్ళాం పోవడమూ, కొన్నాళ్ళూ ఊరుకున్నట్టే వూరుకుని మరో అమ్మాయిని కట్టుకోవడమూ అన్నీ జరిగిపోయినాయి.

నా పెళ్ళి ప్రస్తావన వచ్చినపుడెల్లా మా అమ్మ అతన్నే ఉదాహరణగా తెస్తున్నది ఈ మధ్య.

"చూడ్రా నెత్తిమీద దమ్మిడీ పెడితే ఏగాణీ చెయ్యడు. వాడే పెళ్ళి చేసుకున్నాడు, ఒకసారి కాదు, రెండుసార్లు. నువ్వా వున్నావ్, వేలకు వేలు సంపాయిస్తున్నావ్ నెల తిరిగేసరికి. ఏం లాభం, ఎంత చెప్పినా వినవు కదా, నీకు నచ్చిన పిల్లనే చేసుకో. నేను కాదనను."

రోజూ వుండే భాగోతమే కాబట్టి, నేను మెదలకుండా వూరుకున్నాను. నా మౌనాన్ని అంగీకారమనుకుని మళ్ళీ మొదలుపెట్టింది మా అమ్మ.

"నేను చెప్పిన మాట వినరా, ఆ శివజ్యోతీ వాళ్ళ పిల్లను చేసుకో, పిల్ల బంగారబ్బొమ్మ. ఇరవై వేలు కట్నం. డిగ్రీ చదువుకుంది. పెళ్ళానికి డిగ్రీ ఎందుకనుకుంటావా, వీధి చివరి మేడమీది ఇంజినీరుగారు కబురు చేశారు. ఆయన తమ్ముడి కూతురు వుందట. ముప్పైవేలకు పైగా ముట్ట చెబుతాడట."

మా అమ్మ అట్లా మాట్లాడుతూనే వుంది. నేను వరండాలోకి వచ్చి స్కూటరు బయటకు తీశాను.

"అంతేరా! నా మాటను ఇట్లానే పెడచెవిని పెడుతూ వుండు. ఎప్పుడో చెప్పా పెట్టకుండా నేను కాస్తా హరీ అంటాను. అప్పుడఘోరిస్తావ్, అమ్మమాట వినలేదే, ఆడదాని అవసరాన్ని అర్థం చేసుకోలేదే అని." అంటున్నది అమ్మ వెనకనుండి.

ఎప్పుడూ ఇంతే. అమ్మ ఎప్పుడూ ఆడదాని అవసరం గురించే మాట్లాడుతుంటుంది తప్ప, ఆడదానికి కావలసిన వ్యక్తిత్వం గురించి మాట్లాడదు.

సత్యవంతుడికి శివజ్యోతి సంపాదన  కావాలి, గుర్రప్పందాలలో పాల్గొడానికీ, పేకాటలో ఖర్చు పెట్టడానికీ, ముసలి ఇంజనీరుకు కాళ్ళు పట్టడానికి వరుగులా వున్న బడుగు పెళ్ళాం కావాలి. ఆ పెళ్ళాం ఖల్లు ఖల్లుమని దగ్గే గద్దుల పళ్ళెం అయినా ఇబ్బంది లేదు.

సర్కిల్ ఇన్‌స్పెక్టరుకు ఆడదంటే గోల్డెన్ ఈగిల్ అందించే పక్కమీది చక్కని చుక్క.

మెడికల్ రిప్రజెంటేటివ్‌కు, ఇంటికొచ్చినప్పుడు అన్ని రోజులూ తన ఒంట్లో దాచుకున్న వేడిని ఒక్కసారిగా చల్లార్చే ఫ్రిజిడేర్, భార్యంటే.

ఇఎన్‌టీ స్పెషలిస్ట్‌కు తన భార్య, తన పిల్లలకు వేడి వేడి అన్నం వండి వడ్డించే వో వంటకత్తె.

ఆపిలు గుగ్గల పెద్ద నర్సుకు, తన శరీరం డబ్బును పండించే పంటభూమి.

హైస్కూలు హెడ్మాస్టరుకు, అతని భార్యలోని స్త్రీత్వానికీ, అతని కోటులోని అధికారానికీ భేదం తెలీదు.

ప్రొటస్టెంటు పాస్టరుకు, ఆడదంటే మగవాడి పక్కటెముక. పాపానికి శ్రీకారం చుట్టిన ఈవ్‌కు వారసురాలు.

పుగాకు చౌదరిగారికి, అతని పెళ్ళాం అతను కాల్చుకునే వో పొగాకు కాడ.

గిరీశానికి అతని పెళ్ళాం మెడమీద వో పెద్ద గుదిబండ.

వీళ్ళందర్నీ చూస్తూ కూడా నేనెట్లా పెళ్ళిచేసుకోను? తన వ్యక్తిత్వంతో మగవాణ్ణి పరాభూతం చేయగల స్త్రీ ఇంతవరకూ నాకు కనబడలేదు.

గిరిశం పూరిపాక మా మేడకు సరిగ్గా ఎదురుగ్గా వుంది. మా ఇల్లు నిద్రలేచేసరికే, ఆ పూరిపాక ముందు కళ్ళాపి చల్లబడి వుండేది. రాత్రిపూట మా ఇంట్లో దీపాలారిపోయినా, ఆమె మాత్రం మట్టి అరుగులమీద, పూరిగుడిసె చూరు క్రింద కొంగు పరుచుకుని, మిణుకు మిణుకుమంటున్న కిరసనాయలు బుడ్డి పెట్టుకుని సవతి పిల్లల్ని చెరోవైపునా పడుకోబెట్టుకుని దుఃఖ ఉద్విగ్నకంఠంతో ఏదో పాటలు పాడుకుంటూ, నాకు కిటికీలోనుండి కనిపించేది.

ఆ గొంతులో ఏ ఆకర్షణాలేదు. ఆమె రూపంలో ఏ ప్రత్యేకతా లేదు. ఆమె పొడవూ కాదు, పొట్టీకాదు, సన్నమూ కాదు, లావూ కాదు. తెలుపూ నలుపూ కలసిన బూడిదవర్ణంలో, ఎండిపోయిన నదిలాగా కనిపించేది. అతుకుల చీరలు వొంటికి చుట్టుకునేది. కాళ్ళు పగిలినా చెప్పులు వేసుకునేది కాదు. కళ్ళు వాచినా కాటుక పెట్టుకునేది కాదు. ఆమెను ఒకసారి చూస్తే జ్ఞాపకం పెట్టుకునే సంగతి ఏదీ ఆమెలో లేదు అని అర్థమౌతుంది. ఈ దేశంలో బ్రతుకుతున్న అనేక లక్షలమంది అనామకులైన ఆడవాళ్ళకు ఆమె జీవచ్ఛవంలాంటి ప్రతినిధి.

స్కూటర్ స్టార్టుచేసి నేను వీధి మలుపుకొచ్చేసరికి గిరీశం అక్కడ సిగరెట్టు తాగుతూ కనిపించాడు.

"గుడ్ మార్నింగ్ సార్" అతని గొంతులో ఎంతో చనువు.

స్కూటర్ ఆపాను.

"ఇవ్వాళ రాత్రి లైబ్రరీ హాల్లో 'ఆడది' నాటకం వేస్తున్నాం. మీరు తప్పకుండా రావాలి" పేట్రన్ టిక్కట్టందించాడు.

నాటకాలు, కవిత్వం వీటిమీద డబ్బు వేస్ట్ చేయడం నాకు నచ్చదు కానీ అతను. నాకు పొరుగువాడు ఎంత చెడ్డా. అతని కళ్ళల్లో మాటలకు  రాని అభ్యర్ధన.

జేబులోనుండి వో పదిరూపాయలు తీసి ఇవ్వబోయాను.

గిరీశం తటపటాయిస్తున్నాడు. ఏదో చెప్పాలనుకుని మొహమాట పడుతున్నాడు.

"ఫర్వాలేదు తీసుకోండి" నేనే బలవంతం చేశాను.

"అదికాదండీ మీరేమనుకోనంటే ఓ చిన్న రిక్వెస్ట్.."

"చెప్పండీ"

"ఏం లేదు. మన దేశంలో పుస్తకాలు వూరికే చదివేవాళ్ళూ, నాటకాలు ఫ్రీగా చూసేవాళ్ళూ ఎక్కువ. టిక్కెట్లు బాగా అమ్ముడుపోతాయనన్న ధీమాతో భారీ ఏర్పాట్లు చేశాను. డిప్యూటీ మినిస్టర్ గారిని ఒకర్ని ప్రెసిడెంటుగా ఇన్‌వైట్ చేశాను. హాలుకు అద్దె, పూలదండలు, మైకు ఛార్జీలు వీళ్ళందరికీ కొంతైనా అడ్వాన్సుగా ఇవ్వకపోతే అక్కడంతా అభాసు అవుతుంది. అంచేత ఓ హండ్రెడ్ మీరు సర్దుబాటు చేస్తే తర్వాత మెల్లగా ఎడ్జస్ట్ చేస్తాను."

గిరీశాన్ని చూస్తే నిజానికి జాలివేస్తున్నది. ఎన్నో అవతారాలెత్తి చివరకు నాటకాలు వేయడంలోకి దిగినట్టుంది. ఆ మాటే అన్నాను. "అంత ఇబ్బందిగా వుంటే నాటకం వేయకపోతే ఏవండీ?"

అతను తల అడ్డంగా వూపాడు. "అమ్మమ్మ అట్లా అనకండి. ఈ నాటకం కనుక సక్సెస్ అయితే ఇహ కనకవర్షమే కురుస్తుంది నా జీవితంలో. దీన్ని కమ్మర్షియలైజ్ చేసాను. ఆ తరువాత పరిషత్తుల్లో బెస్ట్ యాక్టర్ ప్రైజులు కొట్టేస్తాను. ఏదో ఒక పరిషత్తులో ఏ విశ్వనాథ్‌గారో, బాపూగారో నన్ను చూస్తారు. మద్రాసుకు రమ్మంటారు. అక్కణ్ణుంచి నా జీవితంలో వో పెద్ద మలుపు తిరుగుతుంది. ఇప్పుడు సినీరంగాన్నేలుతున్న వారినందర్నీ ఒక్కొక్కర్ని రిటైర్ చేయించేస్తాను. నౌకర్లు, చాకర్లు, బంగళాలు, టెలివిజన్‌లు, ఇంపాలా కార్లు, ఇంట్లో ఫ్రిజ్‌డేర్లు, నడిస్తే కాళ్ళ క్రింద తివాచీలు, మాట్లాడితే ప్రెస్ కాన్ఫరెన్సులు" అతను కళ్ళు మూసుకున్నాడు. పట్టపగలు, నడిరోడ్డు మీద నుంచుని పగటి కలను స్వగతంలో ప్రకటించడం మొదలు పెట్టాడు.

నాకు అటువంటి మనుషులంటే చిరాకు. వాళ్ళ కలలు వాళ్ళను జీవితంలో బాగుపడనీయవు. అతన్ని వదిలించుకుందామని, వో పాతిక రూపాయలు చేతిలో పెట్టి, పేట్రన్ టిక్కెట్ తిరిగి అతనికే ఇచ్చేసి, "నాటకానికి వచ్చే తీరిక లేదు నాకు. సారీ ఏమనుకోకండి. ఈ టిక్కెట్ మరొకరికి ఇచ్చేయండి, ఇప్పటికి ఇంతకన్నా ఇయ్యలేను. ఎక్స్‌క్యూజ్‌మీ" అంటూ స్కూటరు మీద ముందుకు దూసుకుపోయాను.

గిరీశం ఆ రాత్రి నాటకం వేశాడో లేదో నేను పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత వారమంతా నా దగ్గర పుచ్చుకున్న పాతికరూపాయలూ ఇచ్చేస్తాడేమోనని ఎంతగానో ఎదురు చూశాను. కానీ అతను నాకు కనపడలేదు. నేను నిద్రలేచి ఆ పూరిపాక వంక చూసేసరికే అతను ఇంట్లోంచి నగర విహారానికి వెళ్ళిపోయినట్లుగా తెలిసిపోయేది. ఇహ రాత్రిపూట తారీకు మారితేగాని అతను ఇంటికి తిరిగి వచ్చేవాడు కాదు. ముష్టి పాతిక రూపాయల కోసం అర్ధరాత్రి వరకు ఎదురు తెన్నులు చూడడం నా మనస్సు అంగీకరించని విషయం.

ఆరోజు ప్రొద్దుటినుండీ అమ్మ మళ్ళీ నా మీద దాడి ప్రారంభించింది. "ఏరా, పెళ్ళి విషయం ఏం చేశావ్?" అంటూ.

"చెప్తానులేవే, తగిన సమయం రానీ"

"ఆ సమయం ఎప్పుడొస్తుందో ఆ బ్రహ్మదేముడికే తెలియాలి.

నీ రెట్టమతం నీది. నువ్వేంచేసుకుంటావో ఇహ నీ ఇష్టమేగానీ, ముందివ్వాళ రాత్రి బండికి విశాఖపట్నానికి నాకో రైలు టిక్కెట్టు పట్రా."

"ఇప్పుడు అక్కడికెందుకే?"

"ఓరి పిచ్చి సన్నాసీ బ్రహ్మచారిగా వున్నవాడికి ఈ విషయాలేం జ్ఞాపకం వుంటాయిరా? నీ చెల్లెలు మళ్ళీ నీళ్ళోసుకుందని ఉత్తరం రాయలేదూ, మొన్న రాసికూడా అప్పుడే పదిహేనురోజులు దాటిపోలేదూ, ఏడోమాసం కూడా వచ్చేసే వుంటుంది కాన్పు, కాన్పుకూ దానికి గండమే కదరా. అసలే అబ్బనాకారపుదీ, ఏం కష్టపడుతుందో ఏమో?"

అమ్మ, శకుంతలను గురించి మాట్లాడుతున్నది. శకుంతల నా ఒక్కగానొక్క చెల్లెలు. మా ఇద్దరికీ పెద్దగా వయసులో తేడాలేదు. ఇద్దరం ఒక కంచంలోనే తిన్నాం. సరదా పుట్టినప్పుడు చిన్నప్పుడు అది మగదుస్తులు నేను ఆడదుస్తులు వేసుకుని ఆడుకున్నాం. వీధిబళ్ళో పిల్ల మాష్టరును కలిసి ఏడిపించా, అందుకుగాను కలిసి దెబ్బలు తిన్నాం. ఇప్పుడా శకుంతల అప్పుడే ముగ్గురు బిడ్డల తల్లి. నాలుగోసారి మాతృత్వాన్ని పొందబోతున్నది.

కాసేపు వూరుకుని మళ్ళీ అమ్మ అన్నది. "ఒరేయ్ పోనీ శకుంతల ఆడబిడ్డ కూతురుంది చేసుకోరాదూ?"

అమ్మ ఎవర్ని గురించి ప్రస్తావన చేసిందో ఆ పిల్ల నా కళ్ళముందు తళుక్కున మెరిసింది.

సుఖద.

పేరులోనే ఎంతో సుఖం వుంది. ఒక్కసారి చూశాను శకుంతల ఇంట్లో ఏదో ఫంక్షన్‌లో. ఆ అమ్మాయి గంభీరంగా వుంది. ప్రశాంతంగా వుంది. తెల్లగా వుంది. కాళిదాసు కావ్యకన్యలా వుంది. ఆధునిక నాగరికత ప్రసవించిన పుష్పంలా వుంది. మద్రాసులో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో వుంది. ఓ ఆంగ్ల దినపత్రికలో సంపాదకురాలిగా పనిచేస్తోంది.

నేను అమ్మవేపు నవ్వుతూ చూశాను. "మద్రాస్ వెళ్ళొస్తాన్లేవే"

అమ్మ కళ్ళింత చేసుకుని, నావేపు నమ్మలేనట్లుగా చూసింది.

"నిజం"

"నిజమేనమ్మా నువ్వు విశాఖపట్నం నుంచి తిరిగి వచ్చేలోపునే నేను మద్రాస్ వెళ్ళొస్తాను, ఈ విషయంలో ఒక నిర్ణయానికొస్తాను. సరేనా?"

అమ్మ పట్టలేనంత సంతోషంతో నా దగ్గరకు తడబడుతున్న అడుగులతో వచ్చింది. ప్రేమగా నా చెంపలు సవరించింది.

"పిచ్చి కన్నా" అంటూ నా నుదురు ముద్దుపెట్టుకుంది.

"ఏ వయసులో ఆ ముచ్చట జరిగితేనే అది అందంరా"

అమ్మ రాత్రికి వెళ్ళిపోయింది. నేను మర్నాడు సాయంకాలం మెయిల్లో మద్రాసుకు బయలుదేరబోతున్నాను. సూట్‌కేస్ సర్దుకుంటుండగా "అంకుల్" అంటూ ఆ అమ్మాయి అతి చొరవగా లోపలకు వచ్చింది. బీదరికం ఆ అమ్మాయి ప్రతి అణువులోనూ కనిపిస్తున్నది. మాసికలు పడ్డ దుస్తులు, తైల సంస్కారం అతి తక్కువ సార్లు అనుభవించిన జుట్టు, వాడిపోయిన మొహం, పల్చనై పొడుగు సాగిన చేతులు, బలహీనంగా వున్న గొంతు అయినా ఆ అమ్మాయిలో ఏదో చొరవ వుంది. ఏదో చెయ్యాలన్న తపన వుంది. కష్టాన్ని తెలుసుకున్న ఇంగితం వుంది.

"ఎవరమ్మా నువ్వు?"

"నేనుతెలీదా" అన్నట్టుగా ఆ అమ్మాయి నవ్వింది.

"గిరీశంగారు మా నాన్నగారండీ"

"ఓహో అట్లాగా బావుందమ్మా"

ఆ తర్వాత ఏమనాలో నాకు తెలీదు. ఏం చెప్పాలో ఆ అమ్మాయికీ తెలిసినట్లు లేదు. తలవంచుకుని నేను బట్టలు సర్దుకోవడం మొదలెట్టాను.

"ఊరి కెళ్తున్నారా అంకుల్?" ఆ అమ్మాయి ఒక్కసారి నాలిక కొరుక్కుంది.

"అయ్యయ్యో పొరపాటు చేసాను అంకుల్ ఊరికెళ్తున్న వాళ్ళను అట్లా అడగకూడదని మా అమ్మ చెప్పింది"

"పర్వాలేదులేమ్మా నాకిటువంటి వాటిల్లో పెద్దగా నమ్మకం లేదు"

ఆ మాత్రం వూరడింపుతో ఆ పిల్ల సమాధానపడడం నాకు ఆశ్చర్యమనిపించింది. ఆ అమ్మాయి అవీ యివీ పట్టుకుని పరీక్షగా చూస్తూ, "అంకుల్ మా నాన్నగారు నన్ను మీ దగ్గరకు వెళ్ళి రమ్మన్నారు" అనంది వున్నట్టుండి.

"ఏమన్నా చెప్పమన్నారా అమ్మా?"

"కాదండీ వో ట్వంటీ రుపీస్ వుంటే తీసుకు రమ్మన్నారు"

నాకు విపరీతమైన కోపం వచ్చింది. కానీ ఆ కోపాన్ని, ఆ పసిపిల్ల ముందు ప్రదర్శిస్తే లాభమేవిటీ? నాలో నేనే దిగమింగుకుంటూ, "తీసుకు వెళ్ళమ్మా" అంటూ రెండు పదిరూపాయలనోట్లు ఆ పిల్ల చేతిలో పెట్టాను. ఆ పిల్ల ఆనందంతో చాటంత మొహం చేసుకుని "వస్తా అంకుల్ నువ్వెంతో మంచి వాడివి" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి పోయింది.

నాకు గిరీశాన్ని గురించి తల్చుకుంటుంటేనే అసహ్యమనిపిస్తున్నది. దౌర్భాగ్యుడు తీసుకువెళ్ళిన డబ్బు యివ్వలేక మొహం చాటువేశాడు. రెండోసారడిగితే మొహమాటం విడిచి ఎక్కడ లేదంటానో అని తన కూతుర్ని పంపించాడు. ఆ పిల్ల వయసురాని అర్భకురాలు కాబట్టి సరిపోయింది. అదే వయసులోవున్న అమ్మాయి అయితే, అదెంత అసహ్యంగా, ఎంబరాసింగ్‌గా వుండి వుండేది.

నేను మద్రాసు వెళ్ళి సుఖదను కలుసుకోవడంలో, గిరీశం గురించి అతని కూతురు గురించీ మర్చిపోయాను.

మద్రాసులో మెరీనా బీచ్‌లో, ఇసుకలో గూళ్ళు కట్టుకుంటూ, ఆ గూళ్ళను సముద్ర తరంగాలు పడగొడుతుంటే, "జీవితమూ ఇంతే" అని కాసేపు వేదాంతం వల్లించుకుంటూ సుఖదా, నేనూ ఒకరి నొకరం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాం.

"నాకు దేముడంటే నమ్మకం" అన్నాన్నేను సంభాషణను మొదలు పెడుతూ.

"నాకు మాత్రం మనిషంటేనే నమ్మకం" అన్నది సుఖద దృఢంగా.

సాయంకాలపు ఎర్రని సూర్యకిరణాలు ఆమె తెల్లని మొహం మీద పరుస్తున్న వింతకాంతుల సోయగంలో, ఆనంద తాదాత్మ్యంలో, "ఐ లైక్ యూ సోమచ్ సుఖదా" అన్నాను, ప్రపంచం పుట్టినప్పటినుంచీ ప్రతి ప్రేమికుడూ తన ప్రియురాలితో అనేమాట అదేనన్న సంగతిని ఆ క్షణంలో మర్చిపోయి.

"ఐ టూ" అన్నది సుఖద తీగ మీటినట్టు "బట్, విత్ రిజర్వేషన్స్."

కించిత్ విస్మయంతో "ఏవిటవీ?" అన్నాను.

"నా వ్యక్తిత్వాన్ని మీరు గౌరవించాలి. నన్ను మన్నించే మీ సంస్కారాన్ని నేను ఆరాధించగలను. కానీ ఎప్పుడు నా అభిప్రాయాలను, ఆదర్శాలను, ఆచరణను మీరు అపార్థం చేసుకుంటారో అప్పుడే మీమీద నేనేర్పర్చుకున్న గౌరవం కూడా సన్నగిల్లుతుంది. మన మధ్య ఉండవలసింది సమానత్వమే కాని, సాధికారంతో కూడుకున్న నియంతృత్వం కాదు."

"ఒప్పుకున్నాను. మాటవరసకు కాదు, మనస్ఫూర్తిగా అయితే నీ అభిప్రాయాలేవిటో కూడా నేను ముందుగా తెలుసుకోవాలికదా?"

"వెరీ సింపుల్ మన పెళ్ళికి కట్నాలూ, కానుకలూ వుండవు. అట్టహాసంగా విందులూ, వినోదాలూ వుండవు. అర్ధం కాని సంస్కృత మంత్రాల ఘోష వుండదు."

"ఇంకా"

"పెళ్ళి జరిగిన తర్వాత ఉద్యోగం చేసినా మానినా అది నా ఇష్టం. నాకు అంటూ వేరే వో బ్యాంక్ ఎక్కౌంటు వుండాలి."

దగ్గరకు వచ్చి కాళ్ళు తడిపి మళ్ళీ వెనక్కిపోయిన నీళ్ళమీది నురుగును చూస్తూ అన్నది సుఖద.

"నాకు ఉమన్స్ లిబ్ మీద నమ్మకంలేదు. అట్లా అని మగవాడేదో సుపీరియారిటీ కాంప్లెక్స్ ఫీలయితే నేనది టాలరేట్ చెయ్యలేను."

సుఖద అట్లా మాట్లాడడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తున్నది. లోపల వొకటి పెట్టుకుని బయటకు మరొకటి మాట్లాడే మనుష్యులంటే నాకు పరమ అసహ్యం.

సుఖద ప్రేమగా నా చేతి వ్రేళ్ళను సుతారంగా తాకింది. నా వొళ్ళు ఝల్లుమన్నది.

"మ్యారేజ్ అయిన తర్వాత మనదంటూ వేరే వో చిన్న ఇల్లు కట్టుకుందాం, ఆ ఇంట్లో మీరూ, నేనే కొంతకాలం పాటు మరో మూడో వ్యక్తికి అక్కడ స్థానం లేదు"

"కానీ మా అమ్మ మనతోనే వుంటుంది సుఖదా"

సుఖద అడ్డంగా తలవూపింది.

"అమ్మలూ, అమ్మమ్మలూ చుట్టపు చూపుగా వచ్చిపోవలసిందే తప్ప, మనతోనే వుండాలంటే, వూహూ అది కుదరదు."

నా మనస్సు చివుక్కుమంది. ఈ వయసులో అమ్మ నా దగ్గర కాకపోతే మరెక్కడ వుంటుందీ? అదే మాటన్నాను.

సుఖద నా కళ్ళలోకి నిశ్చలంగా చూసింది. "మీ కామె తల్లి కాబట్టి తల్లిగానే వూహించుకుంటున్నారు. నా కామె అత్యగారు, మనతోనే వుంటే అత్తగారి అత్తరికం, కోడలి కోడరికం ఇవి రెండూ తప్పవు. ఇవి తప్పాలంటే, కలతలు లేని కాపురం సాఫీగా సాగాలంటే, అత్తలూ కోడళ్ళూ వేరు వేరుగా వుండాల్సిందే"

సుఖద మాటల్లో లాజిక్ వుంది. కానీ ఆ లాజిక్ నా గుండెను బాధిస్తోంది.

ఇంతలో అటువైపుగా ఐస్ క్రీం కుర్రవాడు వచ్చాడు.

సుఖద ఆలోచనను మరోవైపుకు మళ్ళించటానికి "ఐస్ క్రీం తీసుకుంటావా?" అని అడిగాను.

"నో థాంక్స్. ఐస్క్రీం తింటే లావవుతానని భయం" అంటూ సన్నగా నవ్వింది.

ఒక వైపు సూర్యడు సముద్రంలో పడిపోతున్నాడు. మరో ప్రక్క చంద్రుడు. సూర్యుడూ, చంద్రుడూ వీళ్ళిద్దరి కాంతుల కలనేతతో ఆకాశం సుఖద వదనంలా అపూర్వమైన సౌందర్యంతో తొణికిసలాడుతొంది. కానీ ఆ సౌందర్యంలో రవ్వంత ఎర్రని భయం.

"కానీ నాకు ఐస్క్రీం అంటే ఎంతో ఇష్టం."

"మంచిదే మీ ఇష్టాలు మీవిగా, నా ఇష్టాలు నావిగ వున్నప్పుడే జీవితంలో మనకు పెరుగుదల. ఎవరి ఇష్టం కోసం మరొకరు తమ ఇష్టాన్ని వదులుకోవలసి వచ్చినా అది బాధాకరమే"

నేను మాట్లాడలేదు. కానీ నిజానికి అన్ని సంగతులు తెలిసి, స్వంత వ్యక్తిత్వాన్ని అంతగా పెంపొందించుకున్న మనిషితో నేనేం మాట్లాడలేకపోయాను. ఐస్క్రీం తిని, ఇద్దరం ఒకరి ప్రక్కన మరొకరు నడుస్తూ, ఒకరి మీదినుండి మరొకరి మీదికి వీస్తున్న గాలిలోని ఆ స్పర్శాసుఖాన్ని ఆనందిస్తూ ఇంటికి చేరుకున్నాము.

రాత్రికి మా శకుంతల ఆడబిడ్డ ఇంట్లో, వరండాలో పడక్కుర్చీలో పడుకుని దూరంగా వొరిగిన ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కపెడుతున్నప్పుడు,సుఖదా, వాళ్ళమ్మా మెల్లమెల్లగా మాట్లాడుకున్న మాటలు స్పష్టంగా వినిపించాయ్.

"ఏవిటే ఆ అబ్బాయితో కూడా నీ వెర్రిమొర్రి షరతులన్నీ చెప్పేశావా?"

"ఆహా! నిక్షేపంగా"

"బాగానే వుంది సంబడం. అయితే ఇహ నీకు పెళ్ళయినట్లే, ఈ జన్మలో?"

"అమ్మా మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను జాగ్రత్తగా విను. పెళ్ళి అనేది ఆడదానికి ఎంత ముఖ్యమో, మగవాడికీ అంతే ముఖ్యం. ఇహ నా విషయమంటావా, పెళ్ళి కాకపోతే బాధపడవలసింది నేను కానీ, నువ్వు కాకూడదు. అయిందా సంతోషిస్తాను, కాలేదూ అంతటితో ఆ సంగతి మర్చిపోతాను. సెంటిమెంట్స్‌కు నేను అంత ప్రాముఖ్యత నీయను"

"కానీ ఆ అబ్బాయితో బీచ్‌లోనూ, బజార్లలోనూ షికార్లు తిరిగి.."

“షికార్లు తిరిగినా, మగవాళ్ళతో కార్లలో తిరిగినా, నీ కూతురికి ఏం ప్రమాదం లేదు, నువ్వెళ్ళి హాయిగా పడుకో, అనవసరంగా బ్లడ్ ప్రెషర్ పెంచుకోకు."

ఆ తర్వాత మాటలు వినపడలేదు. మర్నాడు సెంట్రల్ స్టేషన్‌లో ఫేర్‌వెల్ తీసుకున్నప్పుడు కూడా, సుఖద నేనూ మళ్ళీ వివాహ ప్రస్తావన చేసుకోలేదు. తనూ ముభావంగానే వూరుకుంది. నేనూ బెట్టుగానే వున్నాను.

రైలు కూత వేసింది. "మే గాడ్ బీ విత్ యూ" అన్నాను.

నాకు నమస్కారం చేస్తూ "విష్‌యూ హేపీ" అన్నది సుఖద గంభీరంగా.

ఇంటికి తిరిగివచ్చానన్నమాటే కానీ సుఖద రూపమే అనుక్షణం నాకు జ్ఞాపకం వస్తున్నది. ఆమె లేని వంటరితనం, ఆమె తలపులోని తీయదనం, ఆఫీసులో కాయితాల్లో సుఖద, స్కూటర్ మీద పినియన్‌పై కూచుని నా నడుమును గట్టిగా పట్టుకుని వున్నట్లు సుఖద, ఉదయకాంతుల్లో నా దుప్పటి ముసుగు తీసి తీయగా "గుడ్ మానింగ్" అంటూ పలకరిస్తున్నట్లున్న సుఖద.

"గుడ్ మానింగ్ అంకుల్..."

"సుఖదా" అంటూ గభాలున లేచి కూచున్నాను. గిరీశం కూతురు, అదే రూపం, అదే బీద తనం, అదే చలాకీతనం, ఆ గొంతులో అదే అభ్యర్థనం.. నాలో కొంచెం విసుగు. ఆ పిల్ల సుఖద కానందుకు కొంత నిరాశ కంఠంలో కర్కశత్వం.

"ఏమిటిలా వచ్చావ్ ప్రొద్దున్నే?"

ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు.

నేను బాత్‌రూంలోకి వెళితే బయట వెయిట్ చేసింది. డ్రెస్ చేసుకుంటుంటే దూరంగా గది బయట మౌనంగా నిలబడింది.

బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గరకు నడుస్తూ "ఒరేయ్ ముత్యాలూ ఆ అమ్మాయికి కూడా టిఫిను పట్రా" అని పెద్దగా అన్నాను. ముత్యాలు మా వంటవాడు.

"వద్దండీ మా అమ్మ వెంటనే వచ్చేయమన్నదండీ" అన్నది ఆ అమ్మాయి దీనంగా.

"మీ అమ్మా...?"

"అవునండీ మా అమ్మేనండీ. మా నాన్నారు ఈ మధ్య అసలు ఇంటికి రావడమేలేదు కదండీ. అందుకనండీ, మరేనండీ మా అమ్మొమేనండీ మిమ్మల్నడిగి.."

అర్ధమైంది. గిరీశాన్ని బీదరికం పామై కరచింది. ఆశలు మరీచకలై వుంటాయి. ఇంటికి ఉత్తిచేతులతో రాలేక, కట్టుకున్న దానికి మొహం చూపించలేక, కన్నబిడ్డల కడుపు నింపలేక కలలు కల్లలై గిరీశం ఎక్కడికో పారిపోయి వుంటాడు. ఎదురు చూసి, ఎదురుచూసి ఇహ గిరీశం రెండో భార్య, తన సవతి కూతురును తన దగ్గరకు పంపించింది. ఆకలి, అవసరం ఎంత పనైనా చేయిస్తుంది. ఏ రకం మొహమాటాన్నైనా పోగొడుతుంది.

"ఎంత కావాలి?"

"ఇంట్లో బియ్యం లేవండీ సరుకులూ అవీ అసలే లేవండీ. ఓ యాభై ఇస్తే, మా నాన్నగారొచ్చింతర్వాత తిరిగిచ్చేస్తావండీ"

గిరీశం వచ్చిన తర్వాత తిరిగి ఇచ్చేస్తారన్నమాట, వట్టిమాట అని తెలిసి కూడా ఇవ్వకుండా వుండలేకపోయాను. లోపల గుండె లోతుల్లో దాగిన సానుభూతి తీగ కదిలినట్లయింది. ఓ యాభై రూపాయిలిచ్చి ఆ అమ్మాయిని పంపేశాను.

మా అమ్మగారు ఇంకా విశాఖపట్నం నుండి రాలేదు. ఇప్పుడిప్పుడే రాదని ఉత్తరం వచ్చింది. వచ్చిన ఉత్తరంలో "సుఖద విషయం ఏం ఆలోచించావ్?" అన్న ప్రశ్న కూడా వుంది.

పిచ్చి అమ్మ ఆమెకు తెలీదు, సుఖద పెట్టిన షరతు.

సుఖద దగ్గరనుంచి సంక్రాంతి గ్రీటింగ్ కార్డందింది. ఆ గ్రీటింగ్ వెనకాల దాగిన గుండె చప్పుడు నాకు వినిపిస్తున్నట్లే వుంది. గ్రీటింగ్ కార్డు మీద పొందికగా కుదిరిన సుఖద సంతకం. ఆ సంతకం ఎందుకంత ముద్దుగా వుంది? పొందికైన బంగారు గాజుల నునులేత వ్రేళ్ళతో చేసినందువల్ల అని చూడగానే నాకు తెలిసింది టెన్నిస్ ఆడుకుని, హుషారుగా ఈల వేసుకుంటూ స్కూటర్ స్టాండు వేసి, గేటు తీసుకుని వరండాలోకి వచ్చేసరికి, ఆమె భుజం నిండుగా పమిట లాక్కుంటూ లేచి నుంచుంది.

అక్కడ ఆ సమయంలో ఆమెను చూడగానే ఆశ్చర్యపోయాను.

ఆమె గిరీశం భార్య. వడలిపోయిన తోటకూరకాడలాంటి రెండో పెళ్ళాం.

"మీరా?"

ఆమెను ఇంట్లోకి రమ్మనడానికి నాకు బెరుగ్గా వుంది. ఆ సమయంలో ఎవరన్నా ఆమెను అక్కడ చూస్తే బావుండదు.

"మీ డబ్బు ఇవ్వలేకపోయాను. చాలా రోజులైంది."

ఆ మాట చెప్పడానికి తానిప్పుడిక్కడికెందుకూ రావడం. "పర్వాలేదులెండి" అన్నాను.

"మీ అమ్మగారు ఇంకా ఊరినుండి వచ్చినట్టు లేదు."

"లేదు."

తనూ నిలబడే వుంది. నేనూ నిలబడే వున్నాను. ఆమె చిరుచీకట్లో వుంది. నేను సందె వెలుగులో వున్నాను.

ఆమె నవ్వలేక నవ్వింది. "మీరేమన్నా వో చిన్న సాయం చేస్తారేమోనని"

"చెప్పండి మళ్ళీ కొంత డబ్బు కావాలా?"

"కావాలి. కానీ వూరికే కాదు."

నాకర్థం కాలేదు. ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"ఇంతవరకూ ఇల్లు విడిచి బయటకు అడుగుపెట్టలేదు. ఏ పని చేయాలనుకున్నా ఏ పని చేసి ఎట్లా డబ్బు సంపాయించడమో స్పష్టంగా తెలీడంలేదు. మీ ఇంట్లో ఏదన్నా చిన్న పనిచెయ్యనీయండి. వంట చేస్తాను. ఇల్లు సర్దిపెడతాను. మీ ఇష్టం ఏ పని ఇచ్చినా చేస్తాను. మీకు తోచినంత ఇవ్వండి. అందులో కొంత బాకీ క్రింద జమకట్టుకోండి. మిగిలిందే ఇవ్వండి. దాంతోనే ఆ చిన్నదాన్ని పోషిస్తాను. ఆయన ఎక్కడికి పోయినాడో తెలీదు. ఎప్పుడు వస్తారో తెలీదు. కానీ పోతూ పోతూ ఆ పిల్లదాని బరువు బాధ్యతలు మాత్రం నా నెత్తిమీద పడేసి పోయినారు."

ఆమె గొంతు నూతిలోని గొంతుకలావుంది. అంతటి దీనావస్థలోనూ, ఆమె కళ్ళు కన్నీరు కార్చకుండా వుండేందుకు ఆమె పడుతున్న యాతన తెలుస్తోంది. ఆమెను చూస్తే జాలివేస్తున్నది. కానీ నా వంటరితనంలోకి, నా వంటరి ఇంటిలోకి ఆమెను రానిచ్చే ఉద్దేశ్యం నాకు లేదు.

"చూడండీ డబ్బేమైనా కావాలంటే ఇస్తాను, తీసుకోండి. గిరీశం వచ్చిన తర్వాత అతని దగ్గర తీసుకుంటాను. కానీ పని పాటలంటే"

ఆమె తన ఉద్విగ్నతను సంబాళించు కొన్నట్లుగా కాసేపు వూరుకుంది. ఆ తర్వాత మెల్లిగా, "వద్దులెండి. ఇప్పటికే మీకు చాలా బాకీ పడ్డాం" అంటూ భారంగా అడుగులు వేస్తూ గుమ్మం దాటి వెళ్ళిపోయింది.

ఆమె అటు వెళ్ళిపోతున్నప్పుడు సత్యవంతుడు అటుగా వచ్చాడు. వెళ్ళిపోతున్న గిరీశం పెళ్ళాన్నీ, వెనుక దిగడిన పోయి నన్ను కాస్సేపు మార్చి మార్చి చూసి 'ప్చ్' అన్నట్లుగా పెదవి విరిచి ముందుకు సాగాడు.

ఓ నెలరోజులు గడిచిపోయాయి. శకుంతల నీళ్ళాడినట్లు, ఆడపిల్ల పుట్టినట్లూ, త్వరలోనే అమ్మ తిరిగి వచ్చేస్తున్నట్లూ తెలిసింది.

నేను ఒక్కసారి ఇక్కడకు రాకూడదూ? అంటూ వ్రాసిన ఉత్తరానికి' తప్పకుండా వస్తాను త్వరలోనే' అంటూ సుఖద కూడా జాబు వ్రాసింది.

అమ్మ రాగానే, అమ్మనూ సుఖదనూ ఎదురెదురుగా నిలిపి తేల్చేసుకోవాలి నాకు అమ్మా కావాలి, సుఖదా కావాలి.

ఆలోచించుకుంటూ రికార్డు ప్లేయరు మీద 'అనార్కలీ' పాటలు వింటున్న నాకు తలుపు దగ్గర ఎవరివో పాదాలు కదిలిన అలికిడి డిస్టర్బ్ చేసినట్లయింది. రాత్రివేళ కిటికీలోనుండి యౌవన చంద్రుడి పలకరింపు. దొడ్లో వో ఓ మూలగా వున్న పూవు వెలగ పట్టరాని వాసన.

"ఎవరదీ?"

గిరీశం పెళ్ళాం లోపలకు వచ్చింది. జుట్టు జారుముడిగా దువ్వుకుంది. తల్లో ఇన్ని రంగుపూలు తురుముకుంది. తెల్లచీర కట్టుకుంది. లోపల బాడీలేని పల్చటి జాకెట్టు వేసుకుంది. సిగ్గుపడుతున్నట్లుగా ద్వారం ఇవతలకు అడుగు వేసి, "వొంటరిగానే వున్నట్లున్నారు" అన్నది అర్థవంతంగా, తలుపు దగ్గరకు వేయటానికి ప్రయత్నిస్తూ.

నేను చివాలున మంచం మీదినుండి లేచి కూర్చుని, "ప్లీజ్, ఆ తలుపులు వేయకండి" అన్నాను కంగారుగా.

ఆమె తలుపు దగ్గరే నిలబడి పోయింది. నా వేపు నన్ను చూసి జాలిపడుతున్నట్టుగా తనను చూసి తాను శపించుకున్నట్లుగా చూసింది.

"వద్దా?" అన్నది.

"వద్దు, వద్దు. తలుపు వేయద్దు. మీకు డబ్బుకావాలంటే ఇస్తాను. తీసుకుని వెళ్ళిపొండి. తొందరగా వెళ్ళిపొండి"

ఆమె తన పమిట చెంగు కిందకు జారవిడిచింది. "డబ్బు కావాలి నాకు. కానీ ఇంతకన్నా మీకు నేనేం తిరిగి ఇవ్వలేను. అందుకనే.. అందుకనే..."

"ఇవ్వక్కరలేదు. ఇదివరకు తీసుకున్నదీ ఇవ్వక్కరలేదు. ఇప్పుడు తీసుకోబోయేది ఇవ్వక్కరలేదు. నీకెంత కావాలో చెప్పు.."

నా మాటలు పూర్తికాకుండానే ఆమె అన్నది. "నేనడుక్కునేదాన్ని కాదండీ. ఊరికే ఇస్తే మీ డబ్బు నాకక్కరలేదు. నా దగ్గరున్నది మీరు తీసుకోండి. నేనడిగిందివ్వండి.

"సారీ నేనీయలేను."

ఆమె నా వేపు, యుగయుగాలుగా దగాపడ్డ స్త్రీలోని కాఠిన్యాన్ని, కళ్ళలోకి తెచ్చుకుని శపిస్తున్నట్టుగా చూసింది.

గోడమీద వేలాడుతున్న దేవుడి క్యాలెండరు దగ్గరకు పిచ్చిపట్టినదానిలాగా పరుగెత్తి, ఆ క్యాలెండరును గోడనుంచిలాగి చింపి ముక్కలు ముక్కలు చేస్తూ "ప్రాణాన్ని రక్షించేది పాడుపని కాదు దేవుడూ" అంటూ బయటకు పరుగెత్తుకుపోయింది. ఆమె వెనక నేలమీద కన్నీటిబొట్లు.

"ఏవండీ ఏవండీ" అంటూ నేనూ బయటకు రాబోయాను.

గుమ్మం దగ్గర సూట్‌కేస్‌తో సుఖద.

ఆమెను చూసి నేను సిగ్గుపడి వెనక్కు తగ్గాను.

"అసలేం జరిగిందంటే"

"అంతా విన్నాను. ఏమీ జరగలేదు" అన్నది సుఖద నవ్వుతూ.

"నేనంటే నీకు.."

"జాలి. షీర్ పిటీ మగవాళ్ళలో కూడా ఇంత అమాయకులుంటారా అని"

"యూ నాటీ" సుఖద జడను చేతిలోకి తీసుకోబోయాను.

"బీ కేర్‌ఫుల్ ఆ జడతోనే ఆడవాళ్ళు మగవాళ్ళను శాసించేది"

మా అమ్మ వచ్చిన తర్వాత సుఖద వచ్చి వెళ్ళిన సంగతీ, ఆమె పెట్టిన షరతులూ చెప్పాను.

అమ్మ కాసేపు సీరియస్‌గా ఆలోచించింది. "సుఖద వ్యక్తిత్వంగల పిల్లలాగా వుందిరా నీలాంటివాడు అటువంటి అమ్మాయిని చేసుకోడమే మంచిది"

అమ్మవేపు తడికన్నులతో చూశాను. సుఖద వ్యక్తిత్వంకన్నా అమ్మ వ్యక్తిత్వమే ఉన్నతంగా కనిపిస్తోంది. మనసులోపల వీళ్ళిద్దరికన్నా గిరీశం పెళ్ళాం రూపం మరింత పెద్దదిగా కనిపిస్తోంది. నన్ను కలుసుకున్న ఆ రాత్రి తర్వాత పాక ఖాళీచేసి, పిల్లను తీసుకుని ఆమె ఎటో వెళ్ళిపోయింది. గిరీశం మళ్ళీ నా కంట పడలేదు. వాళ్ళెటుపోతే ఏం సమాజంలో రూపం లేనివాళ్ళు?

# కోరిక

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

## (1990 సెప్టెంబర్ ఉదయం వార పత్రిక నుండి)



**వంతెన కింద** రోడ్డు ప్రక్క నిలబడి ఉన్నాడు రాంబాబు భుజాన బరువైన పుస్తకాల సంచి ఉంది. ఒక చేతిలో చిన్న టిఫిన్ క్యారియర్ ఉంది. చాలా ఏకాగ్రతతో దీక్షగా ఎదురుగా ఉన్న పెద్ద సైన్ బోర్డు వంక చూస్తున్నాడు. దానిమీద 'నగరంలో సినిమాల' పోస్టర్లన్నీ ఉన్నాయి. రంగు రంగుల రకరకాల పోస్టర్లు. రాంబాబు ఒక పోస్టర్ చూస్తూ ఆగిపోయాడు. అదేదో ఊరి చివర ఉన్న సినిమా హాల్. సాధారణంగా అక్కడ పాత సినిమాలే ఆడుతుంటాయి. ఇప్పుడు అందులో పాతికేళ్ళనాటి ఒక జానపద చిత్రం వేస్తున్నాడు. పోస్టర్లో పెద్ద అక్షరాల్లో తప్పక చూడండి మీ అభిమాన

కథానాయకుడు నటించిన ఉజ్వల జానపద చిత్రం భయంకర పోరాటాలు, ఉక్కిరి బిక్కిరి చేసే సస్పెన్స్ వగైరా నినాదాలున్నాయి.

రాంబాబుకి అంతలో గుర్తొచ్చింది. అతని నాయనమ్మ చాలాసార్లు అతనితో ఈ సినిమా గురించి చెప్పింది. ఫలానా పేరు గల సినిమా ఎప్పుడైనా, ఏ హాల్లోనైనా వస్తే తనకు తప్పకుండా చెప్పమన్నది. మరిచిపోవద్దంది. అవును, ఇదే సినిమా రాంబాబు మళ్ళీ శ్రద్ధగా పోస్టరంతా చదివాడు. క్రింద పెద్ద అక్షరాల్తో రెండు రోజులు మాత్రమే అని స్పష్టంగా రాసి వుంది. అతడు మెల్లగా యింటి దోవ పట్టాడు. దార్లో అవీ ఇవీ చూసుకుంటూ పార్కు దాటి వంతెన దాటి యింటికి వచ్చేసరికి చిన్న వరండాలోనే నాయనమ్మ ఎదురైంది. ఎందుకో రుసరుసలాడుతోంది. తీరికగా వరండాలో గోడకానుకుని కూర్చుని బొంగురు గొంతుకతో "ఇంతే నా జీవితం, ఎప్పుడు సుఖపడ్డాను కనుక? ఇంతే ఇలా వెళ్ళిపోవల్సిందే" అంటున్నది. రాంబాబు నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. వంట గదిలో తల్లిపనిలో ఉంది. ఆమె కూడా అస్పష్టంగా ఏదో గొణుగుతోంది. రాంబాబు పుస్తకాలు అవతలపడేసి, క్యారియర్ వంటింట్లో పెట్టి ఒక చేత్తో లాగు పైకి లాక్కుంటూ మరో చేతితో ముక్కు తుడుచుకుంటూ "అమ్మా! ఆకలవుతున్నదే తినడానికి ఏమైనా పెట్టవూ? అని అడిగాడు"

వాళ్ళమ్మ కోపంగా వెనుదిరిగి చూసి "ఏం కాసేపు ఆగలేవూ? కాళ్ళు కూడా కడుక్కోకుండా ఏమంత తొందర" అని ఉరిమింది. రాంబాబు వెనక్కు తగ్గి "యింట్లో పరిస్థితి ఏమీ బాగున్నట్టులేదే. అంతా రుసరుసలాడుతున్నారే" అనుకున్నాడు.

ముసలమ్మకి డెబ్బయి ఏళ్ళుంటాయి. ఆమె జీవితమంతా ఎక్కడో పల్లెటూర్లో గడిచింది. అక్కడే పుట్టడం, పెరిగి పెద్దది కావడం, ఆ ఊరి సంబంధమే పెద్దవాళ్ళు ఖాయం చేయడం... అక్కడే పెళ్ళి, అక్కడే పురుళ్ళు, పుణ్యాలు, అక్కడే చావులు, అక్కడే కాంపులు, అక్కడే కష్ట సుఖాలు ఇలా అంత జీవితమూ అక్కడే వెళ్ళిపోయింది.

కొన్నేళ్ళ క్రితం భర్త పోవడంతో అక్కడ మిగిలి ఉన్న చేరడు నేలా, అమ్ముకుని కొడుకు ఆమెను ఇక్కడికి రామా! అనుకోకుండా ఈ ఇల్లు ఆ ఇల్లూ బలాదూర్ తిరగకపోతే?" అని సతాయిస్తూ వుంటుంది. పైగా ముసలమ్మకు చిన్నపిల్లలాగా అదీ యిదీ తినాలని కోరిక. ఈ వేళ అదే జరిగింది. ఆమె మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తర్వాత ఎండ కొద్దిగా తగ్గడం గమనించి చేతికర్ర అందుకోని నెమ్మదిగా తన మామూలు రౌండ్లకు బయలుదేరింది. ఇల్లు దాటి కొద్ది దూరం వెళ్ళగానే సీతాఫలాలమ్ముతున్న ఒక నడివయస్సు అమ్మాయి ఎదురైంది. ముసలమ్మ కళ్ళు మెరిసాయి. నోరూరింది. సీతాఫలాలు ఎంతో? అందంగా ఆకర్షణీయంగా కన్నుల పండువుగా కనిపించాయి. గొప్పగా రోడ్డు మీదనే బుట్ట దింపించి, నదురుగా, పెద్దవిగా వున్న రెండు పళ్ళు ఏరుకుని బేరమాడింది. ఎంత కిందిపెట్టి, మీద పెట్టి బేరమాడినా రెండు పళ్ళు అర్ధరూపాయికి తగ్గలేదు.

ముసలమ్మ రెండు పళ్ళూ ధోవతి చివర కట్టుకుని తమ యింటివైపు వేలు చూపించి, "అదుగో ఆ పక్కనే మా వాటా. మాకోడలుంటుంది డబ్బులడిగి తీసుకో" అని చెప్పి ఎదురుగా వున్న వరలక్ష్మమ్మ గారింట్లో కెళ్ళింది. అమ్మాయి అని పిలుస్తూ. తర్వాత గొడవ అంతా రెండు నిమిషాల్లో జరిగింది.

"ముసలమ్మగారు పళ్ళు తీసుకున్నారమ్మ, రెండూ అర్ధరూపాయి, డబ్బు మిమ్మల్ని అడగమన్నారు"

"ఆ! పళ్ళు తీసుకుంద! రెండు పళ్ళూ అర్ధరూపాయా? వెధవ సీతాఫలాలకు ముఖం వాచిపోయి వుందా? తనేం పసిపిల్లా నెలాఖరు రోజుల్లో డబ్బులేమైనా చెట్లకు మొలుస్తాయనుకుందా? రోజులెట్లా ఉన్నాయి. మండిపోతున్నాయి. ఏళ్ళు వచ్చాయి ఎందుకు? ఆ మాత్రం ఇంగితం తెలియద్దూ."

"అమ్మా! యింతకీ డబ్బులు"

డబ్బులిక్కడ కుప్పపోసుకుని కూర్చోలేదు. "ఫో ఫో" ఇంత జరిగాక పళ్ళ మనిషి ఊరుకుంటుందా? బుట్ట నెత్తినెత్తుకుని విసవిసా నడిచి వరలక్ష్మమ్మ యింటి కొచ్చి ముందరుగు మీద కూర్చుని బాతాఖాని కొడుతున్న ముసలమ్మ దగ్గరికి వెళ్ళి పళ్ళు రెండు పుచ్చుకుని "మంచి బేరమే అని సణుక్కుంటూ వెళ్ళిపోయింది. ముసలమ్మకి తలతీసినట్లైంది. కళ్ళ వెంట నీళ్ళొచ్చాయి. ఏం మాట్లాడేందుకు నోరు పెగల్లేదు. కర్రందుకుని గబగబా అడుగులు వేస్తూ యింటికి వచ్చి తీరిగ్గా మొదలు పెట్టింది. ముక్కు చీదుకుంటూ, మాట మాటకీ కళ్ళు తుడుచుకుంటూ, "ఈనాటికి ఈ గతి పట్టింది. నా కొడుకు యింట్లో నాకింత అవమానమా!వెధవది. అర్ధ రూపాయి డబ్బులకి నోచుకోలేదా? అందరి కోడళ్ళు అందరి యిళ్ళల్లోనూ ఇలాగే ఉన్నారా? ఇంత అరాచకం ఎక్కడైనా ఉందా?"

లోపల కోడలు అన్నీ వింటూనే ఉంది. కానీ పల్లెత్తి మాటాడలేదు బదులు పలకలేదు. వాగి వాగి చివరకు ముసలమ్మ అలిసిపోయింది. అదిగో సరిగ్గా అప్పుడు వచ్చాడు రాంబాబు స్కూలు నుంచి.

రాంబాబు నెమ్మదిగా "నాయనమ్మా సినిమా" అన్నాడు.

ఆమె గయ్యమని లేచింది. "ఏం నాయనా ఎగతాళిగా ఉందా? వెధవది పళ్ళకు అర్ధరూపాయికి గతిలేదు సినిమా అట సినిమా."

రాంబాబు అనునయంగాను, నెమ్మదిగానూ, స్పష్టంగానూ "అదికాదు నాయనమ్మా వినూ నువ్వు ఎప్పుడూ చెపుతూంటావు అది వచ్చిందిపుడు రెండు రోజులే ఇంక ఉండదు" అన్నాడు.

సినిమా పేరు వినగానే ముసలమ్మ గాజు కళ్ళలవంటి కళ్ళు మెరిశాయి. అతని దగ్గరికి జరిగి "ఆ సినిమా వచ్చిందా? ఎక్కడ? ఎప్పుడు? హాలు ఎంత దూరము?" అని ప్రశ్నలు కురిపించింది. రాంబాబు అన్ని ప్రశ్నలకు జవాబు చెప్పాడు. ఆ సినిమా రెండు రోజులు మాత్రమే అనీ ఒకరోజు అయిపోయిందనీ మరునాడు మాత్రమే ఉంటుందనీ

తెలుసుకుని గంభీరంగా ఆలోచించటం ప్రారంభించింది. కాసేపాగి "ఒరే రాముడూ మనము ఎట్లాగైనా సరే ఆ సినిమాకు పోవాలి తప్పదు" అంది ఖచ్చితంగా.

రాంబాబు ఆమె పట్టుదల గ్రహించాడు లోపలికి వెళ్ళి కలం కాగితం తెచ్చి ఇద్దరు మనుషులకు ఆ సినిమాకి వెళ్ళిరావడానికి ఎంత ఖర్చు అవుతుందో లెక్కవేశాడు. రానూపోనూ బస్సు ఛార్జీలు, అక్కడ రెండు టిక్కెట్లు, మధ్యలో తానేమీ వేరుశెనగకాయలు వగైరాలు కావాలని ఆశించడు. జాగ్రత్తగా లెక్కవేసి నిట్టూర్చి "లాభం లేదు నాయనమ్మా చాలా అవుతుంది" అన్నాడు.

ముసలమ్మ వినలేదు. తల అడ్డంగా ఆడిస్తూ "ఎంత ఖర్చయినా సరే – సీతాఫలాలు అక్కర్లేదు. తిండి అక్కర్లేదు" అన్నది.

నాయనమ్మకు ఆ పాతకాలపు సినిమా మీద అంత మోజు ఎందుకో రాంబాబుకు అర్ధంకాలేదు "పోనీ ఒక పని చేద్దాం. నేను నిన్ను హాలుదాకా తీసుకుపోయి టిక్కెట్టూ తీసి లోపలకు పంపిస్తాను .ఆట వదిలే టైముకు వచ్చి నిన్ను ఇంటికి తీసుకువస్తాను. అందువల్ల బోలెడు సుఖం. పైగా నాకు ఆ పాత చింతకాయ పచ్చడి సినిమాలు ఇష్టం వుండదు."

ముసలమ్మ ఒప్పుకోలేదు "నువ్వు రావలసిందే" అన్నది. "నీకు నీ తాతగారి పేరు పెట్టుకున్నాంరా తండ్రి" అని గొణిగింది. తరువాత అసలు విషయం బయట పెట్టింది. అది విన్న తరువాత రాంబాబుకు కూడా ఆ సినిమా తప్పకుండా చూడాలనిపించింది. నిశ్శబ్దంగా కూర్చుని డబ్బు పోగుచేసే పద్దతులు ఆలోచించడం ప్రారంభించారు ఇద్దరూ.

అది చాలా పాతకాలపు సంగతి. అప్పుడు ఆమె భర్త రాయిలా, హాయిగా ఆనందంగా ఉండేవాడు. తను ఊళ్ళో అడపాదడపా వారినీ వీరిని పోగుచేసి నాటకాలు ఆడుతూ వుండేవాడు. ఆయన ఎప్పుడో మద్రాసు వెళ్ళినప్పుడు, స్నేహితుడు ఈ సినిమాలో చిన్నవేషం వేయమంటే 'సరేన'ని వేశాడు సరదాగా. ఆ కథంతా రాజులకూ, రాజ్యాలకూ క్రూరులైన సేనాధిపతులకు, రాజకుమార్తెలకూ, కుట్రలకు, ఎత్తులకు, పై ఎత్తులకు సంబంధించినది. అందులో ఆయన వేషం వేశాడు. రాజ వైద్యుడి వేషం. ముసలమ్మ మాటలలో 'చాలాసేపే కనిపిస్తారు. చెమికీ కోటు తొడుక్కుని... తలపాగాతో.. మీసాలతో రెండు మూడు మాటలు కూడా వున్నాయి."

నాయనమ్మా, మనవడూ ఇద్దరూ కృతనిశ్చయులై లేచారు.

ఆనాడు రాత్రి ముసలమ్మ కోడలు వంటగది శుభ్రంచేసే పనిలో నిమగ్నురాలై ఉన్నప్పుడు కొడుకు గదిలో చేరింది. కూర్చుని నెమ్మదిగా ప్రారంభించింది. తెల్లవారితే శివరాత్రి ఇంత బతుకు బతికింది తానూ. ఇప్పుడు కాటికి కాళ్ళు చాచుకుని ఉంది. పోయేముందు ఇంత పుణ్యం చిన్న మూటగానైనా కట్టుకుని పోకపోతే సద్గతులుండవు. పైగా దూరమా భారమా. ఉంటున్నది పవిత్ర కృష్ణాతీరం. నాలుగు మునకలు వేసి అమ్మవారిని చూచివస్తే చాలు. వట్టి చేతులుతో పోలేదుగదా. అడుక్కునే నిర్భాగ్యులందరికీ పెట్టలేము. కనీసం కొందరికైనా పైసలు పడేయొద్దూ?

కొడుకు అంతా విన్నాడు. ఏమీ మాట్లాడకుండానే లేచి చొక్కా జేబు తడిని నెలాఖరు రోజుల్లో జేబులో మిగిలిన రెండు రూపాయి కాగితాలు, కాసన్ని చిల్లర నాణేలు ముసలమ్మ కిచ్చి మళ్ళీ కూర్చున్నాడు. ముసలమ్మ ఇవతలికి వచ్చి మనవడి దగ్గర చేరి ఆ డబ్బులన్నీ అతనికి అప్పగించింది. అతడు అంతకు ముందే తాను అప్పుడప్పుడు పోగుచేసిన రూపాయి, చిల్లర లెక్క చూసుకున్నాడు. తరువాత రెండు రోజులపాటు తాను స్కూలుకు నడిచిపోగలడు పొద్దున్నే వీధి చివర ఇంట్లోని కాశీగాడు తనకు ముప్పై పైసలు ఇవ్వాలి. అవి వసూలు చేస్తే 'సుబ్బరంగా' సరిపోతుంది.

మర్నాడు ముసలమ్మ ఎక్కడినుంచో మరో పావలా పట్టుకొచ్చింది.

రాంబాబు కొంచెం శ్రమపడ్డాడు. కానీ మొత్తం మీద కాశీగాడి బాకీ వసూలు చేశాడు.

సాయంకాలం ఐదు దాటిన తరువాత ముసలమ్మ తనకున్న వాటిలో మంచి ధోవతి కట్టుకుని కళ్ళజోడు తాటితో చెవులకు బిగించుకుని తయారైంది. రాంబాబు సిద్ధంగానే ఉన్నాడు.

ముసలమ్మ కోడల్ని కేకవేసి "ఇదిగో నిన్నా మొన్నా చెప్పావే మన ఊరివారి అమ్మాయి కాపురానికి వచ్చి ఇక్కడే ఉంటోందనీ వారింటికి పోతున్నాము. మొన్న కనిపించి ఒకటే బతిమిలాడింది. పాపం పెద్ద దిక్కు ఎవరూ లేరంట. చూసొస్తా. రాముణ్ణి తోడుగా తీసుకుపోతున్నా. పెద్ద మనవడుకదా తోడుగా ఉంటాడని" కోడలు తలవంచి చూసి ఏ కళనున్నదో ఏమో 'సరే' అన్నట్టుగా తలవూపింది. నెమ్మదిగా "జాగ్రత్త" అని కూడా అన్నది.

ఇద్దరూ నడిచి వచ్చి వంతెన దిగి బస్సుకోసం నిలబడ్డారు. ఎన్నో బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. ఏ బస్సులోనూ ఖాళీలేదు. చాలాసేపు పడిగాపులు పడివుంటే చివరకు బస్సు దొరికింది. అది అరగంట ప్రయాణం చేసి ఊరు చివరికి చేరింది. అక్కడినుంచి నడిచి సినిమా హాలుకు చేరుకున్నారు. అది పాత హాలు.. హాలు ముందు లైట్లు కూడా మందంగా ఉన్నాయి. జనం కూడా ఎక్కువమంది లేరు. చాలా పలుచగా ఉన్నారు. ఆ వాతావరణం చూస్తే అసలు ఆ రోజు సినిమా ఉంటుందా ఉండదా అని అనుమానం కలిగింది. రాంబాబు వెళ్ళి కనుక్కుని వచ్చాడు. "నాయనమ్మా ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమా వేస్తారు. పదిమంది ఉన్నాసరే" అని చెప్పాడు.

అక్కడ వున్న పదిహేనుమంది చాలా నిరుత్సాహంగా నిర్లిప్తంగా ఉన్నారు. ఏమీ తోచకా మరి ఏమీ చేయడానికి లేక వచ్చినవారు అలాగే వున్నారు.

అంతలో కొన్ని లైట్లు వెలిగాయి. బెల్ మ్రోగింది. కౌంటర్లు తెరచి కూర్చున్నారు హాలువాళ్ళు. జనం ఉన్న కొద్దిమంది చాలా నెమ్మదిగా నీరసంగా టిక్కెట్లు కొనుక్కుంటున్నారు.

రాంబాబు టిక్కెట్లు తెచ్చాడు. నాయనమ్మ చేయి పట్టుకుని లోపలికి నడిపించుకుని వెళ్ళి ఆమెను కూర్చోబెట్టాడు. లోపల ఏదో పాతకాలపు సినిమా పాట వినిపిస్తున్నాయి.

మళ్ళీ బెల్ మ్రోగింది. లోపల లైట్లు ఆరిపోయాయి.

కూర్చున్న కొద్ది జనంలోనే ఎవడో ఈల వేసాడు.

న్యూస్ రీల్ ఒకటి ప్రారంభమైంది. తరువాత అసలు సినిమా అక్షరాలు పడ్డాయి. మళ్ళీ ఎవడో ఈల వేసాడు.

ఈ కథంతా రాజ్యాల కోసం కుట్రలు, యుద్ధాలు, ముసుగు మనుషులు, ప్రేమలు ఇలా నడుస్తున్నది. పాత ప్రింటు కావడం వల్ల అన్ని సన్నివేశాలలోనూ వర్షం కురుస్తున్నట్లుగా ఉంటుంది. మాటిమాటికీ తెరమీద గీతలు, ఇంటూ, ప్లస్ గుర్తులు పడుతున్నాయి. జనంలో ఎవరో, ఎందుకో ఏదో పెద్దగా అని మరింత పెద్దగా నవ్వారు.

అంతలో ఇంటర్‌వెల్ 'ఇంక పదినిమిషాల్లో' అనుకుంది ముసలమ్మ... 'ఇంక పది నిమిషాల్లో' అని పెద్దగా రాంబాబుతో అన్నది.

కథ నడుస్తున్నది. రాజుగారు మరణశెయ్యమీద ఉన్నారు. చుట్టూ దేవేరులూ, మంత్రులూ, ఇతరులూ నిలబడి ఉన్నారు. మౌనంగా "ఇప్పుడే – ఇప్పుడే" అనంది ముసలమ్మ ఆదుర్దాగా.

రాంబాబు ఉత్కంఠతో జాగ్రత్తగా ఎదురు చూస్తున్నాడు. అంతలో "రాజవైద్యులు" వచ్చేసారు అన్న డైలాగు.. "చూడు చూడు" అన్నది ముసలమ్మ. కెమెరా గుమ్మం వైపు తిరిగింది.

ఉన్నట్టుండి తెరమీద ఎర్రటి మంట కనిపించింది. శబ్దం కూడా వినిపించింది. ఫిలిం కాలిపోయింది. లైట్లు వెలిగాయి. జనంలో ఎవడో మళ్ళీ ఈలవేశాడు ఒకరిద్దరు లేచిపోయారు.

రీలు లోపల చుట్టుతున్న శబ్దం అరనిమిషం తరువాత మళ్ళీ సినిమా మొదలైంది. ఇప్పుడు విలన్ గుహలో నాట్యం ప్రారంభమైంది. జనంలో ఎవడో మళ్ళీ ఈలవేశాడు.

రాంబాబు నీరు కారిపోయాడు. నాయనమ్మ వంక చూశాడు. ఆమె దిగ్భ్రాంతి చెందిన దానిలా బొమ్మలా కూర్చుని ఉంది.

"నాయనమ్మా"

"ఊ!"

"ఇంతేనా?"

"అంతే ఇక కనిపించదు" ఐదు నిమిషాలు తర్వాత రాంబాబు చెయ్యి పట్టుకుని ఆమె లేచి "పద ఇంటికి పోదాం" అన్నది.

ఇద్దరూ హాలు బైటకి వచ్చి బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు. ఎదురుగా అంతమందమైన వెలుతురు ... చీకటిని మించలేని సామాన్యమైన వెలుతురు.

# పెళ్ళాం చిత్తరువు: చిత్తరువు పెళ్ళాం
## - కంటిపూడి జానకి రామచౌదరి
## (1936 జనవరి ఆంధ్రభూమి మాస పత్రిక నుండి)

'ఎందుకట్టాచూస్తారూ.'

'ఎట్టా'

'పటం వైపు'

'చూడకూడదని శెలవా?'

'శెలవుకాదు, శాసనం'

'అన్యాయమైన శాసనాల్ని ఉల్లంఘించడం మా కాం(గ్రెసువారి కానవాయే'

'అట్లాంటివారిని బంధించి శిక్షించడం మా ప్రభుత్వం వారి కలవాటే.'

'బంధించినా... శిక్షించినా..'

'మొదట వార్నింగు యిచ్చినా 'లా'కి వ్యతిరిక్తంపర్తిస్తున్నారు. కాబట్టి దేవరవారికి సంవత్సరం విడిఖైదు.'

'దేవివారి బాహుబంధనంలోనేనా.'

'కష్టపడలేరేమో.'

'తప్పుతుందామరీ.'

'ఎట్టా తప్పుతుంది చేసిన పాపం '

'చెబితే పోతుంది.'

'అవునుకదా మరి చెప్పండి వేగం.'

'ఏవిటీ.'

'చేసిన పాపం.'

'ఏవనీ?'

'నా ఆజ్ఞ లేకుండా నా బొమ్మను చూశాననీ'

'ఉహూ అట్టాకానబ్బా.'

'ఎట్టా అబ్బా.'

'నీ ఆజ్ఞ లేకుండా నీ చిత్రాన్ని చూశాను.'

'నీలో అంత చిత్రం ఏవుంది చెప్మా చూడడానికీ.'

'అబ్బా చెప్పండి.'

'అమ్మా చెప్పనండి.'

'ఇదిగో.'

'అదిగో.'

'చెప్పండి మరి,'

'చెప్పను.'

'పాపం సుమండీ.'

'ఫరవానై.. పాపానికీ పుణ్యానికీ ఎంతో ఎడం లేదులే చిన్నగట్టు అడ్డం అంతే.'

'అదే దాటడం కష్టం అబ్బాయికి.'

'నీలాటి అమ్మాయిలకది. మాకసలు దాటవలసిన అవసరమేలేదు. సరదాకి కావలిస్తే దీనిలో వొహ అడుగు తీసి దానిలో వేసేమంటే సరి.'

'వెనక్కి వొహనెట్టు నెట్టితేసరీ, నాలోకి రావడానికి అర్హతలేదనీ, తక్షణవే బోల్తా హోగయా.'

'వొహ తోపు తోస్తేసరీ నీవెవరవ్ చెప్పడానికనీ.'

'బాహుంది మీతో చెప్పేవన్నీ యిట్టాటివే ఒంటిపిల్లి రాకాసి.'

'అలాటివాడే ప్రపంచంలో అందరికన్నా బలవంతుడు సత్యవంతుడు.'

'చలంగారి సావిత్రి మగడేనా యీ సత్యవంతుడంటేనీ.'

'కాదు చౌదరిగారి 'మను' మొగడు. '

'పోదురూ అన్నీ కొంటెమాటలూ.. అదిగో అట్టా చూడవద్దని చెప్పలే.'

'చెప్పలేదన్నానా.'

'మరెందుకు చూస్తారూ.'

'చూస్తున్నాను గనుకా చూడడం సహజంగనుకా.'

'ఉ.. గనుకేగాని ప్రతీ విషయం చూడడం సహజం కాదు.'

'అది నీలాటి ఆడ అమ్మాయిలకి. మాకు ప్రపంచంలోని ప్రతి విషయం చూడ్డం సహజమే. చూడడానికీ అనుభవించడానికీ వీల్లేని విషయం వొహటీలేదు మాకు. చూడడానికే పుట్టాం. అనుభవించడానికే జన్మించాం మేము '

'మంచిపని చేశారు, ఇహ చెప్పండి మరీ.'

'ఇంకా ఏవిటి చెప్పండి.'

'చేసిన పాపం.'

'చెబితె పోతుందన్నానుగా.'

'పోగూడదేవిటి తమకి.'

'ఇంకేవన్నావుందా పోయిందంటే.'

'పుణ్యం వుంటుందన్నానుగా.'

'అది పిరికివాళ్ళకి అన్నానుగా.'

'అక్కడికి తమరు మహావీరులైనట్టు.'

'ఆ పాపాన్ని ప్రేమించేవాళ్ళు వీరులు కారు.'

'గొప్పవీరులే, నాస్తికవీరులు.'

'ఎవరు మీరా?'

'మీరే. మీ...రే తెలిసిందా?'

'అనుకుంటే సరీ, మేం నాస్తిక వీరులం ఎట్టా అవుతాం? ఆనందమయిన శాశ్వతమైన యింత ప్రపంచం వుందనగా, అనుభవించడానికి.'

'అనుభవించండి. నాకెందుకు? అదిగో ఆ బొమ్మవైపు మాత్రం చూడకండి. భయంలేదు మీకెక్కడా.'

'మా యింటా వంటాలేదు '

'దేవుడన్నా, దయ్యమన్నా.'

'నన్ను చూస్తే నాకు భయం ఏవిటీ?'

'నరకం అన్నా.'

'ఇహ బావుంది వరస. నా యింటిలో నాకు భయం ఎందుకో.'

'ఉహూ. అన్నీ మీరే, అంతా మీరే. కావల్సు.'

'అవును అంతా నేనే. అన్నీ నేనే.'

'అంతా మీరై వుయ్యాలూగండి. నాకెందుకు? యిది తర్డు వార్నింగ్. యిహ చూశారంటే నాదానివంక – ఎదుటవున్న నేను చాలనేవిటి?'

'ఆ ఇది శాశ్వత జీవిలా కనపడుతోంది. పది సంవత్సరాలుపోయినా యిది యింకా యిరవై సంవతారాల 'మనే ' నీకూ దీనికీ ఎంత తేడావుందో.'

'వుంది లెండి. దాన్ని చూడవాకండి.'

'తమరెవరూ చెప్పడానికీ. దీనిలో నా జీవం వుంది. నా శ్రమ వుంది. నా జీవితం కలసివుంది.'

'ఆ వుంది.'

'నీ సౌందర్యం వుంది. నీ మెడవంపులున్నాయి. నీ వక్షస్థలం వున్నతం వుంది. నీ లేతకెంపు పెదవుల రాగిమం వుంది.'

'ఆ వుంది కాని దాన్ని తాకవాకండి. అబ్బా అక్కడ చేయి తీయండి. మీకే. వినపడ్డంలే '

'ఆకాశం మీద నగ్నంగా వున్న చంద్రుని సౌందర్యం వుంది.'

'ఇందుకా, మీరీ బొమ్మను రాస్తా?'

'సూర్యుని లేతకిరణాల వెలుగులో కొండ కోనలవున్న మంచుగడ్డల నునుపు వుంది.'

'బావుంది వెర్రి.'

'ప్రత్యూష సమయాన్ని తూర్పు కొండపై విహరిస్తోన్న ఉషః కన్య పాదాల మృదువుంది .'

'ఇహ తప్పదు. విశాఖపట్నం పిచ్చాసుపత్రికి.'

'...'

'నవ్వుతారెందుకూ? యిదిగో దాన్ని.. ముద్దువద్దు. పెట్టుకున్నారంటేనా? ఏవిటా చిలిపి చేష్టలూ.'

'తమకీ అసూయ ఎందుకూ?'

'అసూయ ఏవిటీ – అసూయ. యిది నా ఛాయ. నా ఆజ్ఞ లేకుండా దీన్ని ముద్దుపెట్టుకోడానికి మీరెవరూ?'

'నీ చిత్రం కాదిది. యిది నామను. నా సృష్టి.పద్యాలన్నీ నా సౌందర్యవర్ణనలతో నిండిపోవాలి. నన్ను పొగడడమే మీ పని. నా యవ్వనాన్ని సదా వర్ణిస్తూండడమే మీ ఉద్యోగం. నన్ను.. నన్ను పవిత్రంగా ప్రేమించడమే మీ జీవితాశయం. అప్పుడీ చిత్రం ఇప్పుడిట్లా గర్వోన్మత్తతో చూస్తూన్న యీ చిత్రం దీని గతి – అసంఖ్యానీకములైన, అసహ్యములైన ముడతలతో, తెల్లని మెరుగులేని వెంట్రుకలతో, తొట్రిలు పాదాలతో, నునుపులేని మృదువులేని కాంతిలేని అవయవాలతో, వుండి వుండి చావాలి – నాకు, నాకు శాశ్వత యవ్వనం. శాశ్వత జీవనం. ఎప్పటికప్పుడు తిరుగులేని జీవనం. అప్పుడు.. అప్పుడూ ప్రేమిస్తారు కదూ మీరు పవిత్రంగా.'

'ముసలివాళ్ళం అయినా నీవు నన్నెంత ప్రేమిస్తావో నేను నిన్నంతే ప్రేమిస్తాను. అసలు మామూలుగా మనమనుకునే ప్రేమ, మనం పవిత్రం అని వర్ణించే ప్రేమ పడుచుతనంలోనూ లేదు, ముసలితనంలోనూ లేదు. ఎప్పుడూలేదు, ప్రపంచంలో ఎక్కడాకూడా లేదు. ప్రేమ పవిత్రం కాదు. అపవిత్రం అనే భేదం లేనేలేదు ప్రపంచంలో.'

'లేదు, లేదు, అవన్నీ నాకే ఆ అనుభవాలన్నీ నాకే. శాశ్వత యవ్వనం శాశ్వత జీవనం దాని జన్మ హక్కు. రోజురోజుకి తరుముకు వస్తూన్న మృత్యువు, భయంకరమైన మృత్యువు నా జన్మహక్కు. అప్పుడు మీరు దాన్ని వర్ణిస్తారు. దాని వర్ణనలతో మీ జీవితం నిండుతుంది. దాన్ని ముద్దుపెట్టుకుంటారు. దాని వక్షాన్ని గాఢంగా అదుముకుంటారు. నేను, నేను చచ్చినా అదివుంటుంది. లేశమయినా విచారం లేకుండా నా చావుని చూస్తుంది. మీరూ అంతే నేను లేకపోయినా మీకు లోపం లేదు మీరూ...'

'ఏవిటది అంతా మనూ చిన్న పిల్లలా మాట్లాడతావ్?''

'ఆ చావుకి ఎవరూ విలపించరు' నాకు మరణగీతిక పాడరు. నా మృత్యువు ఎవరి హృదయాన్ని తాకదు. హత్తదు. మీరు దీని యీ ముఖం యీ పాడు ముఖం చూస్తూ నాకోసం ఏడుస్తారూ? నా మరణ గీతిక నేనే పాడుకోవాలి. ఇప్పుడే పాడుకుంటాను పాడడం ఏమిటీ? ఏడుస్తాను నాకోసం నేనే ఏడవాలి. నేటి నుంచి అదే నా పని, నా విధి.'

'ఈ వేళ నీకు పిచ్చిపట్టినట్టుంది, మనూ లేకపోతే వొకరికోసం వొకరం ఏడవడం ఏవిటీ? అంత అవివేకం మరొహటిలేదు. ఎంత అవివేకం అంటే వొకరికోసం వొకరు నవ్వడం అంతా. నేను చస్తే నాకోసమని ఏడుస్తూ విరహగీతిక లాలపిస్తూ జీవితాన్నంతా దుఃఖాశ్రువులతో నింపుకోవడమేనా నీ పని? దానికన్నా నిజమైన ఆశయం వుంది మన జీవితాలకు. ఇంకా నీ ముందు సుందరతరమైన విశాల ప్రపంచం వుంది. అనుభవించు. ఆనందించు. నేనూ అంతే. నిజంగా వొక్క అశృకణం రాల్చను. అశృకణాలు రాలుస్తూ కూర్చోవడమే నా జీవితాశయం కాదు.'

'ఆ..ఆ.. అలా కాదు. ఆలా కానీయను. దాన్ని మీరు వర్ణించకూడదు. నేనుండగా దానికి స్థానంలేదు మీ హృదయంలో. నేను పోతే చస్తే ఎందుకు చావాలి? చస్తే ఏడ్వవలసిన విధి మీది. తప్పక దుఃఖించాలి. నాకు తెలుసు దుఃఖిస్తారు. నా చావు మీ హృదయాన్ని హత్తుతుంది ' మీ హృదయంలో నాకు స్థానం వుంటుంది నేను పోయినా.'

'బావుంది. నీవు పోయినా నీ రూపాన్ని, నీ విగ్రహాన్ని హృదయంలో పెట్టుకుని కుమిలిపోమన్నావ్, ఆరాధించమన్నావు. అది నా చేతకాదు. ఆరాధన ఉపాసన. అన్నవి వట్టి తెలివి తక్కువ మాటలు. ఎవడూ ఎవడి ప్రేయసినీ ఆరాధించడు. నా హృదయంలో దానికేమూలా స్థానంలేదు. నీకు స్థానం లేదు. ఒకరి హృదయంలో వొకరి కెప్పుడూ స్థానం వుండదు. నా హృదయాన్ని నీకివ్వలేను, నీ హృదయాన్ని నాకివ్వలేవు, మనమెంత గాఢంగా ప్రేమించామనుకున్నా సరే ఎందుకు ఏడవడం? మృత్యువు భయంకరమైన మృత్యువా? ఎప్పుడూ కాదు. పుట్టుక ఎంత ఆనందప్రదం అయిందో,

జీవితం ఎంత సుఖకరం అయిందో మృత్యువంత ఆనందప్రదమైంది, అంత సుఖకరం అయింది – ఎందుకు చావాలీ? ఎందుకు పుట్టాలి?పుట్టావు కనుక చావాలి.'

'మృత్యువంత ఆనందప్రదం అయిందీ అయితే దీనికి ఎందుకులేదు. మృత్యువు లేదు – చావు తరువాత ఏంవుంటుంది నాకు? నా యవ్వనం వుండదు. నా గులాబిపువ్వుల వక్షం వుండదు. ఏవీ వుండదు .మాట్లాడడం వుండదు. చేయడం వుండదు. వుండడం వుండదు. వుండేదల్లా లేకపోవడవే వుంటుంది. ఇదీ...'

'తరువాత ఏంవుంటే నీకెందుకు? ముందు ఏంవుందేవిటి, వెనుక వుండటానికి? పుట్టుక ముందు ఏంవుందో యోచిస్తున్నావా? చావు తరువాత ఏంవుందో ఆలోచించడానికి? ఏవుంటే మనకెందుకూ?'

'ఇది ఎప్పుడూ వుంటుంది. ఈ పాడు ముఖంతో వుంటుంది. ఎందుకుండాలి? వుండకూడదు. వుండనివ్వను. ఒక నిమిషం, ఘడియ అయినా సరే చావు...చావు.. యీసారి అయిందా పనీ.'

'.......'

## కథ నాది ముగింపు ఆమెది

## – శీలా వీర్రాజు

## (1968 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక నుండి)



**'నీతో వో విషయం** మాట్లాడాలి. రేపు ఓసారి రారాదూ ' అంది సావేరి.

తిరుగులేని ఆయుధం అది. స్త్రీ మాట్లాడాలి రమ్మంటే రాననే పురుషుడెవరూ నాకు కనిపించలేదు. ఎంత బెట్టుసరి చేసేవాడైనా ఏ స్త్రీ అయినా అలా వచ్చి పిలిస్తే వెళ్ళకుండా వుండడు .ఆ విషయం స్త్రీకి బాగా తెలుసు. పురుషుడ్ని తన దగ్గరికి రప్పించుకోవాలనుకుంటే స్త్రీ ఉపయోగించే ఆయుధాల్లో యిదొకటి.

ఇదే ఆయుధాన్ని ఏ పురుషుడన్నా స్త్రీమీద ప్రయోగించాడనుకోండి. "ఏమిటా విషయం. ఇక్కడ చెప్పకూడదేమిటి? పోనీలే అంత పరమ రహస్యమైతే అది నీ దగ్గరే అట్టే పెట్టుకో, నాకంత తీరికలేదు బాబూ" అంటూ తీసి పారేస్తుంది. ఆయనే తన దగ్గరకివొచ్చి మరీ ఆ విషయం చెప్తాడని ఆమెకు తెలుసు. అందుకే ఆమెకు ఆ బెట్టుసరి. ఆమె బెట్టుసరి చేస్తున్నట్టు పురుషుడు గుర్తించినా అది ఆమెకు అందాన్నే

యిచ్చింది సుమా అని మురిసిపోతాడు. ఆమెను తను పిలిచిన విషయం మర్చిపోయి, తనే ఆమె దగ్గరకి వెళ్తాడు.

సావేరి ఎందుకు రమ్మందో నాకు తెలుసు. చూచాయగా అంతకుముందే విన్నాను. దశావతారాన్ని ప్రేమిస్తోందిట. బహుశా ఈ విషయంలో నా సలహాను కోరడానికే అయివుండొచ్చు. నిజానికి ఇలాంటి వాటిలో సలహాలివ్వడం అంత మంచిదికాదు. ఒకవేళ ఇచ్చినా ఇవ్వనట్టే మర్చిపోవడం అవసరం.

ఏ వ్యక్తయినా పనిగట్టుకుని నీ దగ్గరకొచ్చి తన ప్రేమ కథంతా చెప్పుకుని నీ సలహా అడిగితే నువ్వెంతో మురిసిపోయి, నిన్నంతగా గౌరవించేస్తున్నాడనుకుని సంబరపడిపోతావుకాని, నువ్వొట్టి అమాయకుడివి సుమా. నీ సలహాని అతను పక్క జేబులో పెట్టుకుని తొడుక్కున్న బట్టల్ని విప్పేవరకూ అలాగే వుంచుకుని తిరుగుతు, జ్ఞాపకం వొచ్చినప్పుడు ఓమారు పైకి తీసుకుని చూస్తూ, మళ్ళీ జేబులో పెట్టుకుని, మళ్ళీ తీసి మళ్ళీ పెట్టి అలా అది మడతలుపడి చిరిగి శిథిలావస్థ చేరుకుంటే విసుగేసి ఎప్పుడో నిర్దయగా తీసి అవతల రోడ్డుమీద పదిమందీ వొచ్చి పోయే నేలమీదకు నిర్లక్ష్యంగా విసిరేస్తాడు. అందుకే యితరుల ప్రేమ విషయంలో నువ్వు సలహా ఇచ్చేప్పుడు దానం చేస్తున్నట్టు సంతోషపడిపోక, పారేసుకుంటున్నట్టు దిగులుపడు.

నేనుకూడా ఇంతవరకు యిలాంటి విషయాల్లో ఎవరికీ సలహాలు ఇవ్వలేదు. ఒకవేళ సావేరి ఇందుకే పిలిచినా నాకేం తెలీదని చెప్పి తప్పించుకోవాలనుకున్నాను.

సావేరి రమ్మన్నదనికాకపోయినా చుట్టపు చూపుగానన్నా వాళ్ళింటికి వెళ్ళకపోతే బావుండదని మర్నాడు వెళ్ళాను.

"నువ్వు వస్తావో రావోనని సాయంకాలం పూట నేనే ఓసారి వచ్చి పోదామనుకున్నాను. నువ్వే వచ్చావు. యింకా నీకు నా మీద గౌరవం వుందన్నమాట" అంది సావేరి.

ఆ గౌరవం ప్రస్తావన ఆమె ఎందుకు ఎత్తవలసి వచ్చిందో ఆ విషయం ఆమెకూ నాకు మాత్రమే తెలుసు.

"పెళ్ళికి నువ్వొస్తున్నావని మా తమ్ముడు చెప్పాడు. అసలు వేణుగోపాలంగారికి అల్లుడ్ని వెతికి పెట్టిందికూడా నువ్వేనటగా. ఈ పెళ్ళికి తప్పకుండా నువ్వొస్తావనే అనుకున్నాను. ఈ విషయం తెలిసాక నిజంగా నాకు ప్రాణం లేచొచ్చిందనుకో" అంది సావేరి.

ఇంతకు ముందయితే ఈ మాటలకి నేను చాలా అర్థాల్ని కల్పించుకుని వుండేవాడిని. ఒకసారి సావేరే అవన్నీ సరికావని చెరిపేసింది. చిన్నప్పుడు పద్యాలకు ప్రతి పదార్థం రాయాల్సి వొచ్చినప్పుడూ ఇంతే. నాకు సరిగాచేతనయ్యేది కాదు. మూడొంతులు తప్పులే రాసేవాడిని.  సావేరి నా నోట్సు తీసుకుని తప్పుల్ని కొట్టిపారేసి సరైన అర్థాల్ని రాసిచ్చేది. అందుకే ఆమెకు ప్రతిసారీ పరీక్షల్లో తెలుగులో ఫస్టుమార్కో సెకండ్ మార్కో  వస్తుండేది.

"బావనగర్ బాగానే వుంటుందంటగా! ఎప్పుడైనా వస్తే ఆతిథ్యం యిస్తావా?" అంది.

ఏమిటో మరీ కాలక్షేపం మాటలివి. ఆమె రానూరాదు. వస్తే నేను ఆతిథ్యం ఇవ్వకుండా వుండనూ వుండను.

నేనేమీ మాటాడలేదని కాబోలు తిరిగి అబద్ధంకాదు. నిజంగానే వద్దామనుకుంటున్నాను. నిన్ను పిలిచింది కూడా అందుకే" అంది.

"అలాగే. తప్పకుండారా. నాకైతే  వంటరాదు, నువ్వేచేసి పెట్టాలి మరి" అన్నాను.

చాలాసేపు సావేరి మౌనంగా వుండిపోయి ఓసారి అటూ ఇటూ చూసి మెల్లగా " నీతో ఓ ముఖ్యమైన పని పడింది,చేసిపెడ్తవా?" అంది.

నేను ఊహించింది అబద్ధంకాలేదు. ఇంత రహస్యం కళ్ళల్లోనూ, కంఠంలోనూ ఎందుకో నాకు తెలుసు. ఈ తెరవెనక హృదయాన్ని చదవగలను. తన ప్రేమ విషయం చెప్పుకుని నా సలహాయేమిటో అడగడానికే అయివుంటుంది. ప్రేమించటం తప్పేమీకాదు. ప్రేమ జీవితాన్ని అర్ధవంతం చేస్తుంది, చైతన్యమయం చేస్తుంది. ప్రేమ అక్కర్లేని మనిషెవరు? ఆ మధ్య పత్రికల్లో చదివాను. చైనాలో ప్రేమ నిషిద్ధమట. ప్రేమ పనికిరాదంటుంది చైనా. దానివల్ల పారిశ్రామికోత్పత్తిలో మాంద్యం యేర్పడుతుందటకాని, ప్రేమలేందే కరుణలేదు. ప్రేమలేందే జాలిలేదు. అది మనసును వెన్నలా మెత్తబరుస్తుంది. మనసు మృదువుగా వుంటేనే బాధా, శ్రమా అర్ధమౌతాయి. బాధితులయెడ సానుభూతీ జాలీ కలుగుతాయి. వాళ్ళ కన్నీళ్ళను తుడవడానికి చెయ్యి అందివ్వమంటుంది ప్రేమ. చుట్టూ నిక్షిప్తమైవున్న అందాన్ని గుర్తింపజేస్తుంది. దానివల్ల మనసుకు ఉల్లాసం కలుగుతుంది. శ్రమను మరిచిపోయే మానసిక బలం చేకూరుతుంది. ఉత్తేజం కలుగుతుంది. రెట్టింపు ఉత్సాహంతో యే పనైనా చేపట్టవచ్చు. అలాంటప్పుడు పారిశ్రామిక ఉత్పత్తులు కుంటుపడతాయన్న చైనా వాదనకి తావులేదు. ప్రేమించలేని మనసు హత్యచెయ్యడానిక్కూడా జంకదు. జాలి, కరుణా లేనప్పుడు, చిత్తశాంతీ, మనోల్లాసమూ లేనప్పుడు, సౌందర్యారాధనా, రసదృష్టీ లేనప్పుడు కోపమూ, అసహ్యమూ, అసహనమూ వచ్చి చేరతాయి. కోపం, అసహ్యం, అసహనం వున్నచోట అశాంతి ప్రబలుతుంది. దారుణాలు జరుగుతాయి హత్యలు జరుగుతాయి. అశాంతీ, భయం వ్యాపించినచోట ఉత్పత్తి సక్రమంగా సాగదు. పారిశ్రామికోత్పత్తిలో మాంద్యం ఏర్పడుతుంది. కనుక, చైనా వాదన అర్ధరహితమైనది.

"అంతసేపు ఆలోచిస్తున్నావేమిటి? చేసిపెట్టడం యిష్టంలేదా?" అంది సావేరి.

ఆమె చెప్పే సంగతేమిటో తెలుస్తూనే వున్నా ఆమె నోటిమీదగానే విందామని అసలు విషయమేమిటో చెప్పమన్నాను.

"మీ ఊరు వస్తాను. కొంతకాలంపాటు వుండనిస్తావా?" అంది.

ఇదా యీమె చెప్పదలచినది. ఈ మాత్రందానికి యేదో పెద్ద రహస్యం చెప్తున్నట్లు ప్రవర్తించిందేం.

"ఏం, మాట్లాడవేం? నేనువస్తే ఆమాత్రం వుండనివ్వవా?"

"లంకంత పోర్షను. హాయిగా వుండొచ్చు. ఇంతకీ నువ్వు నిజంగా వస్తావా?" అన్నాను అనుమానాన్ని ప్రకటిస్తూ.

ఆమె వింతగా మాట్లాడడం ఆశ్చర్యంగా వుంది. ఏమిటో నాకు యిప్పటికీ సావేరి అర్ధంకాదు. అయినా యితరులు మనకి అర్థం కాలేదనుకోవడం పొరపాటే. చాలాసార్లు మనకి మనమే అర్థం కాము కదా.

"చూసావా నా మాటల్ని యేమాత్రం నమ్మలేకపోతున్నావు. అంత చెడ్డదాన్నయిపోయానా నేను" అంది. ఆమె కళ్ళచుట్టూ తడీ, ఆమె కంఠంచుట్టూ దుఃఖం అంటుకుంది.

ఇదిగో యిలాంటి కంఠంతోనే ఆమె జయించుకొస్తోంది. ఇంట్లో సవతి తల్లి. అందుకే ఆమెకు కన్నీళ్ళూ, దుఃఖం తడిసిపోయిన కంఠమూ సర్వసాధారణమైపోయాయి. ఒకసారి నన్ను కూడా యింలాంటి కంఠంతోనే జయించింది. జీవితంలో నేను ఎప్పుడూ యే విషయంలోనూ పరాజయం పొందలేదు. అదిగో అదొక్కటే. తట్టుకోలేక గిలగిల్లాడాను. ఒడ్డున నిలుచుని బయటపడేసిన చేపను చూసినట్టు సరదాగా చూస్తుంటే నేను ఆమె ఎదుటినుంచి తప్పించుకుని వెళ్ళిపోయాను.

సావేరి యేదో చెప్పబోయి ఆగిపోయింది. ఇటువైపు అడుగుల శబ్దం వినిపిస్తే పక్కకు తిరిగాను. సావేరి సవతి తల్లి. గుర్తుపట్టి పలకరించింది "అందరికీ పెళ్ళిళ్ళు చేయిస్తున్నావుగాని నువ్వెప్పుడు చేసుకుంటావోయ్" అంది. ఆమెకు నేనంటే మొదటినుంచీ అభిమానం. బహుశా యీ అభిమానంవల్లనేగాబోలు సావేరి నాకు దగ్గరగా రాలేకపోయింది.

ఆమె అవీ యివీ మాట్లాడి లోపలికి వెళ్ళిపోతూ "ఆ వేణుగోపాలంగారంతపాటి చేయలేకపోయానటయ్యా నేను?" అని ఓ విసురు విసిరింది.

నిజమే. అంతకన్నా దగ్గరి బంధువేమరి. కాని, వేణుగోపాలంగారికి సహాయం చేసినట్టు నేను యీమెకి సహాయం చేయగలనా? అంత నిస్స్వార్ధ పరుణ్ణికాను. సావేరి ఒకసారి యేదో విషయంలో అననే అంది. "నీలోనూ స్వార్థం వుంది. లేకపోతే నువ్విలా మాట్లాడి వుండవు" అని. ఔను. అప్పుడు నేను స్వార్థపరుడ్నే. అప్పుడేకాదు యిప్పుడు కూడా.

"ఏమిటి ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టున్నావ్. చెప్పవేం, మీ వూరు వచ్చేదా?" అంది సావేరి.

ఆమె సరదాకి అడగడంలేదని, సీరియస్‌గానే అడుగుతోందని అర్థమైంది.

"ఈ మాత్రందానికి నన్ను అడగాలా. అడగక్కరలేకుండా తిన్నగానే రావొచ్చు నువ్వు. ఆ మాత్రం చనువు నీకు లేదూ?"

"ఉందనుకో. అయినా అడగడం మంచిదికదూ. అనవసరంగా నిన్ను ఇబ్బంది పెట్టడం అవుతుందేమోనని అడిగాను. ఇంతకీ నేను రావడంవల్ల నీకు ఏమైనా యిబ్బంది కలుగుతుందా?"

"అలాంటిదేమీ లేదు."

"మరి ఎవరైనా నన్ను గురించి అడిగితేనో?"

అవును. ఎవరైనా అడిగితే ఆలోచిస్తున్నాను.

"సరేలే. నువ్వేం చెప్పుకున్నాసరే, నాకు మాత్రం కొంతకాలం ఆశ్రయమియ్యి" అంది సావేరి.

కాలేజీనించి సావేరి తమ్ముడు వచ్చాడు. సావేరి అక్కడ్నించి లేచి వెళ్ళిపోయింది. వాళ్ళ తమ్ముడితో మాట్లాడుతున్నానన్నమాటేగాని నా ఆలోచనలన్నీ సావేరిని గురించే. దశావతారాన్ని గురించి చూచాయగానన్నా ఏమీ చెప్పలేదేం? విలన్‌ని చూసినట్టు ఎందుకలా చూడాలి నన్ను?

ఎంతసేపున్నా సావేరి తమ్ముడు కదల్లేదు. వెళ్ళిపోదామని లేచాను. వాళ్ళమ్మతోకూడా చెప్పి బయలుదేరబోతుండగా సావేరి వచ్చి "నేను చెప్పిన సంగతి మర్చిపోవుకదూ. వెళ్ళిన తర్వాత ఆ ఉద్యోగం గురించి గట్టిగా ప్రయత్నించు. అప్లికేషన్ పెట్టమంటే తర్వాత పెడ్తాను. ఉత్తరం రాయి, ఇదిగో అడ్రసు" అని కాగితం ఇచ్చింది.

నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే అక్కడ్నించి వెళ్ళిపోయింది.

అడ్రసు యివ్వడమేమిటి తెలీనట్టు. కాగితం విప్పాను. అడ్రసు మాత్రం కాదు. మడిచి జేబులో పెట్టుకుని హడావిడిగా వీధిలోకి వచ్చాను. వీధి చాలా పొడుగ్గా వుంది. ఉత్తరం చదవడానికి వీలు పడదు. సావేరి పిన్నికో, తమ్ముడికో కనిపించొచ్చు. ఆ కాగితం యిస్తున్నప్పుడు వాళ్ళు అక్కడే వున్నారు.

కాగితంలో యేముందో తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది. ఎప్పుడో సావేరి అంది. నేను స్వార్ధపరుడిని అని. అవును. ఆ స్వార్ధం నాలో వున్నట్టు యిప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. అందుకే అర్ధంలేని యీ పిచ్చి ఆనందం. ఎదురుగా రిక్షా వస్తోంటే బేరం చెయ్యకుండానే ఎక్కి కూచున్నాను. కాగితం తీశాను.

"ఇంట్లో చాలా విషయాలు చెప్పడం కుదరలేదు. చిన్న పని చేసిపెట్టు. నువ్వు ఉద్యోగం చేస్తున్న చోటే ఓ టైపిస్టు పోస్టు వుందనీ, అప్లికేషన్ పెట్టమని నాపేర ఓ ఉత్తరం రాయి. అది చూసుకుని సర్టిఫికెట్లన్నీ నీకు పంపిస్తాను. వారం రోజుల తర్వాత ఉద్యోగం వచ్చిందనీ, వెంటనే వచ్చి చేరమని ఉత్తరం రాయి. బయలుదేరి వస్తాను. నీతో చెప్పాల్సిన విశేషాలు చాలా వున్నాయి."

ఆ ఉరకలూ పరుగులూ యిప్పుడు లేవు. పాలపొంగులాగా అయిపోయింది. ఇన్ని నీళ్ళు చిలకరించిందీ వుత్తరం. స్వార్ధం కళ్ళల్లో దుమ్ములాగా యీ నీళ్ళు.

"కుడివైపా? ఎడంవైపా బాబూ?"

"కుడీలేదూ ఎడమా లేదు. ఆపెయ్"

దిగిపోయి చిల్లర డబ్బులు చేతిలో పెట్టి బయలుదేరాను. చికాగ్గా వుంది. ఇంటికొస్తే సావేరి కనీసం కాఫీనీళ్ళన్నా యివ్వలేదుకదా. హోటల్‌కి వెళ్ళాను. వెధవ కాఫీ పాతిక పైసల కాఫీయేనా యిది. వట్టి నీళ్ళ కాఫీ. సర్వర్‌ని కసురుకుని వీధిలోకొచ్చాను. ఇంత దుమ్ము కళ్ళల్లో కొట్టివెళ్ళింది ఓ లారీ. ఛీఛీ, యేం రోడ్డో. నడవడానికి కూడా వీల్లేదు. దారిలో

పార్క్ వుంటే వెళ్ళి కూర్చున్నాను. చల్లగా వుంది. మైక్‌లోంచి వెండి తీగను జలతారుపోగులాగ సాగదీస్తున్నట్టు అసావేరిలో సన్నగా వైలెన్ సంగీతం వస్తోంది.

సావేరి ప్రవర్తన యేమిటో విచిత్రంగా వుంది. దశావతారం నుంచి దూరంగా ఎందుకు పారిపోతున్నట్టు? సావేరి తనను ప్రేమిస్తున్నదని దశావతారం ఎవరితోనో చెప్పినమాట నిజంకాదా? అది కేవలం స్వోత్కర్షేనేమో. తన గొప్పతనాన్ని చాటుకుందుకు యీ అబద్దాన్ని ఓ అలంకారంగా తగిలించుకున్నాడేమో. ఒకవేళ ఆమె అతన్ని ప్రేమించినా ప్రేమించి వుండొచ్చు. ప్రేమ ఉప్పులాంటిది. అది విడిగా ఎందుకూ పనికిరాకపోవచ్చు. కాని అది లేందే జీవితానికి రుచేలేదు. చిన్నప్పటినించీ సావేరి జీవితం నిస్సారంగానే గడిచింది. దశావతారాన్ని ప్రేమించివుంటే అందులో వింతేమీలేదు. వింతగా అనిపించే విషయం ఒకటే. ఆమె ప్రేమించే హృదయాన్నే కోరుతూ వుంటే, అంతకుముందు అలాంటి హృదయాన్ని ఎందుకు తిరస్కరించింది? దశావతారమంటే అంత ప్రత్యేకమైన అభిమానం వున్నప్పుడు యిప్పుడిలా పారిపోవడం దేనికి?

దశావతారమే ఆమెను తిరస్కరించి వుండొచ్చు. అవును. ఆమె కళ్ళల్లో గిలగిలా కొట్టుకుంటున్న చూపులూ, ఆమె ముఖంలో ఎగిరిపడుతోన్న బాధా, రెపరెపలాడుతోన్న ఆందోళనా, మసిగుడ్డలాగా మాసికలుపడ్డ ఉత్సాహం యివన్నీ ఆ సంగతే చెపుతున్నాయి. వెనక యిలాంటి స్థితిలోనే నేనూవుండి యిలాగే పారిపోయానుకదా.

సావేరిమీద జాలేసింది. పాపం ఎప్పుడూ ఆమె జీవితం సవ్యంగా గడవలేదు. అన్నీ వంకర గీతలే.

చీకటిపడేవరకూ పార్కులోనే కూర్చుని యింటికి వెళ్ళాను. భోంచేసి పడుకునేముందు ఎంత వొద్దనుకున్నా గతం గుర్తుకొచ్చింది.

మర్నాడే వెళ్ళిపోయాను. వెళ్ళేముందు సావేరిని కలుద్దామనుకున్నానుగాని అంతకుముందే అప్పగింతలన్నీ అయిపోయాయికదా, యింకెందుకులెమ్మని కలవలేదు. ఊరువెళ్ళింతర్వాత ఆమె కోరినట్టే ఉత్తరం రాశాను. ఏవేవో ట్రూ కాపీలూ, ఓ అప్లికేషనూ పంపించింది. ఆ తర్వాత ఓ టెలిగ్రామూ, ఉత్తరమూ రాస్తే రాసిన వారం రోజులకు పెట్టె బేడాతో సహా ఊళ్ళో దిగింది. మరో విశేషం కూడా. వాళ్ళమ్మమ్మను వెంటబెట్టుకుని మరీ వచ్చింది.

"తోడుగా వుంటుందని ఏలూరు వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొచ్చాను" అంది.

ఆమె సావేరి స్వంత అమ్మమ్మ. కూతురు పోయాక మనవరాలుని తీసుకుపోవాలనుకుందిగాని అల్లుడు పడనిచ్చాడు కాదు. ఎప్పుడైనా వచ్చి మనవరాలుని చూసి వెళ్తుంటుంది. మనవరాలంటే ఆమెకు మా చెడ్డ అభిమానం.

సావేరి వచ్చేంతవరకూ నాకు అనుమానమే నిజంగా వస్తుందా అని. నిజంగానే వచ్చింది. నెలల తరబడి వుండిపోయేదానిలాగా పెద్ద ఆర్భాటంతోనే వచ్చింది. లేకపోతే యింతదూరం రావడం నాలుగైదు రోజులువుండి వెళ్ళిపోవడానికా. ఆమె ఇక వెళ్ళలేదు. ఆమె చుట్టూ ఓ గోడ. మంచితనంతో ఎత్తుగా ఓ గోడ కట్టేసి దిగ్బంధనం చేసేస్తాను. ఆమె ఇక్కడే వుండిపోతుంది. ఈ జీవన ప్రాంగణం నించి ఆమె ఇక కదిలి వెళ్ళలేదు.

మనసంతా అర్ధంపర్ధంలేని ఆరాటంగా వుంది.

సావేరి యింట్లో అడుగుపెట్టిన తర్వాత ఇంటికళే మారిపోయింది. బ్రహ్మచారి కొంప బొట్టులేని ఆడదిలాటిదే. ఎన్ని డ్యూకో పెయింట్లు వేస్తే మాత్రం యే మూలో కాస్తంత పసుపూ, మరికాస్తంత కుంకుమా లేకపోతే వెలితిగానే వుంటుంది.

ముసలావిడ వంట ప్రారంభిస్తానంది.

సామానులేమీ లేవు. రెండురోజులు హోటలు తిండే గతయ్యింది. మూడో రోజున నాతో కూడా బజారుకు వచ్చి కావలసిన సామాన్లూ ఎచ్చాలూ కొంది సావేరి. డబ్బులు నన్ను ఇవ్వనియ్యలేదు. 'నా దగ్గర డబ్బు ఎక్కువేంలేదు. కానీ వున్నంతవరకూ నన్ను ఖర్చుపెట్టనియ్యి. ముందు ముందు అవసరం వస్తే నువ్వే యివ్వాల్సి వుంటుందిలే" అంది.

వాళ్ళు వచ్చిన నాలుగోరోజున ఆదివారం ఇంట్లోనే వున్నాను. మధ్యాహ్నం భోజనాలయ్యాక వాళ్ళ అమ్మమ్మ నిద్రపోయింది.

"ఆదివారం పూట నిద్రపోయే వాడివేమో నేను వచ్చి నీ అలవాట్లన్నీ మార్చేస్తున్నాను కదూ. నావల్ల నువ్వు ఇబ్బందిపడాల్సి వస్తోంది" అంటూ నా గదిలోకి వచ్చి కూర్చుంది సావేరి.

"నేను రావడంవల్ల నీకు యిబ్బందే. నా గురించి ఆ మాత్రం ఇబ్బందిపడేవాళ్ళు నువ్వుగాక నాకింకెవరున్నారు. అందుకనే నీ దగ్గరకొచ్చాను" అంది తిరిగి.

"నేనేం ఇబ్బంది పడ్డంలేదు. పైపెచ్చు నువ్వొచ్చినందువల్ల నాకెంత సంతోషంగా వుందో తెలుసా. నిజంగా ఓ పండుగలాగే వుంది."

సావేరి యేమీ మాట్లాడలేదు. ఓ నిట్టూర్పు మాత్రం విడిచి పెట్టి గొణుక్కుంటున్నట్టు "నీ మంచితనాన్ని నేను నా స్వార్థానికి వుపయోగించుకుంటున్నానేమో. కానీ యేం చెయ్యను మరి. మరో గత్యంతరం లేదు నాకు" అంది.

సావేరి చాలా అర్థవంతంగా మాట్లాడుతుంది. ఆమె మాటలూ, ఆమె ప్రవర్తనా తేలిగ్గా నాకు అర్థంకావు. క్లిష్టాన్వయాలూ, కఠిన సమాసాలూ నిండిన ఏ సంస్కృత పదాల తెలుగు పద్యంలాగానో అనిపిస్తుంది సావేరి.

మొదటినుంచీ ఈ అర్థాలూ, ఈ తాత్పర్యాలూ నాకు వంటపట్టలేదు.

సావేరి నన్ను మంచివాడ్నని మెచ్చుకున్నందుకు కాస్త గర్వగా వుంది. నిజానికి తనను తాను ప్రేమించుకోవడం కన్న మెచ్చుకోవడంకన్న ఇతరులు తనను ప్రేమించాలనీ, మెచ్చుకోవాలనీ కోరుకుంటాడు మనిషి. ఎందుకంటే తనను తాను ఎలాగో గౌరవించుకోలేడు. కారణం తనలోని లోపాలూ, బలహీనతలూ అన్నీ అతనికి తెలుసు గనక.

"నేను ఎందుకొచ్చానో ఈ పాటికి నీకు అర్థమయ్యే వుంటుందనుకుంటాను. ఏమిటో. తెలిసుండి కూడా అప్పుడప్పుడు కొన్ని కొన్ని పొరపాట్లు చేస్తుంటాం. ఆ పొరపాట్లే పీక మీదకొచ్చి కూర్చుంటాయి. అలాంటి పరిస్థితుల్లోనే చిక్కుకుని ఇక్కడికి వచ్చాను.." సావేరి మధ్యలోనే ఆపి నా వేపు చూసింది. నేను వినడం చూసి –

"వెనక ఒకసారి నీతో చెప్పానేమోకూడా దశావతారం నేనూ పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నామని. పెళ్ళికి ఎప్పటికప్పుడు యేవో అవాంతరాలు వచ్చిపడుతూనే వున్నాయి. ఈ మధ్యనే అతను మాస్ కమ్యూనికేషన్ ట్రైనింగ్‌కని ఢిల్లీ వెళ్ళాడు. నాకేమో యేమీ తోచకుండావుంది. నా కడుపులో నలుసు కదులుతోంది. మూడోనెల. ఈ విషయం తెలిసాక రోజుకో ఉత్తరం చొప్పున అరడజను ఉత్తరాలు రాశాను. ట్రయినింగ్ అయ్యేవరకూ ఎలాగోలాగ గడిపేస్తే తనువచ్చి అన్నీ చక్కబరుస్తానన్నాడు. వీలయితే అబార్షన్‌కి ప్రయత్నించమన్నాడు. నాకు చాలాకోపం వచ్చింది. యే గత్యంతరం లేకపోతే ఆ పనే చేసేదాన్నేమో మరి. ఇంతలో దేముడిలాగా నువ్వు అటొచ్చావు.."

దీని ప్రభావం నామీద ఎక్కువగానే పడింది. ఆమె ఆ తర్వాత యేం చెప్పిందీ సరిగా వినిపించుకోలేకపోయాను. బాధా? ఏమో? చెప్పలేను. మనసంతా ఆరాటంగా, అశాంతిగా, తీరిగ్గా వినే ఓపిక కోల్పోయి చికాకు చికాకుగా వుంది.

"నిద్రొస్తున్నట్టుంది కాబోలు నీకు. పోనీ పక్క వేసేదా పడుకుందువుగాని."

"ఒద్దు నేను వేసుకుంటాలే"

"ఏం, నేను వేస్తే నచ్చదా?"

"ఇంతకాలమూ నాకు మరొకరి సాయం కావలసి వచ్చిందా, నా పని నేను చేసుకోలేదూ"

సావేరి బాధపడినట్టుంది. "నీ ఇంట్లో వుంటూ నీ తిండి తింటూ ఆ మాత్రం నీకింద చేస్తే తప్పా. గతిలేక నీ దగ్గరకి వచ్చాననేకదా ఇలా మాట్లాడతున్నావు." ఎక్కిళ్ళొచ్చేసి, కళ్లల్లో నీళ్ళు తిరిగి చూస్తుండగానే ఏడ్చేస్తోంది. బయటికి గట్టిగా ఏడవలేక తనలో తనే కుళ్ళిపోతున్నట్టు ఎక్కిళ్ళుపడుతూ, కొంగు నోటికి అడ్డుపెట్టుకుని మనసునిండా బరువుగా అల్లుకున్న దుఃఖం కరిగి కన్నీళ్ళై కారిపోయేవరకూ ఏడుస్తూనే వుండిపోయింది.

ఇంతకీ నేనేమన్నానని ఈ ఏడుపు? ఆమెను బాధపెట్టాలన్న ఆలోచన నాకు యే కోశానా లేదు. ఇలా ప్రతి చిన్న విషయాన్నీ తనకు అన్వయించుకుని ఆమెను నేనెందుకు ఏడిపిస్తాను. ఇంతకాలంగా బయటికి వ్యక్తం చేయలేక లోలోపలే బంధించేసుకున్న దుఃఖాన్ని ఇప్పుడు అవకాశం వచ్చిందని నా యెదుట పడేస్తోంది. కాని మరేంలేదు. ఆమెకు కావలసింది ఓదార్పు.

ఓదార్చడం నాకు చేతకాదు. యేడ్చేవాళ్ళని చూస్తే నా కంఠం కూడా దుఃఖంతో తడిసిపోతుంది. కంఠంలో జీర పలికి మధ్యలో ఆగిపోతుంది. అందుకని సావేరి ఏడుస్తోంటే నేనేమీ మాట్లాడలేకపోయాను.

అవతల నడవాలో ముసలావిడ దగ్గిన శబ్దం విని కళ్ళు తుడుచుకుని లేచి వెళ్ళిపోయింది.

సావేరి రావడం ఓ చిన్న సమస్యే అయ్యింది నాకు. ఇంటివాళ్ళు వూళ్ళో మరో చోట వుంటున్నారు. గనక వాళ్ళ బాధ తప్పింది. చుట్టుపట్ల వాళ్ళతో పరిచయంలేదు. ఇంట్లో ఆడవాళ్ళంటువుంటే భాష వచ్చినా రాకపోయినా పరిచయాలు పెరిగేవి. ఆఫీసులో మాత్రం ఇద్దరు ముగ్గురు కొలీగ్స్ అడిగారు.

"చుట్టం" అన్నాను.

"అంటే?" అన్నారు.

"అంటే చాలా వుంది. చెప్తాలెండి" అన్నాను.

పకోడీ పొట్లలాగ పనిచేసిందది, పొట్లం చూసి వెంటబడి తిరిగిన కుక్కల్లాగ చుట్టూ తిరిగారు. కసికొద్దీ చాలాసార్లు తిప్పుకున్నాను.

ఇటాలియన్ స్పై పిక్చర్లు ఎగబడి చూసేవాళ్ళ కుతూహలం చేతులు కట్టుకుని కూచోలేకపోయింది. ఎలాంటి చుట్టమో తెలుసుకోవాలన్న కుతూహలం పురుగుని తొలిచినట్టు తొలిచిందేమో రెండు మూడు సార్లు యింటికొచ్చారు.

పెళ్ళికాని హిందూ స్త్రీని గుర్తుపట్టడం చాలా తేలికే కదా. ధైర్యం వుంటే మెడనీ, లేనప్పుడు బుద్ధిమంతుడిలాగ పాదాల్నీ చూసేస్తే సరి.

వచ్చినవాళ్ళు పాదాల్నే చూసి గర్వంగా వెళ్ళిపోయారు. జూనియర్ సైంటిస్టులు వాళ్ళు. నిజంగా వాళ్ళు గొప్ప పరిశోధకులే. దేశానికి అవసరమైన ఓ గొప్ప సత్యాన్ని కనుగొన్నారు కదా మరి. కాదని ఎలా అనగలం?

సావేరి కూడా బైటికి రావడానికి అంతగా యిష్టపడేదికాదు. వచ్చిన కొత్తలోనే ఓ సెలవురోజున ముసలావిడ్నీ, సావేరినీ గాంధీ స్మారక మందిర్‌కు తీసుకెళ్ళాను. మరో రోజు సాయంకాలం గట్టిగా పట్టుబడితే బోర్తలాబ్‌కు వచ్చారు ఊరంతటికీ మంచి నీటిని సరఫరా చేసే చెరువది. చెరువు పక్కనే పెద్ద తోటని పెంచి పిక్నిక్ స్పాట్‌గా డెవలప్ చేశారు.

తోటలో ఉన్నంతసేపూ మనస్సేమీ బావుండలేదు. బయలుదేరినప్పుడున్న ఉత్సాహం తీరా అక్కడికి వెళ్ళాకలేదు. గులాబీ మొక్క పక్కనించి వెళ్తోంటే ఓ ముల్లు గీరుకుపోయింది. గడ్డిలో కూచుందామని చెప్పులు తీసి గట్టు దిగి రాబోతూంటే పల్లేరుకాయ గుచ్చుకుంది. ఎక్కువసేపు తోటలో వుండలేకపోయాను. సావేరి కూడా చల్లగాలిపడదంటే తొందరగానే తిరిగి వచ్చేశాం.

ఆ తర్వాత ఎప్పుడూ సావేరినికూడా రమ్మనమని అడగలేదు. ఎక్కడికెళ్ళినా ఏవో జ్ఞాపకాలతో మనసుకే ముళ్ళుగుచ్చుకుంటాయి. ఒకసారి సావేరే సినిమాకి వెళ్దామని అంది. ఫస్ట్‌కు జీతం అందుకుని ఇంట్లోకి కావలసిన సరుకులు కొందామని సావేరిని వెంటబెట్టుకుని బజారుకి వెళ్ళినప్పుడు తోవలో సినిమాహాలుని చూసి అంది "సినిమా చూసి చాలాకాలమైంది. మంచి సినిమా ఏదన్నా వుంటే రేపు వెళ్దాం" అని.

మర్నాడు ముసలావిడ్ని రమ్మంటే "హిందీ సినిమా నాకేం అర్థమౌతుంది, మీరువెళ్ళండి"అంది. ఇద్దరమూ ఫస్ట్ షోకు వెళ్ళాం. సినిమా చాలాబావుంది. బండివాడిని ప్రేమించి, ఆ విషయం గట్టిగా హృదయానికి నచ్చచెప్పుకునే ఆత్మ స్థైర్యంలేక దూరంగా వెళ్ళిపోయిన ఓ నర్తకి కథ. సావేరికి కూడా బాగా నచ్చినట్టుంది. చూస్తున్నంతసేపూ సినిమాలోనే లీనమైపోయింది.

సినిమా విడిచిపెట్టాక టాంగాలో వెళదామంటే వున్న అయిదారు టాంగాలూ జనాన్ని ఎక్కించుకుని వెళ్ళిపోతున్నాయి. పర్లాంగు దూరం నడిచి చౌరస్తా దగ్గరకు వెళితే టాంగాలు వుంటాయిగాని ఆమెను అంత రాత్రివేళ నడిపించడం యిష్టం లేదు. ఆటో రిక్షాలో బయలుదేరాం. ఆ అనుభవం కొత్తది. వెచ్చగా కాలుస్తున్న స్పర్శ. మలుపుల్లో తూలిపడకుండా గట్టిగా పట్టుకున్నప్పుడు వేళ్ళ చివరవరకూ సాగిన కోరికల తీగలు ఆధారాన్ని చుట్టచుట్టుకుని పాకుతున్నాయి.

సావేరి మౌనంగా నడుముమీంచి చేతిని తొలగించేసింది. దగ్గరగా ముడుచుకుని రాయిలా బిగుసుకుపోయి కూచుండిపోయింది.

ఇంటికి వెళ్ళాక ముసలావిడ భోజనం వడ్డించబోతే పడుకోమని చెప్పి తనే వడ్డించింది. తలవంచుకుని తింటున్నాను. తలుపులు దగ్గరగా చేరేసి వచ్చి అంది 'నీ దగ్గరికి పెద్ద నమ్మకంతో వచ్చాను. నువ్వు అందరిలాంటివాడివికావనీ, నీ దగ్గర నాకు ఏ ఆపదావుండదని నమ్మి వచ్చాను. నా అసహాయస్థితిని అవకాశంగా తీసుకుని నువ్వుకూడా నన్ను అగౌరపరుస్తావా, పెళ్ళికాకుండా తల్లినయ్యాననేగా నువ్విలా చిన్నచూపు చూస్తున్నావ్' అప్పటికే ఆమె చెక్కిళ్ళమీదకి కన్నీళ్ళు జారిపోయాయి. ఆమె కంఠం బొంగురుదేరిపోయింది.

ఏం మాట్లాడగలను నేను? ఏమీ మాట్లాడకండా మంచితనం పేరు చెప్పి నా నోరు కట్టేసింది. దొంగకు తాళాల గుత్తిచ్చే తెలివి ఆమెది. ఆమె ఎదుటినుంచి ఎంత వేగంగా తప్పించుకుందామా అని సగం తిని, సగం వదిలేసి చేతులు కడుక్కోబోతే చూసి కళ్ళద్దుకుని గబగబా లేచొచ్చి 'అదేమిటి అలా సగం తిని లేచిపోతున్నావ్. నీ సంపాదన అంతా మాలాటివాళ్ళకి పెట్టడానికేనా, నీ సౌఖ్యం గురించి ఆలోచించుకోనక్కర్లేదా. వుండు లేచిపోకు. నువ్వు లేస్తే నామీద ఒట్టే. కూరలన్నీ చల్లారిపోయినట్టున్నాయి, రెండు అప్పడాలు గబగబా వేయిస్తాను. అందువుగాని" అంది.

ఇదిగో యిలాంటప్పుడే సావేరి పరాయిదన్న విషయం కొట్టొచ్చినట్టు తెలుస్తుంది. సావేరి పరాయి మనిషి కాదు. కాని సావేరి పరాయిదే. ఇది సత్యం సత్యాన్ని అబద్దంగా ఎలా చూడను? నిజాన్ని అంగీకరించకుండా ఎలా వుండను?

ప్రతి పనిలోనూ సావేరి కల్పించుకు చేస్తోంటే నాకు భయం వేస్తోంది. ముందు ముందు నేను వట్టి బద్ధకస్తుడిగా తయారవుతానేమోనని. రేపొద్దున్న సావేరి వెళ్ళిపోతే మరొకరెవరో నా క్రిందచేసి పెట్టాల్సి వస్తుందేమో? వద్దంటే బాధపడుతుంది. కళ్ళనీళ్ళు కక్కుకుంటుంది. మాటిమాటికీ తన పరిస్థితిని ఎత్తి చెప్పుకుని, అందుకే చిన్నచూపు చూస్తున్నానంటుంది. ఇలాంటివాళ్ళతో వేగడం కష్టమే.

ఒకసారి ముసలావిడతోనే అన్నాను. "పొద్దుట్నించీ అలా ఎడతెరిపిలేకుండా ఏదో ఒక పనిచేస్తూనే వుంటుంది. కాస్త తన ఆరోగ్యం గురించి చూసుకోమనండి విశ్రాంతి లేకపోతే ఎలా?" అని

"నేనూ ఆ విషయమే మాట్లాడదామనుకుంటున్నాను నాయనా. వొంట్లో ఏ మాత్రం రక్తంలేదు. ఒకసారి డాక్టరుకి చూపిస్తే మంచిది" అంది.

డాక్టరు దగ్గరకి తీసుకెళ్తానంటే వచ్చేదికాదు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. పెడచెవిని పెట్టేసింది. డాక్టరును యింటికే తీసుకొచ్చాను. ఆవిడ వెళ్ళిపోయక మనవరాలుని గట్టిగా కసురుకుంది ముసలావిడ. "గుట్టుగా యింట్లో పెట్టుకుని తిండిపెట్టడం చాలక ఆయనచేత యీ ఖర్చులు కూడా చేయిస్తావటే. డాక్టరమ్మ వచ్చిందంటే ఎంత ఖర్చయ్యుంటుందో ఆలోచించావా? అడ్డమైనవాళ్ళందరికిందా ఆయన ఎందుకు చేయాలి? వెధవ బెట్టూ నువ్వూనూ. బుద్ధుంటే సరి. అయినా ఆ బుద్ధేవుంటే యీ వ్యవహారం యింతదూరం ఎందుకొస్తుందీ"

సావేరి యేడుస్తున్నట్టుంది, ముసలావిడ మళ్ళీ కసురుకోవడం వినిపించింది.

ఆమె అలా కసురుకోవడం నాకేం నచ్చలేదు. నడవాలోకి వచ్చినప్పుడు ఆవిడ్ని పిలిచి అన్నాను –

"కోప్పడకండి. అసలే ఆమె మనసేం బావుండలేదు. ఏమన్నా ప్రతీదీ తన పరిస్థితికి అన్వయించుకుని మరీ బాధపడుతుంది. మనమే ఎగతాళి చేస్తే పరాయివాళ్ళకి మరీ లోకువ. అయినా ఇందులో ఎగతాళి చెయ్యాల్సినది ఏముంది? రేపొద్దున్న దశావతారం ట్రయినింగ్ పూర్తిచేసుకొస్తే అన్నీ వాటంతటవే చక్కబడిపోతాయి."

ఆమె వయసులో మూడోవంతులేదు నాకు. ఆమెకు నేను బోధచేస్తున్నానేమిటని ఆశ్చర్యపోతున్నదో ఏమో నా ముఖంలోకి చూసి "ఆ.....ఆ...వచ్చే వాటంగానే వుంది. అంత అభిమానం వున్నవాడే అయితే ఒకసారి వచ్చి వెళ్ళకపోయేవాడా? ఇక్కడికి మేం వచ్చి మూడు నెలలు అవుతోంది కదా. ఒకసారి వచ్చి వెళ్ళమని పదుత్తరాలు రాసినా వచ్చాడూ? పదిహేను పైసల కవరు మాత్రం రాశాడు. ట్రయినింగట, రావడానికి వీలుండదట. ఎప్పుడో వీలుచూసుకుని వస్తాడట. నిజంగా అభిమానమే వున్నవాడు అమ్మాయి ఇలాంటి పరిస్థితుల్లో వుందంటే నిమ్మకు నీరెత్తినట్టు వూరుకుంటాడా?"

అయితే దశావతారం ఉత్తరాలుకూడా సరిగా రాయడం లేదన్నమాట. సావేరి ఎప్పుడు చెప్పనేలేదే. పైపెచ్చు అతని దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా అని అడిగితే 'ఊ ' అనికూడా అంది పాపం. సావేరి మోసపోయినట్టుంది.

ఆఫీసుకు వెళ్ళానన్న మాటేగాని యిదే ఆలోచన. సాయంకాలం ఆఫీసునించి వొస్తూ తిన్నగా యింటికి రావాలనిపించలేదు. కాస్సేపు పార్కులో కూచోవాలనిపించింది. మంచి హోటల్‌కి వెళ్ళి స్వీట్స్ తినాలనిపించింది.

ఊళ్ళోకంతటికీ పెద్ద హోటల్లోకి వెళ్ళి , ఓ అర్ధగంట పార్కులో గడిపి వస్తూ వస్తూ బజారుకు వెళ్ళి బుట్టెడు పళ్ళు కొనుక్కుని వచ్చాను.

"ఇన్ని పళ్ళా? నీకేం మతిపోయిందా? ఇవన్నీ తినమనే తెచ్చావా?" అంది సావేరి.

నిజమే. చాలా పళ్ళున్నాయి. ఏమిటో కొనెయ్యాలనిపించి కొనేశాను. ఆలోచించనేలేదు.

"పోనీ తిన్నన్ని తిని మిగతావి వొదిలెయ్. అయిన ఈ ద్రాక్షపళ్ళున్నాయి చూడూ.. ఇలా మాటాడుతూ మాటాడుతూ కాలక్షేపంగా ఒకటొకటీ తినేసెయ్యొచ్చు" వాటిలోంచి ఓ అరడజను తెంచి గాలిలోకి ఎగరేసి, నోటితో అందుకుంటుంటే విచిత్రంగా చూస్తూండిపోయింది సావేరి.

చిన్నప్పుడు బఠాణీలు , వేరుశెనక్కాయ గింజలూ యిల్లా ఎగరేసి అందుకోవడం అప్పుడే  మర్చిపోయిందేమో?

"ఇవ్వాళ చాలా హుషారుగా వున్నావే, ఏమిటి విశేషం?" అంది.

హుషారా.. వుండేవుండొచ్చు. విశేషంలేందే యింత హుషారు ఎక్కడిది. వుంది. కాని –

"ఇదిగో నువ్విలా ఖర్చుపెట్టడానికి వీల్లేదు. నీచేత ఖర్చుపెట్టించడానికే మేం వచ్చింది. నీ యింట్లో వుండనిచ్చావు .ఆ మాత్రం చాలు" అంది సావేరి. లోపలికెళ్ళి ఓ కాగితం సంచి పట్టుకొచ్చి యిచ్చి "ఇదివుంచు. ఇందులో డబ్బుంది, మందులకి దీంట్లోంచి ఖర్చు చెయ్యి. నీ చేతి డబ్బు ఎంతకని పెడ్తావ్. మేం వచ్చినదగ్గర్నుంచి సరిగా యింటికి కూడా నువ్వు డబ్బు పంపిస్తున్నట్టు లేదు" అంది.

పుచ్చుకోనంటే వూరుకుంది కాదు. డ్రాయరు తీసి లోపల పెట్టేసి వెళ్ళిపోయింది.

ఈ ఊరు వస్తున్నప్పుడు వాళ్ళమ్మ తాలూకు వస్తువొకటి ముసలావిడ దగ్గర వుంటే అమ్మించేసి డబ్బు పట్టుకొచ్చినట్టు లోగడ చెప్పింది. ఇందులోనుంచే నెలనెలా రెండో తారీఖున యింటికి ఓ వందో డెబ్బయ్యో మనియార్డరు చేస్తోంది. మొత్తమ్మీద తెలివైనదే. మంచి పకడ్బందీగా అన్ని ఏర్పాట్లూ చేసుకుంటోంది. కాని, యింత తెలివైనది ఎలా యీ గోతిలో పడిందో అర్థంకాదు. ఇప్పటికీ దశావతారాన్ని నమ్ముతోంది. అదే విచిత్రం.

ఆ తర్వాత ఒకసారి ఎప్పుడో దశావతారం నించి ఉత్తరం ఒకటి వచ్చినట్టు చెప్పింది సావేరి. ఏం రాశాడో అడగలేదు నేను. ఏం రాసినా అతని మీద నాకు ఏ మాత్రం నమ్మకంలేదు. ముసలావిడ వూహించింది అబద్ధమేమీకాదు. అంత అభిమానం వున్నవాడు యేదోవిధంగా వీలు చూసుకుని రాకుండా వుంటాడా?

నెలలు దగ్గరపడేకొద్దీ ముసలావిడకి కంగారు ఎక్కువయ్యింది. డాక్టరు టానిక్కులవీ వాడమని రాసిస్తే వాడుతోంది. రెండు వారాలకొకసారి డాక్టరు వచ్చి వెళ్తోంది. డెలివరీ అప్పుడు ప్రయివేటు నర్సింగ్ హోంలోనే చేర్పించాను.

మధ్యాహ్నం ఆఫీసుకు ఫోను వచ్చింది ఆడపిల్లట. కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది డాక్టరు. కంగ్రాచ్యులేషన్స్ నాకు చెప్పడంలో ఆమె తప్పేంలేదు. ఏమైన వుంటే అది నాదే.

దశావతారానికి టెలిగ్రాం ఇచ్చాను. ఉత్తరం కూడా రాశాను. సమాధానం వచ్చింది. ఈ వార్త సంతోషాన్ని కలిగించిందట. మరో నెలరోజుల్లో ట్రయినింగ్ పూర్తయిపోతుందట. ఆ తర్వాత పోస్టింగ్స్ బహుశా హైదరాబాదులోనే ఇవ్వొచ్చు. ఏకంగా అప్పుడే వస్తానని రాశాడు. ఈ విషయం సావేరికి చెపితే ఏడ్చింది. అప్పటికి ఆమెను యింటికి తీసుకొచ్చేశాను.

ఖర్చు బాగానే అయ్యింది. సావేరి యిచ్చినదాంట్లో నెలనెలా వాళ్ళింటికి పంపేయగా చివరికి ఏమీ మిగలలేదు. ఎస్.బి.ఐ లోంచి కొంత తీయాల్సి వచ్చింది. డెలవరీ తర్వాత సావేరి కోలుకోవడానికి కూడా బానే ఖర్చయ్యింది. "నీ ఋణం వుంచుకోను. ఎప్పటికైనా తీర్చేస్తాను" అని అంటుండేది. అస్తమానం యిదేమాట. లేదా కళ్ళనీళ్ళు పెట్టుకోవడం.

దశావతారానికి మూడో నాలుగో ఉత్తరాలుకూడా రాసింది సావేరి. పెద్ద పెద్ద ఉత్తరాలే. పోస్టు చేయమని నాచేతికి యిచ్చేది. కవర్లు లావుగా అనిపించేవి. వాటికి సమాధానం రాసుంటాడనుకోను. రాసుంటే సావేరో, వాళ్ళ అమ్మమ్మో చెప్పుండేవారు.

నెలా పదిహేను రోజులకి చివరికి ఓ ఉత్తరం వచ్చింది. ఉత్తరం పెద్దదే. అసలు సారాంశం మాత్రం చాలా చిన్నది. హైదరాబాదుకి పోస్టింగ్స్ యిస్తారనుకుంటే తీసుకెళ్ళి విశాఖలో పడేశారట. ఇక్కడికి వచ్చి వెళ్ళడానికి టైములేకపోతే నేరుగా నాగపూర్ రూట్‌లో విశాఖ వెళ్ళిపోయాడట. తీరా చార్జి తీసుకునేసరికి సెంట్రల్ మినిస్టర్ టూర్ ఒకటి వచ్చిపడిందట. ఆ హడావుడీ అయిపోతే సెలవు పెట్టేసి వస్తానన్నాడు.

మొత్తమ్మీద సావేరిని మాత్రం ఫూల్‌ని చేస్తున్నాడు. తెలివైనవాడే. ఎంత తెలివైనవాడు కాకపోతే సావేరిలాటిదాన్ని బుట్టలో వేసుకోగలుగుతాడు. విచిత్రమేమంటే దశావతారం నాటకం ఆడుతున్నాడని యింత స్పష్టంగా తెలుస్తున్నా యింకా ఆమెకు ఆశ చావలేదు. పాపం నిజంగా అతను వస్తాడనే నమ్ముతోంది పిచ్చిపిల్ల.

ఓ రోజు సాయంకాలం ఆఫీసునించి వచ్చి పాపదగ్గర కూచుని ఆడిస్తున్నాను. మరీ చిన్నపిల్లల్ని ఎత్తుకోవాలంటే యిబ్బందే. ఇప్పుడిప్పుడే అలవాటవుతోంది. ఎత్తుకోబోతే బట్టలు పాడుచేస్తుందేమో ఉండు రబ్బరు గుడ్డ వేస్తాను" అంటూ రబ్బరు షీటు తెచ్చివేసింది సావేరి. చాలాసేపు పక్కనే నుంచుంది. విశేషమేదో వుండి వుంటుందనిపించింది. తలెత్తి చూస్తే

"రేపు సోమవారంకాక ఆపై సోమవారం వెళ్ళిపోదామనుకుంటున్నాను. ముందుగా రిజర్వు చేయించుకోవాలి కదా. అదీకాక నువ్వే డబ్బు సర్దుబాటు చేయాల్సి వుంటుంది. ఓ నూటయాభై అప్పుగా యివ్వు. బ్రతికుంటే ఎప్పటికైనా నీ ఋణం తీర్చుకుంటాను" అంది.

ముసలావిడ కూడా వచ్చింది. “అవున్నాయనా ఇప్పటికే నీకు చాలా ఋణపడిపోయాం. ఆపదలో దేవుడిలాగా ఆదుకున్నావ్. నిన్నింక యిబ్బంది పెట్టడం యిష్టంలేదు" అంది.

దగ్గర్లోనే ఎప్పుడో ఒకప్పుడు సావేరి తన ప్రయాణం సంగతి చల్లగా చెవిని వేస్తుందని అనుకుంటూనే వున్నాను. ఆ వార్త వినడానికి సిద్ధంగానే వున్నా, తీరా విన్న తర్వాత మనసంతా బాధతో మెలికలు తిరిగిపోయింది. ఇంతకాలంగా ఆమె నాకింద సేవలు చేసి, నేను ఆమెకింద చేసి యిప్పుడిలా ఎవరికి ఎవరూ ఏమీ కానట్టు విడిపోవాలంటే బాధపడకుండా వుండలేకప్పోయాను.

"రమ్మని రాశాడా?" అని అడిగాను.

"లేదు. మేమే వెళ్దాం అనుకుంటున్నాం" అంది ముసలావిడ.

"ఎలాగూ అతను వస్తున్నాడు కదా మరో నెలరోజులు చూసి ఆ తర్వాత వెళుదురుగాని" అన్నాను.

కాదు కూడదంది సావేరి. వెళ్ళి తీరాలని పట్టుపట్టింది. ఒకవేళ నా దగ్గర డబ్బులేకపోతే తన చేతిగాజు ఒకటి అమ్మేస్తానంది.

ఆమెను ఆపడం నాకు చేతకాలేదు. ఆమెకింద యెంత ఖర్చు పెట్టినా, ఎంత సేవ చేసినా కొంత స్వార్థంతోనే చేశాను. కానీ యిప్పుడు ఆమెను వెళ్ళొద్దని ఆపడంలో నా స్వార్థం ఏమీలేదు, తీరా అక్కడికి వెళ్ళాక దశావతారం ఆమెను తిరస్కరిస్తే? ఎక్కడికి వెళ్ళగలుగుతుంది? కూడా చిన్నపిల్ల ఒకర్తి. ఎక్కడికి వెళ్ళాలన్నా, ఏం చేయాలన్నా వీల్లేని పరిస్థితి.

ఆఖరిసారిగా స్టేషనుకు బయలుదేరే ముందు కూడా చెప్పాను. ఆమె ఎలాంటి చిక్కుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో వివరించాను.

"నీదంతా వట్టి భ్రమ. అతను అలాంటి వాడేంకాదూ. అతన్ని గురించి నీకు పూర్తిగా తెలీదులే" అంది. ఆ మాట ఆమె మనఃస్ఫూర్తిగా అన్నదికాదు. అంత ధైర్యం వున్నది మాటిమాటికీ ఎందుకు కన్నీళ్ళు పెట్టుకున్నట్లు?

"దశావతారం మంచివాడే. కాదనను. కానీ పరిస్థితులకు జడిసి ఒకవేళ నిన్ను వదుల్చుకోవాలని ప్రయత్నిస్తే?"

"నువ్వేం భయపడక్కర్లేదు. నేను ఆత్మహత్యలాంటి యే అఘాయిత్యానికీ పూనుకోను. అంత పిరికిదాన్నేంకాను. ఇదేమిటి నువ్వు యివ్వాళ యింత విచిత్రంగా ఆలోచిస్తున్నావ్."

"ఏమీలేదుగానీ ఓ విషయం జ్ఞాపకం పెట్టుకుంటావా?"

"ఏమిటది?"

"ఒకవేళ అక్కడ నువ్వేమైనా చిక్కుల్లో పడితే ఇక్కడికి వచ్చేసెయ్యి. నేనున్నాను."

"ఎందుకూ? ఆశ్రయమిస్తావా?" అంది సావేరి నవ్వుతూ.

"కాదు. పెళ్ళి చేసుకుంటాను."

ఆశ్చర్యంగా చూసింది సావేరి.

"దశావతరం నిన్ను తిరస్కరించాలని నేను కోరుకోవడంలేదు. ఒకవేళ తిరస్కరించడమేగాని జరిగితే యిక్కడ నేనున్నాను మర్చిపోవద్దు."

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగానే అక్కడినించి కదిలి వెళ్ళిపోయింది.

రైలుకి టైమయ్యిందంటే వెళ్ళి టాంగా పట్టుకొచ్చాను. స్టేషనుకి వెళ్ళాం. దారి పొడుగునా, స్టేషన్లోనూ ముసలావిడ నా మంచితనాన్ని పొగుడుతూనే వుంది. సావేరి మాత్రం మాట్లాడకుండా మౌనంగా కిటికీలోంచి చూస్తూ ఆలోచిస్తూ వుండిపోయింది. బండి కదిలింది. వెళ్ళొస్తానన్నట్టు తలాడించింది సావేరి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దీనంగా కిటికీలోంచి చూస్తోంది.

"నేను చెప్పిన విషయం మర్చిపోవుకదూ. వచ్చేముందు ఉత్తరం రాయి, స్టేషనుకొస్తాను."

ఆమె యింకా అలాగే చూస్తోంది. అలా చూస్తూనే చూపునించి తప్పుకుని దాటిపోయింది.

ఇంటికొచ్చాను. నేనెంత వంటరివాడ్నో నాకిప్పుడు తెలిసొస్చ్చింది. నా చుట్టూ మహా సరస్సులాగా వంటరితనం, ఎటు కదలినా బురద బురదగా అంటుకుంటున్న జ్ఞాపకాలు. ఇల్లంతా నిశ్శబ్దంగా నిద్రపోతున్నట్టు వుంది. రాత్రంతా ఆలోచనలే. కంటిమీద రెప్పవాలలేదు.

పొద్దుట్నుంచి మళ్ళీ నా పని నేను చేసుకోవాలంటే బాధగానే వుంది. మొదట్లో నా పని నేను చేసుకునేవాడ్ని. సావేరి వచ్చి  ఇతరులమీద ఆధారపడడం నేర్పింది.

మళ్ళీ హోటలు తిండే గతయ్యిందినాకు. ఉన్న ఆ ఒక్కగానొక్క సౌతిండియన్ హోటల్‌నించి ఏం వస్తే అది తినక తప్పదుకదా. కేరియరు, అంతకు ముందు ఓ ముసల్ది తెస్తుండేది. సావేరీ వాళ్ళు వచ్చినప్పుడు మానిపించేశాను. ఇప్పుడు మళ్ళీ ఆమెనే తెమ్మన్నాను. ముసల్ది ఆశ్చర్యంగా చూసింది. వాళ్ళు వూరెళ్ళిపోయారని చెప్పాను. ఇంకా ఎంతమందికి సమాధానం చెప్పుకోవాలో? ఎంతమంది ఎదుట భంగపడాలో? మరింకెంతమంది అపహాస్యానికి గురికావాలో?

సావేరి వెళ్ళిన  మూడోరోజునించే ఉత్తరం గురించి ఎదురు చూస్తున్నాను. ఇంకా ఆశ యింకిపోలేదు. ఎక్కడో పల్చగా తడితడిగా నన్ను అంటిపెట్టుకునే వుంది. సావేరినించి నేను నేర్చుకున్న వాటిల్లో మరోటి నిరీక్షణ. చిన్నప్పుడు అర్థాలు నేర్చుకున్నాను. పెద్దయ్యాక నిరీక్షించడం నేర్చుకున్నాను.

శనివారం ఒకపూటే ఆఫీసు. ఇవ్వాళైనా యింటికొచ్చేసరికి సావేరిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చివుంటుందని హడావిడిగా ఆటోలో వచ్చాను. తలుపుతీస్తే లోపల ఏ ఉత్తరాలూ లేవు, మనియార్డరు రసీదు మాత్రం వుంది. ఇంటికి పంపిన మనియార్డరు తలూకు ఎక్‌నాలెడ్జిమెంట్ రసీదు అది.

కేరియర్ వస్తే భోంచేస్తున్నాను. ఇప్పుడిప్పుడే హోటల్ తిండి అలవాటవుతోంది. సావేరివాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత మూడురోజులవరకూ సరిగా భోజనమే చేయలేదు.

కేరియర్ ముసల్ది హడావుడిగా టెలిగ్రాం పట్టుకొచ్చింది. సావేరి దగ్గర్నుంచేనేమో. ఆ ఆతృతలో ఎంగిలి చెయ్యి కడుక్కున్నానో లేదో తెలీదు. సంతకం పెట్టి పోస్టుమేన్‌ను పంపించేసి టెలిగ్రాం విప్పాను.

అవును, సావేరి దగ్గర్నుంచే.

ముసల్ది ఆతృతగా చూస్తోంది. కాదు మరీ, టెలిగ్రాం అంటే ఎవరికైనా కంగారే.

పాపం ఆ ముసల్దాన్ని చూస్తే జాలేస్తోంది. బీదది. ఎవరూ లేరు. ఆమెతో ఎల్లుండినించి కేరియర్ తేవక్కర్లేదని చెప్పాలంటే నాకు నోరు రావడంలేదు.

# అందమైన జీవితం


## గొల్లపూడి మారుతీరావు

### (1974 ఆంధ్రజ్యోతిదీపావళి ప్రత్యేక సంచిక నుండి)

"**నీ ముక్కు** అంత పొడుగ్గా లేకపోతే తప్పకుండా నిన్ను పెళ్ళి చేసుకునేదాన్ని" అంది కమల ఇరవైయేళ్ళ క్రితం.

ఆ మాటకి కమలమీద కోపం రాలేదు నాకు నా ముక్కుమీద వచ్చింది. తరువాత చాలా సంవత్సరాలపాటు నా ముక్కుమీద ద్వేషం పెరుగుతూనే వుంది. జీవితంలో చాలా వాటితో రాజీ పడ్డానుకానీ, కమల తిరస్కారానికి కారణమయిన ఈ ముక్కుని మాత్రం క్షమించలేదు.

నిజానికి కమలవంటి అందకత్తెకి ఎవరినయినా తిరస్కరించే అధికారం వుంది. మత్తుగా నిద్రపోతున్న ప్రపంచం మీద ఉదయించిన సూర్యోదయంలాంటి ముఖం, కొండలోయల్లో మంచు తెరల్ని తట్టిలేపే వెలుగుతెరల్లాగ, గుండెలోతుల్లో కోరికల్ని తట్టి పలకరించే చిరునవ్వు ప్రపంచాన్ని జయించిన సామ్రాజ్ఞి చివరి తిరస్కారంలాగ, ఠీవిగా కదలాడే కళ్ళూ యివే కమలకి ఆ అధికారాన్ని యిచ్చాయనుకుంటాను.




నేనేకాదు తనను చూడవచ్చిన పెళ్ళికొడుకు ముఖం మీదే "జుత్తేమిటి పొట్టేలులాగ" అంటే అందరూ ఏడుపు ముఖం పెట్టినా అతను చిరునవ్వు నవ్వుతూనే వున్నాడు.

"దానికేం? అవసరమయితే మార్చుకోవచ్చు" అని ఆమెకి వినబడేలాగు అన్నాడేకాని ఆ అవసరాన్ని అతనికి కల్పించలేదు కమల.

ఇంటర్మీడియట్ రోజుల్లో కాలేజీ కుర్రాళ్ళకి ఆమె కొంటెతనం ఆటవస్తువయింది. వాళ్ళ అల్లరి పనులన్నింటినీ హర్షిస్తూ, వీలయితే ప్రోత్సహించేది. ఐతే చివరికి వాళ్ళ అల్లరికి తన ఆరంగుళాల జడే బలి అయిపోయిందనీ, ఓ చీకటి సాయంకాలం ఎవరో అబ్బాయిలు ఆమె చెయ్యిపట్టుకు లాగి ఒక గజం మేర కొంగును కత్తిరించారనీ, మర్నాడు చాలామంది కుర్రాళ్ళ జేబుల్లో ఆ ప్యాకెట్ రుమాళ్ళే కనిపించాయనీ వాళ్ళ నాన్నగారు తెలుసుకున్నాక చదువు మానిపించేశారు. అందుకు విచారించలేదు కమల. విచారిస్తే కమల ఎందుకవుతుంది?

ఇంటిదగ్గర తీరిగ్గా గడపవలసిన రోజుల్లోనే మా యిద్దరి బాంధవ్యం పెరిగింది. అంత అందమైన అమ్మాయి కోరే ఏ సహాయమయినా చిటికెలో చేసేవాడిని. మధ్యాహ్నం అందరి భోజనాలూ అయాక యిద్దరం ఎప్పుడేనా బజారుకి వెళ్ళేవాళ్ళం. సాయంకాలం తరుచు బీచ్‌కి వెళ్ళేవాళ్ళం. విసురుగా ముఖానికి కొట్టుకునే గాలిని ఎదిరిస్తూ చికిలించే కమల కళ్ళు చిలిపిగా ఏవో రహస్యాల్ని చెప్తున్నట్టుండేవి. మసకచీకటి పడేవేళ నా చెయ్యి పుచ్చుకుని ముందుకు వచ్చిపోయే కెరటాలతో ఆటలాడడం యిప్పటికీ అందమైన కలలాగ గుర్తుకొస్తుంది. ఆమె అందాన్ని చూసి చుట్టూ ముసురుకునే కుర్రాళ్ళని చూసి భయంగా పారిపోయేది కాదు. చిరునవ్వులతో తిరస్కారాన్నో, కంటి ఎరుపులో నిర్లక్ష్యాన్నో ప్రదర్శించి నా చెయ్యి పుచ్చుకుని వాళ్ళ మధ్యనుంచే పరివారం ఎదుట నడిచి వెళ్ళిన సామ్రాజ్ఞిలాగ నడిచిపోయేది. అప్పట్లో ఆ ఠీవి దర్పం చూసి ముగ్ధుడినయి ఆమెతో నడిచేవాడిని.

తన అందంలో గొప్పతనం తెలుసు. అది వాళ్ళని ఎట్లా కట్టిపడేస్తోంది తెలుసు. మల్లెపువ్వుల్లో కనిపించే అమాయకమయిన అందం కాదది. త్రాచుపాములో ద్యోతకమయే ఠీవయిన అందం. కమల అందంలో గడుసుతనం ఉంది. గర్వం ఉంది, ఠీవి ఉంది, తిరుగుబాటు ఉంది.

ఒకేసారి ఒకే ఒక్కసారి బీచ్ నుంచి వచ్చేటప్పుడు సంధ్య వెలుగులో ఒక మాట అన్న జ్ఞాపకం.

"నువ్వు చాలా అందంగా వుంటావు కమలా."

అలా ఎప్పుడూ పిలవలేదు ఆమెకి. అలాంటి మాట ఆమెముందు ఎప్పుడూ అనలేదు. నా గొంతులో వొణుకు కనిపెట్టిందిగావును. దిమ్మెరపోయి ఒక క్షణం ఆగిపోయింది.అలాంటి విషయం ఇంతవరకు ఎవరూ చెప్పలేదేమో? అది చెప్పడం ఆమె కిష్టమేమో?

ఒక్కసారి వంగి రెండు చేతుల్లో ముఖాన్ని తీసుకుని ముద్దుపెట్టుకుంది. ఆ తియ్యటి ఊపిరి నాకెంతో యిష్టమయిన కితకితలు పెట్టే ఆ నల్లటి జుట్టు నాకిష్టం. నవ్వినప్పుడు కుడిచివర బయటుకి తొంగిచూసే సన్నటి పంటి నొక్కు చాలా యిష్టం.

ఆ క్షణంలో కమల నాపట్ల కళ్లలో ప్రదర్శించిన దయా, సానుభూతీ యివాళ్టికీ గుర్తున్నాయి.

సానుభూతి ఎందుకని ?

చెప్పడం మరిచాను. అప్పుడు నా వయస్సు పదేళ్ళు. కమల్ అనాకంటే మరో పదేళ్ళు పెద్ద.

పెళ్ళంటే సరిగ్గా అర్థం తెలీని ఆ వయస్సులో ఓ సాయంకాలం తెల్లటి పొడవాటి మనిషి కమలని చూడ్డానికి రావడం, ఆమెవేపు చూసి చిరునవ్వు నవ్వడం, మొదటిసారిగా కమల కళ్ళల్లో తృప్తి ప్రశంసా కనిపించడం, నేను కష్టపడి కొని తెచ్చిన పువ్వులూ, పళ్ళూ అతనితో వచ్చిన వాళ్ళందరికీ కమల పంచడం ఆ తరువాత రెండురోజులపాటు ఆ

పొడవాటి మనిషి గురించే కమల మాట్లాడుతూండడం యివన్నీ నాకు నచ్చలేదు. ఇన్నాళ్ళకి నేనేదో వస్తువు పోగొట్టుకున్నట్టూ, ఆటలో ఓడిపోయినట్టూ నిరుత్సాహంగా తిరిగాను.

ఆ రోజుల్లో రాఘవేంద్రరావుని గుర్తు తెచ్చుకుంటే నామట్టుకు నాకే ఆశ్చర్యం వేస్తుంది. పాలరాయిలాగ తెల్లటి నునుపయిన శరీరం, విశాలమైన నుదురూ, నవ్వితే పెదాల్లో అందమైన వంపూ, మాట్లాడితే ఆడవాళ్ళ గొంతులో కనిపించే లాలిత్యం, నెమ్మదీ చాలా అందమైన వాడనిపిస్తుంది. డార్జిలింగ్ ప్రాంతాల్లో జియాలజిస్టుగా పనిచేస్తున్నాడు. సెలవుల్లో వచ్చినప్పుడు ఎవరో అమ్మాయి వుందంటే చూడడానికి వచ్చాడు.

మరి నెలరోజులకి తెలిసింది. వాళ్ళిద్దరికీ పెళ్ళవుతుందని.

"పెళ్ళంటే?" అమ్మని అడిగాను.

అమ్మ నవ్వి "మరి నాలుగైదు నెలల్లో కమల ఆ అబ్బాయితో వాళ్ళ ఊరికి వెళ్ళిపోతుంది" అంది.

గుండె గొంతులో కదిలింది నాకు. అన్నం సహించలేదు. కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. భోజనం కాగానే కమలావాళ్ళింటికి పరిగెత్తుకు వెళ్ళాను. రెండు జడలూ ముందేసుకుని ఏదో చదువుకుంటోంది కమల.

నన్ను చూసి "ఏం బాబీ?" అంది.

"నువ్వు మొన్న వచ్చిన ఆ పొడవాటి ఆయనతో వెళ్ళిపోతావా?" అన్నాను దుఃఖాన్ని దాచుకోకుండా.

ఒక క్షణం ఆశ్చర్యంగా చూసి "అవును బాబీ" అంది. నా బిక్క మొహం చూసి అంతలో నవ్వేసింది. అమ్మ కళ్ళలో కనిపించే దయ అప్పుడు నాకు కమల కళ్ళలో కనిపించింది. కాని ఆ కళ్ళు అల్లరికీ, చిలిపితనానికీ అలవాటుపడ్డాయి. ఈ రెండు రోజుల్లోనే కమల పెద్దదైపోయినట్టనిపించింది. ఇప్పుడు గెంతడం లేదు. పాటలు పాడడం లేదు. ఈ పెద్దరికం నాకు నచ్చలేదు. హఠాత్తుగా చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోయినట్టనిపించింది.

ఆ తర్వాత చాలారోజులు నిశ్శబ్దంగా గడిపాను. మధ్య మధ్య అమ్మని అడిగేవాడిని “కమల నన్ను పెళ్ళిచేసుకుంటే మన ఇంటికి వచ్చేస్తుందా?" అని. అమ్మ నవ్వింది. మరి ఒకటి రెండుసార్లు అలా అడిగితే నవ్వి "తప్పు. అలా అనకూడదు" అని బుగ్గమీద వేలితో ఒకటి వేసింది.

ఇందులో తప్పేముంది? కమల నవ్వితే నాకిష్టం. పాడితే నాకిష్టం. ఏ సహాయమైనా చేశాక "చాలా బాగా చేశావురా బాబీ" అనే పొగడ్తకి ప్రలోభపడేవాడిని. కమలకి ఏ పువ్వులు ఇష్టమో తెలుసు. ఏ చీరలో అందంగా కనిపిస్తుందో తెలుసు. మరి ఇంత చనువు ఏం కాను?

ఇక ఆగలేక పెళ్ళికి రెండువారాలుందనగానే ఒకరోజు కమల తలస్నానం చేసి డాబామీద జుత్తు ఆరబెట్టుకునే సమయంలో అడిగేశాను.

"నన్ను పెళ్ళిచేసుకోవూ?" అని.

ఆ ప్రశ్నకు ఒక్క క్షణం నిర్ఘాంతపోయింది. కాస్సేపు ఆలోచించి "చేసుకునేదాన్నే బాబీ నీ ముక్కు అంత పొడుగుగా లేకపోతే తప్పక నిన్ను చేసుకునేదాన్ని" అంది.

ఆ మాట చెప్తున్నప్పుడు నిజంగా ఆమె కళ్ళల్లో నీళ్ళు చూశానో లేక ఊహించుకున్నానో గుర్తులేదు. కాని ఎప్పుడు అద్దం చూసినా కమల కళ్ళు గుర్తుకొస్తాయి.

పెళ్ళిలో ఎంత తృప్తితో, భక్తితో వరుని పక్క ఒదిగిపోయిన ఓ బంగారు బొమ్మ యిప్పటికీ గుర్తే. వాళ్ళిద్దరి అందం, అన్యోన్యతా చూసి ఆశ్చర్యపోయాను క్షణకాలం.

గొప్ప అందగాడిని చేసుకోవాలనే అపూర్వ లక్ష్యం సిద్ధించిన తృప్తీ, గర్వం ఆ క్షణంలో ఆ అగ్ని హోత్రం వెనుక గమనించాను.

పెళ్ళయిన నెలలోనే రాఘవేంద్రరావుతో డార్జిలింగ్‌కి వెళ్ళిపోయింది కమల. ఆమె తల్లీతండ్రేకాదు స్థంభం చాటున నిలబడి కళ్ళు తుడుచుకుంటున్న నన్నూ గమనిస్తూనే వుంది కమల. ఆమె కార్చిన కన్నీళ్ళలో ఒక బొట్టయినా నామీద జాలితో అయివుంటుందని నా నమ్మకం.

వాళ్ళ ఇంటికి రాసిన ఉత్తరంలో ఎప్పుడయినా నన్ను గుర్తు చేసుకుంటే చేసుకునేది. లేకపోతే లేదు. ఆ వయస్సులో కమల జ్ఞాపకాలు మరుగునపడడానికి పెద్ద వ్యవధి అవసరం లేకపోయింది. ఉన్న ఊళ్ళో చదువు బాగులేదని నాన్నగారు నన్ను మద్రాసులో చేర్పించారు. శెలవులకి యింటికి వచ్చినప్పుడెప్పుడేనా అటువేపు వెళ్తే కమల వచ్చి వెళ్ళిపోయిందనో, ఆ సంవత్సరం రాదనో తెలిసేది.

వయస్సుతో పాటూ ఆలోచనలు అభిప్రాయాలూ స్తిమిత పడ్డాయి.

అలా ప్రతిసారీ వాకబు చేయడంలోనూ ఏదో ఇబ్బంది, వెగటూ తోచింది. తర్వాత ఆ పనీ మానుకున్నాను. చెట్టుకు పువ్వు తెగిన చోటు కన్నీరు కార్చిన గుర్తులాగా చిన్నప్పటి కమల జ్ఞాపకం మిగిలిపోయింది.

దాదాపు పదేళ్ళు గడిచిపోయాయి. బి.ఏ పరీక్షలు వ్రాసేశాక ఇళ్ళకు పోయేముందు ఓ పదిమంది విద్యార్థులం తిరుపతి వెళ్ళి అక్కడినుంచి చెదిరిపోదామనుకున్నాం. ప్రయాణం చాలా హుషారుగా సాగింది. కొండమీదకి బస్సులో వెళ్ళడానికి ఎవ్వరూ అంగీకరించలేదు. అందుకని ఆడుతూ పాడుతూ మెట్లు ఎక్కడం ప్రారంభించాం.

***యౌవనంలో "భక్తి" అన్నది భగవంతుణ్ణి చూసినప్పుడు మాత్రమే జ్ఞాపకం వచ్చే ఆలోచన అనుకుంటాను.*** ఎందుకంటే మిగతా యాత్రంతా వినోదంగా, విచ్చలవిడిగా సాగింది. ఆలయానికి కనుచూపు మేరలో ఆగిపోయిన కారు పక్కన నిలబడ్డ పంజాబీ అమ్మాయిని చూడగానే మాలో కొంతమంది ఆగిపోయారు. వెంటనే నవ్వులూ కేరింతలూ సాగాయి.

ఆ అమ్మాయి కారు నీడపడే చోటు అటువేపు తిరిగి కూచుంది. ఉదారంగు దుస్తుల్లో అప్పుడే ఈ ప్రపంచంలో కళ్ళు తెరిచిన గడ్డిపువ్వులాగా కనిపించింది. గాలికి మీద వున్న వల్లెవాటు రెపరెపలాడుతోంది. మా అల్లరికి యిటు తిరిగితే నల్లటి కళ్ళద్దాలు, విశాలమయిన ముఖం తెలిసింది. నల్లద్దాల వెనుక కళ్ళు ఏ భాష మాట్లాడుతున్నాయో తెలియదు కానీ, మమ్మల్ని చూడగానే సన్నటి మొక్క మీద తుమ్మెదవాలిన అలసటలాగా నీరసించినట్టు కారు అంచుమీద కూర్చుండిపోయింది. పెదవులు నవ్వుకి తెరుచుకున్నాయి. ఇటు తిరగబోతున్న నన్ను "బాబీ" అనే పలకరింత ఉలికిపడేటట్టు చేసింది.

ఆ అమ్మాయే పిలిచిందని గుర్తుపట్టడానికి కొంతసేపు పట్టింది. నా పక్కన మిత్రులంతా తెల్లపోయారు "తెలిసిన అమ్మాయేనట్రా – సారీ" అని చెవిలో ఊదారు.

ఇప్పుడు నల్ల కళ్ళద్దాలు తీసేసింది ఆ అమ్మాయి. వెంటనే కమలని గుర్తుపట్టాను. నిర్ఘాంతపోయాను.

"ఇదేమిటి? నువ్విక్కడ?" అన్నాను విస్తుపోతూ.

నవ్వింది. "ఆయనా నేనూ యాత్రలకి బయలుదేరాం. కారు చెడిపోయింది. ఎవరినో తీసుకొస్తానని వెళ్ళారు" ఒక్క క్షణం ఆగి "ఆడపిల్లలని ఏడిపించినప్పుడెప్పుడైనా నేను జ్ఞాపకమొస్తానా బాబీ?" అంది.

నా ముఖం ఎర్రబడింది. "నువ్వని తెలీదు. ఏమీ అనుకోకు వాళ్ళూ బాధపడుతున్నారు."

"కానీ నాకేం బాధలేదు. మీ నవ్వులు వింటూంటే మళ్ళీ పదేళ్ళు చిన్నదాన్నయినట్టనిపించింది" అంది గాలిలో తల తిప్పి.

కమలకి ఈ వేషం నప్పలేదు. బాగా ఒళ్ళుచేసినట్టు కనిపించింది. లేక శరీరానికి అతుక్కుపోయిన దుస్తుల్లో అలా కనిపిస్తోందో. ఇంకా నిండుగా చీరకట్టుకున్న రెండు జడల అమ్మాయే గుర్తునాకు. ***చూపాలనుకున్న అందాన్ని దాచడంలోనే గొప్పతనం వుందని మనదేశంలో స్త్రీలూ, కవులూ ఒక్కసారే గ్రహించారు. అందుకే మన సాహిత్యానికీ, సౌశీల్యానికీ అంత రాణింపు.*** కాని ఈ బట్టబయులు కాస్త వెగటుగా, చికాకుగా వుంది.

"ఏం చూస్తున్నావ్? వొళ్ళు చేశాను కదూ? అవును, ఇంకేం చెయ్యాలో తెలీక" అంది పకాలున నవ్వి.

నా ఆలోచనలని గ్రహించినట్టుంది. వల్లెవాటు నడుముకి బిగించి "ఈ బట్టలంటే ఆయనకిష్టం. ఆయనతో టూరు వెళ్ళడం నేనూ అలవాటు చేసుకున్నాను" అంది.

ఆ 'ఆయన' గురించి చెప్పినట్టు మాటల్లో ఆప్యాయత కంటె అధికారం, భయం కనిపించింది. ఆశ్చర్యంగా గమనిస్తూంటే

"ఏమిటలా పిరికిగా చూస్తావ్? చిన్నప్పుడు మనిద్దరం స్నేహితులం. ఎప్పుడూ నా కొంగు పట్టుకు తిరిగేవాడివి నువ్వు" అంది.

"ఇప్పుడు కొంగే లేదుగా? నువ్వూ మారిపోయావు" అన్నాను.

అంతలో ఆలోచనలోపడి "అవును మారిపోయాను" అంది. ఈ అలంకారాలు తనకిష్టంలేనట్టుంది. అంతలో ఆలోచనలు మరిచిపోవడానికి ప్రయత్నించి "ఈసారి సెలవులకి యింటికి వస్తావా? ఎప్పుడొచ్చినా నువ్వు లేవనే మీ అమ్మ చెపుతుంది. నీతో చాలా మాట్లాడాలి."

"ఇప్పుడు మాట్లాడు. మీరెక్కడ దిగారో చెపితే కొండదిగగానే వస్తాను."

"నువ్వా? అమ్మో వద్దు. వీలయితే ఆయన్నే తీసుకుని మీ దగ్గరికి వస్తాను" అని మా అడ్రస్సు తీసుకుంది.

ఇద్దరికీ ఏవో మాట్లాడాలనివుంది. కాని మాట్లాడలేకపోతున్న సంగతి యిద్దరికీ అర్థమవుతోంది. నా విషయంలో అందుకు కారణం వయస్సని తెలుస్తోంది. మరి కమల మాట్లాడలేకపోవడానికి కారణం? ముఖం మీద కనిపించేదంతా నవ్వూ, తృప్తి  ఆనందం కాదని గుర్తు తెలిసిపోయింది.

ఆలోచనల్ని పసిగట్టినట్టుంది "ఇంక వెళ్ళు మీ మిత్రులు ఎదురుచూస్తున్నారు" అంది.

నేను వెనక్కి తిరగబోతే అంతలో గుర్తువొచ్చినట్టు

"అన్నట్టు, పెళ్ళెప్పుడు? సంబంధాలు ఏవో వస్తున్నట్టు అమ్మ చెప్పింది. పెద్దలు చూసిన పిల్లని పెళ్ళిచేసుకుంటావా? లేక ఎవరినయినా ప్రేమించావా?" అంది నవ్వుతూ. మాటలు కూడదీసుకుని అన్నాను.

"నా ముక్కుని అంగీకరించే అమ్మాయి దొరికే వరకూ ఆగాలి."

నవ్వింది. "నీ ముక్కుకేం? నువ్వు అందంగానే వున్నావు" అంది.

ఆశ్చర్యమేసింది నాకు.

ఈ పదేళ్ళలో 'అందం' మీద ఆమె అభిప్రాయం ఎంత మారిందా అని విస్తుపోయాను. ఇప్పుడు రాఘవేంద్రరావు ఎలా వున్నాడో చూడాలనిపించింది. ఆ సాయంకాలం భర్తని వెంటపెట్టుకుని మా గదికి వస్తుందేమోనని ఎదురు చూశాను. కానీ ఆమె రాలేదు. ఆ తర్వాత మరి ఆరేళ్ళవరకూ ఆమెను చూడడం పడలేదు.

ఈ ఆరేళ్ళలో రెండు విచిత్రమయిన మార్పులు జరిగిపోయాయి జీవితంలో. పదిహేనేళ్ళు చదివిన చదువు వల్లకాక అయిదేళ్ళుగా పెంచుకున్న అభిరుచివల్ల ఉద్యోగం దొరకడం మనస్సులో అందమైన భార్య కావాలని రూపుదిద్దు కుంటున్న కలని మరిచిపోయి హఠాత్తుగా ఓ అమ్మాయి మెడలో మూడు ముళ్ళూ వేయడం.

జీవితానికి పరిస్థితులతో రాజీ తప్పదని చదువూ, ఉద్యోగం ద్వారా గ్రహించాక, వివాహం విషయంలో అటువంటి రాజీయే పడడానికి పూనుకునేసరికి అబ్బాయి వర్ణాంతర వివాహం చేసుకోబోతున్నాడని నాన్నగారు ఓ రోజు పరిగెత్తుకొచ్చి కోప్పడి, ఏడ్చి, వద్దని ఒప్పించి మరి రెండు నెలలకి ఓ అమ్మాయిని చూపించి ఈమెతో బ్రతకాలని గుర్తు చేశారు.

నవ్వొచ్చింది. పళ్ళు ఊడకొట్టుకోడానికి నేను చూసుకున్న రాయి కాదని మరొకరాయి చూపించారు. అంతే తేడా. అప్పటికే ఆశాభంగాలు చాలా గొప్ప సెన్సాఫ్ హ్యూమర్‌ని ఏర్పరచాయి. మరో నెలలో పెళ్ళయిపోయింది. అదృష్టవశాత్తూ సీత మంచి పిల్ల. అయితే అందమయినది కాదు. అది కూడా అదృష్టవశాత్తూనేమో?

మరో ఏడాదికి ఉద్యోగరీత్యా ఢిల్లీ ట్రయినింగ్‌కు వెళ్ళవలసిన అవసరం వచ్చినప్పుడు అమ్మ గుర్తు చేసింది. కమలావాళ్ళు ప్రస్తుతం ఢిల్లీలోనే వుంటున్నారని "ఉత్తరం రాయి ఆ పదిరోజులూ వాళ్ళింట్లో ఉండొచ్చు" అంది. వెంటనే వ్రాశాను. తిరుగు టపాలోనే సమాధానం వచ్చంది. కమలే స్వయంగా వ్రాసింది. "తప్పకుండా రా. కాని ఒక్క షరతు. నీతోపాటు మీ ఆవిడనీ తీసుకురావాలి". ఉత్తరం చూడగానే మా ఆవిడ పట్టుపట్టి కూర్చుంది. ***ఆడవాళ్ళకి ఆలోచనా, మగవాళ్ళకి అవకాశం వస్తే ఇక ఆ పనికి విరమించడం అంటూ ఉండదు.*** తప్పనిసరిగా యిద్దరం బయలుదేరాం.

మా ఆవిడని చూడగానే ఆప్యాయంగా రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుని పలకరించింది కమల.

"ఆయన స్నానం చేస్తున్నారు రండి" అని సామాన్లు అందుకుంది. ఒక క్షణంలో ఇద్దరికీ కాఫీ అందించింది. నా పక్కకి వచ్చి "మంచి పిల్లనే చేసుకున్నావే దొంగా" అంది సీత వినకుండా. నాకంతా ఉక్కిరి బిక్కిరిగా ఉంది.

మరో క్షణంలో రాఘవేంద్రరావు వచ్చాడు. ఆయన్ని చూసి పదహారేళ్ళయింది. వెంటనే పోల్చుకోలేకపోయాను. జుత్తు దాదాపు ఊడి బట్టతల అయిపోయింది. పెదవులు మరీ దళసరిగా కనిపిస్తున్నాయి.

అన్నిటికన్నా కళ్ళు ఎర్రగా తెలుస్తున్నాయి.

నన్నూ అతను పోల్చుకోలేకపోయాడు.

"బాబీ అండీ మన పెళ్ళికి పదేళ్ళవాడు" అని మా ఆవిడవేపు తిరిగి "మీ ఆయన చాలా గడుసువాడమ్మా. ఆ రోజుల్లోనే నన్ను పెళ్ళి చేసుకోమని వెంటబడేవాడు" గుక్క తిప్పుకోకుండా నవ్వింది.

సీత సిగ్గుపడింది. నా ముఖం ఎర్రనయింది. రాఘవేంద్రరావుకి ఈ పరిహాసం నచ్చనట్టుంది "నాకు ఆఫీసు వేళయింది" అని నా వేపు తిరిగి "రెస్ట్ తీసుకోండి. రాత్రి మాట్లాడుదాం" అని గదిలోకి వెళ్ళిపోయాడు. ఇంత నవ్వుతున్న కమల పిల్లి అయిపోయింది. మాష్టారి పేము బెత్తం రుచి తెలిసిన విద్యార్థిలాగా అతని వెనక గదిలోకి నడిచింది. అతను వెళ్ళేవరకూ మళ్ళీ మా వేపు చూడలేదు. మేం మా సామాన్ల గొడవలో పడ్డాం.

మేం వచ్చినందుకు తెచ్చిపెట్టుకున్న ఉత్సాహం తప్పిస్తే, నిత్యజీవితంలో అది లోపించినట్టు ఆ క్షణంలో పసిగట్టాను. కమలకేం వయస్సు మించిపోలేదు. కాని జీవిత భారాన్ని మోసిన అలసట కళ్లకింద నీడల్లో తెలిశాయి. మనిషి నీరసించింది. గాలిపోయిన బెలూనులో మడతల్లాంటివి ముఖం మీద అక్కడక్కడా కనిపించాయి. ఇల్లు చాలా విశాలంగా, చాలా శుభ్రంగా వుంది. కానీ ఎక్కడా పిల్లల అలికిడి లేదు. కమల జీవితంలోనూ, మనస్సులోనూ ఒంటరేనేమో? మేం

రావడం ఆవిడకి పెద్ద మార్పులాగా వుంది. మాతోపాటు అన్ని చోట్లకీ వచ్చింది. హుషారుగా అన్నీ చూసింది. అప్పుడు నాకో విషయం అర్థమయింది. మూడేళ్ళయి అక్కడ ఉంటున్నా ఒక్కసారీ ఇవేవి ఆమె చూడలేదని. ఆశ్చర్యం కలిగింది.

ట్రయినింగ్ మరి నాలుగు రోజులకయిపోతుందనగా మధ్య ఆదివారం వచ్చింది. ఆ రోజు తాజ్‌మహల్ చూడాలని అనుకున్నాం. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఏర్పాట్లు చేస్తోంది కమల.

"మీ ఆయన్నీ రమ్మను" అన్నాను.

చెంపపెట్టు తగిలినట్టు తుళ్ళిపడి, అంతలో నవ్వి "ఆయనకి తీరిక ఉండదు, పోనిద్దూ" అంది ముఖం తప్పించుకుని.

బాగుండదని బయలుదేరే ముందురాత్రి నేనే అడిగాను "మీరూ రాకూడదా?" అని.

"నేనూ అంటే కమల వస్తుందా?" అన్నాడు.

ప్రశ్నకి బిత్తరపోయాను.

అంతలో నవ్వి "తాజ్‌మహల్ చరిత్రకి ఒక గుర్తు. నాకేమీ కాదు. నేను కళాకారుడిని కాను. ఐయామ్ నాట్ ఇంట్రెస్టెడ్" అన్నాడు.

ఏ విషయం మీదయినా ఖండితమైన అభిప్రాయాలు కలవాడిగా, తన అభిప్రాయాన్ని ఖండించే హక్కు ఎవరికీ లేదన్నట్టుగా అతనికి విశ్వాసం ఉన్నట్టు ఆ మాటల్లో గ్రహించాను.

విచిత్రం తెల్లవారు ఝామున లేస్తూనే తను రావడంలేదని చెప్పేసింది కమల. మేమిద్దరం నిర్ఘాంతపోయాం.

"అదేం? అంతలో నీ మనస్సు మారిపోయిందేం" అన్నాను నేను ఆశ్చర్యంగా.

జవాబుగా సీత ముఖం చూసి నవ్వింది కమల.

"నీకేం తెలుస్తుంది బాబూ. నువ్వు మగాడివి. ఆ ప్రశ్న మీ ఆవిడ అడిగిందేమో చూడు" అంది.

"నేను చూడకపోతే ఏం మునిగిపోతుంది. వెళ్ళిరండి" అంది మళ్ళీ.

ఇంత జరిగాక వెళ్ళడంలో ఉత్సాహం చచ్చిపోయినా బయలుదేరాం.

రాత్రికి తిరిగి వచ్చేసరికి పన్నెండు దాటింది. మా పిలుపు వినీవినడంతో కాచుకు కూచున్నట్టు తలుపు తీసింది కమల. మేం లోపలికి రాగానే "ఇష్ నెమ్మదిగా. ఆయన పడుకున్నారు" అని మెల్లిగా మా గదివేపు నడిచింది చెయ్యిపుచ్చుకుని. ఆ గొంతులో భర్తపట్ల భయం, విశ్వాసం చూసి ఆశ్చర్యమేసింది.

అంతా చీకటి

"ప్రయాణం బాగా జరిగిందా?" అంది రహస్యంగా.

"ఊ" అన్నాను.

"పడుకోండి. ఉదయం మాట్లాడుకుందాం" అంది వెనక్కి తిరుగుతూ.

ఆమెలో ఏదో లోపాన్ని హఠాత్తుగా పసిగట్టాను. పొద్దుటి వ్యక్తికీ ఇప్పటి వ్యక్తికీ తేడా కనిపించింది. నిద్రరాక అటూ యిటూ దొర్లుతూంటే బాత్‌రూంలో లైటు వెలిగింది. అప్పటికే సీత వొళ్ళు మరిచి నిద్రపోతోంది. ఎవరిదో ఏడుపూ, బరువుగా ఊపిరీ తెలిసింది.

మెల్లిగా లేచి గది బయటికి వచ్చాను. బాత్‌రూంలోని దీపం చారలో కమలని గుర్తుపట్టాను.

"కమలా!" అన్నాను భయభ్రాంతుడ్నయి.

ఆ కేకకి తలమీద పిడుగు పడ్డట్టయి ఒక్కసారివచ్చి నా నోరు మూసింది. "మెల్లగా మాట్లాడు. ఆయన వొళ్ళు మరిచి నిద్రపోతున్నారు. నువ్వు ఇప్పుడు లేచావేం?" అంది గొంతు మామూలుగా ఉంచాలని ప్రయత్నిస్తూ.

"ఏమిటిది. నుదుటికి రక్తమేమిటి?" అన్నాను.

ఎంతోసేపు మాట్లాడలేదు కమల. "ఎంత బ్రాందీ సీసాలయితే మాత్రం అంత గట్టివి ఎందుకు బాబూ?" అంది.

ఒళ్ళు జలదరించింది నాకు.

"తాగాడా? సీసాతో కొట్టాడా?"

నవ్వింది. "ఏం? కొట్టడానికి అధికారంలేదా భర్తకి ?"

తెల్లబోయాను. "ఎందుకూ?"

"కారణం ఏ ఆడదీ చెప్పదు బాబీ. నువ్వడగకూడదు. ఇప్పుడు లేచావు, లేకపోతే నీకూ దొరికేదాన్ని కాదు. ఎవరితో అనకేం?" అని చెయ్యిపట్టుకుంది.

"చఛ" అన్నాను.

ఆలోచించినకొద్దీ రాఘవేంద్రరావుమీద కసీ, కమల పరిస్థితి మీద జాలీ పెనవేసుకున్నాయి. నేనాలోచిస్తున్నానని కనిపెట్టింది గావును అంది "నువ్వూ మీ ఆవిణ్ణి కొడతావా?"

ఉదాసీనంగా అన్నాను. "నాకు అందం లేదుగా? పెళ్ళాన్ని కొట్టే అర్హతలేదు."

ఆ మాట చెళ్ళున తగిలినట్టుంది. చీకట్లో నిర్ఘాంతపోయి చూసింది.

బయలుదేరేముందు కొత్త చీరతో సీతని సత్కరించింది.

"త్వరగా అబ్బాయిని ఎత్తుకోవాలి సుమా" అని చెవిలో మెల్లిగా అంది. ఆ మాటలో ఎదుటి వ్యక్తికి ఆదేశంకన్నా, తన పరిస్థితిపట్ల అసంతృప్తి తోచి జాలేసింది నాకు.

గుమ్మం దిగబోతూంటే చిన్నపిల్లాడ్నిలాగా వెనక్కి లాగి "మంచిపిల్ల. జాగ్రత్తగా చూసుకో" అంది.

అనుకోకుండా అన్నాను. "మంచిదయితేనేం? అందగత్తెకాదు."

చ(రున కోపం తెచ్చుకొంది. "ఆమె అందానికేం? చిలకలాంటి పిల్ల"

నవ్వు రాలేదు నాకు. "అందం"లో రాజీకి కమల మరో మెట్టు దిగి వచ్చినందుకు ఆశ్చర్యమేసింది.

నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ హైదరాబాదులో ఓ స్నేహితుడి పెళ్ళిలో తటస్థపడింది కమల.

నలుగురితో కబుర్లు చెప్పుకుంటూ పెళ్ళి పందిట్లో ఓ మూల చేరిన నన్ను వెదుక్కుంటూ ఓ కుర్రాడు వచ్చాడు. "బాబీ మీరేనా?" అంటూ.

తలూపాను.

"అయితే ఒకావిడ మీతో మాట్లాడాలంటోంది. బయట గేటు దగ్గర నిలబడింది."

నేనాశ్చర్యపోయాను. దగ్గర్లోనే కూర్చున్న మా ఆవిడకి ఆ మాటలు వినిపించినట్లున్నాయి. అప్పుడే అనుమానంతో నావేపు చూస్తోంది.

లేచాను. గేటుని ఆనుకుని కమల నిలబడివుంది. నేనాశ్చర్య పడడం చూసి "ఏం? వింతగా వుందా? నిన్ను చూసి నేనూ ఆశ్చర్యపోయాను" అంది.

"పెళ్ళికొడుకు తండ్రీ, మా ఆయనా ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. మూడేళ్ళయింది వచ్చి. నువ్వెందుకొచ్చావిక్కడికి?

మనిషిలో ఇదివరకటి ఉత్సాహం లేదు. కానీ ఇదివరకటి ఆప్యాయత ఏమాత్రం తగ్గలేదు. పెద్దమనిషిలాగా, నిండుగా, ప్రేమగా, నిలకడగా మాట్లాడడం అలవాటయింది. ఇది వరకటికంటే బాగా చిక్కింది. కణతల దగ్గర జుత్తు తెల్లబడుతోంది. నేను సూటిగా గమనించడం చూసి

"ఇక్కడే నన్నలా చూస్తు నిలబడితే ఎవరయినా ఏమయినా అనుకుంటారు. మీ ఆవిడని తీసుకుని మా ఇంటికి రాకూడదూ ఒక్కసారి?" అంది.

ఇంటి గుర్తులు చెప్పింది. "రా. చాలా విచిత్రాలు చూపిస్తాను. ఇంక వెళ్ళాలి. అబ్బాయిలేచి ఏడుస్తాడు" నా కళ్ళలో ఆశ్చర్యాన్ని గమనించి నవ్వేసి "అన్నట్టు మావాడిని చూడలేదు కదూ నువ్వు? చూద్దువుగాని" అంది రెండుచేతుల్తో బర్మాముడిలో గులాబిని సరిచేసుకుంటూ.

నా చెయ్యి పట్టుకుని బీచ్‌కి ఆడుతూపాడుతూ నడిచే కమలకీ, నిండయిన పరిపూర్ణత సాధించిన ఈ మాతృమూర్తికీ పోలికలు వెదక ప్రయత్నించేలోగా వెళ్ళిపోయింది. నడిచిపోతూంటే చూస్తూ మనిషిలో ఇంకా ఠీవి పోలేదనుకున్నాను.

మరో ఆదివారం తీరిక చేసుకుని నేనూ మా ఆవిడా కమల ఇంటికి వెళ్ళాం.

ముందు వసారాలో కూర్చున్న వ్యక్తినిగానీ, అతని ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ కుర్రాణ్ణికానీ పోల్చుకోలేకపోయాను. కమల లోపల్నుంచి వచ్చి భర్తకి నన్ను గుర్తు చెయ్యబోయేసరికి రాఘవేంద్రరావుని గుర్తుపట్టి నిర్ఘాంతపోయాను. కుడికన్ను దగ్గర్నుంచి చెవివరకూ చీరుకుపోయినట్టు పెద్ద మచ్చ. చూసేటప్పుడు కన్నుకూడా దృష్టి తప్పినట్టనిపిస్తుంది. ఎడమ చెయ్యి సరిగా పని చెయ్యనట్టుంది. వంకర తెలుస్తోంది. శరీరం మరింత బరువయింది. తలమీద ఒక్క వెంట్రుక కూడా లేదు. మనిషి మాటలో ఇది వరకటి సూటిదనం, నిర్భయం లేదు. ఇప్పుడు తరుచు నవ్వుతున్నాడు. జీవితంలో ఓటమివల్లనో, కష్టసుఖాల అవగాహన వల్లనో మెత్తబడ్డాడు. ఇది రాఘవేంద్రరావులో ఊహించలేని పెద్ద మార్పు. తెల్లబోయి కమలవేపు చూస్తే "మాట్లాడకు" అని సంజ్ఞ చేసింది.

రాఘవేంద్రరావు నా ఉద్యోగం విషయాలన్నీ తీరికగా అడిగాడు. తన ప్రమోషన్లు, బదిలీలూ, టూర్‌ల గురించి చెప్పాడు. మాట్లాడుతూ చాలాసేపు కూర్చున్నాను. కమల మా ఆవిడతో గంటపైగా కబుర్లేసుకుంది.

వస్తానని లేచి లోపలికి నడిచాను.

"మీ ఆవిడ ముఖం కడుక్కుంటోంది. దొంగా.. పిల్లలని చెప్పవేం? ఇద్దరటగా?" అంది కమల.

"అవును. మా మామగారి దగ్గర ఉన్నారు" అన్నాను.

కాస్త ఆగి "ఏమిటయింది మీ ఆయనకి?" అన్నాను ఆతృతగా.

"మూడేళ్ళక్రితం కాన్పూరు దగ్గిర జీపు ఆక్సిడెంటయింది. తల పగిలేదే, కొద్దిలో తప్పింది. ఆ తర్వాత నాలుగు నెలలు ఆసుపత్రిలో ఉన్నారు. అప్పుడే ఈ బదిలీ వచ్చింది."

ఎక్కడా అసంతృప్తీ, దుఃఖం ఆమె కంఠంలో ధ్వనించలేదు. ఉండబట్టక కసిగా ఓ ప్రశ్న వేశాను. "ఎలా బ్రతుకుతున్నావు ఇటువంటి కురూపితో?"

తెలివి తక్కువ వాడిని క్షమించినట్టు చూసి పకాలున నవ్వింది. "నోర్మూయ్ మీ ఆవిడ వింటుంది. వింటే ఆయనతో బ్రతకడం నిజంగా నాకు ఇష్టంలేదేమోఅనుకుంటుంది కూడాను" అంది.

అంతలో మాట మార్చి "మా బాబుని చూశావా? మధు వీడిపేరు" అంది.

చూశాను. సన్నగా, పీలగా, ఒంట్లో ప్రాణం లేనట్టు నీరసంగా వున్నాడు. పెద్ద జుత్తు, చిన్న నోరు. మూడేళ్ళొచ్చినా మాటలు రాలేదు. ఏమయినా వాడిలో అందం కనిపించలేదు.

ఆమాటే అన్నాను. "మీ ఇద్దరి పోలికా రాలేదు."

పక్కున నవ్వింది. "ఏమయినా ఆయన పోలిక రాలేదు. అదే అదృష్టం"

నేను తెల్లబోతే "అన్నిటికీ అలా అర్థాలు తీయకూడదు. వీడు పుట్టాక నాకేం హద్దులు లేవు" అని ఆప్యాయంగా వాడిని అక్కున చేర్చుకుంది.

ఆలోచిస్తూ మా ఆవిడతో నడిచాను.

చిన్నప్పటి గర్వం, తిరుగుబాటులోకన్నా ఈ దయ, ప్రేమలో ఇంకా అందంగా కనిపించింది కమల. లేక అందం మారలేదేమో. అందాన్ని చూసే దృష్టిలోనేనేమో ఈ మార్పంతా.

రాఘవేంద్రరావులో అందం చెరిగి పోయినా, నా అందాన్ని గురించి ఆమె అభిప్రాయంలో మార్పు తెచ్చుకుంది.

సీతలో "అందం" లేకపోయినా ఆమె స్వభావంలో, బ్రతకడంలో వున్న అందంతో సరిపెట్టుకుంది.

మరి ఆ పసివాడిలో అందం? తండ్రి పోలికలు లేని కారణాన, ఆ గుణాల్ని పుణికిపుచ్చుకోడన్న ఆశలు, అన్నిటికీ మించి తన కొడుకన్న ఆప్యాయతలోని అందమేమో అది.

ఆలోచనలమీద ఆలోచనలు పేరుకుంటున్నాయి.

కళ్ళముందు వృద్ధాప్యం ఆవరించుకుంటున్న స్త్రీమూర్తిని ఊహించుకుంటూ "అందం" తన విశ్వరూపాన్ని కమలలో ప్రదర్శించిందనుకున్నాను.

# అందని ద్రాక్షపళ్ళు

- అరెకపూడి (కోడూరి)కౌసల్యాదేవి

## (1976 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

**మోహన్ గదిలో** అడుగిడేసరికి అంతా చాలా కోలాహలంగా వుంది. రఘుపతి అదృష్టగానం జరుగుతూన్నదక్కడ. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగాలు వెలగబెడుతూన్న ప్రాజ్ఞుల గదిలా లేదది. అలనాటి కిష్కిందాపురి ఇదేనేమోననిపించేట్టుగా వున్నది.

మొహన్‌ను చూచి ఆ అల్లరీ, నాట్యాలూ మరింత అధికమయ్యాయేకానీ అసలు సంగతిని విశదీకరించేనాథుడెవరూ కనిపించలేదు.

"ఇందాక నేను బయటికి వెళ్ళేసరికి అంతా బాగానే వున్నారు క్షేమంగా. ఇంతలోనే ఏమొచ్చిందిరా పోగాలం?" సీరియస్‌గా అడిగాడు మోహన్.

"అయ్యో మిత్రమా! పోగాలమే దాపురించినదిరా రుబ్బురోలు పాత్రమా! ఈ సత్రమును వీడి పోవుచున్నాడు మన మిత్రరత్నము" ఏడుపును అభినయిస్తూ అన్నాడు కేశవ్.

"ఎక్కడికీ?" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"ఇంకెక్కడికీ? గృహస్త్రాశ్రమములోనికి" ఆంజనేయులు నాటక ఫక్కీలో విషాదరాగం అందుకున్నాడు. "అయ్యో ఈ విరహమెటుల భరింతుము..."

"నోర్మూయ్యండోయ్" నవ్వుతూ కసురుకున్నాడు మోహన్ అందర్నీ.

"కంగ్రాచ్యులేషన్స్ రఘూ," అంటూ రఘుపతితో కరచాలనం కావించాడు.

సందడి సద్దుమణిగి అందరూ ఒక్క క్షణం గంభీరంగా మారిపోయారు.

"పోవోయ్" తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నాడు కేశవ్.

"నీకంటె బండెడు అభినందనలు కురిపించాం మేమందరం, పిడుగుపాటువంటి ఈ యదార్థం తెలియకముందు" అంటూ ఒక ఛాయాచిత్రాన్ని జేబునుండి తీసి మోహన్ కనుల దగ్గరగా వుంచాడు.

"కళ్ళు బైర్లు కమ్మేను జాగ్రత్త. ఇటువంటి తటిల్లతతో వీడి వివాహం జరిగాక ఇక మనమందరం ఎందుకు గుర్తుంటామూ?"

నిజంగా కళ్ళు చీకట్లు క్రమ్మాయి మోహన్‌కు. సంభాళించుకుని చూశాడు. అలా చూస్తూనే నిలబడిపోయాడు కనురెప్పలు కదలచకుండా.

"ఏం గురూ, తిరిగాయా కళ్ళు? ఆ అందమే మనవాడి పాలిట వరమై మన యెడల శాపమైనది."

మిత్రులంతా యేవేవో సరదాగా వ్యాఖ్యానిస్తూనే వున్నారు. కానీ మోహన్ పెదవులు ఒక్క హాస్యవచనమైనా విసరలేదు. ఆ కనులలో కాంతి అదృశ్యమైంది.

"కొంచె పనుంది నాకు బజారులో" అంటూ వెళ్ళిపోయాడు ఆ అందరి నడుమా ఆ సందడిని భరించలేక.

అందరూ విస్మయంగా ముఖముఖాలు చూసుకున్నారు.

"ఏమిటి గురుడు అలా వున్నాడు?"

"ఏముందీ జల్సాలెక్కువ కదా? ఇంటికి సరిగా డబ్బు పంపడంలేదేమో? తండ్రి ఉత్తరం వ్రాస్తుంటాడు తల వాచే చీవాట్లతో."

ఎవరికి తోచినట్లు వారు సరిపెట్టుకున్నారు.

2

ఒంటరిగా నది ఒడ్డున కూర్చున్న మోహన్ తలపోతలు రెండేళ్ళ వెనకకు కళాశాలలో చదువుకుంటున్న రోజుల్లోకి పరుగుతీశాయి.

కాలేజ్ బ్యూటీ కాంచన కనులముందు నిలిచింది.

ఆ అందాన్ని ఆరాధించటానికే అనేకమంది విద్యార్థులు కళాశాలకి తప్పనిసరిగా హాజరయ్యేవారు.

ఆ సౌందర్యాన్ని చూసి తరించుతూ, తాము కళాశాలకు అసలు ఎందుకు వస్తున్నామోననేది విస్మరించేవారు మూడు వంతులమంది.

ఆ అందాలరాశి కటాక్ష వీక్షణం కొరకు దారులు కాచేవారిలో ప్రప్రధముడు తాను.

ఎక్కువ ప్రేమలేఖలు వ్రాసినవాడు తాను.

కానీ ఫలితం?

ఘోరమైన అవమానం. కళాశాల ప్రిన్సిపాల్‌చేత చీవాట్లు, కళాశాలనుండి ఉద్వాసన.

తల్లిదండ్రులు అసహ్యించుకున్నారు.

"తప్పుతుందా తద్దినం?" తండ్రి ఎవరెవరో పెద్దల కాళ్ళు పట్టుకుని ఎలాగో మరో పట్టణంలోని కళాశాలలో తనకు ప్రవేశం కలిగేట్టు చేశాడు.

అవమానం వల్లనైతేనేమి మనస్సున బాధవల్లనైతేనేం సరిగా చదవలేక అత్తెసరు మార్కులతో పాసై, దొరికిన చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకున్నాడు.

తనవంటి మరో అయిదుగురు గుమాస్తా బ్రహ్మచారులతో కలిసి ఈ రెండు గదుల అద్దె భాగంలో అతి సాధారణ జీవితం గడుపుతూండగా తమలో ఒకడైన శంకర్‌కు పెదతండ్రి కొడుకు రఘుపతి రావడం తటస్థించిది ఆరు నెలల క్రిందట.

రఘుపతి ఏదో కంపెనీలో జూనియర్ ఇంజనీర్.

తమవంటి సాధారణమైన సగటు బ్రతుకు కాదు. ఈ మహానగరాలలో బ్రహ్మచారి గాళ్ళకు గది దొరకడం సులభం కాదు అన్నయ్యా. దొరికే వరకూ మాతో ఇక్కడే వుండిపో. మేమెటూ ఆరుగురం వున్నాం. నీతో ఏడుగురం. అంతేగా? మాకెవరికీ అభ్యంతరాల్లేకపోగా ఆనందం కూడా నీ అంతటి ఇంజనీర్ మాతో ఉండడం. ఎటొచ్చీ నీకేమైనా అభ్యంతరాలుంటాయేమో మరి?"అన్నాడు శంకరం.

"ఛ. ఎందుకు అభ్యంతరం? హాయిగా మీ అందరితో సందడిగా వుంటుంది. ఒక్కణ్ణీ పడుండే అవస్త వుండదు" అని ఆనందంగా అంగీకరించాడు రఘుపతి.

అందరితో చిరపరిచితుడిలాగా కలసిపోయాడు రఘుపతి అయిదారు రోజులలోనే. తాను వారందరికంటే ఉన్నత స్థితిలో వున్నవాడిననిగానీ, మిగిలిన వారికంటే విద్యాధికుడననిగానీ రఘుపతి ఎన్నడూ భావించినట్లుగా వుండేది కాదు అతడి ప్రవర్తన.

అందరితోపాటు తానూ యింటి అద్దె పంచుకున్నాడు.

తమ రాబడికి తగినట్లుగా ఖర్చులు మితంగా చేస్తూ సరిపెట్టుకునే ఆ ఆరుగురినీ తనతోపాటు హోటళ్ళకూ, సినిమాలకూ తీసుకువెళ్ళి ఖర్చులు తానే భరించేవాడు. అతడి పౌడర్లూ, స్నోలూ, తలనూనెలూ అంతా, యదేచ్చగా వాడుకునేవారు.

రఘుపతి రాకతో తమకు ఏమి ఒడిదుడుకులు సంభవించుతాయోనని భయపడినవారందరూ అతడు తమ పాలిట కల్పవృక్షమని భావించి సంతోషించేట్లుగా వుండేది అతడి నడవడి.

రఘుపతికి గల ఈ పరపతి మోహన్‌కు ఈర్ష్య కలిగించినా, ఆ వైకల్యం మనసులోనే గుప్తంగా వుండేట్లు జాగ్రత్త పడ్డాడు.

అంతేకాదు తను తక్కువవాడననే న్యూనతాభావం కలిగినప్పుడల్లా అందుకు కారణభూతురాలైన కాంచన గుర్తుకురావడమూ, ఆమెపైగల క్రోధమూ కక్షా ద్విగుణమూ, త్రిగుణమూ కాసాగినై.

'ఓసి కాంచనా! నేను నీకు తగలేదు కదూ? అందగాడినీ ఐశ్వర్యవంతుడినీ వివాహమాడ్తున్నావ్ కదూ? చూద్దువుగాని నా తడాఖా. నన్నూ నావంటి అనేకులనూ మజ్నూలను చేసి విర్రవీగిన నువ్వు ఎలా సుఖపడ్తావో నేనూ చూస్తాను ' కసిగా ప్రతిజ్ఞ బూనాడు.

3

"పెళ్ళి చాలా బాగా జరిగింది."

"చాలా వివాహాలు చాలాబాగానే జరుగుతాయి. పెళ్ళి కుమార్తె చాలా బాగుంది. అదీ చెప్పుకోవలసిన విషయం."

"ఎంతటి అందంరా మల్లెమొగ్గలాగే వుంది. అందుకు తోడు డిగ్రీ. రఘుపతి అదృష్టవంతుడు."

"కాంచన పేరు ఆ రూపానికి తగ్గట్టుగానే వున్నది బంగారు తీగలాగా"

రఘూ, కాంచనల వివాహాన్ని కనులారా చూసి వచ్చిన స్నేహితుల కబుర్లు కర్ణకఠోరమై తోచాయి మోహన్‌కు.

"అందరం వెళ్ళాం. నువ్వొక్కడివే రానందుకు రఘుపతి చాలా యిదయ్యాడురా" అన్నాడు మోహన్‌ను ఉద్దేశించి.

"ఏమిటో ఆ సమయానికే నేను మరి మా ఊరు పోవలసి వచ్చిందిగా" నీరసంగా అన్నాడు మోహన్.

"నిజంగా కళ్ళు జిగేల్‌మనే అందంలే ఆవిడది. ఈ ఆదివారం సాయంత్రం వస్తున్నారు, చూస్తావుగా?" ప్రభాకరం అన్నాడు.

ఉలికిపడ్డాడు మోహన్. "ఈ ఆదివారమే? మరి ఇల్లూ వగైరా..?"

"ఇల్లు దొరికింది. అందమైన చిన్న డాబా యిల్లు. రెండు నెలల అద్దె అడ్వాన్స్ కూడా యిచ్చాడట పెళ్ళికి వెళ్తూనే ఇల్లు కుదుర్చుకున్నాడు."

"ఇల్లు ఎక్కడా?" ఆరాగా అడిగాడు మోహన్.

చెప్పాడు ప్రభాకరం. అంతేకాదు ఇంకా బాధాకరమైన విషయాలు చెప్పాడు.

"సోమవారం సాయంత్రం అందరికీ బ్రహ్మాండమైన పార్టీ యిస్తాడట. ఆ ఏర్పాట్లతోనే శంకర్ ఖాళీ లేకుండా తిరుగుతున్నాడు. అతగాడేమో నూతన వరుడు. ఇక పార్టీలో పెద్దరికమంతా మనందరిదేనని వేరే చెప్పనక్కర్లేదుగా?"

"ఏడిశావ్ తలకు మాసిన చవటా, ఎవడిదో వూళ్ళో పెళ్ళైతే కుక్కలకి హడావుడి అట" లోలోపలకసిగా తిట్టుకున్నాడు మోహన్.

4

"వచ్చేశామండోయ్ వదినగారూ" అంటూ కోలాహలంగా ప్రవేశించిన అందర్నీ నవ్వుతూ ప్రతి నమస్కారం చేసి ఆదరంగా పలకరించింది కాంచన.

"టీ పార్టీ తర్వాత మీ అందరి భోజనాలు కూడా ఇక్కడే. మళ్ళా ఆ హడావుడిలో పారిపోతారేమోనని ఇప్పుడే చెప్తున్నాను" అన్నది.

"మీ ఇష్టం. కానీ మరీ మమ్మల్ని నెత్తికెక్కించుకుంటే ఆనక మీరే బాధాపడతారేమో? ఎప్పుడు తీరిక దొరికితే అప్పుడే వచ్చేస్తూంటాం" జగన్నాధం హాస్యంగా అన్నాడు.

"రోజూ రండి. బాధ దేనికీ" నవ్వింది కాంచన.

"ఏం గురూ?" రఘుపతి దెస చూస్తూ తలెగరేశాడు కేశవ్.

రఘుమతి మొహం అమాయకంగా పెట్టాడు.

"నే చెప్పేదేముంది ఇంక? గృహరాణి ఆవిడ. ఆవిడ ఆజ్ఞకు మీతోపాటు నేనూ బద్ధుడనే"

ఒక్కసారిగా ఇల్లంతా నవ్వులతో ప్రతిధ్వనించింది.

అందరికీ కొంచెం వెనుకగా మిగిలిపోయిన మోహన్‌కు ఇవన్నీ వింటూంటే ఒంటికి కారం పూసినట్లే వున్నది.

"అదే చలాకీతనం. అదే నవ్వు. ఆనాటికంటే అధికమైన అందం." ఆనందలాస్యం చేస్తూన్న ఆ అందమైన మూర్తి ఒకనాటి ప్రేమిక, మరొకనాటి శత్రువు. నేడు మరలా కళ్ళెదుటికి వచ్చింది ఆరిపోతూన్న అగ్నిలో ఆజ్యం పోయడానికి.

"చూస్తాను ఈ ఆనందం, ఈ విరగబాటూ ఎంతకాలమో నేనూ చూస్తాను" కసిగా తలపోస్తున్న మోహన్ రఘుపతి చేయి తన భుజం మీద పడడంతో ఈ లోకంలోకి దిగివచ్చాడు.

అందరి చాటునా నక్కి నిలబడిన అతడిని ఎదుటికి లాగుతూ భార్యకు పరిచయం చేశాడు రఘుపతి.

"ఇతడు మోహన్. మన వివాహానికి రాలేకపోయారు. చాలా సరదా మనిషి. వెరసి నీకు ఆరుగురు మరుదులన్నమాట"

తలెత్తకుండానే ఎలాగో నమస్కారం చేసాడు మోహన్.

కాంచన ఎలా నమస్కరించిందో ఆమెకే తెలియదు. ఒక్కసారిగా ఆమె పెదవులపై చిరునగవూ, కనులలో తళతళా మాయమైనాయి.

మరెవరో అతిధులు వచ్చిన నెపంతో త్వరత్వరగా ఆ తావునుంచి వెళ్ళిపోయింది.

అయితే పార్టీ జరుగుతున్నంతసేపూ కాంచనా మోహన్‌ల చూపులు ఏదో ఓ మూలనుండి కలుసుకుంటూనే వున్నాయి, అంతలోనే కంగారుపడుతూ విడిపోతూనే వున్నాయి.

5

"పార్టీ చాలా బాగనే జరిగింది కదూ?" భర్త ప్రశ్నకు యధాలాపంగా 'ఊ' కొట్టి శయ్యను చేరుతున్న కాంచనను పరిశీలనగా చూశాడు రఘుపతి.

"ఏం అలా వున్నావ్? అంతగా అలసిపోయావా?" అన్నాడు ఏ మాత్రం ఉత్సాహంగా లేని ఆమె ముఖాన్నే చూస్తూ.

"చాలా తలనొప్పిగా వుంది" అంది అటు తిరిగి పడుకుంటూ.

"పడుకో. తెల్లారేసరికి అలసట తగ్గి హాయిగా వుంటుంది. ఈ బహుమానాలన్నీ ఏమిటేమిటో చూస్తాను నేను" అన్నాడు. విందుకు వచ్చిన అతిధులంతా ఇచ్చిన కానుకలు పేర్చి వున్న టేబుల్ ముందు కూర్చుంటూ.

ఏదో అలాగ అన్నాడేకానీ అతడికి ఆశ్చర్యంగా వుంది కాంచన స్థితి. వివాహమైనప్పటినుండీ అతి ఉత్సాహభరితమైన ఆమె మూర్తినే చూస్తున్నాడు కానీ, యిటువంటి రూపంలో స్తబ్దుగా చూడడం యిదే ప్రధమం. 'కారణమేమైవుంటుంది?' అనుమానం మొలకెత్తింది మనసులో.

ఆలోచనలతోనే బహుమతులను సరిచూస్తున్న అతడు అదిరిపడ్డట్టే అయ్యాడు.

ఒక అందమైన అట్టపెట్టెలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన నాగసర్పం బొమ్మ.

ఇదేమి బహుమతి?

ఎవరు ఇచ్చారిది?

ప్రతి బహుమతిపైనా అది ఎవరిచ్చిందో వ్రాయబడి ఉంది కానీ దీనిమీద ఏ పేరూ లేదు.

ఈ బహుమతి పెట్టెను ఎవరి చేతిలో చూచి వుంటానా? అనే ఆలోచనలలోనే రేయి అంతా సతమతమైన అతడు ఉదయం లేస్తూనే భార్యకు ఆ విశిష్టమైన బహుమతిని చూపించాడు.

"ఎవరిచ్చారంటావ్?"

"నాకూ గుర్తులేదే, అయినా యిదేం బహుమతి?" అతి సహజంగా అంటూ ఎదురు ప్రశ్నవేసిందికానీ, ఆ కన్నులలోని భయాన్నీ, అలజడినీ రఘుపతి గమనించాడని గ్రహించలేదు.

"పోనీలేకానీ, నీ తలనొప్పి తగ్గిందా?" రఘు మాట మార్చాడు.

"ఆ బాగానే వున్నాను."

"మరి యింకా అలా వున్నావేమిటి మందకొండిగా? నిన్నెప్పుడూ యిలా చూడలేదు సుమా నేను."

"చాల్లెండి పెళ్ళైన ఇన్ని రోజుల తర్వాత కూడా యింకా కొత్త పెళ్ళికూతురిలా ఎలా వుంటాను?" నవ్వేసి ఏదో పని సాకుతో వంటింటిలోనికి వెళ్ళిపోయింది.

ఆ నవ్వులో కళ లోపించడమూ, తనకు ముఖం చాటువేయడమూ గ్రహించలేనంత మూర్ఖుడు కాదు రఘుపతి.

6

**"రఘుపతీ,**

బంగారు తీగలాంటి భార్యనే పొందావు కానీ, గర్వపడకు. అది పేరుకే కాంచన. బుద్ధికి యిత్తడి. కళాశాలలో చదివేప్పుడు దానికి ఎందరు ఆరాధకులో, ఎందరితో తిరిగిందో తెలిసుంటే నీవు తప్పక ఆత్మహత్య చేసుకోవాలి. ఐ పిటీ యూ. ఇప్పుడైనా ఎవరితోనూ పారిపోకుండా సరిగా వుండేట్లు కట్టుదిట్టాలు చేసుకో.

**నీ శ్రేయోభిలాషి."**

**"మిస్టర్ రఘూ,**

ఎవరోయ్ నీకీ పెళ్ళి వాళ్ళు. నిన్ను గోతిలో దింపారు కదా నిలువునా. ఎంగిలి కూడు తింటున్నావు. ఏ మాత్రమూ గుణమూ, శీలమూ లేనిదాన్ని కట్టుకుని. ఇప్పుడు క్రొత్త అందరికీ తెలిసిననాడు తలెత్తుకోగలవా? ఎందరితో ప్రేమాయణాలు జరిపిందో నీకేం తెలుసు? ఆమె వ్రాసిన ప్రేమలేఖలలో ఒకదానిని నీకు బహుమతిగా పంపుతున్నాను చూడు. నీ భార్యామణి చేతివ్రాత నీకు గుర్తింపేకదా. ఐ పిటీ యూ! పూర్ బ్రదర్.

**నీ హితైషి."**

ఇంచుమించుగా యిదే సారాంశంతో కొద్ది భాష తేడాతో రెడు మూడురోజులకొకసారి వచ్చే ఈ ఉత్తరాలూ, వాటితో జతచేసి వుండే ప్రేమలేఖలూ మతిపోగొట్టసాగాయి రఘుపతికి.

అది కాంచన దస్తూరీయే. సందేహం లేదు.

కానీ...కానీ కాంచన అంతటి స్వైరవిహారి అని నమ్మబుద్ధి కావడంలేదు.

'ఈ శ్రేయోభిలాషి ఎవరో తప్పక కాంచనను ఎరిగున్నవాడే కావాలి. ఎవరు? ఎవరు? ఎవరై వుంటారు. మగవాడి వ్రాతలాగే వుంది.

అన్ని రోజులనుండీ జాగ్రత్తగా ఆలోచిస్తున్న అతడి తలలో వేయి నాగసర్పాల బుసలు వినిపిస్తున్నాయి.

'పాము బొమ్మను కానుకగా యిచ్చిన వ్యక్తీ ఈ ఉత్తరాల వ్యక్తీ ఒక్కడే కాదుగదా?'

ఒక్కడే కావచ్చు. వాడెవడో తప్పక ఆ పార్టీకి వచ్చి వుండాలి. అయితే కాంచన గుర్తుపట్టి వుండాలి. అందుకే అలా విచారంగా ముభావంగా వుంటున్నదేమో?"

"అబ్బ చాలా అందంగా వున్నావ్ కాంచనా ఈ రోజు. ఈ లేతాకుపచ్చరంగు దుస్తులలో."

సిగ్గు అభినయించింది.

"అబ్బ నువ్వు కాలేజీలో చదివే రోజుల్లో తప్పక కాలేజ్ బ్యూటీవని పేరు వచ్చి వుండాలి. ఔనా?"

"మహా గొప్ప మీ భార్యే అంత అందగత్తె. ఇంకెవరూ లేరు" కాంచన కోపంగానే అన్నది.

"అరె చిత్రం అందంగా వున్నావంటే ఆడవాళ్ళు అపరిమితంగా ఆనందిస్తారని విన్నాను. మరి నీకు కోపమెందుకూ? నా అనుమానం అసమంజసమేమీ కాదు. బహుశః నీ అందానికి క్రిందపడిపోయే వాళ్ళేమో చాలామంది విద్యార్థులు. ఔనా?"

కాఫీ త్రాగుతూ రఘుపతి ఒక్కో వాక్యమే మెచ్చుకోలుగా విసురుతున్నాడు.

అతడి మాటలలో హాస్యం కాక అనుమానమేమైనా వున్నదేమోననే సంకోచం రాగానే కాంచన ముఖం మాడిపోయింది.

నీళ్ళు నిండిన కళ్లతో అతడి సమక్షం నుండి నిష్క్రమించింది.

'ఔను. ఆడది అందంగా వున్నా అనుమానమే. అందంగా వుంటే అనుమానం. అంద వికారంగా వుంటే అలుసు. చదువుకుంటే అసహ్యం. చదువులేని మొద్దైతే అవహేళన ఎంత చిత్రంగా వుందే ఆంధ్రయువతీ నీ పరిస్థితి.'

దుఃఖంతో తలపోస్తూన్న కాంచన మనసులో అనుమానం కలిగింది. 'ఈయన ఎందుకిలా మాట్లాడుతున్నారు? బహుశా నాకు వస్తూన్నటువంటి విషపు ఉత్తరాలే ఆయనకూ రావడంలేదు కద?'

ఈ ఆలోచన రాగానే మేను జలదరించింది. గుండె గొంతులోనికి వచ్చినట్లే అనుభవమైంది.

భగవాన్ ఏది దారి?

సాధారణ యువతి భగవంతుని వేడుకోవడం మినహా ఏమి చేయగలదు?

## 7

"కాంచనా!" ఉత్సాహంగా పిలుస్తూ ప్రవేశించాడు రఘుపతి.

బీరువాలో బట్టలమాటుకు గబగబా ఏదో త్రోసిపారవేసి ఖంగారుగా యిటు తిరిగిన కాంచనలో గాభరా స్పష్టంగా కనపడటమేకాదు ఏడ్చి కళ్ళు తుడుచుకున్నట్టుగా వుంది వాలకం.

తేలికగా తొణికే స్వభావంలేని రఘుపతి అదేమీ గమనించనట్లే అతి సహజంగా మాట్లాడాడు.

"మంచి పిక్చర్ వచ్చింది. త్వరగా తయారుకా. అందుకే ఓ గంట ముందుగానే వచ్చాను."

"ఏం పేరు?" బీరువా మూస్తూ అడిగింది.

"చెప్తాలే దారిలో. ముందు త్వరగా తయారవ్వు. వెళ్ళు."

"మీకు కాఫీ తేనా?"

"ఓ డార్లింగ్ ఏమీ వద్దు. అక్కడే కేంటిన్‌లో త్రాగవచ్చు. ఆలస్యమైతే టిక్కెట్లు దొరకొద్దూ? హరియప్" త్వరపెట్టేశాడు.

కాంచన స్నానాల గదిలోనికి వెళ్ళి తలుపు మూసేవరకూ అతడికి క్షణమొక యుగంగా తోచింది. కాంచన లోపల స్నానం చేస్తూన్న అలికిడి వినవస్తోంది. ఆత్రత పట్టలేని రఘుపతి బీరువా తీశాడు.

ఏమిటది నాకు తెలియకుండా కాంచన దాస్తూన్న వస్తువు?

చీర మడతల వెనుక దాచబడిన ఆ వస్తువులు అతడికి దిగ్ర్భాంతినే కలిగించాయి.

తల పంకిస్తూ తిరిగి అన్నీ యధాస్థానంలో సర్దేశాడు. ఏమీ ఎరగనట్లే తానూ సినిమాకు సిద్దం కాసాగాడు.

8

"మోహన్"

పరధ్యానంగా కూర్చున్న కాంచన అదరిపాటుతో లేచి నిలబడి సంబోధించింది.

"ఆ నేనే, ధన్యుణ్ణి, గుర్తుపట్టావన్నమాట వక్రంగా నవ్వుతూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"ఎందుకొచ్చావ్? ఏమిటి నీకు పని?"

"అవి చెప్పటానికేగా వచ్చానూ? తొందరెందుకు?"

"నువ్వేం చెప్పక్కర్లేదు, వెళ్ళు. నా భర్తలేని సమయంలో రావటానికి నీకెన్ని గుండెలు."

"అతడు ఊళ్ళో లేనప్పుడేగా మరి మనకి అవకాశం."

"అతిగా వాగకు, నడు" తర్జని వీధివేపు చూపుతూ హుంకరించింది కాంచన.

నిర్లక్ష్యంగా నవ్వాడు మోహన్.

"తాటాకు చప్పుళ్ళకు బెదరనని నీకూ తెలుసుగా?"

"కాల సర్పానివని కూడా తెలుసు. అందుకేగా సర్పం బహుమానంగా యిచ్చావ్ పెళ్ళి విందులో?"

"ఓ స్మార్ట్ గాళ్. గ్రహించావన్నమాట, అది నేనే బహూకరించానని" విజయగర్వంతో నవ్వాడు.

"మరి పాము కాటు వేస్తుందని కూడా తెలుసుగా?"

"ఎందుకు? నేనేం పాపం చేశానని యిలా కక్షగట్టావ్?"

"తెలియదూ? నా ఆరాధనని కాలదన్ని, నన్ను నాశనం చేయలేదూ. కాలేజ్‌నుండి డిస్‌మిస్ చేయించి?"

"ఒక అమాయక బాలికను పాడుచేయాలనుకున్నందుకు ఫలితం అది. తెలిసి మరలా నిప్పుతో చెలగాటమాడకు, వెళ్ళు."

గర్వంగా చూస్తూ కాలరు సర్దుకున్నాడు మోహన్.

"అప్పుడు నీది పైచేయి. ఇప్పుడు నాది. నీవు భర్తచాటు భార్యవు. కొనగోటితో నీ సంసారాన్ని కూలద్రోయగలను. రఘుపతి మనసులో అనుమానం రేకెత్తించి."

"నీకు సాధ్యం కాదది. నా భర్త మనసు అంత సంకుచితం కాదు"

"ఆహా! ఏమి గుండె నిబ్బరం. ప్రతి ఆడదీ అలాగే మురుస్తుంది అగాధంలో దిగబడేవరకూ. నీ భర్తా మానవుడేగానీ దేవుడు కాదుగదా?"

"ఆ మానవుడే, మనసున్న మానవుడు,నీచత్వం లేని నిజాయితీపరుడు. నీలాటి బురదపాములు మమ్మల్నేమీ చేయలేవు. పోతావా, అందర్నీ పిలిచి అల్లరి చేయమంటావా?"

"పోతాలే, నీ బ్రతుకుమాత్రం అల్లరిపడకుండా కాపాడగల శక్తి ఎవ్వరికీ లేదు. నీ చేతి వ్రాతను కూడా నేను నేర్చుకున్నాను. నీ మీద పగతీర్చుకోవడానికి, నువ్వు ఎవడికో వ్రాసినట్లుగా ప్రేమలేఖలు వ్రాసి నీ భర్తకు పంపాను. ఏదో ఒక క్షణంలో నిన్ను అతడు బయటకి నెట్టివేయటం ఖాయం. అప్పుడు నన్ను గుర్తు తెచ్చుకో. నాకేం అభ్యంతరం లేదు. రెండో పెళ్ళైనా సరే నిన్ను చేసుకుంటాను" అంటూ వెనుదిరిగిన మోహన్ కాలు అలాగే వుండిపోయింది సగం సాగి.

"నీచుడా ఎంతకు తెగించావ్?" అంటూ నిందించబోయిన కాంచన స్వరం పైకి వినిపించనేలేదు.

కారణం కర్టెన్ తొలగించుకుంటూ అప్పుడే లోనికి ప్రవేశించిన రఘుపతి.

మోహన ముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

కాంచన పరిస్థితి వర్ణనాతీతం. గ్రామాంతరమేగిన అతడు అప్పుడే ఎందుకు తిరిగివచ్చాడు? ఈ మోహన్ రాకను ఏ విధంగా అర్థం చేసుకుంటాడు? భగవాన్ నీలాపనిందను మోయవలసి ఉన్నదా?

ఎట్టి విపత్కర పరిస్థితికైనా సిద్ధమైనట్లుగా తల వాల్చుకుని నిశ్చలంగా ప్రతిమలా నిలబడిన భార్యను ఒక్కసారి జాలిగా చూసి వడివడిగా తప్పించుకుని నడిచిపోతున్న మోహన్ చేతిని పట్టుకుని ఆపాడు రఘుపతి.

"అరె కూర్చోవోయ్ గృహస్థుల వద్దకు వచ్చి తేనీరైనా సేవించకుండా వెళ్ళిపోతావా? కూర్చో. ఇంతవరకూ నా శ్రీమతికి చెప్పిన విషయాలు నాకూ కాస్త విన్నవించు."

బిత్తరపోయి చూశాడు మోహన్.

"కాంచన... నాకు స్నేహితురాలు.. మాట్లాడదామని వచ్చాను" అన్నాడు నట్టుతూ.

"బ్రదర్ నేను అంతా విన్నాను. నీవు లోనికి వచ్చిన వెంటనే నేనూ వచ్చాను."

ఆ గంభీరమైన ఉచ్చారణకు ఆశ్చర్యంగా చూసింది కాంచన తలెత్తి.

"ఇతటి అమోఘమైన పథకం వేయగల నీ మేధకు నా జోహార్లు మోహన్. కానీ ఈ తెలివిని ఏదైనా ప్రయోజనాత్మకమైన విషయంలో ఉపయోగించితే నీకూ, సమాజానికీ కూడా మేలు కదా?"

"...."

"మోహన్ నీవు ఎంతో శ్రమపడి తయారుచేశావు కానీ, నీవు పంపిన ఉత్తరాలు నిజంగా కాంచన స్వయంగా ఎవరికైనా వ్రాసినవైనా నేను బాధపడను. అదేమీ నేరంకాదు. యువకుడుగా నువ్వూ కాంచనను ఆరాధించావ్. రేపు నీ భార్యకు ఈ విషయం చెప్తావా? చెప్పవు. అందుకు చాలా ధైర్యం కావాలి. ఆమె నాతోడి బంధన జీవితంలో బాధ్యతలకు న్యాయంగా తల ఒగ్గుతుందా లేదా అనేది ప్రధానం. అంతే. నేనూ విద్యార్థి దశలో ఒక అమ్మాయిని ఆరాధించాను. కానీ, అందుకోలేనంత మాత్రాన ఆమెను శపించి, నాశనం చేయాలని ఏనాడూ అనుకోలేదు. మనసారా ఆమె సుఖాన్నీ, ఔన్నత్యాన్నీ కాంక్షించాను. కాంక్షిస్తున్నాను. ఆరాధనలో ప్రేమా, త్యాగం వుండాలి కానీ, ద్వేషం, హింసా వుండకూడదు. నాకు ఉత్తరాలు వ్రాసి వ్రాసి విసిగిపోయావ్ నా మనసు విరచలేక.

తర్వాత అస్త్రం కాంచనకు ఎవరో పాత స్నేహితుడిలాగా ప్రేమలేఖలు ప్రారంభించావ్ మారుపేరుతో. అవి నా కంటపడి నేను కాంచనను బాధించాలని, లేదా వదిలిపెట్టాలని. కానీ నేను కంటికి కనిపించిందల్లా నమ్మే అవివేకిని కాను. అన్నివైపులనుండీ నిఘా వేశాను. నిదానంగా పట్టుబడ్డావ్. చూశావా?"

ఇంకా మోహన్ వాలివున్న తల లేవలేదు.

"మోహన్ నీమీద నాకేం కోపం లేదు. వెళ్ళిరా, మనిషిలా జీవించు. మనసులోని మత్సరాన్ని తుడిచివేయి"

ఒక్కమాటైనా మాట్లాడకుండా విసవిసా వెళ్ళిపోయాడు మోహన్ సిగ్గుతో.

"మీరు..మీరు నిజంగా.." మాటలు పూరింపలేకపోయింది కాంచన ఆనందాతిరేకంతో,

"ఆ ఉత్తరాలెప్పుడు చూశారు?"

"పిచ్చిదానా. పెద్ద పెద్ద మాటలు వద్దు. నేనేం చేస్తానోనని లోపల్లోపల ఎంత బాధపడ్తున్నావో కదూ ఇన్నాళ్ళూ. అందుకే ఊరు వెళ్తున్నట్లు అబద్ధం చెప్పించి స్నేహ్తులచేత మోహన్ ఇక్కడకు వచ్చేట్లు చేశాను."

"మీకు నామీద కోపం లేదుగా?"ఇంకా బెదిరిపోతూనే అడిగింది కాంచన.

"లేదు. గర్వంగా వుంది. ఎందరెందరికో అందని ఈ అందాలరాసి నాకు లభ్యమైనదని."


"అందరూ యింత ఉదారంగా ఆలోచిస్తే ఎంత బాగుంటుంది?" భర్తపై అనురాగం కురిపించుతూ అన్నది.

"ఔను. ఎవడో ఉత్తరం రాసినంత మాత్రాన, మరెవడో వెకిలి కూతలు కూసినంత మాత్రానా, ఆడపిల్ల పరువుపోయిందని బాధాపడక్కర్లేదు. పళ్ళు కాసిన చెట్టుమీదకే రాయి విసురుతారు ఎవరైనా, ఓ పండు దొరకకపోతుందా అని. అలాగే బుద్ధిమంతురాలైన యువతినే పొంద ప్రయత్నిస్తాడు ఎవడైనా. ఆ ప్రయత్నం విఫలమైనంత మాత్రాన, ద్రాక్షపండ్లను అందుకోలేని నక్కబుద్ధిని ప్రదర్శించితే వాళ్ళే తేలిక అవుతారు నలుగురిలో. పద, ఆ బీరువాలోని ఉత్తరాలన్నీ కాల్చి పారవేయి దీపావళి శుభ సందర్భంలో."

# ఆత్మీయత

## - ఎమ్.వి వి సత్యనారాయణ

## (1981 జనవరి విజయ మాసపత్రిక నుండి)



**రైలు దిగుతూ ప్లాట్‌ఫారం** మీద అడుగు పెడుతూనే దడదడలాడింది సరోజ. అయిదు సంవత్సరాల తరువాత తను తిరిగి ఆరవల్లి స్టేషనులో అడుగుపెట్టింది. మధుని ఒక చేత్తో ఎత్తుకుని, సంచి చేత్తో పట్టుకుని ప్లాట్‌ఫారం మీద నడుచుకుంటూ వెళ్ళింది. స్టేషను మాష్టరుకి టిక్కెట్టిచ్చి గేటుదాటి బయట పడింది సరోజ.

రైలు కూతవేసి భారంగా కదిలింది.

ఆరవల్లి స్టేషను బాగా మారిపోయింది. అయిదేళ్ళ క్రితం తను చూసినదానికీ, యిప్పటికీ చాలా తేడా వచ్చింది. ఇంతకుముందు మట్టి ప్లాట్‌ఫారం కాస్త ఎత్తు పెరిగి సిమెంటు పలకలను కప్పుకున్నది. సిమెంటు బల్లలు, కొత్తగా పెంచిన స్టేషన్ షెడ్డూ, వెల్లవేసిన గోడలూ, నోటీసు బోర్డులూ దాటుకుంటూ మెట్లు దిగి రోడ్డుమీద అడుగు పెట్టింది సరోజ. మట్టిరోడ్డు తారురోడ్డు అయింది. చుట్టూ ఉన్న పొలాలు కనబడకుండా రోడ్డు కిరుప్రక్కలా షాపులు వెలిశాయి. ఒక ప్రక్కగా వున్న నిద్రగన్నేరు చెట్టు క్రింద రిక్షాలు, జట్కాలు నిలబడి వున్నాయి.

సరోజ రోడ్డు మలుపులోకి దృష్టి సారించింది. తడికలతో చిన్న సైకిలు రిపేరు షాపు వుండేది. అది తాతబ్బాయిది. ఇప్పుడు అక్కడ పెద్ద షాపు ఉండి, ముందు టైర్ల దొంతరలుండి, కొత్త సైకిళ్ళు నిలబడి ఉన్నాయి. అది తాతబ్బాయిదేనా?

కౌంటరులో కూర్చున్న వ్యక్తిని పరకాయించి చూసింది. సందేహం లేదు. అతడు తాతబ్బాయే. కృతజ్ఞతా భారంతో కళ్ళు తడిశాయి.

సరోజ రిక్షా మాట్లాడుకుని బాబుతో ఎక్కి కూర్చున్నది. రిక్షా కదిలింది. సరోజ తల వంచుకుంది. అదృష్టవశాత్తూ మలుపు తిరిగేటప్పుడు తాతబ్బాయి చూడలేదు. అయిదేళ్ళ తరువాత మొదటిసారి కనిపిస్తూనే అతడికి కృతజ్ఞత చెప్పుకోవడం ఎలాగో తెలియలేదు సరోజకి.

రిక్షా పొలం మధ్యనున్న రోడ్డు పట్టింది. మధు ఒళ్ళో తలపెట్టి నిద్రపోతున్నాడు. పంట పొలాల మీదుగా సున్నితమైన గాలి హాయిగా తలుగుతోంది వంటికి.

సరోజకి చటుక్కున శ్రీకాంత్‌తో ఆ రాత్రి కటిక చీకట్లో సైకిలు కేరేజి మీద కూర్చుండి, గుండెలు అరచేత్తో పట్టుకుని ఇదే రోడ్డుమీద గతుకుల్లో ఎగిరెగిరి పడుతూ స్టేషన్‌కి రావడం గుర్తొచ్చింది.

'శ్రీకాంత్' అనే ఊహతోనే సరోజ పరవశించింది. శ్రీకాంత్ తన ప్రాణాలను కాపాడటమే కాకుండా తనలో కొత్త ఊపిరిని, కొత్త నెత్తురును పోసి, కొత్త జీవితాన్ని తనకి ఏర్పాటు చేశాడు.

ఆ రాత్రి ఇంట్లో చెప్పింది తను – "శ్రీకాంత్‌ను పెళ్ళి చేసుకుంటాను అమ్మా" అని.

నరసమ్మ పిడుగు పడినట్లు చూసింది.

"అయితే నేను అనుకున్నది నిజమేనన్నమాట" అన్నది నోరు పెగిల్చి.

తను మాట్లాడలేదు. తల్లి ఏమనుకుందో తను తెలుసుకోదల్చుకోలేదు.

"ఆ అబ్బాయి వర్ణం ఏమిటి?" అడిగింది నరసమ్మ. సరోజ నీట్టూర్చింది. వర్ణం కలిస్తే పెళ్ళి చేయగలదానల్లే తల్లి మాట్లాడింది. వర్ణం కలిశాక గోత్రం ఒకటి కారాదు. అవన్నీ కలిస్తే శ్రీకాంత్ వైపు బంధువులు నచ్చాలి. వాళ్ళ పేరు ప్రతిష్టలు నచ్చాలి. వాళ్ళ ఆస్తిపాస్తులు నచ్చాలి.

"ఆయన నాకు నచ్చారు. ఆయనకి నేనమే యిష్టం. అంతే చాలనుకుంటున్నాను."

"ఈ కబుర్లు రేపు ఉండవు"

"ఏం"

"పుట్టబోయే పిల్లలకి కులం, గోత్రం వుండద్దూ?"

"మా యిద్దరికీ అక్కరలేదు."

"నాన్నకి చెప్పావా?"

"నువు చెబుతావని. అమ్మా! నా కోరిక కాదనకు. శ్రీకాంత్ చాలా మంచివారు."

"మంచితనం అన్నది ఒక్కటే చాలదు" నరసమ్మ గొణుక్కుంది.

విషయం విన్న తర్వాత అన్నారావు ఎగిరిపడ్డాడు. సరోజని కులభ్రష్టురాలవని తిట్టాడు. మూడోనాటికల్లా తగిన వరుణ్ణి తెచ్చి పెళ్ళి చెయ్యకపోతే తన పేరు అన్నారావే కాదు అన్నాడు. ఆరోజే విసురుతో జోళ్ళు తొడుక్కుని ఇంట్లో ఉన్న చివరి ఇరవై రూపాయలు జేబులో వేసుకుని భోజనమైనా చేయకుండా ఎండలో నడుచుకుంటూ రైల్వే స్టేషన్ దిశగా వెళ్ళిపోయాడు.

సరోజ నిట్టూర్చింది.

అదే తను ఐదేళ్ళ క్రితం తండ్రిని ఆఖరిసారి చూడటం 'ఆనాటి కోపం ఇంకా తన మీద వున్నదో లేదో?' సరోజ ఆనాడు తండ్రికి ముందు విడమర్చి చెప్పాలనుకున్నది. ఎలా చెప్పాలో వివరంగా పథకం వేసుకున్నది. అసలు శ్రీకాంత్ అంటే అన్నారావుకి గౌరవం, అభిమానం, కృతజ్ఞత ఉన్నాయి. ఇంటల్లుడు అవుతాడంటేనే అవి తుడిచి పెట్టుకుపోయాయి.

శ్రీకాంత్ తన గ్రామం, చుట్టుప్రక్కల గ్రామాల్లో వైద్యం చేసుకు బ్రతికే ఆర్.ఎం.పి డాక్టర్. అవకాశాలు లేక, బీద పరిస్థితుల్లో సర్దుబాటు చేసుకోలేక మెడిసన్ చదవాలన్న కోరికను అణచుకుని స్వయంకృషితో ఆర్.ఎం.పి కోర్స్ చదివాడు. తన కాళ్ళమీద తను నిలబడే వరకు ఇంటి మొహం చూడనని అలిగి వచ్చినట్టు గ్రామంలో చెప్పుకునేవారు. ఆర్.ఎం.పిగా అతడి ప్రాక్టీసు బాగుండేది.

దంతవల్లికి మైలు దూరంలో వుంది ఆరవల్లి. ఆరవల్లి బాగా అభివృద్ధి చెందిన పల్లెటూరు. సరోజ అక్కడికి రోజూ వెళ్ళి, మహిళామండలిలో టైలరింగు నేర్చుకు వచ్చేది. టెంత్ చదివి ఫెయిలై, పెళ్ళికి ఎదురుచూస్తూ, నాలుగేళ్ళు గడిచాక, కట్నాల విషయంలో తన కుటుంబం వేసే పిల్లిమొగ్గలతో జ్ఞానోదయమై, ఏదో వ్యాపకంగానే గాకుండా, ఆధారంగా కూడా ఉంటుందని భావించి టైలరింగ్ నేర్చుకుంటోంది సరోజ.

ఒకరోజు కుట్టు మిషన్ ట్రబులిచ్చింది. సరోజ దాని హెడ్ తీసి మరమ్మత్తు చేస్తోంటే సూది చటుక్కున చూపుడు వ్రేలులో కండ లోపలి కంటా గుచ్చుకుపోయింది. రక్తం ధారగా కారింది. సరోజ స్నేహితురాళ్ళు ప్రక్క యింట్లోకి పరిగెత్తి, కాఫీపొడి తెచ్చి గాయం మీద వేసి బలంగా కట్టుకట్టారు. మూడు నాలుగ్గంటల్లో నొప్పి తగ్గినట్టే తగ్గి, మరునాడు తిరిగి అదే సమయానికి బాగా బరువు చేసింది గాయం.

అన్నారావు మూలుక్కున్నాడు. సరోజ అక్కలిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి కళ్ళు తేలవేసుక్కూర్చున్నాడు. వాళ్ళ పెళ్ళయి ఐదేళ్ళయినా అన్నారావు చేసిన అప్పులు ఒక కొలిక్కి రాలేదు. మక్తా వ్యవసాయంలో మిగిలేదెంత అప్పులికి కట్టేదెంతగా వుంది అన్నారావు పరిస్థితి.

సరోజకి వ్రేలుతోబాటు చెయ్యి కూడా వాచిపోయి ఆ సాయంత్రానికి టెంపరేచర్ పెరిగింది. చెప్పేవాడు చెప్పిన గచ్చాకు పుచ్చాకులన్నీ కట్టారు. కానీ గుణం కనిపించలేదు.

గత్యంతరం లేక అన్నారావు శ్రీకాంత్‌కి కబురు పెట్టాడు. సరోజ వ్రేలు ప్రాంతం నల్లగా కమిలిపోయింది. శ్రీకాంత్ దాన్ని చూస్తూనే సెప్టిక్ అయిందని నిర్ధారణగా చెప్పి వైద్యం ప్రారంభించాడు.

సరోజ చిక్కి శల్యమైపోయింది. చెయ్యి నల్లబడిపోయింది. సరోజ బతకదనుకున్నారు. శ్రీకాంత్‌కి సరోజ సవాల్‌గా కనిపించింది. మిగిలిన కేసులు మానుకుని, సరోజని కాన్‌సెంట్రేట్ చేశాడు. రాత్రింబవళ్ళు అతడికి సరోజ తోడిదే జీవితమైపోయింది.

శ్రీకాంత్ ఏం తిన్నాడో, ఏం త్రాగాడో, సరోజ చేత ఏం మందులు మింగించాడో, తాగించాడో  పది రోజుల తర్వాత సరోజకి చెయ్యి నలుపు తగ్గింది. మరో మూడు వారాల్లో మామూలు మనిషయ్యింది.

"మా అమ్మాయిని బ్రతికించారు బాబూ" అన్నారు అన్నారావు దంపతులు గ్రుడ్లనీరు క్రుక్కుకుంటూ.

శ్రీకాంత్ సంతృప్తిగా చూశాడు.

సరోజకి మృత్యు ముఖానికి దగ్గరగా ఉన్నప్పుడే శ్రీకాంత్ తన పట్ల చూపే తాపత్రయాన్ని ప్రేమగా అర్థం చేసుకుంది. ఆమెకి అతడిపట్ల అంతవరకూ ఉన్న గౌరవం ప్రేమగా మారుతున్నట్టు తోచడానికి అట్టే రోజులు పట్టలేదు.

నరసమ్మ విషయాన్ని పసికట్టింది. కూతురును అడగాలనుకుంటూనే ఆలస్యం చేసింది. కోలుకుంటూనే కూతురును తను అడిగి తిరిగి ఆమెను అస్వస్థురాలిని చేయడం ఆమెకు హితవు కాలేదు. ముగ్గురు కూతుళ్ళలోనూ సరోజ అంటేనే ఆమెకు బాగా ప్రేమ.

శ్రీకాంత్‌కి, టైలరింగు స్కూలుకి వెళ్తూ తండ్రి అన్న మాటలు చెప్పింది సరోజ. శ్రీకాంత్‌కి చేతిలో చిల్లిగవ్వలేదు. అన్నారావు, సరోజ వైద్యం కోసం పెద్దగా యిచ్చుకోలేకపోయాడు. మిగిలిన కేసులు ఈ మధ్య కాలంలో వట్టిపోయాయి శ్రీకాంత్‌కి.

"ఏం చేద్దాం?" అడిగాడు శ్రీకాంత్.

"మీ యిష్టం" అన్నది సరోజ.

"నా కోసం అందరినీ వదులుకోగలవా?"

సరోజ తల వంచుకుంది.

"చెప్పు సరోజా?"

సరోజ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"మీ ప్రాక్టీసు?"

"విజయవాడ వెళ్ళిపోదాం. ప్రాక్టీసు అక్కడే పెట్టుకుంటాను."

"ఇద్దరమూ బ్రతకగలమా?"

"నన్ను సందేహిస్తున్నావా సరోజా? నిన్ను పోషించుకోలేనా? నా వృత్తిమీద, నా కృషి మీదా నాకు నమ్మకం వుంది."

"విజయవాడ వరకు ఎలా వెళతాం?"

తాతబ్బాయిని వంద అడుగుతాను. అతని సైకిలు అడిగి తెచ్చి కాలవగట్టున గడ్డిమేటు ప్రక్కన ఉంచుతాను. మీ అమ్మ పూర్తిగా నిద్రలోకి జారుకున్న తర్వాత ధైర్యంగా వచ్చెయ్యి. నీకోసం కాచుకుంటాను."

సరోజకి ఒళ్ళంతా భయం ప్రాకి నీరసం వచ్చేసింది. ఏదో చేయాలి తప్పదు.

"ఇష్టమేనా?"

సరోజ తల ఊపింది.

సంఘం దృష్టిలో తను శ్రీకాంత్‌తో లేచిపోయినట్టు కాబోలు సరోజలో మొండి ధైర్యం ప్రవేశించింది.

రిక్షా కుదుపుతో ఈ లోకంలోకి వచ్చి పడింది సరోజ. మధు ఉలిక్కిపడి లేచాడు. రిక్షా దంతపల్లి కాలవ గట్టు పట్టింది.

"అమ్మా" అన్నాడు మధు.

"వచ్చేశాం బాబూ తాతయ్యగారి ఊరు వచ్చేశాం" అనంది సరోజ.

వారం క్రితం నరసమ్మ ఉత్తరం రాయించింది సరోజకి. మీ అక్కలు బావలతో వస్తున్నారు. ముగ్గురినీ ఒక్కసారిగా చూసుకోవాలని మీ నాన్న ఆరాటపడుతున్నారు. శ్రీకాంత్‌తో కలసి ఒకసారి రమ్మని ఉత్తరంలో సారాంశం.

శ్రీకాంత్‌కి క్షణం తీరడం లేదు. ఉదయం సాయంత్రం రెగ్యులర్‌గా ఇంజక్షన్లు యివ్వవలసిన పేషంట్లున్నారు. అతడి క్రింద ఒక కాంపౌండరు ఉన్నాడు. కానీ, అతని చేత ఇంజక్షన్లు తీసుకోవడం యిష్టంలేని పేషంట్లు కొంతమంది వున్నారు.

అయిదేళ్ళ తరువాత పుట్టింటికి వెళ్ళడానికి సరోజకి బెరుకుగా వుంది.

తను లేచిపోయింది వాళ్ళ దృష్టిలో. తల్లి రమ్మని రాసింది కానీ చుట్టుప్రక్కలవారు తన పట్ల ఎలాంటి భావాలు ప్రదర్శిస్తారో తనకు తోచడంలేదు.

అక్కలు తనంటే ప్రేమ చూపేవారు. తనమీద ఈ ముద్ర పడినప్పుడు వాళ్ళలో చెలరేగిన భావాలేమిటో తనకు తెలియదు. ఇప్పటికీ వాళ్ళు తనపట్ల ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారో తను వూహించలేకపోతోంది.

పెద్దక్క భర్త జూనియర్ ఇంజనీర్ అయ్యాడు. వాళ్ళు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

చిన్నక్క భర్త ఒక పల్లెటూళ్ళో ఎలిమెంటరీ స్కూలు మాస్టరు.

ఆ ఇద్దరు అల్లుళ్ళని కొనుక్కోవడంతోనే తన తండ్రి జీవితం సరిపోయింది. తన తండ్రి ప్రతాపం చూపడానికి తన పెళ్ళి అతనికి ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు. 'ఆయన అభిమానం గాయపడటానికి అదే కారణం' అంటూంటాడు శ్రీకాంత్.

సరోజ ఆలోచనలకు ఆనకట్ట వేసే ప్రయత్నంలాగా రిక్షా ఆపి బెల్ కొట్టాడు రిక్షా డ్రైవర్.

సరోజ రిక్షా దిగి బాబుని ఎత్తుకుని సంచి తీసి రిక్షా అతనికి డబ్బులిచ్చింది. తలెత్తి చూడటానికి బిడియంగా వుంది. అప్పటికే ఊళ్ళోకి రిక్షా రావడంతో పిల్లలు బిలబిలలాడుతూ పరిగెత్తుకు వచ్చి చుట్టూ మూగారు. పనిపాటల్లో ఉన్న స్త్రీలు ఇళ్ళల్లోంచి బయటకు వచ్చి విడ్డూరంగా చూస్తున్నారు.

సరోజ పిల్లల్ని తప్పించుకుంటూ కాల్వగట్టు వెంబడి నడచి వంతెన దాటి అవతలి ప్రక్కకి వెళ్ళింది.

నరసమ్మ ఎదురువచ్చి మధును అందిపుచ్చుకుని ముద్దుపెట్టుకుని, "బాగున్నావా అమ్మా? అల్లుడు రాలేదా?" అన్నది.

సరోజలో బెదురు తగ్గింది. తల్లి పలకరింపు విన్నాక వాతావరణం సుముఖంగా ఉన్నట్టు ఆనందం కలిగింది.

"ఆయనకి తీరిక లేదు. కేసులు ఎక్కువయ్యాయి. నీ వంట్లో బాగుంటోందామ్మా?" అన్నది సరోజ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఇంట్లో అడుగుపెట్టారు. ఇల్లు బిలబిలలాడుతూ ఉంది. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న దానిలాగా ఉండే ఇల్లు పిల్లలతో సందడిగా ఉంది.

"పెద్దక్కకి ఇద్దరు పిల్లలు. చిన్నక్కకి ముగ్గురు."

సరోజ మౌనంగా తల ఊపింది.

పెద్దక్క కాంతం పిండి రుబ్బుతూంది.

సరోజని చూస్తూనే, "ఇదేనా రావడం?" అన్నది.

సరోజ తలాడించింది, "చిన్నక్క ఏదీ?" అంది.

"ఎవరింటికో వెళ్ళినట్టుంది పిల్లల్ని వదిలి పెట్టి" అంది పెద్దక్క విసుగుతో.

అన్నారావు వస్తూనే సరోజని పలకరించాడు. శ్రీకాంత్ గురించి అడిగి తెలుసుకున్నాడు.

సరోజ అన్యమనస్కంగా వుంది. తను ఎంత భయపడుతూ వచ్చిందో, అంతా నిజంగానే జరుగుతోంది. తన అక్కలకు జరిగినట్టు తనకి జరగడంలేదు. వాళ్ళ పిల్లలకు అందినట్టుగా తనపిల్లవాడికి అందడం లేదు. తల్లి కూడా ఏమంత ఆసక్తి కనబరచటం లేదని సరోజకి అనుమానంగా వుంది.

కేవలం నా అనుమానమేనా? 'కాదు' అంది మనస్సు.

ఆ రోజు అందరూ తలంటుకున్నారు. మధుకి తలంటుదామంటే కుంకుడు పిప్పి తప్ప ఏమీ మిగలలేదు. తనయితే సబ్బుతోనే ముగించుకుంది. తల్లికి తెలిసి కూడా కిరాణా కొట్టునుండి తెప్పించలేదు.

పుట్టింట్లో అభిమాన పడటమేమిటి? అని సరోజ తనని తాను సమాధాన పరచుకోవాలని చూసింది. లాభం లేకపోయింది. ఉదయం భోజనాల దగ్గర తనవంతు వచ్చేటప్పటికి కొన్ని ఆధరువులు తగ్గిపోయాయి. సరోజలో దుఃఖం పొర్లుకొచ్చింది.

కేవలం తను చుట్టం చూపుగా వచ్చిందే తప్ప, పుట్టింట్లో తనకి వాటాగానీ, స్థానంగానీ లేవు. తన కొడుకు తల్లిదండ్రులకు 'ముద్దుల మనవడు'కాలేదు. తనది సాంప్రదాయ బద్ధమయిన పెళ్ళి అయివుంటే తనకివన్నీ తీరని కోరికలు కావు.

అక్కలు పై మెట్టు మీదనుంచి తనని చూస్తున్నారనిపిస్తోంది.

ఏమో తన భ్రమేమో? సరోజ ఉలికిపడి చూసింది. తనని ఎవరో కనిపెడుతున్నట్టు తోచింది. చుట్టూ చూసింది. చినబావ తనని తినేసేలాగా చూస్తూ చటుక్కున చూపులు మరల్చుకున్నాడు. తను వచ్చినప్పట్నుంచి తనని వెంటాడుతున్నాడు.

సరోజ చప్పున బట్టలు సర్దుకుని లేచి వెళ్ళిపోయింది.

మధు ఏడుపు మొదలు పెట్టాడు. రాత్రి తొమ్మిదయి వుంటుంది. గాలి తగలక ఉక్కగా ఉంది. సరోజ మధుని ఎత్తుకుని వాకిట్లోకి వచ్చింది.

చీకటిలో ఊరంతా ఎప్పుడో సద్దుమణిగింది. గాలిలో మధుని ఆడించాక కొంతసేపటికి భుజం మీద నిద్రపోయాడు. తను పిల్లవాడితో తిప్పలు పడుతున్నా, తల్లి మెలకువగా వుండి కూడా కిక్కురుమనక పోవడం సరోజ గమనించింది. అదే అక్కల పిల్లలు ఏడ్చినప్పుడు ఆమె గాభరాపడి ఊరుకోబెట్టడం తను చూసింది.

మధుని అలాగే భుజం మీద వుంచుకుని ఇంట్లోకి నడిచింది. ఇద్దరు అక్కలూ రెండు గదులు ఆక్రమించుకున్నారు. తల్లికొక మంచం, తండ్రికొక మంచం. పిల్లలందరూ రెండు మంచాలమీద సర్దుకు పడుకున్నారు. సరోజకు చాప దక్కింది. పిల్లలకు తలగడలున్నాయి. సరోజకు గుడ్డలమూట ప్రాప్తమయింది. చాపమీద పడుకున్నది గానీ సరోజకి నిద్రరావడంలేదు. నిశ్శబ్దంలో ఎవరో వెక్కి వెక్కి ఏడవటం వినిపించింది సరోజకి. అలాగే చెవులు రిక్కరించుకుని వింది.

ఏడుస్తోంది పెద్దక్క.

"ఏమే నా ఇష్టం – నా సంపాదన. నీ తాత ఎవడన్నా ఇచ్చాడా? తాగితే తాగుతాను. ఎవడడుగుతారు?" అంటున్నాడు పెద్దబావ ముద్దగా.

"నీ చేతులిరగ. తాగితే తాగు. నన్ను ఎవరు కొట్టమన్నారు? తాగొచ్చిన వాడివి నోరు మూసుకుని పడుకో" శోకాలు పెడుతోంది పెద్దక్క.

ఆ వెనక దభీదభీమని గుద్దినట్టు చప్పుడు, ఆ వెనుక మెల్లగా ఏడుపు.

సరోజకి నిద్ర పూర్తిగా దూరమైంది.

"పెద్దల్లుడిని కేకలు వేయరాదూ?" అంటోంది తల్లి.

తండ్రి నిట్టూర్చి ఊరుకున్నాడు.

సరోజకి ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

"అబ్బ! వద్దండీ"

"ఎప్పుడూ వద్దంటావు ఎలా? నేను వేరే మార్గం చూసుకోనా?" అంటున్నాడు చినబావ.

"ఆపరేషన్ చేయించుకోరు. నాలుగో సంతానం కలిగితే ఎలా?"

"పుట్టరు లెద్దు"

ఏమో నాకు మాత్రం పచ్చిపుండులా వుంది ఒళ్ళంతా."

"నెలలో పాతిక రోజులు నీకు అంతే" శాంతక్క, బావల తగాదా యిక వినలేక చెవులు మూసుకుంది సరోజ.

సరోజ స్నానం చేసి వచ్చేటప్పటికి మధుని పట్టుకు కొడుతోంది శాంతక్క.

"చూడు బాబు తినేదాంట్లో కిందపడిన ఎంగిలి పోస్తున్నాడు. సంకరజాతి లక్షణం కాకపోతే" అంటోంది చిన్నక్క.

సరోజ, శాంతక్కతో తగాదా వేసుకునేందుకు సిద్దంగా లేదు. తను రాత్రంతా ఆలోచించి విజయవాడ వెళ్ళిపోవడానికి నిర్ణయించుకుంది. తనకి పుట్టింట్లో ఉండడం దుర్భరంగా ఉంది.

తండ్రి స్థితి చాలా అధ్వానంగా వుంది. కిరాణా కొట్లో అయిదువందల పై చిలుకు బాకీ వుందట. ఉదయాన్నే సందువా పెట్టె తిరగేస్తుంటే బావలు అతడికి పంపుతున్న మనియార్డరు ముక్కలు కనిపించాయి. నెలకి ఇరవై ముప్పై సర్దుబాటు చేస్తున్నారు వాళ్ళు. పెన్షన్ డబ్బులూ, అవీ ఇవీ కలుపుకుని గుట్టుగా కాలక్షేపం చేస్తున్నారు తన తల్లీ, తండ్రీ. అందుకే అక్కల బ్రతుకులు పైకి పటాటోపంగా ఉన్నా, లోపల జరిగేది తెలిసినా తండ్రి మాట్లాడలేకపోతున్నాడు.

నాలుగు మెతుకులు ఎంగిలిపడి ఎవరూ చూడకుండా తల్లికి తన చీరల్లో రెండు యిచ్చింది సరోజ. తల్లి కళ్ళల్లో నీళ్ళు తిరగడం స్పష్టంగా చూసింది సరోజ. ప్రయాణం ఖర్చులకు పోగా, పాతిక రూపాయలు మిగులుతాయని లెక్కపెట్టుకుని వాటిని తల్లి చేతిలో పెట్టింది సరోజ.

"నాన్న లేరా?" అడిగింది సరోజ.

"ఆరవల్లి వెళ్ళారు" అన్నది తల్లి.

సరోజ అందరి దగ్గరా శలవు పుచ్చుకుని బయలుదేరింది. దారిలో జట్కా కనిపించింది. స్టేషను చేరుకుని టిక్కెట్టు తీసి ప్లాట్‌ఫారం మీద బెంచీపై కూర్చుంది.

చెమటలు కక్కుతూ తండ్రి వెతుక్కుంటూ రావడం చూసింది సరోజ. చటుక్కున నిలబడి, "నాన్నా!" అంది

అతడు వస్తూనే మధుని ఎత్తుకుని ముద్దాడి, జేబులోంచి ఉంగరం తీసి అతడి వ్రేలికి తొడిగాడు.

సరోజకి కృతజ్ఞతా భారంతో కడుపులో దేవినట్టయింది. ఆ వుంగరంతో వాళ్ళు మరెంతగా దరిద్రంలో దిగబడ్డారో?

"ఇప్పుడు అది ఎందుకు నాన్నా?" అంది సరోజ.

"ఉండనియ్యి తల్లీ. రాక రాక యింటికి మనవడు వస్తే ఈ మాత్రం యిచ్చుకో తగనా తల్లీ" అన్నారావు గొంతు పూడుకుపోయింది.

"ఉంగరానికి డబ్బు ఎక్కడిది నాన్నా?"

"మీ అమ్మ తన పాత దుద్దులు చెడగొట్టి, చిన్న దుద్దులు చేయించి, మిగిలిన దానితో ఉంగరం చేయించింది. కంసాలి ఈ రోజు వరకూ ఇవ్వలేదు. అదృష్టవంతుడిని తల్లీ. సమయానికి అందాయి" అన్నాడు అన్నారావు చుట్టూ చూస్తూ. బావలు ఇటు ఏమైనా వచ్చారేమోనని తండ్రి కంగారు పడుతున్నాడు.

ఉన్నట్టుండి అన్నారావు ఏడవసాగాడు.

"ఊరుకో నాన్నా!"

సరోజ దుఃఖం అణచుకోలేకపోయింది.

సిగ్నల్ స్థంభం దగ్గర రైలు బండి మలుపు తిరుగుతూ కనిపించే సమయానికి, ఆమెకు మనసులో ఏ బరువూలేదు.

# అజ్ఞాత రచయిత


- మల్లాది వెంకటకృష్ణమూర్తి

(1981 ఆంధ్రసచిత్రవార పత్రిక జనవరి 30 నుంచి)

**కథా రచయిత** పరమేశ్వర్ ఆఫీస్ నించి ఇంటికి రాగానే అతని భార్యతో చెప్పాడు.

"నానిగాడు చదువులో బొత్తిగా వెనక పడిపోతున్నాడని దారిలో కనపడి చెప్పారు మేష్టారు."

"వాడు నా మాట వినటం లేదు. మీరేమో ఇంటికి రాగానే కాగితాల ముందు కూర్చుంటారు."




కాఫీ తీసుకురావడానికి వంట గదిలోకి వెళ్ళింది అతని భార్య.

తన రైటింగ్ టేబుల్ మీద నాలుగు ఉత్తరాలు ఎదురు చూస్తూ కనిపించాయి. కవరు మీద చేతి వ్రాత కొత్తగా కనబడటంతో ముందుదాన్ని కత్తిరతో కత్తిరించి లోపలనించి మడతబెట్టిన ఉత్తరం తీసి విప్పి చదివాడు.

**ప్రఖ్యాత రచయిత శ్రీ పరమేశ్వర్‌కి–**

మీ విలువైన కాలం వృధా చేస్తూ ఉత్తరం రాసే ఈ అపరిచిత వ్యక్తి ఎవరా అనుకుంటున్నారు కదూ? నమస్కారమండి నా పేరు రామం. మీ కథలు చాలా సంవత్సరాలుగా చదువుతున్నాను ముఖ్యంగా మీ సీరియల్ నవల 'మనసులో మనసు' నన్ను బాగా ఆకట్టుకుంది. మీరు నా అభిమాన రచయిత.

మీ నుంచి చిన్న సహాయం కావాలి. ఈ ఉత్తరంతోపాటు జత చేస్తున్న కాగితం మీద మీ ఆటోగ్రాఫ్ కావాలి నాకు. మీ సౌకర్యం కోసం నా చిరునామా గల కవరు కూడా జతచేస్తున్నాను. సంతకం చేసి, వ్రాస్తే నాలుగు ముక్కలు ఏమైనా రాసి పంపించండి. ఎందుకనుకుంటున్నారా? మీలాంటి రచయితల సంతకాలు సేకరించడం హాబీగా పెట్టుకున్నాను. ఈ విధంగా దాదాపు వందమందివి సేకరించాను. ఆ కాగితాలన్నీ కలిపి బైండ్ చేయించదలచుకున్నాను. చాలామందికి స్టాంపులు, నాణాలు సేకరించే హాబీ వుంటే, నాకు రచయితల చేతివ్రాత, ముఖ్యంగా సంతకాలు సేకరించే హాబీ వుంది.

మరో సహాయం కూడా చేయాలి. ఇంతదాకా మీ ఫోటో ఏ పత్రికలో ప్రచురింపబడలేదు. మీరు పంపలేదు, పంపినా సంపాదకుడు వేయలేదో తెలియదుకాని దయచేసి మీ ఫోటో కూడా ఒకటి పంపండి రచయితల ఫోటోలుండే ఆల్బంకూడా ఒకటి నాదగ్గర వుంది. తప్పక పై రెండింటినీ పంపుతారని ఆశిస్తూ ఈ ఉత్తరం ముగిస్తున్నాను

**భవదీయ**

**రామం.**

ఆ ఉత్తరాన్ని చదివి చిన్నగా నవ్వుకున్నాడు పరమేశ్వర్. అతని హాబీకి ముచ్చటకూడా వేసింది.

భార్య కాఫీ కప్పుతో వచ్చింది భర్తకి కప్పు అందించి ఆ ఉత్తరం అందుకుని చదివింది.

"పంపటంలేదా?" అడిగింది భర్తని ఆ ఉత్తరంతోపాటు పంపబడ్డ ఖరీదైన తెల్లటి కాగితం చూసి.

తల అడ్డంగా ఊపాడు పరమేశ్వర్.

"ఇతనికి మాత్రం పంపండి. అందరి సంతకాలుంటాయి కాని మీది మాత్రం వుండదా బైండ్‌లో. ఫోటో ఎలాగూ పంపరు."

"ఊహు. పద్ధతంటే పద్ధతే"

పరమేశ్వర్ కాఫీ తాగి, మిగతా ఉత్తరాలు చదివి, మొహం కడుక్కోడానికి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

పద్దెనిమిదేళ్ళుగా పరమేశ్వర్‌తో కాపురం చేస్తున్న ఆవిడకి తెలుసు. తన భర్త అభిమానులకి, కొత్తవాళ్ళకి ఉత్తరం రాయటం కాని, ఫోటోలు పంపటం కానీ చేయరని. అనేకసార్లు అతన్ని పోరింది ఫోటోని పత్రికలకి ప్రచురణకి పంపమని పక్కింటి వాళ్ళకి, కూరల దుకాణంలో, పచారీ దుకాణంలో, బంధువులకి అందరికీ గర్వంగా చూపించుకోవచ్చు ఆ ఫోటో పడ్డ పుస్తకం.

ఎంత బ్రతిమాలిడినా మొండిగ నిరాకరించాడు. అంతేకాదు. తరచు జరిగే సాహితీ సభలకి ఆహ్వానం వచ్చినా వెళ్ళడు.

"నాకు ఇష్టంలేదు బలవంతంచేసి పంపకు" అంటాడు.

"ఎందుకు ఇష్టంలేదు?" నిలదీస్తుంది.

"అక్కడికి వెళితే ఫోటోలు తీస్తారు. కొన్ని వందలమంది కళ్ళబడాలి."

"ఇదేం పద్ధతండీ మీది? తమ ఫోటో పేపర్లో పడాలని కోరుకోని వాళ్ళు వుండనే ఉండరు."

"ఒక్క నేను తప్ప" నవ్వుతాడు.

విసిగిపోయి ఇక ఆ ప్రసక్తి మానేసి పదేళ్ళు దాటింది.

పరమేశ్వర్ ఆ రాత్రి ఓ కథ రాద్దామని రైటింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. మళ్ళీ రామం రాసిన ఉత్తరం అతని కంట పడింది.

వెంటనే అతనికి సౌమిత్రి గుర్తు వచ్చింది.

ఇప్పుడెక్కడుందో? ఎలా వుందో అనుకున్నాడు.

సౌమిత్రి అన్నయ్య కూడా గుర్తుకు వచ్చాడు.

పరమేశ్వర్ కాలేజీలో చదువుతున్న రోజులవి. బి.ఏ ఆఖరి సంవత్సరంలో చేరడానికి సెలవలయాక కాకినాడకి వచ్చాడు మళ్ళీ. వారం రోజులు ప్రయత్నించాక ఓ డాబాలో మేడమీది చిన్నగది అద్దెకి దొరికింది. అది ఇండిపెండెంటు గది కాబట్టి, యింటివాళ్ళతో ఎలాంటి సంబంధం వుండేది కాదు.

ఆ డాబాలో కింద పోర్షన్‌లో అద్దెకుండేవాళ్ళు సౌమిత్రి, సౌమిత్రి అన్నయ్య, వాళ్ళ తల్లిదండ్రులు.

చాలాసార్లు సౌమిత్రిని చూశాడు పరమేశ్వర్. లంగా వోణీలతో, చామన ఛాయతో పద్దెనిమిదేళ్ళ సౌమిత్రి పరమేశ్వర్ మనసుని దోచింది. సౌమిత్రి కూడా పరమేశ్వర్‌ని అవకాశం దొరికినప్పుడల్లా దొంగచూపులు చూసేది.

ఓసారి మేడ మెట్లెక్కుతూంటే సౌమిత్రి పలకరించింది పరమేశ్వర్‌ని.

"మీరు స్టూడెంట్ కదా?"

"అవును" తడబడుతూ చెప్పాడు.

"నవల్స్ ఏమైనా వుంటే ఇస్తారా?"

"ఉండండి తెస్తాను."

గబగబా పైకి పరిగెత్తి గదిలో వున రెండు నవలలు తెచ్చి సౌమిత్రికి ఇచ్చాడు.

ఆ తర్వాత సాహిత్యం అంటే చాలా అభిలాష వున్న పరమేశ్వర్ తనకోసం తెచ్చుకునే ప్రతీ నవలా, ప్రతీ పత్రికా సౌమిత్రికి ఇస్తూండేవాడు.

ఇంటిదగ్గర మాట్లాడుకునేవాళ్ళు కారు. కాని బయట ఎక్కడైనా కనబడితే రోడ్డుమీద మాట్లాడుకునేవారు.

నాలుగైదు నెలల్లోనే అది ప్రేమకు దారి తీసింది. "బి.ఏ అయాక ఎం.ఏ చదివి లెక్చరర్ అవుదామనుకున్నాను కాని ఏదో ఓ ఉద్యోగం చూసుకుని నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అని అనేకసార్లు చెప్పాడు సౌమిత్రికి.

ఆరోజు బాగా వర్షం పడుతోంది. కాలేజీనించి ఇంటికి వచ్చిన పరమేశ్వర్ మేడ మెట్లెక్కి పైకెళ్ళాడు. తలుపు తాళం తీద్దామని జేబులో చూసుకుంటే తాళం చెవి లేదు.

హోటల్‌లోనో, ఎక్కడో జారిపోయి ఉంటుందనుకున్నాడు. తాళం పగలకొట్టించడానికి ఎవరయినా మనిషిని పిలుచుకురావాలని మెట్లు దిగి కిందకి వచ్చాడు.

వాళ్ళింటి గుమ్మంలో నిలబడ్డ సౌమిత్రి పలకరించింది అతన్ని.

"ఎక్కడికి?" జరిగింది చెప్పాడు.

"ఎవరూ దొరక్కపోతే ఓ స్నేహితుడి గదిలో పడుకుంటాను ఈ రాత్రికి"

"కాసేపు లోపలికి రండి."

"ఎవరూ లేరా?"

"ఉహూ అమ్మా, నాన్నా పుష్కరాలని రాజమండ్రి వెళ్ళారు. అన్నయ్య సినిమాకి వెళ్ళాడు."

పరమేశ్వర్ లోపలికి వెళ్ళాడు. సౌమిత్రి తలుపు మూసి లోపల గడియ పెట్టింది.

"మంచినీళ్ళు కావాలా?" అడిగింది.

"వద్దు. దాహం లేదు బయట వర్షంగా"

చిలిపిగా నవ్వింది సౌమిత్రి. "బయట వర్షం పడుతుంటే దాహంగా లేదా?"

"ఉంది."

సౌమిత్రిని దగ్గరకి లాక్కున్నాడు. అతని భుజాల చుట్టూ రెండు చేతులూ వేసి అన్నది.

"ఐ లవ్‌యు. మీరు పాసవగానే మనం ఎలాగూ భార్యాభర్తలవుతాంగా."

ఆ తర్వాత ప్రేమలేఖలు రాసి పుస్తకాలలో వుంచి ఎక్సేంజ్ చేసుకునేవారు.

ఓ రోజు కొంప మునిగింది.

"ఏమిటిది?"

మొదటిసారిగా పరమేశ్వర్ గదిలోకి వచ్చిన సౌమిత్రి అన్నయ్య, పరమేశ్వర్ రాసిన ఓ ప్రేమలేఖని అతని చేతికిచ్చి అడిగాడు ఉగ్రంగా.

పరమేశ్వర్‌కి వెంటనే ఏం మాటాడాలో తెలియలేదు.

"ఇంకోసారి ఇలాంటి పిచ్చి వేషాలు వేస్తే, నా సంగతి నీకు తెలుసుగా?"

పరమేశ్వర్ మాట్లాడలేదు.

"వారం టైం ఇస్తున్నాను. ఈలోగా గది ఖాళీ చెయ్యి లేదా నేనే సామాను బయట పారేస్తాను. అందరి ముందు అల్లరి పెడతాను."

మర్నాడు సౌమిత్రి వచ్చింది. మొహం పీక్కుపోయి వుంది.

"నిన్నేమయినా అన్నారా?" అడిగాడు.

"నాకు నెల తప్పింది. ఈ సంగతి మా ఇంట్లో తెలిస్తే చంపేస్తారు" సౌమిత్రి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"గుడ్ గాడ్. ఎలా ఇప్పుడు?" అడిగాడు కంగారుగా.

"ఏం చేద్దాం? పారిపోదామా?" అడిగింది సౌమిత్రి.

"ఎక్కడికి?"

"ఎక్కడికయినా."

"ఎలా బ్రతుకుతాం?"

"....."

"ఇంట్లో చెప్పక అప్పుడే. నన్నో రెండురోజులు ఆలోచించుకోనీ."

మర్నాడు ఉదయం పరమేశ్వర్ కాలేజీ లైబ్రరీలో తీసుకున్న పుస్తకాలు రెండూ తిరిగి ఇచ్చేసి, టి.సి తీసుకుని అర్ధరాత్రి రహస్యంగా గది ఖాళీచేసి, తన ఊరు పారిపోయాడు. బి.ఏ వైజాగ్‌లో పూర్తి చేసాడు.

ఆ తర్వాత కాకినాడ మళ్ళీ ఎప్పుడూ వెళ్ళలేదు.

యం.ఏ సాగర్‌లో చేసాడు. హైద్రాబాద్‌లో తను కోరుకున్న లెక్చరర్ ఉద్యోగం దొరకలేదుకాని అసెంబ్లీలో యు.డి.సి ఉద్యోగం దొరికితే అందులో చేరాడు.

క్రమంగా సాహిత్యం మీదవున్న అభిలాష, రచనా వ్యాసంగానికి దారి తీయించింది.

ఉద్యోగంలో చేరాక కథలు రాయసాగాడు. పత్రికలు ప్రచురించసాగాయి. చక్కటి కథా రచయితగా గుర్తింపు వచ్చాక నవలలు రాయసాగాడు. అవీ ప్రచురింపబడ్డాయి.

నాలుగుసార్లు కథల పోటీలో బహుమతులు లభించాయి. ఫోటో, జీవిత వివరాలు పంపమని రాసారు సంపాదకులు, మొదటిసారి బహుమతి లభించినప్పుడు. ఫోటో తీయించుకున్నాడు. పోస్ట్ చేయబోయేముందు ఓ సహోద్యోగి అన్నాడు కొద్దిగా అసూయగా –

"నీ ఫోటో లక్షలమంది పాఠకులు చూస్తారు. అందులో అమ్మాయిలూ వుండచ్చు. బావున్నాడు  అనుకుంటారు కొందరు కదా?"

సౌమిత్రి కూడా చూడొచ్చు అనిపించింది ఆ మాటలు వినగానే. సౌమిత్రి అన్నయ్య, వాళ్ళ తల్లితండ్రులు, కాకినాడలోని తన ఇంటివాళ్ళు, తన క్లాస్‌మేట్స్ ఇంతమందిలో ఏ ఒక్కరు చూసినా తనెక్కడున్నాడో తెలుస్తుంది.

మూడు సంవత్సరాల్లో తన పగని మరిచిపోకపోవచ్చు ఆఫీసుకో, ఇంటికో వచ్చి తనని నిలదీసి అడిగితే ఏం సమాధానం చెప్పగలడు?

ఫోటో పంపలేదు. చింపేసాడు. ఆ తర్వాత నవలలు సీరియల్స్‌గా మొదలయినా, ఏ అవకాశం వచ్చినా తన ఫోటోని ప్రచురణకి పంపలేదు. అభిమానులమంటూ ఉత్తరాలు పాఠకులనించి వచ్చినా సమాధానాలు రాయలేదు.

పరమేశ్వర్‌కి తెలుసు. జవాబు రాస్తే వాళ్ళు ఆ ఉత్తరాన్ని గర్వంగా అనేకమందికి చూపించే అవకాశం వుందని.

యాదృచ్ఛికంగా అది సౌమిత్రో, సౌమిత్రి అన్నో చూసి, తన చేతి వ్రాతని గుర్తుపడతారనే భయం పరమేశ్వర్‌లో, నరనరాల్లో పేరుకుపోయింది అందుకే ఎవరికీ జవాబులు వ్రాయడు.

పత్రికలకి తన గురించి పంపే పరిచయంలో తను బి.ఏ మూడేళ్ళు వైజాగ్‌లో చదువుకున్నట్లుగానే రాస్తాడు, నిజానికి కేవలం ఆఖరి సంవత్సరమే వైజాగ్‌లో చదివినా.

పద్దెనిమిది సంవత్సరాలుగా ఇలా సాగుతోంది.

ప్రతీ సంవత్సరంలాగే ఆసారి కూడా పరమేశ్వర్ భార్యా, పిల్లలతో హైదరాబాద్‌లో జనవరి, ఫిబ్రవరిలలో జరిగే ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళాడు.

పిల్లలు గొడవచేస్తే జైంట్‌వీల్ ఎక్కాడు వాళ్ళతోపాటు.

దిగి బయటకి వచ్చాక, "హలో" అన్న ఆడ కంఠం వినిపించింది.

అటు చూసాడు. ఎవరో కొత్త వ్యక్తి. రెండడుగులు ముందుకు వేసాక, ఆ వ్యక్తిని ఎక్కడో చూడటం జరిగిందనిపించి వెనక్కి తిరిగి చూశాడు మళ్ళీ.

"సౌమిత్రి?" అన్నాడు పెగుల్చుకుని.

"ఎలా వున్నావ్? బట్టతల వచ్చేస్తోందే?" నవ్వింది సౌమిత్రి పరమేశ్వర్‌ని ఎగాదిగా చూసి.

పరమేశ్వర్ మొహంలోకి భయం, ఆశ్చర్యం కలగా పులగంగా పాకాయి.

"కులాసానా?" అనడిగాడు. ఈ జీవితంలో ఎవరి కంట మళ్ళీ పడకూడదనుకున్నాడో ఆ వ్యక్తి తటస్థించింది.

"పిల్లలా?" అడిగింది నానిగాడిని, వాడి చెల్లెళ్ళిద్దరినీ చూసి.

"ఎవరండీ?" అడిగింది పరమేశ్వర్‌ని, అతని భార్య రహస్యంగా.

"నా భార్య" పరిచయం చేసాడు సౌమిత్రికి తన భార్యను వెంటనే.

"నమస్తే."

"నమస్తే."

"మీ పేరు?"

"సౌమిత్రి. మీ వారెప్పుడూ చెప్పలేదా నా గురించి?"

"పెళ్ళయిందా?" అడిగాడు పరమేశ్వర్ తల వంచుకుని చేతి గడియారానికి కీ ఇస్తూ .

"అయింది."

"పిల్లలా?"

తల ఎత్తకుండానే అడిగాడు.

"లేరు."

తలెత్తి చూసాడు సౌమిత్రి వంక.

సౌమిత్రి కూడా పరమేశ్వర్ కళ్ళలోకి చూసింది. ఆ కళ్ళలోని భావం అంతుపట్టలేదు పరమేశ్వర్‌కి.

"ఎక్కడ వుండేది?"

"రాంచి ఆయనకు అక్కడ ఉద్యోగం. మా అన్నయ్యకి సంవత్సరం క్రితం బదిలీ అయింది ఇక్కడికి. ఎగ్జిబిషన్ చూద్దామని వచ్చాను."

నడుస్తున్నారు అంతా కలిసి. సౌమిత్రిని అడగాలనుకుంటున్నాడు కాని పక్కన భార్య వుండడంతో ఎలా వంటరిగా మాట్లాడాలా అని సతమతమవుతున్నాడు పరమేశ్వర్. అది గ్రహించి చెప్పింది సౌమిత్రి.

"నాకు పిల్లలు పుట్టరని డాక్టరమ్మ తేల్చింది. పుట్టుకలోనే గర్భసంచిలో ఏదో లోపమట."

చటుక్కున ఆగిపోయాడు. పరమేశ్వర్ కళ్ళు సౌమిత్రిని గుచ్చి గుచ్చి చూసాయి.

పరమేశ్వర్ భార్య సానుభూతిగా చూసింది సౌమిత్రి వంక.

నవ్వింది సౌమిత్రి. ఆ నవ్వులో దిగులు.

"ఓసారి నిజంగా నాకు నెలతప్పిందనుకుని సంతోషపడ్డానండి. కాని రెండు నెలలు ఆలస్యంగా అయింది మెన్సెస్. ఇప్పుడూ అంతే మూడు నాలుగు నెలలకోసారి అవుతూంటుంది."

"ఎప్పుడైనా మా ఇంటికి రండి వెళ్ళేలోపల" మర్యాదగా ఆహ్వానించింది మిసెస్ పరమేశ్వర్.

"ఆనంద్‌నగర్ కాలనీలో కదా మీ ఇల్లు?" అడిగింది సౌమిత్రి.

"అవును నీకెలా తెలుసు?" అడిగాడు పరమేశ్వర్ వెంటనే.

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా సౌమిత్రి పరమేశ్వర్ భార్య వైపు తిరిగి చెప్పింది.

"మా వదినకు మీవారి కథలంటే బాగా ఇష్టం. వెళ్ళేలోగా ఓసారి తప్పకుండా వస్తాం."

గుడ్ బై చెప్పి వెళ్ళిపోతున్న సౌమిత్రి వంక అయోమయంగా చూసాడు పరమేశ్వర్.


# అందని ద్రాక్షలు

– పాలకూర సీతాలత

(1977 ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక నుంచి)

**చలికాలపు మంచునీ,** అలుముకున్న చీకటినీ చీల్చుకుంటూ హైద్రాబాదు వైపు పరుగులు తీస్తోంది గోదావరి ఎక్స్‌ప్రెస్.

సింకింద్రాబాదు స్టేషన్ కూడా దాటింది కనుక, బెర్తుమీద పరుచుకున్న దుప్పటిని తీసి ముడిచి సూట్‌కేసులో తోశాడు మురళి.




మరి కాస్సేపట్లో నాంపల్లి స్టేషన్ చేరి, నా బాధ్యత అయిపోయిందన్నట్లు ఆగిపోయింది రైలు. మురళి దిగాడు. అందరిలాగా తోసుకుని వెళ్ళడానికి అతను తొందరపడటంలేదు. సూట్‌కేస్‌ను ప్లాట్‌ఫారం మీద వుంచి జేబులోంచి పాకెట్ డైరీ తీశాడు. అందులోని అడ్రసు ఒకసారి చదువుకున్నాడు. సత్యం స్టేషన్‌కు వస్తానని రాశాడు. అటు, ఇటూ చూశాడు. చలికాలం ఉదయం రాలేక బద్ధకించాడా? ఊహు అలాంటివాడు కాదు.

అలా ఆలోచిస్తుండగానే ప్లాట్‌ఫారం మీద ఓ మెరుపుతీగ మెరిసింది. చిలకాకుపచ్చ రంగు చీర ధరించి, దానికి మ్యాచ్ అయ్యేలా జాకెట్టు ధరించి, పిరుదులు తాకే పొడుగాటి జడ అస్తమానూ అల్లరి పెట్టగా దాన్ని చిరాగ్గా వెనక్కు విసురుకుని హడావుడిగా కంపార్టుమెంటులన్నీ కలియపెడుతున్న ఆ అమ్మాయిని అలా కన్ను ఆర్పకుండా చూడటం సభ్యత కాదని తెలిసినా, చూడకుండా వుండలేక, చుస్తూ రెప్పవాల్చడం మానేశాడు మురళి.

చలిగా అనిపించి ఒక "విల్స్" వెలిగించాడు. గుండెల నిండా పొగ నింపుకుని వదిలాడు. సత్యం వస్తాడేమో అని కొంచెం సేపు చూద్దామని అలాగే నిలబడిపోయాడు. మెరుపు తీగ కోసం చూస్తే మాయమయ్యింది. ఇంకో రెండు నిమిషాల్లో మళ్ళా ప్రత్యక్షమయి తనకు కొంచెం దూరంలో నిల్చుని ఆలోచిస్తోంది. పాపం వస్తానని రాసి ఎవరో వచ్చివుండరు. ఆ అమ్మాయి ఉదయమే లేచి చలిలో వచ్చింది అనుకున్నాడు. వస్తానని చెప్పి రాక, ఈ మెరుపు తీగెకు కష్టం కలిగించిన వాళ్ళపై మురళికి కోపం వచ్చింది. ఇంకో నిముషం గడిచాక ఆ అమ్మాయి మురళిని సమీపించింది.

"ఇఫ్ అయాం నాట్ మిస్టేకన్... యు మస్ట్ బి మిస్టర్ మురళి..."

ఆశ్చర్యపోయాడు. ఆ మెరుపు తీగ తనకోసం వచ్చిందా? వాట్ వండర్.

"ప్లీజ్ స్పీక్" ఆమె హెచ్చరించింది.

సిగ్గుపడ్డాడు మురళి.

"సారీ.. య. ఐ.. మురళి.. బి.యి.జె.యి.." తడబడలాడుతూ తనగురించి అంతా చెప్పేశాడు.

గలగలమని నవ్విందా చిన్నది.

"క్షమించండి మీరెవరో...?"

"నా పేరు లత. బి.ఏ ఫైనల్. నేను మీ సత్యం కజిన్‌ని. మీరు ఈ రోజు వస్తున్నారని సత్యం ఒకసారి చెప్పాడు. నేను నా ఫ్రెండ్ ఒకామెను రిసీవ్ చేసుకోడానికి వచ్చాను. తనుకూడా నాతోనే బయలుదేరాడు. ఇంతలో బాబయ్యగారు వచ్చి

ఉదయమే కూరల మండీకి వెళ్ళమన్నారు. నేను ఎలాగూ స్టేషన్‌కు వస్తున్నాను గనుక మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటానని చెప్పాను. కానీ నా ఫ్రెండ్ రాలేదు. సరే నడవండి" ఆమె మాట్లాడుతున్నట్లు లేదు. వీణలు మీటుతున్నట్లు వుంది.

ఇద్దరూ కలిసి బైటకు నడిచారు. లత ఆటోను పిలవబోతుండగా వారించాడు మురళి.

"ఏమండీ ఒక కాఫీ తాగి వెళదామండి. ఉదయాన్నే అది మాత్రం ఆలస్యమైతే భరించలేను" ఆమె అదోలా చూసింది.

"ప్లీజ్ " అన్నాడు.

ఆమె నవ్వుతూ "నడవండి" అంది.

ఇద్దరూ "దుర్గాభవన్"లోకి దారి తీశారు. ఫామిలీ రూములో కూర్చున్నారు.

సర్వర్‌తో "రెండు ప్లేట్లు ఇడ్లీ, రెండు కాఫీ" చెప్పాడు. కాఫీ తాగుతూ సిగరెట్ పెట్టె బైటకు తీసి..

"మీకు అభ్యంతరం లేకపోతే..." అంటూ ఒకటి నోట్లో పెట్టుకున్నాడు.

"అభ్యంతరం వుంది" అన్నది ఆమె.

ఆశ్చర్యంగా కనుబొమ్మలు ఎత్తాడు.

"మరి నాకు ఇవ్వకుండా మీరు ఒక్కరే తాగితే ఎలా?" అంది.

వెంటనే అతని దృష్టి ఆమె ఎర్రని చిన్ని పెదాలపైకి పోయింది.

చిగురాకుల్లాగ మృదువుగా వున్నాయి అవి.

ఆమె అంది. "లేకపోతే ఏమిటండీ.. సిల్లీ. డోంట్ బీ టూ ఫార్మల్"

అగ్గిపుల్ల గీసుకున్నాడు. బిల్లు చెల్లించాడు మురళి. బైటకు వచ్చాక "ఏమండీ ఈ రాత్రికేకదా పెళ్ళి. ఏమయినా ఒక ప్రజంటేషన్ కొందామండి. మీరు కూడా వున్నారు. సలహా ఇవ్వచ్చు." అన్నాడు. ఆమె చప్పుడయ్యేట్లు రెండు చేతులూ కలిపి నమస్కరిస్తూ

"అయ్యా! ఈ భాగ్యనగరం పదిగంటలయితేగానీ కళ్ళు విప్పదు. మీ ప్రజంటేషన్ మధ్యాహ్నం కొనుక్కోవచ్చు. రండి వెళదాం."

"మధ్యాహ్నం మీరు కూడా వస్తారా?"

"సరే."

ఇద్దరూ ఆటోలో కూర్చున్నారు. ఆటో పంజగుట్టవైపు దూసుకుపోయింది.

మధ్యాహ్నం నిద్ర ముగించి కళ్ళు నులుముకుంటూ రిస్ట్‌వాచ్ చూశాడు. మూడున్నర. బజారుకు వెళ్ళాలి అటు, ఇటు చూశాడు సత్యం జాడలేదు. వెధవ. తనని మరీ ఒంటరిగా వదిలేశాడు. "తను పనులలో తిరుగుతుంటే తనతోపాటు నన్ను కూడా తీసుకువెళ్ళవలిసింది" అనుకున్నాడు. భోజనాలు అయ్యాక "నువ్వు పడుకో" అని పక్క పరిచి ఎటోపోయాడు.

ఇంతలో సత్యం చిన్న తమ్ముడు కనిపించాడు. అతన్ని పిలిచి "సత్యం ఏడోయ్?" అన్నాడు.

"బైటకు వెళ్ళాడండి ఏదో పనిమీద. సాయంత్రందాకా రాడు. రాత్రేకదా పెళ్ళి. బాధ్యత అంతా తనదే" అన్నాడు ఆ తమ్ముడు.

ఓ నిముషం ఆలోచించి "లతగారు ఎక్కడోయ్?" అన్నాడు.

"చూసి పిలుస్తా"నని పోయాడు.

సత్యం, మురళి చాలా మంచి స్నేహితులు. ఇంజనీరింగ్ కాలేజీలో ఒకే బ్రాంచి కలిసి చదివారు. వీళ్ళిద్దర్నీ చూసి మిగతా మిత్రబృందం "ఆదర్శ మిత్రుల"ని పేరు పెట్టారు. అది విని వీళ్ళు నవ్వుకున్నారు. చదువులోకూడా ఇద్దరిదీ పై చెయ్యే. చదువు అయిపోయి విడిపోయినా ఉత్తరాలు రాసుకోవడం ఒకళ్ళ గురించి ఒకళ్ళు తెలుసుకోవడం మానలేదు. మురళి వైజాగ్‌లోనూ, సత్యం హైదరాబాద్‌లోనూ ఉద్యోగాల్లో చేరారు. సత్యం చెల్లి సీత పెళ్ళికి తప్పక రమ్మని సత్యం మరీ మరీ రాయడంతో సత్యాన్ని కూడా చూసినట్లు అవుతుందని బయలుదేరి వచ్చాడు.

ఇంతలో ఒక కుర్రవాడి చేత టిఫిన్, టీ మోయించుకు వచ్చింది లత.

"తీసుకోండి" అంది.

"అరె. నేను నిద్రలేచానని ఎలా తెలుసు?"

"ఎందుకో ఇటువస్తుంటే కూచున్న మీరు కనిపించారు. ఏదో ఆలోచనల్లో మునిగివున్నారు. మళ్ళీ వెనక్కు వెళ్ళి ఇవి తెచ్చాను" అంది టిఫిన్ చూపిస్తూ.

"అబ్బే ఇప్పుడేం వద్దండీ.. టీ చాలు" అంటూ టీ తీసుకున్నాడు.

"ఏమండీ బైటకు వెళ్ళాలి. గుర్తుందా? మీరూ వస్తానన్నారు" గుర్తుచేశాడు మురళి.

"నేనూ వెళ్ళాలి. సీతకు పూలు తేవాలి. మీదే ఆలస్యం. నేను తయారయివున్నాను. రండి మీ పని కూడా అవుతుంది" అన్నది.

ఆమెను పరీక్షగా చూశాడు.

పొద్దున ఒక్క జడ వేసుకుంటే ఇప్పుడు రెండు జడలు వేసుకుంది. వాటిల్లో ఒకటి ముందుకు వేసుకుంది. తలలో గులాబీ, మల్లెలదండ సువాసనలు వెదజల్లుతున్నాయి. ఎడమ చేతికి రిస్ట్ వాచీ, కుడి చేతికి రెండు బంగారు గాజులు. తెల్లని ముఖం మీద ఎర్రని బొట్టు సూర్యుడిలా వెలుగుతోంది. లేత గులాబీరంగు చీరలో తెల్లని బుల్లి పాదాలు దాగున్నాయి.

నల్ల స్ట్రాప్ హైహీల్స్ మెరుస్తున్నాయ్. ఎర్రటి జరీ అంచున్న గులాబీరంగు జాకెట్టు ఆమె యౌవనాన్ని దాయడానికి అవస్థలు పడుతోంది.

"మీరు వచ్చేది వుంద లేదా?" ఆమె పిలుపుకు అదిరాడు.

"ఫైవ్ మినిట్స్" అంటూ పావు గంటలో తన ముస్తాబు పూర్తిచేసుకుని వచ్చాడు.

ఇద్దరూ బయలుదేరారు.

"బస్సుకోసం ఎవడు వెయిట్ చేస్తాడు? " ఆటోలో పోదాం.

"ఎటు వెళ్ళాలో చెప్పండి" అన్నాడు.

"కోటీ" అన్నదామె.

ఆటో బయలుదేరింది.

నాలుగయిదు షాపులు తిరిగారు. ఎన్నెన్నో వస్తువులు చూశారు. కాని వస్తువు విషయంలో ఏకాభిప్రాయం రాలేదు. ఎన్నెన్నో వస్తువులు లతకు నచ్చినవి మురళికి నచ్చలేదు. మురళికి నచ్చినవి లతకు నచ్చలేదు. చివరికి ఒక వెండి రాధాకృష్ణుల విగ్రహం డెబ్బయి రూపాయలు ఇచ్చి కొన్నారు. అది ఇద్దరికీ నచ్చింది.

ఇక పూలు కొందామని లత దారి తీస్తుంటే "ఆకలిగా వుంది మేడం" అన్నాడు.

"అవును. అక్కడ పెట్టిన టిఫిన్లు తినకండి. అవి నచ్చవు మీకు. డబ్బుపోసి హోటల్లో తినేవే బాగుంటాయి మీకు. మీ మగాళ్ళు అందరూ అంతే" అంది.

"ఆహా! మీ ఆడాళ్ళు ఎలాగో మరి? అయినా ఎందరు మగవాళ్ళని స్టడీ చేశారు?" అన్నాడు.

"మాకూ వున్నాయిగా నాలుగు కోతులు. అదే నలుగురు అన్నలు.."

"అన్యాయం అలా అనడం దారుణం. అన్నట్లు మీ అమ్మగారు కనిపించలేదు. ఆమెను మీరు పరిచయం చెయ్యలేదు."

తెల్లని పలువరుస కనిపించేలా నవ్వుతూ "నేను ఒక్కత్తే బాబయ్యగారి దగ్గర. అంటే మా సత్యం నాన్నగారి దగ్గర వుండి చదువుకుంటున్నాను. అమ్మ, అన్నయ్య ఉదయం రావల్సింది రాలేదు. సాయంత్రానికి వస్తారేమో?" అంది.

ఇద్దరూ హోటల్‌కు దారి తీశారు.

సర్వరు టిఫిన్ తెచ్చేలోగా. తన అర చేతిని ఎందుకో చూసుకుంటున్న లతతో "ఆ చేయి ఇలా ఇవ్వండి" అన్నాడు.

ఆమె సున్నితమైన చేతిని తాకి షాక్ తగిలినట్లు ఫీలయ్యాడు.

ఆమె చేతిపై తన చేతితో రాస్తూ "మీది చాలా గొప్ప జాతకం. ఈ చెయ్యిపట్టినవాడు అదృష్టవంతుడు. మీకు విద్య, ధనం రెండూ సమపాళ్ళలో వుంటాయి. అనుకున్నది నెరవేరుతుంది"

"చాలించండి మీ పొగడ్తలు, ఏదేదో చెప్పేస్తున్నారు. అంతా నిజమా? లేక ఉత్తుత్తిగా.."

"అబ్బే సత్య ప్రమాణంగా..." అంటూ తన చేతిని ఆ చేతిలో బంధించి "అంతా నిజమే" అన్నాడు.

తన చెయ్యిని విడిపించుకుని సిగ్గుల మొగ్గలా తలవాల్చి కూర్చున్న ఆమెను చూసి ఎలాగో అయిపోయాడు.

ఎంత ఆపుకుందామన్నా తన తుంటరి మనసు ఆమెవైపు పోతోంది.

హోటల్నుంచి బైటపడి పూలు కొనుక్కుని ఆటోలో ఇల్లు చేరారు.

వివాహం శాస్త్రోక్తంగా జరిగిపోయింది. ఆ వివాహం జరుగుతున్నంతసేపూ తాను లతను వివాహం ఆడినట్లు కలలుగన్నాడు. ఇంచుమించు లత పరిస్థితి కూడా అలాగే వుంది.

ఆ రాత్రి మురళికి సరిగా నిద్రపట్టలేదు. కన్నుమూసినా, తెరిచినా లత రూపమే కనిపిస్తోంది. అందగత్తె. గుణవతి. విద్యావంతురాలు. సంస్కారవంతురాలు. ఇలాంటి సుగుణాల రాశిని తన భార్యగా చేసుకోగలిగే అదృష్టమే అదృష్టం. ఒక్క రెండు నెలలు ముందుగా ఈ అమ్మాయితో పరిచయమయ్యి వుంటే ఎంత బాగుండేది? ఇప్పుడెలా? తనకు పెళ్ళి నిశ్చయమయిపోయింది.తాంబూలాలు పుచ్చుకోకపోయినా "ఖాయం" అని అనుకున్నారు. కట్నం తాలూకు కొంత సొమ్ము కూడా తండ్రి తీసుకున్నట్లు విన్నాడు. తాను పెళ్ళాడబోయే అమ్మాయి గుర్తుకు వచ్చింది. పేరు సావిత్రి. ఇంకా నయం సుబ్బలక్ష్మి కాదు. చామనఛాయ. పొట్టి జడ, ఒక మాదిరి లావు. చదువు కూడా గొప్పదే. పి.యు.సి. ఫెయిలయ్యిందట. లతతో పోలిస్తే ఆ సావిత్రి లత కాలిగోటికి సరిపోదు. లతను చూసినప్పటినుంచి మనసు అసలు ఇంకే స్త్రీని గురించి ఆలోచించనంటుంది. లతను తాను వివాహం చేసుకోవాలి. ఎలా? అది సాధ్యమా? లతకూడా ఇష్టపడాలిగానీ ఎంత? పెళ్ళి అయిపోలేదుగా? చేసుకోము అని చెప్పేస్తే సరి. ఆ కట్నం డబ్బు తిరిగి ముఖాన కొడితే సరి. లతలేనిదే తాను జీవించలేడు. ఆమె తోడిదే జీవితం ఆమె సన్నిధిలో సర్వం మరచిపోతాడు. ఆమె కౌగిలిలో సర్వసుఖాలు వుంటాయి. ఆమెను పొందినవాడు జీవితంలో మరేమీ కోరుకోడు. ఆమెను వదులుకోవడం దుర్లభం. ఆమెను ఎన్ని అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించి తన కోరిక తీర్చుకోవాలి. అవసరమైతే అయిన వాళ్ళను కూడా ఎదిరించి ఆమెను స్వంతం చేసుకోవాలి. ఇదే తన జీవితాశయం కావాలి.

సావిత్ర వద్దు... లత కావాలి.

లత కావాలి... సావిత్రి వద్దు.

ఏదో నిశ్చయానికి వచ్చినట్లు నిదుర రాని కళ్ళను బలవంతంగా మూశాడు. ఇంచుమించు అలాంటి ఆలోచనలతోనే లతకూడా ఆ రాత్రి గడిపింది.

ఎంత చక్కనివాడు మురళి, అందమైన రూపం. పసిమి ఛాయ. చక్కని నొక్కుల క్రాఫ్. ఇంజనీరు. మంచి మాటకారి. అతనితో వుంటే గంటలు నిమిషాల్లో దొర్లిపోతాయి. అతని మాటలవల్ల ప్రేమించే హృదయం వున్నట్లు అర్థం అవుతోంది.

ఒక్కగానొక్క కొడుకునని చెప్పాడు. ముందు వెనుక ఏ బాదర బందీలూ లేని మనిషి. రెండు చేతులా ఆర్జించి, హాయిగా ఖర్చుపెట్టుకుంటున్నాడు. చక్కగా సిగరెట్లు త్రాగుతాడు. (కొందరు అమ్మాయిలకు సిగరెట్లు తాగే మగాడంటేనే ఇష్టం వుంటుంది. సిగరెట్లు తాగే భర్తని అవి మానమని భార్య చెప్పగా ఆ మగాడు సిగరెట్లు తాగడం మానేశాడనుకోండి అది ఆ భార్యకు క్రెడిట్.)

"నామీద ప్రేమతో నేను చెప్పిన మాట విన్నాడు" అని సంతోషిస్తుంది. (సిగరెట్లు తాగని భర్తతో అలా చెప్పే అవకాశం వుండదుగా) ఎందుకో తన మనసు మురళిపై పోతోంది. కానీ తాను మురళి స్వంతం కావడం సాధ్యమా? తాను వివాహితకాకపోయినా నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోకపోయినా ఒక వ్యక్తి నలుగురి సమక్షంలో తనను వివాహం ఆడేందుకు అంగీకరించాడు. అతను సుబ్బారావు. గుంటూరులో తెలుగు లెక్చరరు. చూడ్డానికి కొంచెం నల్లగా పీలగా వుండాడ్. సాదా క్రాఫ్ సగం నుదుటిని కప్పేస్తుంది. సిగరెట్లు తాగడు. బెల్‌బాటం పాంట్లు వేసుకోడు. తన తర్వాత పెళ్ళి కావల్సిన చెల్లాయిలు ఇద్దరున్నారు. తండ్రిలేని కారణంగా వారి బరువు బాధ్యతలు అతనే తీసుకోవాలి. ఆలోచిస్తూంటే సుబ్బారావు మీద ఎందుకో తేలిక భావం కలుగుతోంది. అతన్ని వివాహమాడేందుకు తాను ఎలా అంగీకరించానా అని ఆశ్చర్యపడుతోంది. మురళి ముందు అతన్ని పోల్చుకుని మరీ నిరాశపడింది. ఈ మురళి ఇతను కొన్ని నెలల ముందుగా అయినా పరిచయం అయ్యాడు కాదు మామూలుగా అయితే ట్యూబులైటు కాంతివంతమైనదే. కాని దాన్ని సూర్యకాంతితో పోలిస్తే ఎందుకూ పనికిరాదు. ఇప్పుడు సుబ్బారావు అలాగే అనిపించసాగాడు మురళి ముందు.

సుబ్బారావును వదుల్చుకుని మురళిని పెళ్ళాడటం ఎలాగ?

సుబ్బారావు.. మురళి

మురళి.. సుబ్బారావు.

ఆలోచనలు తుది రూపం దాల్చే సమయానికి మనోఫలకంపై సుబ్బారావు రూపం కరిగిపోయి మురళి రూపం నిలిచింది.

తెల్లవారింది.

సత్యంతో బాతాఖానీ కొడుతున్న మురళి లత గురించి కొన్ని వివరాలు లాగాలని ప్రయత్నిస్తున్నాడు.

ఇంతలో ఏదో పనిమీద లత అలా వచ్చి, ఇలా వెళ్ళిపోయింది.

"సింప్లీ మార్వెలస్" అన్నాడు మురళి ఉపోద్ఘాతంలా.

ఏమిటన్నట్లు చూశాడు సత్యం.

"అదేనోయ్ మీ కజిన్ లత. వెరీ ఏక్టివ్ గర్ల్. ఐ లైక్ దిస్ గర్ల్. చదువు, వినయం అన్నీ మూర్తీభవించిన బంగారు బొమ్మ."

"థాంక్యూ. దాన్ని ఎవరు చూసినా ఆ మాటే అంటార్రా. ఆమె ప్రవర్తన అలాంటిది. నలుగురితో కలిసి మంచి "సోషల్"గా మూవ్ అవుతుంది. నిజానికి నాకు "సీత"తో కన్నా "లత"తోనే చనువు ఎక్కువ. మా ఇంట్లోనే వుండి చదువుతుందేమో.. ఇంకా ఎక్కువ."

"ఎంతయినా మంచి అదృష్టవంతురాలు."

"కాకపోతే అవును నేను చెప్పలేదు. మా 'లతకు' వివాహం కూడా నిశ్చయం అయిందోయ్. చదువు అయిపోగానే చేస్తాం. అబ్బాయి అనకాపల్లిలో తెలుగు లెక్చరర్ బుద్ధిమంతుడు. ఆమె లక్కీగర్ల్ కనుకే ఆ సంబంధం స్థిర పడింది. "సత్యం చెప్తూనే వున్నాడు. మురళికి ఏమీ వినపడ్డంలేదు. ఆముదం తాగినట్లయింది. మెదడు మొద్దుబారింది.

"అవునూ నీక్కూడా సంబంధం కుదిరిందన్నావు పెళ్ళి ఎప్పుడు నిశ్చయం చేశారు?" సత్యం ప్రశ్నించాడు.

అన్యమనస్కంగా "వచ్చే వేసవిలో" అన్నాడు.

"ఏమిటండోయ్? వేసవి కాలం అంటున్నారు?" అంటూ ప్రవేశించింది లత.

"అదికాదు చెల్లాయ్ మన మురళికి పెళ్ళి కుదిరిందిలే. పెళ్ళి ఎప్పుడోయ్? అంటే వేసవికాలంలో వుంటుందంటున్నాడు. ఇంతకీ పెళ్ళి కూతురుది ఏ వూరోయ్? మిగతా వివరాలు ఏమిటి?" అని లతకు జవాబు చెప్తూనే మురళిని ప్రశ్నించాడు.

లత "కంగ్రాట్స్" అని చెప్పి, ఏదో పనివున్నట్టు వెళ్ళిపోయింది.

"థాంక్స్" అని తిరిగి అనాలని అతనికి తోచలేదు. మెరుపుతీగ మాయమయ్యిందన్న బాధ ముఖంలో కనిపించగా, సత్యం ప్రశ్నలకి కూడా జవాబు ఇవ్వలేదు.

మధ్యాహ్నం భోజనం చేసి నడుం వాల్చిన "లత" ఆలోచనలు వేరుగా వున్నాయి.

"పైకి అందంగా కనిపించినా అతని మనసు అతని అంత అందమైనదిగా కనపడటంలేదు. పెళ్ళి నిశ్చయమయినా తనకు దగ్గరగా రావడానికి ప్రయత్నించాడు. అంటే (కాబోయే) భార్యకు విలువ ఇవ్వనట్లేకదా! అందమైన అమ్మాయి కనిపిస్తే వెనుక పరుగులు పెట్టేటట్టేకదా, అమ్మాయిల పిచ్చివున్న మగవాడితో ఏ ఆడది సుఖపడగలదు? జోస్యం చెపుతాననే నెపం మీద తన చేతిని పట్టుకున్నాడు. అలాంటి వాడు ఎంతకైనా తగును. పైగా అస్తమానూ ఆ పెదాల మధ్య

పాడు సిగరెట్ ఒకటి. "సిగరెట్లు ఆరోగ్యానికి హానికరం" అని ఆ సిగరెట్లు తయారుచేసేవాడే చెపుతూవుంటే లెక్కచెయ్యకుండా సిగరెట్లు తాగుతున్నాడు అంటే "చెడిపోతున్నానని తెలిసి చెడిపోవడం అన్నమాట" పాడు... పై మెరుగులు చూసి మోసపోవడం అంటే అతన్ని ప్రేమించడమే. ఆడపిల్ల కనపడగానే ఆమెతో హోటళ్లచుట్టూ తిరుగుతు డబ్బు దుబారా చేసేవాడు రేపు పొదుపుగా సంసారం ఎలా చేసుకుంటాడు? ఎందుకనో సుబ్బారావే నయం అనిపిస్తున్నాడు. పొరపాటున కూడా సిగరెట్లు తాగడు. చెల్లాయిలు వున్నారు కనుక ఆడపిల్లలతో ఎలా మసులుకోవాలో తెలుసు. బరువు బాధ్యతలు వున్నవాడు సంసారంకూడా ఒబ్బిడిగా దిద్దుకోగలడు. కొంచెం నలుపు అయితేనేం? తోలు ఎర్రగా వుంటే సంస్కారవంతుడు అవుతాడా? ఎండలో తిరిగితే ఎర్రగా వున్నవాళ్ళు కూడా నల్లగా అయిపోతారు. శరీరం రంగు ఎలా వుందని కాదు కొశ్చెను, మనసు రంగు ఎలా వుందీ అన్నది పాయింటు.

మధ్యలో వచ్చిన వాడికి మధ్యలోనే గుడ్‌బై కొట్టేస్తే మంచిది.

ఎందుకొచ్చిన పెంట?

అదే సమయంలో వాలు కుర్చీలో పడుకుని సిగరెట్ దమ్ములాగుతూ ఆలోచిస్తున్న మురళి ఆలోచనలు ఎలా వున్నాయంటే

లత.. పేరు బ్రహ్మాండంగా వుంది ఏం లాభం? మనసు మాత్రం నిలకడలేదని తెలుస్తూనే వుంది. లేకపోతే పెళ్ళి నిశ్చయమయిన పిల్ల. తనతో అంత చనువు తీసుకుంటుందా? తనతో షికార్లు కొడుతుందా?

ఆ రోజు హోటల్లో ఆమె చేతిని తాను తీసుకుంటున్నపుడు కొంచెం కూడా అభ్యంతరం చెప్పలేదు. ఎంతయినా ఈ చదువుకున్న ఆడవాళ్ళింతే. అందుకే విద్యావంతురాల్ని పెళ్ళాడటం కన్నా పి.యు.సి చదివిన సావిత్రిలాంటిదాన్ని చేసుకోవడం నయం. కాబోయే మొగుడు ఒకడు వున్నాడన్న జ్ఞానమే లేకుండా తనతో ఎంత చనువుగా తిరిగింది. అయినా భార్య ఎక్కువ అందంగా వుండకపోవడమే మంచిది. ఏ మాత్రం అందమైనది అయినా అందరి చూపులూ అక్కడే వుంటాయి.

అందుకేగా అన్నాడు. "భార్యా రూపవతీ శత్రుః" అని.

"నాకు ఆఫర్ చెయ్యకుండా సిగరెట్ తాగుతారా?" అని అడిగిన పిల్ల ఈవేళ కాకపోయినా రేపు తప్పకుండా సిగరెట్ తాగుతుంది. అమ్మో ఎంత ఘోరం కనివిని ఎరుగని విషయం. వళ్ళంతా కనిపించేట్టు ఆ నైలాన్ చీరలు ఏమిటి అసహ్యంగా? అందంగా వుండటంకాదు ప్రధానం. గుణం అది తక్కువయితే రూపం ఏం చేసుకోవాలి? పెళ్ళయ్యాక రేపు ఇంకో మగాడితో కూడా అంత చనువు పెంచుకుంటే తన మర్యాద వుండాలా? మంట గలవాలా? ఇంకా నయం, పెళ్ళాడదామని మనసులోనే అనుకున్నాడు కానీ ఆ విషయం బైట పెడితే 'సై' అంటే చద్దును. మాటిమాటికీ తన

బారుజడను ముందుకూ వెనక్కి వేసుకుంటుంది. గర్వం కాబోలు. అయినా ఈ రోజుల్లో పొట్టి జడలే ఫాషన్లు అయి, పొడుగుజుట్టు వున్న వాళ్ళు కూడా జుట్టు కత్తిరించుకుంటున్నారు, సావిత్రి ఎలాగయినా వినయం, అణకువ వున్న పిల్ల. చదువు రాలేదు కనుక భర్తమాట చచ్చినట్లు వింటుంది. ఈ చదువుకున్న ఆడాళ్ళు భర్తలను ఎదిరిస్తారు. స్వతంత్రంగా తమ కాళ్ళమీద నిలబడగలమన్న ధైర్యం వుంటుంది గనుక ఎంతకయినా తెగిస్తారు.

మధ్యలో పరిచయం అయిన లతకు వీడ్కోలు చెప్పి, సావిత్రిని మనువాడ్డమే మంచి మార్గంలా కనిపిస్తోంది.

ఆ సాయంత్రమే మురళి ప్రయాణం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో.

సత్యం కూడా బయలుదేరాడు తనతో స్టేషన్‌వరకూ.

"సో మళ్ళా కలిసేది ఎప్పుడు?" అడిగాడు మురళి.

"నీ మేరేజిలో" అన్నాడు సత్యం. హాయిగా నవ్వాడు మురళి.

వెళ్ళేముందు 'లత'కు కనిపించి చెప్పడం తన కనీస ధర్మం.

"అన్నట్లు లత ఏదిరా?"

లతను పిల్చుకువచ్చాడు సత్యం.

"వస్తానండీ. నన్ను జ్ఞాపకం వుంచుకుంటారుగా?"

"అయ్యో ఎంతమాట? మీరు ఎందుకు జ్ఞాపకం వుండరు?" అంది లత ఎదురు ప్రశ్నవేస్తూ.

"లతా నువ్వూ వస్తావా స్టేషన్‌కి" సత్యం అడిగాడు.

"లేదురా! మా ఫ్రెండ్ సరోజ ఇంటికి వస్తానని చెప్పాను నిన్న. దానితో అక్కడకు వెళ్ళాలి" అంటూ కదిలిపోయింది.

ఆటోలో కూలబడ్డారు మిత్రద్వయం .

"ఒరేయ్ నాకు 'వెస్పా' స్కూటర్ ఎలాట్ అయ్యిందిరా. ఇంకో రెండు మూడు నెలల్లో వస్తుంది. కానీ మా కొలీగ్ ఒకడు "వెస్పా" అంత మంచిది కాదన్నాడు. నీ ఉద్దేశ్యం?" అడిగాడు మురళి.

"నాన్సెన్స్ ఆ ముక్క "వెస్పా" స్కూటర్ లేనివాడు అని వుంటాడు. ఎందుకంటే 'అందని ద్రాక్షలు పుల్లన ' కనుక" అన్నాడు సత్యం.

'అందని ద్రాక్షలు' అనగానే మురళికి ఎందుకో 'లత' గుర్తుకు వచ్చింది. ఆటో సాగిపోయింది నాంపల్లి స్టేషన్ వైపు.

# అగ్గిపుల్ల

- నందుల సుశీలాదేవి

(1978 ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక నుంచి)

**"దీర్ఘ సుమంగళీభవ, శీఘ్రమేవ సుపుత్ర ప్రాప్తిరస్తు"** నిండుగా దీవిస్తున్న అత్తగారిని కళ్ళెత్తి చూసింది సులోచన.

మెడ తిరగని నగలతో, నిండైన పచ్చటి విగ్రహం. దోసెడు వెడల్పంచు పట్టుచీరలో ఆవిడ సాక్షాత్తూ పార్వతీదేవిలా కనిపించింది.

భర్త చిటికెన వేలు పట్టుకుని కుడిపాదం ముందు పెట్టింది సులోచన.

సుభద్రమ్మ మేడ అంతా హడావుడిగా వుంది. ఆవిడ ఏకైక కుమారుడు నవ వధువుతో గృహప్రవేశం చేశాడు.

ఆడవాళ్ళ పట్టుచీరల గలగలలతో, పిల్లల హడావుడితో ఇల్లంతా మారుమ్రోగిపోతోంది.

గృహప్రవేశం పీటలమీదనుంచి లేచి లోపలకు వెళ్ళింది సులోచన.

పట్టు తివాసీమీద మోకాలిపైన తలవాల్చుకుని కూర్చుంది సులోచన.

చుట్టూ ఆడవాళ్ళు రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

"కట్నకానుకలకు ఆశించకుండా రూపాన్ని చూసుకుంది సుభద్రమ్మ."

"అసలు ఆవిడది దొడ్డ మనస్సు. పుత్తడి బొమ్మలా పెళ్ళికూతురు కనపడేసరికి పేదయింటి ఆడపడుచని సంశయించకుండా కొడుక్కు చేసుకుంది."

"చేతి చలవ తల్లి మా సుభద్ర. ఇంత కలిమి వున్నా భేషజం అనేదే లేదు."

అత్తగారి పట్ల గౌరవాభిమానాలతో మనసంతా తడిసిపోయింది సులోచనకు.

తన జీవితంలో ఊహించని రీతిలో అదృష్టదేవత తనను అందలం ఎక్కించింది.

చేతికున్న బంగారు గాజులు మెరిసిపోతుంటే తన చెయ్యి తనకే మరి మరీ చూడాలనిపిస్తోంది.

"ఆ అడ్డు కూడా ఈ రోజే తీర్చేస్తోందిటగా సుభద్ర. అందరికీ రాత్రికి పట్టు రవికెల గుడ్డలూ, వెండి కుంకుమ భరిణలూ పంచి పెడ్తుందటగా."

దూరంగా కూర్చుని మాట్లాడుకుంటున్న వాళ్ళ కంఠ స్వరాలు సులోచన మనస్సులో గిలిగింతలు పెడ్తున్నాయి.

మనస్సులో వరుని రూపం మెదిలింది.

తల్లిలాగా పచ్చని పసిమితో, సున్నితంగా రాకుమారుడిలాగా వుండే వరుని రూపం ఆ కన్నె హృదయాన్ని రాగరంజితం చేసింది.

"అమ్మాయ్ సులోచనా?"

చటుక్కున లేచింది సులోచన.

"అస్తమానూ అట్లా లేవకు తల్లీ. నాకు రవి ఎంతో, నువ్వూ అంతే. అత్తలో అమ్మను చూడాలి. సరేకాని బట్టలు మార్చుకుంటావా? భోజనాలు వడ్డించేస్తున్నారు చూడు. మొహం అంతా ఎట్లా వాడిపోయిందో."

అత్తగారిని అనుసరించింది సులోచన.

మధ్యాహ్నం రవీంద్ర గదిలో సులోచనను కాసేపు పడుకోమని చెప్పి బంధువులను పంపే సన్నాహంలో పడిపోయింది సుభద్రమ్మ.

ఎండ నెమ్మదిగా జారిపోతోంది.

వాతావరణం చల్లబడుతోంది.

సులోచన ఆలోచనలు క్రమంగా వేడిని పుంజుకుంటున్నాయి.

మెత్తటి దిండులో కన్నులు గట్టిగా మూసుకుంది.

ఏదో తెలియని ఆందోళన, లజ్జా శంకలతో కూడిన ఆనందం ఆమె మస్తిష్కమంతటా నిండిపోయింది.

ఆలోచనా జాలర్ల నుంచి తప్పించుకుంటూ చెప్పుల చప్పుడు విని చప్పున తలెత్తింది.

ఎదురుగా తెల్లటి పట్టుబట్టలలో రవీంద్ర నిలబడి వున్నారు. సులోచన తత్తరబాటుగా లేచి నిలబడింది.

రవీంద్ర ఏదో చెప్పబోయాడు.

అంతలోనే ఆ ప్రయత్నం మాని మరుక్షణం బుక్ షెల్ఫ్‌లో తనకు కావాల్సిన పుస్తకం తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆర్భాటంగా సాయంత్రం వేడుకలు మొదలయ్యాయి.

సుభద్రమ్మ ఇంట పేరంటానికి  పిలవక్కరలేకుండానే విపరీతంగా పేరంటాళ్ళు వస్తారు.

పెట్టుపోతలు ఘనంగా వుంటాయి. అంతకుమించి ఆమె ప్రతి వ్యక్తినీ ఆప్యాయంగా పలకరించే తీరు అందర్నీ ఆకర్షించుతుంది.

పేరంటాళ్ళందరూ వెళ్ళిపోయిన తర్వాత రవీంద్రతో సులోచన ఒంటరిగా మిగిలిపోయింది.

రవి చాలాసేపు చికాగ్గా పచార్లు చేశాడు.

సులోచన నిశ్శబ్దంగా గది మధ్యలో నిలబడిపోయింది. క్షణాలు మౌనంగా దొర్లిపోతున్నాయి.

రవీంద్ర నిట్టూరుస్తూ వెనుదిరిగాడు.

"సులోచనా బలిపశువు అనేమాట విన్నావా?"

సులోచన గుండెలు ఝల్లుమన్నాయి.

రవీంద్ర నెమ్మదిగా ఆమెను సమీపించాడు.

"ఈ పెళ్ళి మా అమ్మ బలవంతం వల్ల జరిగింది. అమ్మ పట్టుదల వల్లనే నేనీ సంబంధానికి ఒప్పుకున్నాను."

సులోచన అయోమయంగా అతనివంక చూసింది. రవీంద్ర బాల్కనీగుండా బయట విరజిమ్ముతున్న వెన్నెలను చూస్తూ అన్నాడు.

"నేను ఇంకో అమ్మయిని ప్రేమించాననుకుంటున్నావా? ఈ జన్మకు అటువంటి కోర్కెలు నాకు లేవు. బలి పశువును నేను కాదు. నువ్వు సులోచనా! నువ్వు. ఈ ఇంటి వైభవానికి అందమైన కోడలు కావాలి. అన్ని విధాల అణకువగా వుండాలి. ఈ భవంతిలో వున్న రహస్యాల మేలి ముసుగును అందంగా జలతారు పరదాలా ధరించగలగాలి. నేనొక్కడినే ఇంత ఆస్తికి వారసుడిని. నాకు పేద ఇంటి పిల్లనే ఎందుకు ఎంచుకుంది అమ్మ..."

సులోచన శిలలా వినసాగింది.

అతను అసహనంగా అన్నాడు.

"అసలు నాకు పెళ్ళి ఏమిటి అర్ధం లేకుండా. అన్ని విధాల అమ్మతో వాదించి నెగ్గలేకపోయాను. కారణం.. కారణం సులోచనా నాకు సంపాదించే సమర్ధతలేదు. అమ్మని కాదని ఈ ప్రపంచంలో ఒక్కడినే బ్రతుక్కురాగల సమర్ధతా లేదు. అసలు.. అసలు.. ఏ విధమైన సమర్ధతా లేని అందమైన విగ్రహాన్ని.

సులోచన చెవుల్లో వేయి సముద్రాల హోరు ప్రారంభమయింది

చికాగ్గా అన్నాడు రవీంద్ర.

"ఇవన్నీ నేనే నీకు చెప్పవలసిరావటం నా దౌర్భాగ్యం. నాకు అన్ని రకాల వైద్య పరీక్షలూ పూర్తయాయి. దాంపత్య జీవితం నాకు ప్రాప్తంలేదు. కాని నువ్వు ఈ విషవలయంలో చిక్కుకున్నావు. నీ జీవితం నీ ఇష్టం వచ్చినట్లు మలచుకో. నాకు ఏం ప్రమేయం లేదు. అమ్మ నీకు యితరత్రా ఏ లోటూ రానీయదు. డబ్బుతో పొందగలిగే సౌఖ్యాలన్నీ నువ్వు పొందవచ్చు. స్నేహితుడిగా నన్ను భావిస్తే సరే సరి, లేదా నా మానాన నన్ను బ్రతకనీయి. అంతలో చెప్పటం ఆపేశాడు.

సులోచన తెలివి తప్పి పడిపోతూవుంది.

ఆమెను నెమ్మదిగా మంచం మీదకు చేర్చి బయటకు వెళ్ళిపోయాడు రవీంద్ర.

ఎప్పటికో తెలివి వచ్చింది సులోచనకు. తలంతా దిమ్ముగా వుంది.

తన జీవితం ఇట్లా తెల్లవారిపోవసిందేనా? పెద్ద పెట్టున దుఃఖం వచ్చింది సులోచనకు.

నుదుటిమీద చల్లని చేయి పడింది.

"రామచంద్రా! ఎవరి కళ్ళు పడ్డాయో పండువంటి పిల్ల ఇట్లా వడలిపోయింది."

సులోచన చివ్వున తలెత్తింది.

అత్తగారి మీద ఆగ్రహం – తన నిస్సహాయత – పుట్టింటి లేమితనంలోని బేలతనం– సముద్రపుటలలుగా ఆలోచనలు విరుచుకుని పడుతుండగా ఏమీ చేయలేని అశక్తతతో భోరున ఏడ్వసాగింది.

సుభద్రమ్మ కోడలి తల నిమిరింది.

"లేచి మొహం కడుక్కోతల్లీ. తెల్లవారిపోవస్తోంది. ఈ రోజు టైలర్‌ని రమ్మన్నాను. కొలతలిస్తే పట్టు జాకెట్లన్నీ కుట్టి తెస్తాడు. చీరలన్నింటికీ నప్పే గుడ్డలు తీసుకున్నాను."

సులోచన నెమ్మదిగా లేచింది.

"రవ్వల నెక్లెసు చేయిద్దామనుకుంటున్నాను. నీకు నచ్చిన నమూనా ఏరుకో"

సులోచన కళ్ళు తుడుచుకుంది.

"డబ్బు తీసుకుని మధ్యాహ్నం బజారుకి వెళ్ళమ్మా. చిన్నపిల్లలు మీకు ఏం కావాలో పూర్వకాలపు దాన్ని నాకేం తెలుస్తాయి. కావల్సినవన్నీ కొనుక్కో"

నోట్ల కట్టను సులోచన మంచమ్మీద పెట్టి లేచింది ఆవిడ.

సులోచన నిస్సత్తువగా లేచి కూర్చుంది. నోటల్ కట్టవైపు చూసి

డబ్బు విసిరిపారేద్దామని చేతుల్లోకి తీసుకుంది.

చేయి వణికింది.

విసరలేకపోయింది.

తరువాత నెమ్మదిగా లేచి నోట్ల కట్టను భద్రం చేసుకుని మొహం శుభ్రంగా తుడుచుకుని గది బయటకు వచ్చింది.

రోజులు క్రమంగా కరిగిపోతున్నాయి.

కోరిన బట్టలు కొనుక్కోవడం, నచ్చిన సినిమాలు చూడటం, మెచ్చిన నగలు చేయించుకోవటం సులోచన కార్యక్రమాలుగా మారిపోయాయి.

సులోచనను అతి అపురూపంగా చూసుకుంటోంది సుభద్రమ్మ.

వ్యాపారంలో డబ్బు గడించడం తప్ప మరేం ధ్యాసా లేని మామగారూ, నిరంతరం జపతపాలతో, అన్నదానాలతో మునిగితేలే అత్తగారూ – తన పుస్తకాలతో తనదైన ప్రత్యేక ప్రపంచంలో విహరించే భర్తా –

సులోచనకి ఏ విధమైన కట్టడులూ లేవు. సంవత్సరం గడిచేసరికి సులోచనకు ఆ ఇంట్లో ప్రత్యేకమైన స్థానం వచ్చేసింది.

క్రమంగా, చీరెలూ నగలూ సులోచనకు తృప్తినివ్వడం మానేశాయి.

యౌవనం విరగబూసిన ఆమెలో కోర్కెలు క్రమంగా వళ్ళు విరుచుకోసాగాయి.

ఏ చీర పట్లా ఆసక్తిని చూపించలేని కోడలి ప్రవర్తన సుభద్రమ్మ గమనిస్తూనే వుంది.

ఆ ఇంటిలో సుభద్రమ్మ కన్నుదాటి ఏ సంఘటనా దాటిపోదు.

కోడలిలో అసంతృప్తి పెరగడం సుభద్రమ్మ గ్రహించింది.

ఇంట్లో అంతా వాడుకునే కారు కాకుండా కోడలి కోసం ప్రత్యేకంగా  కారు తెప్పించింది సుభద్రమ్మ.

తిరిగే సులోచనకు కావల్సినంత కాలక్షేపం జరిగిపోతోంది.

చాకులాంటి కుర్రాడు సత్యాన్ని కోడలి కారుకు డ్రైవర్‌గా కుదిర్చింది సుభద్రమ్మ.

సులోచన అందానికి తోడు మంచి పోషణ జరుగుతోంది.

అణువణువూ వయస్సు నిగారింపుతో మెరిసిపోతోంది.

పరవళ్ళు వేసే యౌవనం లత ఆలంబన కోసం తపిస్తూ వుండగా సత్యం ఆమె జీవితంలో ప్రవేశించాడు.

న్యాయాన్యాయాలు గురించి ఇద్దరూ ఆలోచించలేదు.

ముందు ముందుగా సులోచన మనస్సు సంశయంతో ఊగిసలాడినా యిరవై ఏళ్ళ పరువం ఆమెను జయించింది.

సత్యంతో సన్నిహితత్వం పెరుగుతూ వుంటే సులోచన అంతరాంతరాలలో బెదురు బుసలు కొట్టసాగింది.

ఓ రోజు రాత్రి అవుట్ హౌస్‌లో వున్న సత్యం గదినుంచి బటకు వస్తూ సుభద్రమ్మ కంటపడి నిలువునా వణికిపోయింది సులోచన.

కోడలిని గమనించనట్లుగానే తన దారిని తాను వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

ఆ రోజు సత్యం దగ్గర ఏడ్చింది సులోచన.

"నిజానికి నువ్వే నాకు భర్తవి. ఈ సంపదా వద్దూ, హోదాలూ వద్దు. మనిద్దరం ఎక్కడికైనా వెళ్ళిపోదాం సత్యం."

సత్యం నెమ్మదిగా నవ్వాడు.

"ఇప్పుడు ఇట్లాగే అనిపిస్తుంది. మీ అత్త వేసే మీగడ పెరుగు లేనిదే నువ్వు ముద్ద ఎత్తలేకపోతున్నావు. నాకు నిలకడైన బ్రతుకు తెరువులేదు. ఈ రోజు ఈ పొంగులో నాతో వచ్చేసినా తర్వాత బతుకంతా బాధపడతావు."

సులోచన మరింతగా అతని గుండెల్లో ఇమిడిపోతూ మరి మాట్లాడలేదు.

అత్తగారి కోసం తోటలో పువ్వులు కోస్తూంటే కళ్ళు తిరిగాయి సులోచనకు.

డాక్టరు వచ్చి వెళ్ళాక తనలో తానే ముడుచుకుని పడుకునిపోయింది.

వెన్నువెంట తెలియని ఆందోళన జరజరా పాకింది.

సుభద్రమ్మ లోపలికి వస్తూనే కోడలికి దిష్టి తీసింది. "లంకంత కొంపకి గోరంత వెలుగు రాబోతోంది. ఇన్నాళ్ళకు నేను నాయనమ్మను కాబోతున్నాను. చూడు తల్లి వేళకు పాలూ, పళ్ళూ క్రమం తప్పకుండా పుచ్చుకోవాలి. నీకు ఏ కోరిక వున్నా తీర్చేటందుకు నేనున్నాను.."

సులోచన బెదురుగా ఆమె వైపు చూసింది.

చెక్కు చెదరని చిరునవ్వుతో వున్న ఆవిడను చూడగనే నెమ్మదిగా కళ్ళను దించేసుకుంది.

ఆ తర్వాత సత్యం దగ్గర భోరుమని ఏడ్చింది. "ఈ ఇంట్లో మరింక నేను వుండలేను సత్యం. ఇప్పుడైనా నన్ను నీ వెంట తీసుకుని వెళ్ళిపో సత్యం."

సత్యం బాధగా అన్నాడు.

"నాకు ఈ వంద రూపాయల జీతమే ఆధారం. తల్లీ, చెల్లెళ్ళ భారం నామీదనే వుంది. నాకు స్థిరమైన మంచిపని దొరికితే ఎంత బాగుండును."

సీమంతం వేడుకలు ఘనంగా జరిగాయి.

రవీంద్రలో కూడా ఎటువంటి అసహనం కనిపించలేదు సులోచనకి

బంధువుల పరిహాసాలన్నీ చిరునవ్వుతో స్వీకరించాడు.

అత్తవారి తత్వాలు సులోచనకు అర్థంకాలేదు. వారి  మంచి మనస్సులే కారణమనుకోవడానికి ఆమె హృదయం వప్పుకోవటంలేదు.

సులోచన మనస్సులో కోటి శంకలు మెదుల్తుండగానే నెమ్మదిగా నెలలు గడిచాయి.

ఊరిలోకెల్లా పెద్ద నర్సింగ్ హోంలో పురుడు పోయిందింది సుభద్రమ్మ.

నౌకర్లు, చాకర్లు నాలుగు కార్లనిండా చుట్టాలు, ఇంత హడావుడిలో సుభద్రమ్మగారికి మనవడు పుట్టాడని అంతరూ తీపి తిన్నారు.

పదకొండోరోజున పురిటి స్నానం చేయించి బారసాల వేడుకలు అతి వైభవంగా జరిపించింది సుభద్రమ్మ.

వచ్చిన పేరంటాళ్ళందరికీ పసివాడిని పట్టుగుడ్డలలో ఎత్తుకుని చూపిస్తూ అంటోంది సుభద్రమ్మ.

"అంతా మా రవి పోలిక ఆ ముక్కూ, కళ్ళూ అంతా అచ్చుగుద్దినట్లు పుట్టాడు కదూ."

సుభద్రమ్మ పంచిపెట్టిన వెండి బొమ్మలు చూసుకుని మురుస్తున్న బంధుజనం సంతోషంగా తలలు ఊపారు.

"ఇంత కాలానికి మా నట్టింట ఈ చిన్ని కృష్ణుడు వెలిశాడు.."

అత్తగారు సంబరంగా చెప్పే మాటలు సులోచనకు మంటలు పుట్టిస్తున్నాయి.

సులోచనకు సత్యం భోజనం చేశాడో లేదో తెలియటం లేదు.

పుట్టిన బిడ్డను సత్యానికి చూపాలని ఆమె మనస్సు తహతహలాడిపోతోంది.

ఎప్పుడూ పదిమంది చుట్టూరా వుండటంతో అసలు సత్యాన్ని పలకరించే సాహసం కూడా చేయలేకపోతోంది.

నెమ్మది నెమ్మదిగా బంధువులంతా తమ తమ యిళ్ళకు వెళ్ళాక సులోచనకు ఊపిరి సలిపినట్లయింది.

సమయం చూసుకుని అత్తగారిని సమీపించింది. నెమ్మదిగా అంది.

"బాబుకి కొన్ని వస్తువులు కావాలి. బజారుకి వెళ్ళివస్తాను. చిన్నకారు తీసుకుని వెళ్ళనా?"

సుభద్రమ్మ ప్రేమగా అంది.

"వెళ్ళు తల్లీ జాగ్రత్తగా వెళ్ళు. తొందరగా వచ్చేయి."

అత్తగారు అంత సులువుగా అంగీకరిస్తారని అనుకోని సులోచన తొందర తొందరగా తయారయి బయటకు వచ్చింది.

కారు తీసుకుని ఓ ముసలి డ్రైవర్ వచ్చాడు.

సులోచన నిర్ఘాంత పడింది. "సత్యం ఎక్కడా?" ఆతృతగా అడిగింది.

అతను వినయంగా అన్నాడు.

"అతని బదులుగానే నన్ను వేసుకున్నారమ్మా. సత్యాన్ని మానిపించి వారంపైగానే అయింది."

సులోచన చెవుల్లో పిడుగులు పడ్డాయి. కంఠం పొడారిపోతుండగా అంది.

"అతను ఎక్కడ పనిచేస్తున్నాడు?"

"పెద్దమ్మగారి దొడ్డబుద్ధి తమకు తెలియనిదేముందమ్మా. ఆరునెలల జీతం యినాముగ ఇచ్చారు. వాళ్ళ వూరు తూర్పువైపుట. అక్కడ ఏదో పని చూసుకోవచ్చునని వెళ్ళిపోయాడు. రండమ్మా! కారు తెచ్చాను."

"వద్దులే" అంటూ లోపలకు వచ్చేసింది.

ఆగ్రహావేశాలతో అణువణువునా వణికిపోయింది సులోచన.

వేగంగా అత్తగారు వున్న చోటుకి వెళ్ళింది.

దేముడి పూజకు కూర్చునివుంది సుభద్రమ్మ.

సులోచనకు ఏమి మాట్లాడాలో తెలియలేదు. సుభద్రమ్మ కోడలిని చూసింది.

"అదేమిటి బజారుకి వెళ్ళలేదా?"

కోడలి సమాధానం కోసం చూడకుండానే అంది సుభద్రమ్మ.

"పోనీలే చల్లగాలిలో తిరక్కుండా వచ్చేశావు. అసలే పచ్చి ఒళ్ళు జాగ్రత్తగా వుండాలి"

ప్రమిదలో వత్తిని అగ్గిపుల్లతో వెలిగించి, దానితోనే వత్తిని ఎగసనదోసి, దీపం ప్రకాశిస్తూ వుంటే పుల్లను గిరాటు వేసింది సుభద్రమ్మ.

# కథానాయకి

- బలివాడ కాంతారావు

(1971 ఉదయం నవతరం వార పత్రిక)



**ఏదో సమయాన్న తట్టిన భావాన్ని,** ఎక్కడో తారసపడ్డ వ్యక్తిపరంచేసి కథలల్లడానికి ప్రయత్నించేవాడిని, కథానాయికను ఎంచుకోవటంలో చిక్కుల్లో పడిపోతుంటాను.

ఒకసారి ఏమైందంటే మా ఆవిడ కవరు విప్పి ఉత్తరం చదువుతూ నవ్వుకుంటుంటే

"ఏమిటి సంగతి?" అని అడిగాను.

"మీకో కథానాయికతో పరిచయం చెయ్యాలా? " అని ప్రశ్నించింది.

"అంతకన్నా నువ్వు చేసే గొప్ప సహాయం ఇంకొకటి ఉండదు"

"అయితే మీరు ఒక వారం రోజులు ఈ ఊరు వదిలి వెళ్ళాలి"

"ఎక్కడికి?"

"ఇక్కడినుంచి రైల్లో అయిదు గంటలు. రైలు దిగి బస్సులో ఆరుగంటల ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారా?"

"అంత గొప్ప కథానాయకి తారసపడుతుందంటే వెంటనే తప్పక వెళ్తాను" అన్నాను.

"తొందరపడకండి"

"ఏం? ఆమె దగ్గరనుంచి ప్రేమలేఖ వస్తేనేగాని నేను వెళ్ళకూడదా?"

"ప్రేమలేఖలు రాసే అలవాటు ఉంటే ఈసరికి పెళ్ళే చేసుకునేదిగా!"

"మీ ఇద్దరికీ ఇంత భేదం ఉంది కదా, ఆవిడతో నీకు స్నేహం ఎలా కుదిరింది?"

"ఆమె నాన్న, మా నాన్న ఒకే ఆఫీసులో పనిచేసేవారు. మేమిద్దరం నాలుగేళ్ళు ఒకే స్కూల్లో కలిసి చదువుకున్నాం"

"ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"ఆవిడ గురించి అంతగా అడుగుతున్నారు గానీ ఆవిడ మీ కథానాయకి కాదంటోంది"

"ఇంకెవరు?"

"చదవండి" అంటూ మా ఆవిడ ఉత్తరం అందిచ్చింది.

"క్రితంసారి మనం కలుసుకున్నప్పుడు మీ ఆయనతో కలిసి వస్తానన్నావు. గుర్తుందా? ఈ ఊరి గురించి ఇదివరకే నీకు వివరంగా చెప్పాను. ఈ వివరాలు మీ వారితో చెప్పి ప్రయాణం చేయించే చాకచక్యం రచయిత పెళ్ళాంగా నీకుందని నాకు తెలుసునులే. అయినా ఒక చిన్న విషయం. నా ఊహబట్టి మీ ఇద్దరికీ నీటి చేపలంటే మహా ఇష్టం అనుకుంటాను, రకరకాల రుచుల చేపలకు ఇదే సీజను. ప్రక్కనే ఏటి ఒడ్డున నీలాటి రేవులో గుట్టమీద కూర్చుని గేలం వేసి చేపలు పట్టే సరదాను ఆయన తీర్చుకోవచ్చును. దగ్గర్లో ఉన్న కొండల్లో కాలిబాటలో నడిచిపోయే వంపులు తిరిగిన వయ్యారిని తారసపడి, ఆ మాటాడని అడవి మల్లెను అపూర్వమైన కథానాయికగా అతని కథల్లో మలచవచ్చు.

మాలతీ మాధవులకు ఆతిథ్యం ఇవ్వడానికి వేచి ఉన్న.. నీ ఉమ"

నోటినీ, మనసునూ ఊరించిందా ఉత్తరం. ప్రయాణానికి సిద్ధమయ్యాను.

బస్సు ఆగింది. ఊరు చిన్నదైనా రోడ్డు మీద పాకలో 'టీ' దొరుకుతోంది. ఇళ్ళముందు పూలతోటలు. ఈ రంగుల మలారాన్ని ఈ పీఠభూమి మీద సృష్టించగలిగిన మనుషులో మానవత్వం పొదిగిన వజ్రం ఒక్కటైనా మెరుస్తూ నాకు తారసపడుతుందనుకున్నాను.

అంత దూరంలో 'టీ ' తాగుతూ మా ఆవిడ్ని అడిగాను "ఉమ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"ఆవిడ పెళ్ళి విషయం మీరు అడగటం రెండోసారి. మీరెలాను కలవబోతున్నారు? మీరే ప్రశ్నలు అడగాలనుకున్నారో ఆలోచించి మరీ అడగండి."

ఉమ బస్సు స్టాండుకు రాలేదు. మా ఉత్తరం అందలేదని ఇల్లు కనుక్కుని వెళ్ళాక తెలిసింది. ఉమ ఇల్లు విశాలంగా లేకపోయినా, ఊరు విశాలంగా ఉంది. చలిగాలి ఉండీ ఉడిగీ వేసుకున్న తలుపుల సందుల్లోంచి ఫడీమని చెంపపెట్టులా కొడుతూంది. నేను చూసిన ఉమ ఊహించిన ఉమకు భిన్నంగా ఉంది. అంత చక్కని భావాలతో ఉత్తరం రాసిన ఉమ చూడ్డానికి పొట్టిగా, లోతు కళ్ళతో పిట్టలా సన్నంగా ఉంది. చదువు చెప్పడానికి ఈవిడకెక్కడినించి ఊపిరి వస్తుందో ఊహించుకోలేకపోయాను.

"రేపటినుంచి మీ ఒక్కరినే వదిలేస్తున్నాం. ఎక్కడెక్కడకు తిరిగి ఎలాంటి కథానాయికలతో తారసపడ్తారో మీ ఇష్టం" అన్నది మరుసటి రోజు ఉదయమే వేగిరం టిఫిను పెట్టి.

"గేలం లేకపోయినా ఫరవాలేదు వెళ్ళండి, నీలాటి రేవుకు" అన్నది ఉమ. ఇంచుమించు నన్నొక్కడిని ఇంటినుంచి తరిమేసింది. నీలాటి రేవులో అంత దూరంలో నిల్చున్నాను. ఏ గుట్ట కనిపించలేదు. స్వచ్ఛమైన నీలి నీరు పారుతోంది. బంగారు ఛాయ శరీరాలకు, ముఖం నుంచి కాళ్ళవ్రేళ్ళ వరకూ పసుపు రుద్దుకుని యవ్వనులు నీటిలోనికి గెంతుతున్నారు. మబ్బులను దాటుకుని వచ్చిన పొద్దు వాళ్ళను తాకి ఆ తళుకు నా కళ్ళముందుకు ప్రసరింపచేసింది. ఆ ఆకర్షణ తాకిడికి తట్టుకోలేక దగ్గరగా జరిగితే చప్పున ఒక ముగ్ధ నావేపు కళ్ళతో నిప్పులను కక్కి నేనో సంస్కారహీనుడన్నట్లు ఏదేదో తిట్టుకుంటూ వెళ్ళిపోయింది. మిగతా ఆడవాళ్ళు కూడా నా చూపులతో దెబ్బతిన్న లేడుల్లా పరుగెత్తిపోయారు. హృదయం తరుక్కుపోయి, మనసు ముక్కలై నేను తిరిగి వచ్చి కూర్చుంటే, వంట ఇంటిలో ఉన్న ఇద్దరిలో ఉమ రాబోయే సంక్రాంతి పాటలు పాడుకుంటున్నారేమో.

"బంగారు చెంబుతో పన్నీరు పట్టుక

పడతి రుక్మిణి వచ్చె మేలుకో కృష్ణా మేలుకో..." అని వెక్కిరించినట్లు పాడుతోంది. తరువాత బయటకు వచ్చి నన్ను చూసి నవ్వుతూ, తుమ్ముతూ

"మాలతీ.. మాలతీ ఇలా రా? మీ ఆయన విరహతాపంతో ఇక్కడ కూలబడ్డారు. ఆయన అందాన్ని చూసి ఆతృతతో "హా ప్రియా" అని కేకవేసి యే రంభ దివికేగిపోయిందో. ఓదార్చు.."

ఈరోజు నా మనోభావాల్లో ముల్లుగుచ్చుకుని బాధతోపడి ఉంటే, మరుసటిరోజు ఉదయమే నన్ను ఉమ తరిమింది. ఆమె చెప్పినట్లు ఊరుదాటి కాలిబాట మీద పడ్డాను. నడుస్తుంటే చలి తగ్గింది. ఎక్కడోగానీ ఒక ప్రాణి తారసపడలేదు. అప్పటికే పైకి లేచినట్లుంటే చెట్టు క్రింద కూర్చున్నాను. కదలని కొండలమీద యే కదలిక కనపడలేదు. పడమరకు తిరిగితే చిన్న గుట్ట గూటిలోనుంచి సెలయేరు గలగలమంటూ దిగువకు జారుతోంది. రంగురంగుల పిట్టలు ఆ గుట్టమీద కదులుతున్నాయ్. ఈ రంగు పిట్టలన్నీ కన్నె పిల్లలుగా మారితే? నిండు ప్రాయమ్ముతో నా ముందు వంగితే? ఆ యవ్వనపు నీడల్లో కదలి కథానాయకుడ్ని నేనే అయిపోదునే? పొదల రెమ్మల చాటునుంచి చప్పున గెంతి నిల్చున్న నల్ల ఆడపులిలా ఉంది ఒక పర్వత కన్య.

నీరు తాగి నా దాహం తీరనట్లు నావేపు ఒకసారి నిరీక్షణగా చూసింది. ఆ కళ్ళు ఇంద్రనీలాల్లా మెరుస్తున్నాయ్. ఆమె అంతదూరంలో నున్నా నాలో కోరికల కారుచిచ్చు యెదిగెదిగి మంటలై మండిపోయి అందులో ఆమెను కలుపుకోవడానికి విస్తరిస్తోంది. గతం అంతా మరచిపోయి ఆమె వెంట అడవిలోనికి వెళ్ళిపోదామనుకున్నాను. జరుగుతూ అలా నేను చూస్తుండగానే నావేపు రాకుండా కొండలవేపు ఉరుకుతూ కదిలిపోయి నా కంటి చూపుకి దూరమైపోయింది.

జీవితంలోని కోరికలన్నీ ఈ క్షణాన మంటగలిసిపోయినట్లు అయి నరాలు తెగి శక్తిహీనుడనై అలా కూలబడిపోయాను. ఏదో చేతులారా పోగొట్టుకున్నానన్న కసి నాలో అల్లుకుంది.

ఏదో జరుగుతుంది. జరిగి తీరుతుందన్న ఆశ ఇంకా నాలో చావలేదు. అందుకే ఈ రెండు పరాభవాలను తట్టుకోడానికి ప్రయత్నిస్తూ ఇంకో రెండురోజులు ఈ ఊర్లో ఉండడానికి నిశ్చయించుకున్నాను. చీకటిపడింది. పడిశంతో బాధపడుతున్న ఉమ మంచం మీద చేరబడక తప్పలేదు. మంచం మీదనున్నా బహుశా లోపల జ్వరం ఉందేమో కొద్దిగా మూలుగుతూనే మాటాడుతోంది. ఉమ భోజనం చెయ్యలేదు. మా ఆవిడ చేసిన మిరియాల చారు తాగి, ముక్కుకు విక్స్ రాసి కూర్చుంది. ఆ ముఖంలో నవ్వు మాత్రం పోలేదు.

మా ఆవిడ చప్పున "మీరు ఉమను ప్రశ్నిస్తానన్నారు ప్రశ్నించండి" అంది.

నేను సిగ్గుపడ్డట్లు తలదించితే

"అదేమిటండీ ఉమ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు అడుగుతానన్నరుగా?"

తలెత్తి నవ్వేసాను. ఉమ కాస్త సర్దుకుని మంచం మీదే కూర్చుని.

"నేను తప్పక చెప్తాను. సినిమాల్లో కథానాయకునిలా అందంగా కరాటే కండలతో ఉన్న మాధవరావు గారు ఎలాగ పెళ్ళి చేసుకున్నారో విననియ్యి" అంది ఉమ.

మాలతి కొంటెగా చూసి నవ్వింది, నేను మాటాడటానికి సంశయిస్తుంటే.

"అందులో ఊహలకు ప్రాణం పోసి కథలల్లుతున్న రచయిత. డబ్బున్న ఇంటి ఒకే ఒక సంతానం. మంచి ఉద్యోగంలో ఉన్న విద్యాధికులు. చెప్పండి. ఎందరి అమ్మాయిల హృదయాలను గాయపరచారో? ఎందరి కోరికలను వమ్ముచేసారో? ఎందరి స్వచ్ఛమైన ప్రేమను, అందచందాలు నచ్చక తృణీకరించారో? చెప్పండి...చెప్పండి.."

ఈ మాటలు కాస్త హేళనగా ఉన్నాయని మౌనంగా ఉంటే నా బదులు మాలతి మాటాడింది.

"అయ్యబాబోయ్ అతనా? అంగట్లో అన్ని కొట్లు తిరిగి సూటు బట్ట ఎంచుకున్నట్లు చివరకు నన్ను ఎంచుకున్నారు?"

"మీకెంతమంది ప్రేమలేఖలు రాసారో?" అడిగింది సూటిగా ఉమ. కాస్త గాభరాపడ్డాను. నాకు రాసిన ఒకే ఒక అమ్మాయి మాలతి వేపు చూసాను.

"మరి నాకోసం చూడండి ఎందరు ప్రేమలేఖలు రాసారో?" అంటూ చిన్న బీరువా దగ్గరకు వెళ్ళి అందులో ఒక ఆల్బంలో ఉంచిన ప్రేమలేఖల కట్ట తీసి చూపించింది.

కొన్ని కవర్లలోనే ఉన్నాయ్. కవర్ల మీద పోస్టు మార్కులున్నాయ్. మరికొన్ని మామూలు కాగితాల మీదనున్నాయి. వివిధరకాల చేతి రాతలు, బాణీలు అన్ని నమ్మతగ్గట్లున్నా నాకు ఈమెలో ఏమి చూసి ఈ ప్రేమ లేఖలన్న సంశయంపోలేదు. బహుశ ఈమెను చూడకుండా రాసుంటారు. మళ్ళీ ఉమ మాటలు వినిపించాయి.

"మా నాన్నగారు కొన్ని సంబంధాలు చూపించారు"

"ఏ మాత్రం అడిగారు?" అన్నాను.

"మీరే మాత్రం పుచ్చుకున్నారు?" అంది ఉమ.

మాలతి చప్పున "యాభైవేలు" అంది.

"అమ్మబాబోయ్ ఇంత చక్కనైన అమ్మాయి. ఉండవలిసిన అన్ని హంగులున్నాయి. అంత బాగా పాడుతుంది. మాలతీ నువ్వు మొగుడ్ని కొనుక్కుంటావని నేనెప్పుడూ అనుకోలేదు"

"వాళ్ళు కోరి ఇచ్చారు" అన్నాను.

"మీరు అమ్ముడుపోయిన ప్రేమికుడని యెప్పుడూ కలలోనైనా అనుకోలేదు"

దీనితో నాకు కొంత పౌరుషం వచ్చి

"మీకు పెళ్ళి చేసుకోడానికి ఏమాత్రం అడిగారో చెప్పలేదు" అన్నాను.

"మా నాన్న నిజాయితీతో బతికే గుమస్తా. నా తర్వాత కూడా ఉన్నారు.

"నా సంవత్సరం జీతమే పదివేలు దాటిపోయింది కదా. అయిదేళ్ళలో మీరు పుచ్చుకున్న దానికన్నా హెచ్చు పుచ్చుకున్నట్లే లెక్క కదా చూడండి. ఈ ఫోటోలు చూడండి .వీళ్ళని కాదన్నాను" అని కొన్ని ఫోటోలు చూపించింది.

ఆ రాత్రి మెల్లగా మా ఆవిడ చెవిలో "బలే కోతలు కోస్తుందే మీ ఉమ" అని ఊదాను. మాలతి అంత "నాకు తెలిసిన మట్టుకు ఉమది అబద్ధాలాడే తత్వంకాదు" అన్నది.

"ఇవన్నీ నిజాలే అంటావా?" అని ప్రశ్నిస్తే కాస్సేపయ్యాక.

"మీకు అబద్ధాలుగా అనిపించవచ్చు. అవి ఆమెకు నిజాలు కాకూడదా?"

ఈ ప్రశ్న ఆలోచింపజేసింది. అలా నిద్దరపోయాను. ఉమ ఉదయమే లేచింది.

"ఈవేళ నా బడి చూపిస్తానన్నానుగా. తొందరగా తయారు అవ్వండి" అంది.

"మీకు జ్వరంగా ఉందిగా. నీరసంగా ఉన్నారు రేపు వెళ్ళవచ్చు" అన్నాను.

"ఫరవాలేదు" అని తయారయిపోయింది. ఆమె వెంట ఇద్దరం వెళ్ళాం. ఈమె పనిచేస్తున్న బడి రెల్లు గడ్డితో నేసినది. ఒకటో క్లాసుకు ఉమ క్లాసు టీచరు. ఉమను చూడగానే ఈ పిల్లలందరికీ ఆమె శరీరంలో బాగోలేనట్లు తెలిసిపోయిందేమో? ఆమె నీరసంగా ఉన్న ముఖాన్ని చూసి పోల్చారన్నట్లు వాళ్ళలో వాళ్ళే గుసగుసలాడుకుంటూ మాటాడకండి "టీచర్ ఒంట్లో బాగులేదు" నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం చూసి మేమూ మాట్లాడలేదు. అంతమంది పిల్లల ముఖాల్లో ఆమె యందున్న భక్తిని చూస్తూ ముగ్ధుడనయ్యాను.

మరుసటి రోజు ఉదయం మా ప్రయాణం. ఆవేళ సాయంత్రం మా ఆవిడ ఆ ప్రాంతపు ఆడవాళ్ళు వేసుకునే గాజులు కొనుక్కుని వస్తానని ఒంటరిగా వెళ్ళింది. వెళ్తూ నా చెవిలో "మీకున్న సంశయాలన్నీ అడిగి తీర్చుకోండి" అంది. నేను ఎలా మాటలు కలుపుదామనుకుంటుంటే ఉమ అడిగింది.

"రెండు రోజులు యేకాంతంగా తిరిగారు కదా మీ కథలకు పనికివచ్చే ఎందరు కథానాయికలతో తారసపడ్డారు" అంది.

"ఎవరూ చేతికి చిక్కలేదు"అన్నాను.

"బహుశ నీలాటి రేవులో ధగధగ మెరుస్తున్న మెరుగుపెట్టిన బంగారు శరీరాలను చూసి ఉంటారే. ఆ కొండల్లో అపురూపమైన ఆడవాళ్ళను చూసే ఉంటారు. వాళ్ళను చూడటం వలన మీలో రేగిన తపనతో వాళ్ళను కథానాయికలుగా మలచుకోలేరా?"

ఈ ప్రశ్నతో ఆమె కళ్ళలోనికి చూశాను. ఆ కళ్ళు కూడా ఒక్కసారి కదలకుండా నా కళ్ళవేపు నిదానంగా చూసాయి.

"మీరు రాత్రి చెప్పినదంతా నిజమేనా?" అన్నాను.

అలా చూస్తూ ఒకసారి తలదించి

"మీకు ఏదో మంచి జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తూ బ్రతికే అవకాశం ఉంది. మరి నాకు పుట్టుకతోనే అలాంటి అవకాశం లేకుండా పోయిందిగా.."

"ఎందుకని?"

ఆమె దించిన తల ఎత్తింది. ఆ కళ్ళల్లో నీరు తిరిగినట్లనిపించింది.

"మీకు అవన్నీ అబద్ధాలు. నేను వాటిని అలా సృష్టించి నిజాలనుకుంటే గానీ కనిపించీ, కన్నీటీ నుంచీ దూరంకాలేను. అలా దూరమైతే గానీ, ఆ బడి పిల్లలు చూపించే ఆప్యాయతకైనా నోచుకోలేను."

బస్సులో తిరుగుదలలో మౌనంగానే ఉన్నాను. రైలు ఎక్కేముందు మాలతి అడిగింది.

"కథానాయిక దొరికినట్లేనా?"

"హా" అన్నాను

"ఎవరు?"

"ఊహించు"

"ఉమేనా?"

"అవును." మాలతి కొంటెచూపు చూసి నవ్వింది.